ఆంధ్రప్రచారిణీగ్రంథమాల. 37.

శ్రీకృష్ణచరిత్రము

ద్వితీయసంపుటము.

శ్రీబంకించంద్రచట్టోపాధ్యాయుని వంగభాషాగ్రంథమునుండి

బాలాంత్రపు సూర్యనారాయణరావు ఎమ్. ఏ. గారిచే

ఆంధ్రీకరింపఁబడినది.



మొదటి కూర్పు.

ప్రకాశకులు

వేంకటపార్వతీశ్వరకవులు.

ఆంధ్రప్రచారిణీగ్రంథనిలయము,

కాకినాడ.

ప్రధానపోషకులు

మ. రా. శ్రీ పోతాప్రగడ బ్రహ్మానందరావు పంతులుగారు, ప్రొప్రయిటరు, సుజనరంజనీ ముద్రాక్షరశాల, కాకినాడ.

రాజపోషకులు.

మ. రా. రా. శ్రీ శ్రీమంతు శ్రీరాజా యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ బహద్దరు బి. ఏ. గారు, చల్లపల్లిరాజాగారు, చల్లపల్లి.

" శ్రీరాజా ఇనుగంటి వేంకట సూర్యప్రకాశ రావుగారు. ఉండూరు.

" శ్రీకలిదిండి వేంకటరామరాజుగారు, భీమవరము.

" శ్రీ కొప్పూరి సూర్యనారాయణరెడ్డిగారు, జమీందారు, కాకినాడ.

" శ్రీ కర్రి చినవేంకటరెడ్డిగారు, మర్చంటు, రంగూన్.

" శ్రీ కోనాల చినవేంకటరెడ్డిగారు, ఆరవల్లి.

" శ్రీముత్యాల సుబ్రహ్మణ్యముగారు, రంగూన్.

" శ్రీ వనచర్ల సత్తెయ్యగారు, రంగూన్.

" శ్రీబత్తుల బసవయ్యగారు, రాజమండ్రి.

" శ్రీ ఆకెళ్ళ సూర్యనారాయణరావు పంతులుగారు వకీలు, విశాఖపట్టణము.

" శ్రీ ఆకారపు వేంకన్నగారు, వర్తకులు, ఒరంగల్లు.

" శ్రీ ఆకారపు చెన్నయ్యగారు, వర్తకులు, ఒరంగల్లు.

" శ్రీ వెలగల గోవిందరాజుగారికుమారులు వేంకటరెడ్డిగారు,

[illegible]

Printed by
K. Subbarayudu Bros.,
at Scape & Co., Cocanada.
1924

ప్రధానపోషకులు

మ. రా. శ్రీ పోతాప్రగడ బ్రహ్మానందరావు పంతులుగారు, ప్రొప్రయిటరు, సుజనరంజనీ ముద్రాక్షరశాల, కాకినాడ.

రాజపోషకులు.

మ. రా. రా. శ్రీ శ్రీమంతు శ్రీరాజా యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ బహద్దరు బి. ఏ. గారు, చల్లపల్లిరాజాగారు, చల్లపల్లి.

" శ్రీరాజా ఇనుగంటి వేంకట సూర్యప్రకాశ రావుగారు, ఉండూరు.

" శ్రీకలిదిండి వేంకటరామరాజుగారు, భీమవరము.

" శ్రీ కొవ్వూరి సూర్యనారాయణరెడ్డిగారు, జమీందారు, కాకినాడ.

" శ్రీ కర్రి చినవేంకటరెడ్డిగారు, మర్చంటు, రంగూన్.

" శ్రీ కోనాల చినవేంకటరెడ్డిగారు, ఆరవల్లి.

" శ్రీముత్యాల సుబ్రహ్మణ్యముగారు, రంగూన్.

" శ్రీ వనచర్ల సత్తెయ్యగారు, రంగూన్.

" శ్రీబత్తుల బసవయ్యగారు, రాజమండ్రి.

" శ్రీ ఆకెళ్ళ సూర్యనారాయణరావు పంతులుగారు వకీలు, విశాఖపట్టణము.

" శ్రీ ఆకారపు వేంకన్నగారు, వర్తకులు, ఒరంగల్లు.

" శ్రీ ఆకారపు చెన్నయ్యగారు, వర్తకులు, ఒరంగల్లు.

" శ్రీ వెలగల గోవిందరాజుగారికుమారులు వేంకటరెడ్డిగారు, ఇతిహాసతరంగిణీ గ్రంథమాలసంపాదకులు, రంగూన్.

రాజపోషకులు.

మ. రా. శ్రీరాజా వత్సవాయి వేంకట సుభద్రయ్యమ్మ జగపతిబ
ద్దరుజమీందారిణీవారు, తుని.

పోషకులు

మ. రా. రా. శ్రీ దివాన్ బహద్దరు కొమ్మిరెడ్డి సూర్యనారాయణమ
ర్తినాయఁడుగారు, కాకినాడ.

" శ్రీవాడ్రేవు వేంకటరత్నము పంతులుగారు, పిఠాపురము.

" శ్రీద్వారంపూడి రామారెడ్డిగారు, అనపర్తి.

" శ్రీ ద్రోణంరాజు వేంకటరమణారావు పంతులుగారు, మొ
సాదారు, తణుకు.

శ్రీ సారంగు సోమసుందరరావు పంతులుగారు, బి, ఏ, ప్లీడరు,
నరసాపురము.

" శ్రీమల్లెల శివరామకృష్ణయ్యగారు, ప్రొప్రయిటరు, రా
పూడి.

" శ్రీ బందా సూర్యనారాయణ పం తులుగారు బి.ఏ. యల్
తణుకు.

" శ్రీ పండ్రాజు వీరాజుగారు, కాకినాడ.

" శ్రీ కొవ్వూరి వేంకటరెడ్డిసోదరులు, పిట్టలవేమవరం.

" శ్రీ కర్రి పల్లారెడ్డిగారు, మారుటేరు.

" శ్రీ తేతల గంగిరెడ్డిసోదరులు, పెనుగొండ.

పోషకులు



మ. రా. శ్రీ దివాన్‌బహద్దర్ పి. పరాంకుశంనాయుడు, రిటైర్డుస్పెష
ల్‌పోలీసుకమీషనరువారు, చెన్నపురి.

" శ్రీ అర్జి పెంటయ్యగారు, నర్సాపురం.

" శ్రీ టి. యల్ నరసింహారావుగారు, మూరుటేరు.

" శ్రీ రామదేవు ఆదినారాయణగారు, మూరుటేరు.

" శ్రీ చిర్ల అమ్మిరెడ్డిగారు, రంగూన్.

" శ్రీ పులగం వేంకన్నగారు, మూరుటేరు.



సహాయులు



మ. రా. రా. శ్రీ ఉదయరాజు వేంకటరంగారావుపంతులుగారు, దేశ
ముఖ్, సర్‌దేశపాండ్యా మఠేవాడ, ఒరంగల్లు (దక్కన్)

" శ్రీ నేరెళ్ళ నరసింహరాములుగారు, కలపవర్తకులు, ఒరం
గల్లు, (దక్కన్)

" శ్రీ యాదగిరీశ అండు కంపెనీవారు, పుస్తకములవర్తకులు,
ఒరంగల్లు, (దక్కన్)

" శ్రీ గుండా పుల్లయ్యగారు, వర్తకులు, ఓరంగల్లు, (దక్కన్



విషయసూచిక.



(రెండవసంపుటము.)



శ్రీరామచంద్ర.

2||11

శ్రీకృష్ణచరిత్రము

ద్వితీయ సంపుటము.

చతుర్థ ఖండము.

ఇంద్రప్రస్థము.

"అహంతంసర్వకార్యేషు ధర్మకార్యార్థముద్యతమ్
వైకుంఠస్యచయద్రూపంతస్మై కార్యాత్మనేనమః॥

శాంతిపర్వము 47 అధ్యాయము.

ప్రథమ పరిచ్ఛేదము.

ద్రౌపదీస్వయంవరము.

మహాభారతమునఁ గృష్ణకథ యెంతవఱకుఁ గానవచ్చుచున్నదో, అది యెంతవఱకు మౌలికమును, విశ్వాసయోగ్యమును, నైయున్నదో దానిని నిర్వచించుటకుఁ బ్రథమఖండమున వ్రాయఁబడిన విషయముల నన్నిటిని మరల నొకసారి స్మృతిపథమునకుఁ దెచ్చికొనవలయునని పాఠకమహాశయులను వేఁడికొనుచున్నారము.

మహాభారతమునఁ గృష్ణుఁడు ప్రప్రథమమున ద్రౌపదీస్వయంవరమునఁ గానఁబడుచున్నాఁడు. మహాభారతమునందలి యీకథాంశమున మౌలికతనుగూర్చి సందేహించుటకుఁ గారణము లేవియు లేవ

ని మాయభిప్రాయము. లాసన్‌దొరగారు పాంచాలాదు లగుపంచజాతులయేకీకరణస్వరూపమునకుఁ బాంచాలి యని పేరు పెట్టి ద్రౌపది కేవలముగఁ గవికల్పనాప్రసూతయే గాని, మానవి కాదని చెప్పియున్నారు. ద్రుపదకన్యక యగ్నికుండమున నుద్భవించినదని గాని, ఆమె కేవురు భర్తలు కలరని గాని, మేము విశ్వసింపఁజాలము. కాని, ద్రుపదరాజున కౌరసపుత్రిక జనించుటయును, ఆమెకు స్వయంవరవివాహము జరగియుండుటయును, ఆస్వయంవరమున నర్జునుఁడు లక్ష్యభేద మొనర్చి యామెను గైకొనియుండుటయు నను నీవిషయము ల సంభవము లని చెప్పుటకుఁ గారణము లేవియుఁ గానరావు. ఆమె కై ద గురుభర్తలు గలరో, ఒకభర్త కలఁడో, అనువిషయమును గూర్చి మర్శ చేయుటలో మాకేమియును బ్రయోజనము లేదు. *

కృష్ణుఁడు మహాభారతమున ద్రౌపదీస్వయంవరమునఁ బ్రప్రథమమునఁ గానఁబడుచున్నాఁడు. అందతని దేవత్వ మెంతమాత్రమును సూచింపఁబడి యుండలేదు. ఇతరక్షత్రియులవలెనే యాదవులంద్రోఁ గూడ నతఁడును ద్రుపదరాజుచే నాహూతుఁడై పాంచాలపురమునకు వచ్చెను. ఇతరక్షత్రియు లందఱును ద్రౌపదిని బడయఁగోరి లక్ష్యభేద మొనర్పఁ బ్రయాసపడిరి. కాని, యాదవులుమాత్ర మందులకు బ్రయత్నింపరైరి.

---

* మహాభారతమునందలి యనుక్రమణికాధ్యాయమున వ్యాసుఁడు భారతమునందలి సంక్షిప్త వృత్తాంతమును 150 శ్లోకములలో రచియించి యుండెనని యిదివఱకే చెప్పఁబడినది. ఈయనుక్రమణికయందలి సంక్షిప్తవృత్తాంతమున ద్రౌపదీస్వయంవరకథ కానఁబడుచున్నది. కాని, ద్రౌపది పంచపాండవులకు వివాహము గావింపఁబడినట్లు ఎందును జెప్పఁబడియుండలేదు. అర్జునునకే యామె లభించినదనువిషయముమాత్రమిందుఁ జెప్పఁబడినది.

"సమవాయే తతో రాజ్ఞాం కన్యామ్ భర్తృస్వయంవరామ్
ప్రాప్తవానర్జునః కృష్ణాం కృత్వా కర్మ సుదుష్కరమ్"

పాండవు లీస్వయంవరమునకు విచ్చేసి యుండిరి. కాని, వారం దుల కాహ్వానములు కాలేదు. దుర్యోధనుఁడు వారికిఁ బ్రాణహాని జేయఁ బ్రయత్నించుచుండ, వారాత్మసంరక్షణార్థము మాఱువేషముల తో నరణ్యములలోఁ దిరిగి తిరిగి యిప్పుడీద్రౌపదీస్వయంవరవృత్తాంతమును విని ప్రచ్ఛన్నులై యీసభకు వచ్చియుండిరి.

అందు సమావేశమైన బ్రాహ్మణ క్షత్రియ మండలమధ్యమునఁ గేవలము కృష్ణుఁడు మాత్రమే ప్రచ్ఛన్న వేషధారుల యిన పాండవులను గుర్తింపఁగలిగెను. అతఁడు దైవశక్తి ప్రభావముననే యిట్లు తెలిసికొనఁజాలె నని భారతమున నెంతమాత్రమును సూచింపఁబడలేదు. ఆతఁడు మనుష్యబుద్ధితోడనే తెలిసికొనఁజాలిన ట్లాతనిమాటలవలననే స్పష్టపడుచున్నది. ఆతఁడు బలరామునిఁ జూచి "చూడుము! మహాశయా! ఆవిస్తీర్ణశరాసనధరుఁడే యర్జునుఁడు. అంకుల కేమియును సందేహము లేదు. తనబాహుబలమున వృక్షమును బెకలించి నిర్భయముగ రాజమండలమధ్యమునఁ బ్రవేశించుచున్న యాతఁడే వృకోదరుఁడు." అని చెప్పెను. అటు తరువాత నుభయులును గలిసికొనినప్పుడు యుధిష్ఠిరుఁడు శ్రీకృష్ణునిఁ జూచి, "మమ్ములను నీవెట్లు గుర్తింపఁగలిగితివి?" అని యడిగినట్లును, "నిప్పుగవిసినంతమాత్రమున నిప్పు మఱుఁగుపడునా?" అని యాతఁడు ప్రత్యుత్తర మిచ్చినట్లును భారతమునందే చెప్పఁబడినది. ప్రచ్ఛన్న వేషధారు లయినపాండవుల గుర్తించుట యతికఠినము. ఇతరు లెవ్వరును వారిని గుర్తింపఁజాల రని చెప్పుటలో నాశ్చర్య మేమియును లేదు. స్వాభావిక మైనమానవబుద్ధితోడనే కృష్ణుఁడు వారిని గుర్తింపఁగలిగె ననుటచేత నాతఁ డితరులకంటెఁ గుశాగ్రబుద్ధియని తేటపడుచున్నది. మహాభారతమునం దెచ్చోటను నీవిషయము విస్పష్టముగఁ జెప్పఁబడి యుండలేదు. కృష్ణుఁడు ప్రతికార్యమును మానవబుద్ధితోడనే యొన

ర్చుచుండుట సత్యమే కాని, ఆతఁ డందఱకంటెను. గుణాగ్రగణ్యుఁ డగు గుపురుషుఁ డని యాతఁ డొనర్చిన ప్రతికార్యముచేతను దెలియవచ్చుచున్నది. ఆతనిబుద్ధియం దెందును, ఛిద్రములు గానరావు. ఇతరుల స్తుతు లయుండువలెనే బుద్ధియందుఁ గూడ నాతఁ డాదర్శస్వరూపుఁడు.

అర్జునుఁడు లక్ష్యభేద మొనర్చినతోడనే యచ్చోట సమావేశమయిన రాజబృందముతో నతనికి వివాదము తటస్థించెను. అర్జునుఁడు భిక్షుకబ్రాహ్మణవేషధారి. ఒక సామాన్యభిక్షుకబ్రాహ్మణుఁడు మహారాజులముఖగ్రాసము నాక్రమించి కైవసము చేసికొనుటఁ జూచి వారలు సహింపఁజాలక పోయిరి తోడనే వారలందఱును యుద్ధమునకు డీకొనిరి. జరిగినంతవఱకు నాయుద్ధమున నర్జునుఁడే జయలాభము నొందెను. శ్రీకృష్ణునివలన నీవివాదము నివారణము చేయఁబడెను.

మహాభారతకథాసందర్భమునఁ గృష్ణుఁ డొనర్చిన ప్రథమకార్యమిదియె. ఆతఁ డేప్రకారమున నీవివాదమును ముగింపఁ జేసెనో దానిని దెలుప నిచ్చగించుచున్నాము. వివాదమును దొలఁగించుటకు ననేకోపాయములు గలవు. కృష్ణుఁడు స్వయముగ విఖ్యాతవీరపురుషుఁడు. అదిగాక బలదేవసాత్యకులు మొదలగుఁ గలవిఖ్యాతవీరపురుషు లాతనిసహాయులై యుండిరి. అర్జునుఁ డత్యంతాత్మీయుఁడు—మేనత్త కొడుకు. ఆతఁడు యాదవసైన్యములఁ దీసికొని, సమరక్షేత్రమున నర్జునునకు సహాయ మొనర్చినయెడల వివాద మంతలో ముగిసియుండును. శ్రీకృష్ణునుఁ డట్లె యొనర్చెను. కాని కృష్ణుఁ డాదర్శధార్మికుఁడు. యుద్ధము లేకుండఁ గార్యసాధన మొనర్పఁగలిగినయెడల, నాతఁ డెన్నఁడును యుద్ధమునకుఁ బ్రవృత్తుఁడు గాఁడు. ధర్మసంరక్షణార్థము గాక యితర కారణమునఁ గృష్ణుఁడు యుద్ధప్రవృత్తుఁడైనట్లు మహాభారతమునం దెచ్చోటను గానఁబడదు. ఆత్మసంరక్షణార్థము, పరసంరక్షణార్థము, యుద్ధముధర్మము. ఆత్మసంరక్షణార్థము గాని, పరుల సంరక్షణార్థముగాని

యుద్ధ మొనరింపకుండుట యధర్మము. మన బంగాళీజాతి, యేడువందలసంవత్సరములుగ నీయధర్మఫలభోగము ననుభవించుచున్నది. కృష్ణుండెన్నఁడును మఱేయే కారణముపై యుద్ధమొనర్చి యుండలేదు. ధర్మసంస్థాపనార్థము యుద్ధమువలన నావశ్యకత లేదు. ఎచ్చోట యుద్ధ మొనర్పకయే ధర్మమున్నతి నొందఁజాలదో యచ్చోట యుద్ధ మొనర్పకుండుటయే యధర్మము. కేవలము కాశీరామదాసును [illegible] రచించిన మహాభారతమును చదువు నాదరముగలవారు మాత్రమే శ్రీకృష్ణుఁడు సకలయుద్ధమునకు పురోహితుఁడని విశ్వసించుచున్నారు. కాని మూలభారతమును బుద్ధిపూర్వకముగఁ జదివినయెడల నీవిశ్వాసము నిలువఁజాలదు. ధర్మాగ్రహము తప్పఁ గృష్ణుఁ డెన్నఁడు నెవ్వరిని యుద్ధమునకుఁ బ్రోత్సాహపఱచిన ట్లగుపడదు. ధర్మాగ్రహము తప్ప దానును స్వయముగ యుద్ధము చేయలేదు.


అతఁడు పాండవసేనాధిపతులను జూచి "భూపాలురారా! ఇతఁడు రాజకుమారు [illegible] ధర్మమూలకముగ సంపాదించుకొనియెను. మీరు కాలింపుఁడు. ఇది యుద్ధమువలనఁ బ్రయోజనము లేదు." అని చెప్పెను. ధర్మవిరోధి యుద్ధము [illegible] లేదు. అప్పటికాలమున ననేకులగు క్షత్రియపుంగవులు ధర్మనిష్ఠులై యుండిరి. బుద్ధిపూర్వకముగ నెవ్వఁడు నధర్మప్రవృత్తుఁడై యుండలేదు. కాని నేఁటివారు రాగాంధులై ధర్మమును మఱచిపోవుచున్నారు. కాని నెవఁడు ప్రశస్తమైన ధర్మాత్ముఁడో, ధర్మనిష్ఠుఁడో, [illegible] నీ [illegible] ధర్మమే [illegible] దానిని మఱచిపోలేదు. ధర్మనిష్ఠ నొందినవారికి ధర్మసంగ్రామమే [illegible] ధర్మాసక్తులను ధర్మోపదేశమును చేయుట [illegible].

అభిమానులఁ జూచి కృష్ణుఁడు "ఇరువురికి [illegible] ధర్మపూర్వకముగఁ బరిగ్రహించెను. కావున నీ యుద్ధమువలనఁ బ్రయో

జనము లేదు." అని చెప్పెను. అది విని, రాజులు శాంతచిత్తులై యుద్ధమునుండి మరలిరి. పాండవులు తమయాశ్రమమునకుఁ బోయిరి.

ఒకసామాన్యపురుషుఁడు ఆరాజలోకమునకు ధర్మోపదేశమును జేసియుండినయెడల వార లెన్నటికిని, యుద్ధమునుండి మరలియుండరు. ఈధర్మోపదేశమును జేసిన యాతఁడు, మహాబలశాలి; గౌరవాన్వితుఁడు; అతఁడు, జ్ఞానమునందును ధర్మమునందును, బాహుబలమునందును, నందఱకుఁ బ్రధానుఁడై యుండెను. సకలవృత్తులను సంపూర్ణరూపమున బరిశీలన మొనర్చినవానియందే యిట్టి ప్రధానత్వము గలుగుచుండును. సకలవృత్తులును, అట్లనుశీలనమునందక యుండినయెడల నట్టిఫలము లభింపనేరదు. శ్రీకృష్ణచరిత్రమూలకముగ నిట్టిధర్మతత్వము పరిస్ఫుటమగుచున్నది.

ద్వితీయపరిచ్ఛేదము.



కృష్ణయుధిష్ఠిరసంవాదము.

అర్జునుఁడు లక్ష్యభేదన మొనర్చి రాజులతో యుద్ధ మొనర్చిన తరువాత భ్రాతృవరులతోఁ గూడి తనయాశ్రమమునకుఁ బోయెను. ఆస్వయంవరమున కరుదెంచినరాజలోకముగూడ స్వస్థానములకుఁ బోయెను. ఇక నప్పుడు కృష్ణుఁడు చేయవలసిన కార్య మేమున్నది? ద్రౌపదీస్వయంవరము సమాప్త మయ్యెను. ఉత్సవ మంతయు ముగిసినది. ఇఁకఁ గృష్ణుఁడు పాంచాలదేశమున నుండవలసినప్రయోజనమేమియును లేదు. ఇఁక నతఁడు స్వస్థానమునకుఁ దిరిగి పోవలసియుండును. ఇతరరాజు లందఱు నట్లే యొనర్చిరి. కాని కృష్ణుఁ డట్లొనర్పక బలరామునిదీసికొని, యప్పుడు పాండవులు వసించుచున్న భార్గవకర్మశాలకుఁ బోయి యుధిష్ఠిరునకు దర్శనమిచ్చెను.

కాని, యీ ప్రదేశమునకుం బోవలసిన యావశ్యకత యేమున్నది? ఇంతకుం బూర్వ మాతం డెన్నండును యుధిష్ఠిరునితో గలసినగాని కాని, మాటాడి గాని యుండలేదు. శ్రీకృష్ణుడు యుధిష్ఠిరునియొద్దకు బోయి సాష్టాంగదండప్రణామపూర్వకముగ నాతని పాదములను గౌగిలించుకొనినట్లు మహాభారతమందే వ్రాసినారు. [illegible] [illegible] యొనర్చెను. ఇట్లు సూచనముగ [illegible] [illegible] కొనుటను జూడంగ, పాండవులు బూర్వము వారు పరస్పరము గలసికొనినట్లు గాని, సంభాషించినట్లు గాని యూహించుటకు వలనుపడదు. కృష్ణపాండవుల కిదియే ప్రథమసమావేశము. కృష్ణుడు కేవలము [illegible] రాములను మిత్రులనుగా [illegible], [illegible] వారి సమర్పించి యుండలేదు. లోకమునకు [illegible] మిత్రులనుగాని సమానులనుగాని, యుధిష్ఠిరుని [illegible] [illegible] వారి సందర్శన మునర్చి సంభాషించినవారము [illegible]. కాని, పాండవుల విషయమై సామాన్యస్త్రీల [illegible]. వారిని సందర్శించి, తాను [illegible] కాలయు [illegible] శ్రీకృష్ణుడు [illegible]. వారలతో సంభాషించి కృష్ణుడు [illegible] కార్యము [illegible] నిన ట్లగపడదు. అతడు కేవలము వినయపూర్వకముగా యుధిష్ఠిరునితో సంభాషించి వారల శుభాకాంక్షను తెలిపి వచ్చెను. [illegible] పాండవుల వివాహ మగునంతవరకుం గాంధారుల దేశమునందే [illegible] మున నివసించియుండెను. వివాహానంతరము [illegible] పాండవులకుం బ్రీతిపురస్సరముగ విచిత్రమైన [illegible] భూషణంబులును, వివిధ దేశవస్త్రసముదాయంబులును, [illegible] పర్యంకములును, విచిత్రములగు [illegible], [illegible] లగు దాసదాసీజనంబులును, సుశిక్షితము లగు గజవాజిసమూహంబులును, అసంఖ్యాకము లగు రథములును, [illegible] లగు [illegible]

నొసంగెను. అప్పుడు పాండవుల కిట్టియైశ్వర్యము లేవియును లేవు. ఏల యన:—అప్పుడు వారు భిక్షుకులై దురవస్థయం దున్నారు. మఱి యును, నివి యన్నియు నప్పుడు వారికి విశేషప్రయోజనకరములై యుండెను. ఏల యనిన:—వారలు రాజకన్యకను స్వీకరించి గృహస్థులై యుండిరి. కావున, యుధిష్ఠిరుఁడు కృష్ణప్రేషిత మగుద్రవ్యసామగ్రి నంతయును నాహ్లాదపూర్వకముగ నందికొని యుండెను. కాని, కృష్ణుఁడు వారలను గలిసికొనకుండ స్వస్థానమునకు వెడలెను. ఇఁక కృష్ణునకుఁ బాండవులనుగూర్చినవిచార మేమియును లేదు. పాండవులు తమరాజ్యభాగమును బొంది, ఇంద్రప్రస్థమున నగరనిర్మాణము గావించికొని వాసము చేయుచుండిరి. మరల శ్రీకృష్ణునకుఁ బాండవులతో సమావేశ మెట్లు కలిగెనో, ఆవిషయమును ముందు వివరించెదము.

ఎవఁడు స్వార్థత్యాగము నాచరించెనో, ఎవఁడు దురవస్థాగ్రస్తులకు హితమును గలుగఁజేయుటయే తనకు జీవనవ్రతముగఁ దలఁచెనో అట్టిశ్రీకృష్ణుని దుష్కర్మాసక్తుఁ డనియును, దురభిసంధియుక్తుఁ డనియును, క్రూరుఁ డనియును, పాపాచరణుఁ డనియును, గొందఱు పాశ్చాత్యులును, వారలశిష్యులును, స్థిరపఱచి యుండుట చాల నాశ్చర్యకర మగువిషయము. ఐతిహాసికతత్వాన్వేషణమున కుచితమగుశక్తి గాని, శ్రద్ధ గాని, యత్నము గాని, లేకపోయినయెడల నిట్టియసంబద్ధాభిప్రాయములు గలుగుచుండును. ఇందలి విశేష మేమన:—శ్రీకృష్ణుఁ డాదర్శపురుషుఁడు గాన, ఇతరసద్వృత్తులవలెనే, ప్రీతివృత్తి కూడఁ బూర్ణవికసితమై యాతనియెడ స్ఫూర్తి నొందియుండె నని యూహింపవలసి యున్నది. శ్రీకృష్ణుఁడు యుధిష్ఠిరున కొసఁగినసత్కారము సామాన్యముగఁ బూర్వస్నేహముగలవారియెడలమాత్రమే జరుగుట సంభవ మగుచున్నది. యుధిష్ఠిరునితోఁ గాని, యుధిష్ఠిరకు

టుంబముతోఁ గాని, శ్రీకృష్ణున కింతకుఁబూర్వము సంభాషణము గాని, స్నేహము గాని, యుండియుండినయెడల నాతఁ డిప్పట్లనొనర్చి నది, భద్రజనోచిత మైనసుగుణముగ నెంచవచ్చును—అంతియే కాని దానినిగూర్చి విశేషించి వర్ణింప నవసరము లేదు. కాని, అపరిచితము ను, హీనావస్థాపన్నమును, నైనకుటుంబమును వెదకికొని వచ్చి, తన కుఁ గార్యక్షతియైనను, వారల కుపకారము సేయుట యాధర్మప్రీతి లక్షణము. కృష్ణుఁడొనర్చినయీకార్యము సామాన్య మైనదియే. కాని సామాన్యకృత్యములే మానవునియథార్థచరిత్రమును వెల్లడించును. ఒకమహాత్కార్యమును దుర్మార్గుఁడుకూడఁ బ్రయత్నించి చేయఁగలిగి యుండవచ్చును; చేసి యుండవచ్చును. కాని, యల్పకార్యములయం దుఁగూడ, నెవ్వరు ధర్మము నాచరించుచుందురో వారు యథార్థముగ ధర్మాత్ములు. ఈకారణమువలననే నేను మహాభారతమునందలివిష యము నాలోచించునెడలఁ గృష్ణుఁ డొనర్చినకార్యము లన్నిటిని నల్ప ములైనను, గొప్పవైనను, నాలోచింపఁ బ్రయత్నించితిని. * ఈమా ర్గము ననుసరించి కృష్ణచరిత్రము నవగాహనము చేసికొనఁ బ్రయత్నిం పకుండుట చాల విచారకర మగువిషయము. అట్లొనర్పక, కృష్ణచరి త్రమధ్యమునఁ గేవలము "అశ్వత్థామాహత ఇతిగజః" అను నసత్య ములును, అసైతిహాసికములును నగుకథల నాధారము చేసికొనుచు న్నారము. ఈకథయందలిమిథ్యాత్వమునుగూర్చి ద్రోణవధ్యాధ్యాయ సమాలోచనకాలమున విశదీకరింతును.

* హరివంశమునందును, పురాణములయందును గూడ విశ్వాసార్హమగుకథలను నిర్ణయించువఁను సంగతి తెలియును.

1 ఈసంగతి మహాభారతమునఁ బ్రక్షిప్తము యున్నది.

ఈవైవాహికపర్వమునఁ గృష్ణసంబంధమైన నొక వినోదకర మైన కథ వ్యాసోక్తమైనదిగఁ జెప్పఁబడియున్నది. అది మేము విమర్శ చేయఁబూనుకొనువిషయములోనిది గాకున్నను, దానినిగూర్చి యించుక చెప్పుటావశ్యక మని యోచించినాము. ద్రుపదరాజు తనకూఁతున కేవురుపతులగుదు రని విని వివాహము నాటంకపఱిచెను. వ్యాసుఁ డావిషయమును ఖండనమొనర్చెను. ఖండనసందర్భమున ద్రుపదున కాతఁడొక యుపాఖ్యానమును వినిపించెను. ఉపన్యాసము చాల విస్మయకరముగ నున్నది. అందలివిశేషార్థ మేమనఁగా:—ఒకప్పుడింద్రుఁడు గంగాజలముల నేడ్చుచున్నసుందరిని గాంచి, నీవేల యేడ్చెద వని ప్రశ్నించెను. అప్పు డామె యిటు వచ్చిచూడు మని చెప్పి యింద్రుని పాశక్రీడాసక్తు లగుయువతీయువకు లున్నచోటునకుఁ దీసికొనిపోయెను. అప్పుడాయువతీయువకు లింద్రునకు యథోచిత మైనసన్మానము గావింపకపోవుటచే నింద్రుఁడు క్రుద్ధుఁ డయ్యెను. కాని, పాశక్రీడయం దున్నయువకుఁడు సాక్షాత్తుగ మహాదేవుఁడు; కుపితుఁడైనయింద్రునిజూచి యాతఁడును గుపితుఁడై యింద్రుని నొకగర్తమునఁ బ్రవేశింప నాజ్ఞాపించెను. ఇంద్రుఁడు గర్తమునఁ బ్రవేశించి యచ్చోటఁ దనవంటియింద్రులను మఱినలువురను జూచెను. మహాదేవుఁడాయైదుగురింద్రులను బిలిచి, మీరు పోయి పృథివియందు మానవులుగ జన్మింపుఁ డని యాజ్ఞాపించెను. అప్పు డాయేవురింద్రులును నేమానవునిగర్భమున జన్మింతు మని మహాదేవుని బ్రార్థించిరి. వీరలే పంచపాండవులై జన్మించిరి. నిరపరాధిని యగునాయువతిని వారలకుఁ బత్నిగా జన్మింపు మని యాజ్ఞాపించెను. ఆమెయే ద్రౌపది. ఏడ్చుచుండినయామెప్రస్తావ మేమియుఁ జెప్పఁబడి యుండలేదు. ఇందతిరహస్యవిషయ మేమనిన:—నారాయణుఁ డీసంగతి విన్నంతనే తనతలమీఁదినుండి రెండువెండ్రుకల నూడఁబెఱికి పాఱవైచెను. అం

దొకటి నల్లనిది. రెండవది తెల్లనిది. తెల్లనిది బలరాముఁడు—నల్లనిది కృష్ణుఁడు !!!

ఈయుపాఖ్యానము మహాభారతమునందలి తృతీయాశ్వాసములోనిది. అనఁగా నిది మూలమహాభారతములోనిది కాదని బుద్ధిమంతులగు పాఠకులను బోధపడఁగలదు. ఈశభారతదేశమును, నిప్పటిబంగాళాదేశమందలియుపన్యాసలేఖకుల యుపన్యాస (నవల) రచనలకంటెఁ జాల నికృష్టముగా నున్నది. మహాభారతమునందలిప్రసిద్ధములగుభాగములను రచించినప్రతిభాశాలులైనవారు యీయుపాఖ్యానరచనాదోషమునకుఁ గడంగియుండరు. అంతియే గాక, మహాభారతమునందలి యితరభాగములకును, దీనికిని సంబంధమును లేదు. ఈయుపాఖ్యానమునందలివృత్తాంతమునంతయుఁ దీసివేసినను, మహాభారతమునందలియేకాంశయును నస్పష్టముగాఁ గాని, నిష్ప్రయోజనముగాఁ గాని యుండనేరదు. ద్రుపదరాజు ద్రోణప్రతియోగాపేక్షణమును ఖండించుటకు యమునఁ గూడ దీనిప్రయోజన మేమియును లేదు. ఏలయనినః—గురుయాపేక్షణము వ్యాసోక్తమునకు యుపాఖ్యానములకు ఖండింపఁబడుచున్నది. ఆయుపాఖ్యాన మీయాఖ్యయమునఁ జెప్పఁబడుచున్నది. అది సంక్షిప్తమును, సరళమును, నైయున్నది. అదిప్రాచీన మహాభారతములోనిదియైన నైయుండవచ్చును. ఇదిమాత్రము చెప్పఁబడిన యుపాఖ్యానము దీనికిభిన్నముగాఁ గానఁబడుచున్నది. ఈరెంటి యందును ద్రౌపదిపూర్వజన్మవృత్తాంతము భిన్నభిన్నముగ వర్ణింపఁబడి యున్నది. కావున నందులో నొకటి ప్రక్షిప్తము యుండవలయునని నుటలో సందేహ మేమియును లేదు. స్వయంవరవిషయములనుబట్టి చూడ ప్రథమోక్తమైనయుపాఖ్యానమే ప్రక్షిప్తమైనదని సిద్ధాంతము చేయవలసియున్నది. అంతియే కాక, ప్రథమోక్తమైనయుపాఖ్యానము మహాభారతమునందలియితరవిషయములకు విరుద్ధముగఁగ

నఁబడుచున్నది. మహాభారతమునందంతటను నొక్కఁడయిందు్రఁడని యే చెప్పఁబడుచున్నది. కాని, ఇందు నైదుగురిందు్రలు చెప్పఁబడి యున్నారు. పాండవులు ధర్మ, వాయు, ఇంద్ర, అశ్వనీకుమారులయొరసపుత్రులైనట్లు చెప్పఁబడి యున్నది. ఇక్కడఁ బాండవు లైదుగురును నైదుగురిందు్రలని చెప్పఁబడియున్నది. ఈవిరోధముల సామంజస్యముకొఱ కుపాఖ్యానరచనాకారుఁ డిందా్రదులు వచ్చి "మమ్ములను మానవగర్భమున జన్మింపఁజేయుదువుగాక !" అని మహాదేవుని బా్రర్థించినట్లుచెప్పియున్నాఁడు. జగద్విదిత మైనమహాభారతమిట్టిక్షుద్రరచనాకారులలేఖినులనుండి పుట్టినదికాదని మనము నిశ్చయింప వచ్చును.

ఏమార్గము ననుసరించి మహాభారతమును మూఁడంతరములుగ విభజించితిమో, దాని నుదాహరణరూపముగ నెఱిఁగించుచుకే మేమీయుపాఖ్యానముల నిచ్చోనెత్తి చూపుచున్నారము. అంతియే కాక, ఇందు మూలకముగ నైతిహాసితత్వ మొకటికూడ నిరూపింపఁ బడుచున్నది. వేదమునందు సూర్యునిమూర్తివిశేషమాత్రముగ నుచ్చతరములైన పురాణేతిహాసములయందు సర్వవ్యాపకుఁడైన యీశ్వరస్వరూపుఁడుగను వర్ణింపఁబడిన విష్ణువు తరువాతకాలపు సామాన్యలేఖకులహస్తములఁ బడి గోపకుఁడుగను, జటారూపుఁడుగను, మార్పుఁజెందును. ఇవి యన్నియుఁ బ్రక్షిప్తోపాఖ్యానములమూలకముగఁ దెలిసికొనుచున్నారము. ఈసకలప్రక్షిప్తోపాఖ్యానములును హిందూధర్మావనతిని సూచించునాయని వానినిచ్చోట నెత్తి చూపినారము. ఎవరో యొకకృష్ణద్వేషియైన శైవుని మూలకముగ నీయుపాఖ్యానము రచింపఁబడి మహాభారతమునఁ బ్రక్షిప్తము చేయఁబడినదని యోచించినను యోచింపవచ్చును. ఏల యనిన, ఇందు మహాదేవుఁడు సర్వనియంతగను, కృష్ణుఁడు నారాయణుని జటాస్వరూపుఁడుగను వర్ణింపఁబ

డి యుండెను. మహాభారతమునఁ గృష్ణమతావలంబకులకును, శివమతావలంబకులకును జరిగిన వివాదచిహ్నములు కనఁబడుచున్నవి. వానిలోఁ జాలభాగము ప్రక్షిప్తములై యుండవచ్చునని యూహించుటకుఁ గారణము లున్నవి. ఇది యథార్థమైనయెడల నీవివాదము ప్రాచీన మహాభారతప్రచారమునకుఁ జాలతరువాత జరిగియుండవలయును. అనఁగా, శివోపాసనమును, కృష్ణోపాసనమును, ప్రబలమైన తరువాత నీవివాదము ఘోరతరమై యుండెను. మహాభారతరచనాకాలమునఁ గాని, తరువాతఁ గొంతకాలమునకుఁ గాని, యీ రెండుపాసనంబులలో నేదియుఁ బ్రబలత నొందియుండలేదు. ఆసమయము వేదోక్తదేవతలు విశేషప్రచారమునం దున్నసమయము. ఈ రెండును బ్రబలత నొందినతరువాతనే వివాదము లధిక మాయెను. పిమ్మట మహాభారతగ్రంథము వృద్ధిఁ బొంద నారంభించెను. ఉభయపక్షములవారి యభిప్రాయములను మహాభారతము సాధారము చేసికొని వారివారి దేవతల గౌరవాధిక్యములఁ జూపుచుండెను. ఇందుచే శైవులు శివమాహాత్మ్యసూచకములైనరచనలను మహాభారతమునఁ బ్రక్షిప్తములు చేయసాగిరి. *దీనికిఁ బ్రత్యుత్తరముగ వైష్ణవులు విష్ణుమాహాత్మ్యసూచకములగు ప్రక్షిప్తములు చేయసాగిరి. అనుశాసనికపర్వమున దీనికి గొన్ని యుదాహరణములు గలవు. ఇచ్ఛయుండినయెడలఁ జదువరు లాపర్వమును జదివి తెలిసికొనవచ్చును. [illegible] గ్రంథస్వరసారము [illegible] యుండెను.

* దీని [illegible] చేసికొనుటకు [illegible] ప్రకటన [illegible] మ్రోగుచున్న [illegible]

తృతీయపరిచ్ఛేదము.

సుభద్రాహరణము.

ద్రౌపదీస్వయంవరమునకుఁ బిదప సుభద్రాహరణకథాసందర్భమునఁ గృష్ణుఁడు కనఁబడుచున్నాఁడు. కృష్ణుఁడొనర్చిన సుభద్రాహరణమునుగూర్చి పందొమ్మిదవ శతాబ్దమందలి నీతిజ్ఞులనుమోదించియుండలేదు. కాని, పందొమ్మిదవ శతాబ్దమునందలి నీతిశాస్త్రమునకు మిన్నగ జగదీశ్వరునీతిశాస్త్ర మొకటియున్నది—అది యన్నిశతాబ్దములయందును, నన్ని దేశములయందును, వర్తించును. కృష్ణుఁడొనర్చినదానిని నే నాశాశ్వతమైనలౌకికనీతినిబట్టి పరీక్షించెదను......

ఈవిచారణమునకుఁ బూర్వము సుభద్రాహరణ వృత్తాంతము మూలమహాభారతమునందలిదియా, లేక, ప్రక్షిప్తమా, యనికృష్ణభక్తులు చెప్పవచ్చును. ఇది ప్రక్షిప్తమనియును, ఆధునిక మనియును, యోచించుటకుఁ గారణము లుండినయెడల నిఁక వేఱుగఁ జెప్ప నవసరము లేదు. కావున, నీసుభద్రాహరణవృత్తాంతము మూలమహాభారతములోనిదేయనియును, ఇది ప్రథమకోశాంతర్గతమైనదే యనియును, నావిషయమున నేమియును సందియము లేదనియును, జెప్పవలసియున్నది. అనుక్రమణికాధ్యాయము నందును, పర్వసంగ్రహాధ్యాయమునందును, దీనిప్రసంగ మున్నది. ఈకథారచనము మిక్కిలి సారవంతముగ నున్నది. ద్వితీయకోశమునందలిరచనముకూడ చాల సుందరమైనదియే. ఈప్రథమద్వితీయకోశరచనముల తారతమ్యమేమనఁ బ్రథమకోశమునందలిరచన సరళముగను, స్వాభావికమును గన్పట్టుచున్నది. ద్వితీయకోశమందలిరచన యలంకారములతోడను, నత్యుక్తులతోడను, బాహుళ్యమై యున్నది. సుభద్రాహరణ కథయందలిరచనకూడ

సరళముగను, స్వాభావికముగను బొడకట్టుచున్నది. అలంకారములు గాని, యత్యుక్తులు గాని యంత బాహుళ్యముగఁ బొడకట్టవు. దీనినిబట్టె యిది ప్రథమకోశములోని దనియు, ద్వితీయకోశములోనిది కాదనియును జెప్పవచ్చును. అంతియే కాక, మహాభాగవతమునుండి సుభద్రాహరణ వృత్తాంతము తొలఁగించిన మొదల మహాభారత మసంపూర్ణగ్రంథ మగును, సుభద్ర కభిమన్యుఁడు జన్మించెను. అభిమన్యునకుఁ బరీక్షిత్తు జనియించెను. పరీక్షిత్తునకు జనమేజయుఁడు పుట్టెను. ఈసుభద్రార్జునులవంశమే బహుశతాబ్దములవఱకును భారతఖండమున సామ్రాజ్యాధికారము నెఱపెను—కాని, ద్రుపదిసంతానము సామ్రాజ్యము నెఱపలేదు. కావున, ద్రుపదీస్వయంవరకథను విడిచినను విడువవచ్చును గాని సుభద్రావివాహ వృత్తాంతమును తొలఁగింప వీలు లేదు.

ద్రుపదివలెనె సుభద్రకూడఁ గవికల్పనాప్రసూతయని పాశ్చాత్యపండితులు విశ్వసింపలేదు. యూరపియనులలో శ్రీమాన్ వెబరు ప్రభృతులు మంగళమే సుభద్రయని లాసెన్‌గారు చెప్పియున్నారు. వెబరుగారి యాక్షేపణ మింతకంటె మిన్నగ నున్నది. కృష్ణసోదరియగు సుభద్ర మానవత్వము నంగీకరింపలేక, వారీసి నిఘంటువునందు యజుర్వేదమునందలి మాధ్యందినీశాఖలోని 23 వ యధ్యాయము 18 వ ఖండమునందలి 4 వ మంత్రము నెత్తి చూపియున్నారు. "అంబా! అంబికా! అంబాలికా! చూడుఁడు; ఎవ్వరును నన్ను తీసికొనిపోవుచున్నది. నేను కాంపీలవాసిని యగు సుభద్ర యయినను స్వయముగ దీనిసమీపమునకు (మహిష్యశ్వమునకు) వచ్చి యున్నాను. గుఱ్ఱముపై నన్నెవరును ప్రయోగించి యుండలేదు.

దీని ననుసరించి వెబరుగారిట్లు సిద్ధాంతము చేసి యున్నారు.

"Kampila is a town in the country of the Panchalas. Subhadra, therefore, would seem to be the wife of the King of that district."&c.

శాయనాచార్యుఁడు కాంపిలకాసినియనుశబ్దమున కిట్లర్థవాదము ను జెప్పియున్నాఁడు

కాంపిలశబ్దమునకు శ్లాఘ్యవసనవిశేష మని యర్థము. కాని వెబ్బరుదొరగారు తాను శాయనాచార్యునికంటెనుగూడ సంస్కృత మున గొప్పపండితుఁడ ననునభిప్రాయముతో నావ్యాఖ్య నంగీకరించి యుండలేదు. కాని, కాంపిలవాసినియైనసుభద్ర యనుపేరుగలయొక కాంత యుండినకారణముచేత సుభద్రయనుపేరుగలిగిన కృష్ణసో దరి యేల యుండఁ గూడదో మేము యోచింపఁజాలకున్నారము. అ శ్వమేధయాగము చేయురాజులయొక్క పట్టమహిషులీమంత్రమును బ ఠింపవలయును. నేను కాంపిలవాసిని నైనసుభద్ర నని వారలను జె ప్పవలయును. సుభద్రాశబ్దమునకు సామాశ్రమిసాహేశయుండు క ల్యాణిని అనఁగా సౌభాగ్యవతి యని యర్థము చెప్పియున్నాఁడు. కాంపి లనగరవాసినులైనస్త్రీలు చాలరూపలావణ్యవతు లని మహీధరుఁడు చెప్పియున్నాఁడు. కావున,నీమంత్రమునకు "నేను సౌభాగ్యవతిని రూ పవతిని నైయుండియు, నీయశ్వసమీపమునకు వచ్చియున్నాను" అని యర్థము. కావున,నీమంత్రము నాధారముచేసికొని కృష్ణసోదరియును, అర్జునపత్నియును, నగుసుభద్రకుబదులుగ సుభద్ర పాంచాలి యని యేల కల్పింపవలయునో బోధపడకున్నది. యుధిష్ఠిరుఁ డశ్వమేధయా గమును జేసియున్నాఁడు. ఆతనికిఁ జాలపూర్వకాలమునందుండిన రాజు లుకూడ నశ్వమేధయాగమును జేసియున్నారు. ఈవిషయము మహా భారతగ్రంథమునందును, నింక నితరప్రాచీనగ్రంథములయందును గ నపట్టుచున్నది. కావున, నశ్వమేధయాగమునందలియీయజుర్మంత్రము కృష్ణపాండవులకంటెఁ జాలప్రాచీనమైన యుండవలయును. ఇప్పటికా లపువార లాధునికలేఖకులకావ్యగ్రంథములనుండి శిశువులకు పేరు లుపెట్టువాడుక యెట్లున్నదో, అట్లేపూర్వముకూడ వేదమునందలిపేర్ల

ను శిశువునకుఁ బెట్టునాఁడుని యుండియుండవచ్చును. ఈమాంత్రము న నుసరించియే కాశీరాజు తన మువ్వురు కొమార్తెలకును "అంబా, అంబికా, అంబాలికా" యని నామములను బెట్టియుండవచ్చును. ఈవిధముగనే కృష్ణసోదరికి సుభద్ర యను నామము పెట్టి యుండవచ్చును. ఈమంత్రము ననుసరించి సుభద్రయు కృష్ణసోదరి యుండెనని యనుమానించుటకు దగినకారణ మేమియు నగపడదు. కావున, నేను సుభద్రాహరణవృత్తాంతమును గూర్చి [illegible] సమకట్టుచున్నాను.

సుభద్రాహరణవృత్తాంతము విమర్శ చేయుటకుఁ బూర్వము పాఠకుల కొకవిజ్ఞాపనము చేసికొనుచున్నాను. [illegible] గ్రంథము నుండి గాని, హరివంశములనుండి గాని, [illegible] గ్రంథములనుండి గాని, నాటకములనుండి గాని, తాము వినియున్నట్టియు జదివినట్టియు సుభద్రాహరణవృత్తాంతము [illegible] మఱచిపోవలసినదని వారిని వేడుకొనుచున్నాను. [illegible] సుభద్ర [illegible] నట్లును, సత్యభామ [illegible] యుండినట్లును [illegible] సుభద్రను దీసికొనిపోయి [illegible] పోవుచుండ [illegible] నట్లును. సుభద్ర [illegible] రథసారథిత్వము [illegible] నట్లును [illegible] కథలను మఱచిపోవలయును. [illegible] సత్యము. కాని, [illegible] పరిశోధనము [illegible] సుభద్రాహరణ [illegible] కార్యములను జెప్పుచున్నాను.

ద్రౌపదీవివాహానంతరము పాండవులింద్రప్రస్థమున సుఖంబుగ రాజ్యము సేయుచుండిరి. ఏదో యొక కారణమున నర్జునుఁడు పండ్రెండు సంవత్సరములవఱకు నింద్రప్రస్థమును విడిచి విదేశమున సంచరించెను. ఇతర దేశము లన్నియును దిరిగి వచ్చినతరువాత నాతఁడు ద్వారకం బ్రవేశించెను. అచ్చట యాదవు లాతనిని విశేషముగ సత్కరించి యాదరించిరి. అర్జునుఁడు కొంతకాల మచ్చో నివసించెను. ఒకప్పుడు యాదవులు రైవతక పర్వతమున నొక మహోత్సవమును బ్రారంభించిరి. అందు యదువీరులును, యదుకులాంగనలును, నంపఱును గలసి యామోదము నొందుచుండిరి. ఇతరస్త్రీలతోఁగూడ సుభద్రయు నుండెను. ఆమె యప్పుడు బాలికగ నుండెను. అర్జునుఁడామెనుజూచి ముగ్ధుఁడయ్యెను. కృష్ణుఁ డది తెలిసికొని యర్జునుని జూచి "సఖా! మనశ్చంచలుఁడవై యున్నను, మన్మథశరములకు లోనైతివా?" అనెను. అర్జునుఁ డపరాధము నొప్పుకొని "సుభద్రయెట్లు తనకు భార్య యగునో" యని కృష్ణుని యభిప్రాయమును వేఁడికొనియెను. కృష్ణుఁడుతనయభిప్రాయము నిట్లుచెప్పెను.

"ఓయర్జునా! స్వయంవరమే క్షాత్త్రధర్మము. కాని స్త్రీలచిత్తవృత్తినిగూర్చి యించుకయును జెప్పుటకు వీలులేదు. కావున, నావిషయమున నాకు సందేహము కలుగుచున్నది. వివాహవిధానమున బలపూర్వకముగఁ గన్యాహరణమొనర్చుటయే మహావీరు లగుక్షత్త్రియులకుఁ బ్రశంసనీయ మైనదని ధర్మశాస్త్రకారులు చెప్పుచున్నారు. స్వయంవరకాలము తటస్థించినది కావున నీవు నాసోదరిని బలపూర్వకముగఁ దీసికొని పొమ్ము. ఏలయన:—స్వయంవరకాలమున నామె యెవరియం దనురక్తయగునో యెట్లు తెలిసికొనవచ్చును?"

ఈయభిప్రాయము ననుసరించి యర్జునుఁడు ప్రయాణమునకు కుంతీయుధిష్ఠిరుల యనుమతిఁ బడయుటకై వారికడకు దూతనంపెను.

వారియామమతిని [illegible] ముని [illegible] సుభద్ర) [illegible] దత్తోగా మునప్పు [illegible] [illegible] బల వంతముగ [illegible] [illegible] పోయెను.

ఇప్పటి [illegible] [illegible] బలవంతముగ [illegible] సమాజనిందయును, రాజదండనమును [illegible] ము లేదు. మఱియు [illegible] [illegible] ! [illegible] ను బలవంతముగ [illegible] నాటి జనసమాజమున నిందయు [illegible] [illegible] [illegible] [illegible] టయు [illegible] [illegible] గాని, [illegible] చేసి [illegible] యుండును. [illegible] [illegible] ను గాని యున్నది [illegible].

కాని, [illegible] [illegible] చెప్పవలయును? [illegible]

దీ:— కన్యతల్లిదండ్రులకును బంధువులకును నత్యాచారము కలుగుచున్నది. మూఁడవది:— సమాజమున కత్యాచారము కలుగుచున్నది. ఎవ్వరైనను నితరులయెడననుచితమైన బలప్రయోగము నెఱపినయెడల సమాజస్థితికి భంగము తటస్థించును. వివాహార్థము చేయఁబడిన కన్యాహరణము నిందనీయమైనకార్యమని యోచించుట కీమూఁడును చాల గురుతరమైనకార్యములు. దీనికిమించిన మఱియొక కారణ మేదియును లేదు.

కృష్ణుఁడొనర్చినయీకార్యమువలన నెవరి కెంతెంతయత్యాచారము ఘటిల్లెనో యోచింపవలసి యున్నది. మొదట నపహృతకన్యయెడల నెట్టియత్యాచారము ఘటిల్లెనో చూతము. కృష్ణుఁడామెకు జ్యేష్ఠభ్రాత! మఱియును. వంశశ్రేష్ఠుఁడు. దేనివలన సుభద్ర కన్నివిధముల శుభముకలుగుచున్నదో దానిని జేయుటయే యాతనికర్తవ్యము. ఈపందొమ్మిదవశతాబ్దభాషననుసరించియిదియే యితనిధర్మము "duty" స్త్రీలకుఁ బ్రధానమంగళకరమైనది సత్పాత్రుని వివాహమాడుటయే. కావున, నామెయెట్లుసత్పాత్రుని జెట్టపట్టునో, యట్లొనర్చుటయే కృష్ణుఁడు సుభద్రయెడలఁజూపింపవలసిన(duty) ధర్మము. ఇఁక నర్జునునివంటి సత్పాత్రుఁడు కృష్ణపరిచితులలో నెవ్వరును లేరని మహాభారతమును పఠించినవారికి వేఱుగఁ జెప్పనవసరము లేదు. కావున, నామె యేకారణమువలన నర్జునుని పత్నియగునో, దాని నొనర్చుటయే సుభద్రవిషయమై కృష్ణుఁ డొనర్పవలసిన కర్తవ్యము. ఆతఁడు దేనిని జెప్పెనో దానినే యాతఁడు చూపించెను. బలవంతముగఁ గాక మఱియేయితరమార్గమునైనను గర్తవ్యసాధన మొనఁగూర్చుకొనుట సందేహాస్పదమైనది. చిరజీవుల శుభసంపాదనమునకై యేమార్గము సందేహాస్పదమైనదో దాని నవలంబింపఁగూడదు. ఏకార్య మవలంబించిన యెడల శుభ

ప్రాప్తి నిశ్చయమో, ఆమార్గము నవలంబించి పోవలయును. కావునఁ గృష్ణుఁడు సుభద్ర చిరజీవనమునకుఁ బరమశుభకరమైనదాని నాకాంక్షించి తత్సాధనముకొఱకు సునిశ్చితమైన మార్గమునుజూపిపరమ ధర్మానుమతమైన కార్యమును నెఱపెను. కావున, నాఁమెయెడల నేమియు నత్యాచారము నెఱపియుండలేదు.

దీనికిఁ బ్రత్యుత్తరముగ రెండాక్షేపణములు చేయవచ్చును. ఏకార్యమునందు నాకిచ్ఛలేదో యాకార్యము నాకు శుభకర మైనను, బలవంతముగ నాకార్యమున నన్నుఁ బ్రవేశ పెట్టుట కెవ్వరికి నధికారము లేదనునది మొదటి యాక్షేపణము. నాసర్వస్వమును బ్రాహ్మణులకు దానముచేసినయెడల నాకుఁ బరమశుభ మగు నని పురోహితుఁడు యోచింపవచ్చును. అట్లని బలవంతముగ నాసర్వస్వమును బ్రాహ్మణులకు దానముచేయించుట కాతని కెట్టియధికారమును లేదు. శుభోద్దేశసాధనముకొఱకు నిందనీయమైనమార్గము నవలంబించుటకూడ నిందనీయమైనదియే. పందొమ్మిదవశతాబ్దీయభావనను సరించి దీనినే యిట్లు చెప్పవచ్చును_(The end dose not sanctify the means)

దీనికి రెండు సమాధానములు చెప్పవచ్చును. మొదటిది—సుభద్ర కర్జునునియెడ ననిచ్ఛగాని, విరక్తి గాని కలిగినట్లు కనఁబడదు. ఇచ్ఛ యున్నట్లును గనఁబడదు. అనిచ్ఛ యున్నట్లును గనఁబడదు. ఆమెకుమనోభిప్రాయమును వెల్లడిచేయ నవకాశమును లేదు. హైందవకన్యలు పాత్రవిశేషములయెడ నిచ్ఛను గాని, యనిచ్ఛనుగాని చూపింపరు. నిజముగ వారిహృదయములయందు, ఇచ్ఛగాని యనిచ్ఛ గాని, సామాన్యముగఁ గలుగఁబోదు. కాని యింటియందే యుంచిన వయసు వచ్చినపిల్ల కట్టియిచ్ఛ కలిగినఁ గలుగవచ్చును. ఏదైన నొకకార్యమునందు నాకిచ్ఛగాని యనిచ్ఛగాని లేకుండ నుండి

యీకార్యసాధనము నాకు శుభకారిమై యుండినయెడలఁగాని, యట్లు గాక విశేషప్రవృత్తి లేకపోవుటచేఁగాని, లజ్జావశమునఁగాని, నేనాకార్యమును స్వయముగ సాధింపలేకపోయినప్పుడు బలవంతముగ నన్నందుఁ బ్రవేశపెట్టినయెడల, నాశుభకార్యము కొనసాగెడు పక్షమున బలప్రయోగము చేయుట యధర్మమా? ఒక గొప్పకుటుంబమున జన్మించినపిల్లవాఁడు దురవస్థయందుండి నీదగ్గఱ సేవకవృత్తిని బొంది పొట్టపోసికొను నవకాశముకలుగుచుండ గొప్పకుటుంబమున జన్మించుటచే నట్టియిచ్ఛ లేకుండినప్పుడు నీవు బలవంతముగఁ దీసికొనిపోయి సేవకవృత్తిని బ్రవేశపెట్టినచో నిరాటంకముగ నంగీకరింపనియెడ నట్టివానిం జేయిపట్టిబలవంతముగఁదీసికొనిపోయి యాతనిని సేవకవృత్తిలోఁ బ్రవేశపెట్టినయెడల నది నీ కధర్మమగునా? అదియాతనికిఁబీడనము క్రిందఁ బరిణమించునా? సుభద్రయవస్థ సరిగ నట్టిదే. హైందవగృహమున జన్మించిన బాలిక "ఇందు వచ్చికూరుచుండుము." అని పిలుచునంతమాత్రమున వరునితోఁగూడఁ బోవునా? సహజముగ బలవంతముగఁ దీసికొని పోవుటకన్న నీశుభసాధనమున కుపాయాంతరము లేదు.

"ఏ కార్యమందు నాకిష్టము లేదో యాకార్యసాధనము నాకుఁ జాల శుభకర మైనను, నన్నందు బలవంతముగఁబ్రవేశింపఁజేయుట కెవ్వరికినినధికారము లేదు"అనునీయాక్షేపణమునకు రెండు సమాధానములున్నవని చెప్పితిని. మొదటిసమాధాన మిదివఱకుఁదెలిపియుంటిని. అది యాక్షేపణ యథార్థమని యంగీకరించినమీఁదట నిచ్చినది. కాని, యిట్టియాక్షేపణ మన్ని సమయములయందును వర్తింపదు. రోగిస్వభావసులభమైన విరాగమువలన నౌషధము సేవింప నంగీకరింపనప్పుడాతనిని బలపూర్వకముగ నౌషధసేవ సేయించుటకు బంధువర్గమున కధికార మున్నది. అపాయకరమైనవ్రణమును నిచ్ఛాపూర్వకముగ

బంధువు లెవ్వరును శస్త్రచికిత్స చేయఁగూడదు—శస్త్రవైద్యునకే యట్టియధికారము కలదు.

బాలకుఁడు చదువను వ్రాయను నేర్చుకొనకుండి నప్పుడు బలవంతముగ విద్యఁ గఱపుటకు గురువునకును, దల్లిదండ్రులు మొదలగు వారికి నధికారము కలదు. వివాహవిషయముకూడ నట్టిదియే. అజ్ఞానదశయందున్న యువకుఁడు గాని, యువతిగాని, యనుచితమైన వివాహమున కుద్యమించునప్పుడు బలవంతముగ వారిని నిరోధించుటకు దల్లిదండ్రుల కధికారములేదా? ఇప్పుడు కూడ నాగరికతఁ జెందినయై రోపియనులలోఁ గన్యావివాహసమయమునఁ గన్యను సత్పాత్రునకొసంగునాచారము కలదు. పదునైదుసంవత్సరములవ్రాయము కలిగిన హిందూకన్య నెవరైన సత్పాత్రునకు బలవంతముగ నిచ్చుటకేతల్లిదండ్రులైన నాక్షేపణము సేయుదురా? ఎవ్వడైనను బాలికయైన కన్యను బలవంతముగ సత్పాత్రున కొసఁగినయెడల నాతఁడు నిందనీయుఁడగునా? అట్లు కానియెడల సుభద్రాహరణవిషయమునఁగృష్ణునియును మతి నిందనీయు మెట్లగును?

ప్రథమాక్షేపణమునకు రెండుప్రత్యుత్తరములును జెప్పఁబడినవి. ఇఁక ద్వితీయాక్షేపణమునుగూర్చి యోచింపవలసని యున్నది.

కృష్ణుఁడు సుభద్రకుశుభముచేయ నాకాంక్షించి యిట్టియుపాయము చెప్పెనని యంగీకరింతము. ఆమెను నర్జునకు వివాహము సేయుటకు బలవంతముగఁ దీసికొనిపోవుటకంటె రెండవమార్గము లేదా? స్వయంవరమున మూఢమతియైనబాలిక కేవలము ముఖవైఖరిరిగాంచి యేయపాత్రునైనను వరించునవకాశ ముండును. దీనికుపాయాంతరము లేదా? కృష్ణుఁడు గాని, యర్జునుఁడుగాని. వసుదేవుఁడు మొదలగు పెద్దలతోఁజెప్పి వారి నొప్పించి వారిచేఁ గన్యాదానము సేయింపలేరా?

యాదవులు కృష్ణునకు వశీభూతులు; ఆతనిమాట కెవ్వరు నడ్డుచెప్పరు. అర్జునుఁడుకూడ సత్పాత్రుఁడైనవరుఁడు. అందుల కెవ్వరు నాక్షేపింపజాలరు. అట్లేల జరుగలేదు?

ఇప్పటికాలమున నిట్టికార్యము సులభముగనై యుండును. కాని సుభద్రార్జునుల వివాహము నాలుగువేలసంవత్సరములకుఁబూర్వమున నైనది. అప్పటివివాహాచార మిప్పటియాచారమువంటిది కాదు. అప్పటివివాహాచారము నెఱుఁగకయె కృష్ణునియాదర్శబుద్ధియు ను, నాదర్శప్రీతియును, మనకు సంపూర్ణముగ బోధపడఁజాలదు.

మనుస్మృతియందు వివాహము లెనిమిది విధములని చెప్పఁబడియున్నది. (1) బ్రాహ్మ్యము (2) దైవము (3) ఆర్షము (4) ప్రాజాపత్యము (5) ఆసురము (6) గాంధర్వము (7) రాక్షసము (8) పైశాచము. ఈక్రమము పాఠకులు మనస్సునం దుంచుకొనవలయును. ఈయష్టవిధములగు వివాహములకు నన్నివర్ణములవారికి నధికారములేదు. క్షత్రియులకుఁ గొన్నివివాహములయం దధికార మున్నది. "షడానుపూర్వ్యావిప్రస్య క్షాత్రస్యచతురోవరాన్"అని మూడవయధ్యాయమున 23వ శ్లోకమునఁ జెప్పఁబడి యున్నది. ఇందులకు "క్షత్రియస్య అవరానుపరితనా నాసురాదీం శ్చతురః"అని టీకాకారుఁడైనకుల్లూకభట్టు వ్రాసియున్నాఁడు. అట్లయినయెడల క్షత్రియులపక్షమున నాసుర గాంధర్వ, రాక్షస, పైశాచము లనునాల్గు విధము లగువివాహములును ధర్మములు; తక్కినవి యధర్మములు.

"పైశాచశ్చాసురశ్చైవనకర్తవ్యౌ కదాచన"అని 25 శ్లోకమునఁ జెప్పఁబడినది. పైశాచాసుర వివాహములందఱికి ననాచరణీయములు. కావున, క్షత్రియులపక్షమునఁగూడఁ గేవలము గాంధర్వము, రాక్షసము మాత్రమే విహితములై యున్నవి.

వీనిలో వధూవరు లుభయులకుఁ బరస్పరానురాగముగల వివాహము గాంధర్వమనఁబడును. సుభద్రికనురాగము లేనియెడల వివాహ మసంభవ మగును! కావున, నది కేవలము కామజన్యమగును. పరమనీతిజ్ఞులైన కృష్ణార్జును లట్టిదాని నెప్పు డంగీకరించియుండరు. కావున రాక్షసవివాహము తప్ప మఱియేయితరవివాహమును శాస్త్రానుసారముగ ధర్మము కాఁజాలదు. మఱియును క్షత్రియులపక్షమున ప్రశస్తము కాదు. ఇతరవిధము లైనవివాహముల కితరావకాశము లేదు. బలవంతముగఁ గన్యనెత్తికొనిపోయి వివాహము చేసికొనుటయే రాక్షసవివాహము. శాస్త్రానుసారముగ నీరాక్షసవివాహమే క్షత్రియులపక్షమున బ్రశస్తమైనది.

"చతురో బ్రాహ్మణస్యాద్యాన్ ప్రశస్తాన్ కవయోవిదుః।
రాక్షసంక్షత్రియస్యైక మాసురో వైశ్యశూద్రయోః॥"
మను, 3 అ 24 శ్లో.

ఏవివాహము ధర్మమో, ప్రశస్తమో, తన భగినీభగినీపతులకును నిజకులమునకును గౌరవమో కృష్ణు డట్టివివాహమును బ్రోత్సాహపఱిచెను. కావుననే, కృష్ణుఁడట్లర్జునుని బ్రోత్సాహపఱిచి తన శాస్త్రజ్ఞతయును నీతిజ్ఞతయును, నభ్రాంతబుద్ధియును. మానసంభ్రమరక్షణములయందలి గౌరవమును, హితేచ్ఛయును, వెల్లడిచేసెను. ఈవిషయమున మనుస్మృతి ప్రమాణ మెట్లు వర్తించును? మహాభారతయుద్ధకాలమునాఁటికి మనుసంహిత యుండెననుటకుఁ బ్రమాణ మేమి కలదు? అంతటిప్రాచీన కాలమున మనుసంహిత సంకలితమైనదో లేదోయను విషయము వాద ప్రతివాదముల కెడమిచ్చుననుట సత్యమే. మనుసంహిత పూర్వము ప్రచారములో నున్నరీతి నీతుల

సంకలనమాత్రమే యని పండితులమతము. అట్లయిన మొదలయుధిష్ఠిరునిరాజ్యకాలమువాఁటికిఁ బ్రచారములోనున్న వివాహపద్ధతి యిట్టిది యే యని మనము యోచింపవచ్చును. అట్లు కాకపోయినను మహాభారతమునం దీవిషయమునుగూర్చి యెట్లు చెప్పఁబడినదో దానిని బరిశీలింతము. సుభద్రాహరణపర్వాధ్యాయమున నిందుకు సమాధానముగఁ గొన్ని ప్రమాణములు కలవు. పాఠకమహాశయులకు మేమెట్టి సమాధానము చెప్పియుంటిమో కృష్ణుఁడట్టిసమాధానమునే బలరామునకుఁ జెప్పియున్నాఁడు. అర్జునుఁడు సుభద్రను బలవంతముగఁ దీసికొనిపోయెనని విని యాదవులు కోపోద్రేకమున రణసన్నాహము సేయుచుండ బలరాముఁడు వారిని వారించి, "కృష్ణుఁడేమి చెప్పునో విందము." అని కృష్ణునివైపునకుఁ దిరిగి యర్జునుఁడు మనవంశమున కవమానము ను గలిగించెనని కోపముతోఁ బలికి యాతనియభిప్రాయ మేమని యడిగెను. కృష్ణుఁడందులకుఁ బ్రత్యుత్తరముగ నిట్లు చెప్పెను.

"అర్జునుఁడు మనకులమున కవమానమును జేసియుండలేదు, అంతియేగాక విశేషముగ మనగౌరవమును గాపాడెను. అతఁడు మిమ్ముల నర్థలుబ్ధులని భావింపకుండుట చేనర్థమూలకముగ సుభద్రను వరించుటకుఁబ్రయత్నమునర్పియుండలేదు. స్వయంవరమువఁ గన్యను బడయుట చాలదుష్కరమైన వ్యాపారము. అందుచే దానికి సమ్మతించియుండలేదు. తల్లిదండ్రులయనుమతిపూర్వకముగ నొసఁగఁబడినకన్యను వివాహమాడుట తేజస్వియైనక్షత్రియునకుఁ బ్రశంసనీయమైనకార్యము కాదుఁ కావునఁగుంతీపుత్రుఁడైన ధనంజయుఁడు పైదోషముల నన్నిటి నాలోచించియే బలవంతముగ సుభద్రను దీసికొనిపోయెనని నేనుయోజించితిని. ఈసంబంధము మనకు కుచితమైనది. మఱియును, కులశీలవిద్యాసంపన్నుఁడైనపార్థుఁడు తన్ను బలవంతముగఁ దీసికొనిపోవుటచే సుభద్రకీర్తిమతియగుననుటకు సందియము లేదు."

ఇందుఁ గృష్ణుఁడు క్షత్రియులకు నాలుగు విధము లగువివాహ ము లుచితమైనట్లు చెప్పియున్నాఁడు. (1) అర్థము- (శుల్కము) నొసఁగి చేసికొనినవివాహ మాసురము. (2) స్వయంవరము. (3) తల్లిదండ్రులచే నొసంగఁబడినకన్యను బెండ్లియాడుట ప్రాజాపత్యము (4) బలవంతముగఁ గన్యనపహరించుట రాక్షసము.

వీనిలో మొదటిది కన్యాకులమున కపయశస్కరమైన దని యందఱు నొప్పుకొనినవిషయమే. రెండవదానిఫల మనిశ్చితము. మూఁడవది వరునకు గౌరవహీనమైనది. కావున నాల్గవ దొక్కటియే విహితమైన వివాహము. ఇది కృష్ణోక్తివలననే తేటపడుచున్నది.*

నేను రాక్షసవివాహపక్షమును సమర్థించుచున్నాఁడ నని యెవ్వరును దలంపకుందురుగాక ! రాక్షసవివాహము నిందనీయమని వేఱుగఁ జెప్పనక్కఱలేదు. ఆకాలమున క్షత్రియులలోఁ బ్రశంసనీయముగఁ బరిగణింపఁబడుచున్నను గృష్ణుఁడే దాని ప్రచారకర్త కాఁడు.

* * * * * * *

బలవంతముగఁ గన్యాహరణ మొనర్చి చేయు వివాహము మూఁడుకారణములచే నిందనీయమైన దని యిదివఱకే చెప్పియున్నారము. (1) కన్యయెడల నత్యాచారము. (2) కన్యపితృకులమునకు జరుగు నత్యాచారము, (3) సమాజము నెడలఁ గలుగు నత్యాచారము. కన్యక కెట్టి

*మహాభాగతములో నియనుశాసనపర్వములోఁ జెప్పఁబడినవివాహతత్త్వమునిందుఁ జేర్చకని యుండలేదు: ఏల యనిన, నది ప్రక్షిప్తము. అందు రాక్షసవివాహము భీష్మునిచే నిషేధింపఁబడి యున్నది. కాని భీష్ముఁడు స్వయముగ కర్తవ్యాకర్తవ్యములం బాలోచించియే కాశిరాజుపుత్రులు ముగ్గురను దీసికొనిపోయెను. అందువలన భీష్ముఁడు రాక్షసవివాహము నిందించుటగాని నిషేధించుటగాని సంభవింపనేరదు. ఏది నిషిద్ధమో ఏది నిందితమో దానిని ప్రాణాంతమైనను భీష్ముఁడు చేయఁడని యాతనిచరిత్రమే చెప్పుచున్నది. అతనిచరిత్రమును వ్రాసినకవియాతనినోట నిట్టిపలుకు లెన్నఁడును బలికించి యుండఁడు.

యత్యాచారమును ఘటిల్లకుండుటయే గాక విశేషించి యామెకు శు
భకర మయినదనియును దెలిపియున్నారము. ఇఁక నామెపితృకులమున
కత్యాచారము ఘటిల్లినదేమో చూడవలసియున్నది. కాని, విశేషావ
కాశము లేకపోవుటచే సంక్షేపముగఁ జెప్పవలసియున్నది.

కన్యాహరణమునఁ బితృకులమునకు రెండుకారణములవలన న
త్యాచారము ఘటిల్లుచున్నది. కన్యక యపాత్రునిచేతులోఁ బడుట
యొకటి. కాని, మనకథాసందర్భమున నట్లు జరుగలేదు. అర్జునుఁ డ
పాత్రుఁడు కాఁడు. అనభిప్రేత పాత్రుఁడును గాఁడు. రెండవది—
తమ కవమానము ఘటిల్లుట; ఇంతకుఁ బూర్వము చెప్పినదానినిబట్టి
సుభద్రాహరణమున యాదవుల కెంతమాత్రము నవమానము కలిగి
యుండలేదని యోచింపవలసి యున్నది. ఈవిషయమున యాదవశ్రే
ష్ఠుఁ డైన శ్రీకృష్ణుఁడే ప్రతిపాదించి యున్నాఁడు. ఇది న్యాయసంగత
మని యోచించియే యాదవు లర్జునుని దిరిగి తీసికొని వచ్చి వివాహ
కార్య మొనర్చిరి. కావున, నిందువలన వారికత్యాచారము ఘటిల్లిన
దని చెప్పుట కవకాశము లేదు మూడవది—సమాజమునకుఁ
గలుగునత్యాచారము. సమాజములో నెవ్వరికైనను హానికలిగించు
విధివిరుద్ధమైన బలప్రయోగమువలన సమాజమున కత్యాచారము ఘ
టిల్లుచున్నది. కాని, యప్పటి యార్యసమాజమునందలి క్షత్రియుల
వలన నిట్టి బలప్రయోగము ప్రశస్తమైన దనియును, విహితమైన దని
యును, జెప్పఁబడి యుండుటచే నప్పటిసమాజమున కత్యాచారము
ఘటిల్లినదని చెప్పుట కవకాశము లేదు. ఏది సమాజసమ్మతమో దా
నిమూలముగ సమాజమున కత్యాచారము ఘటిల్లదు.

నేనీవిషయమును సవిస్తరముగ వ్రాయుటకుఁ గారణ మున్నది.
సుభద్రాహరణవిషయమునఁ గృష్ణద్వేషులు కృష్ణునెప్పుడు నిందించి

యుండ లేదు. దీనికొఱకుఁ గృష్ణపక్షమునవలంబించి సమర్థింప నవసరము లేదు.

చతుర్థపరిచ్ఛేదము

ఖాండవదాహము

సుభద్రాహరణ మయినతరువాత ఖాండవదాహకథాసందర్భమునఁ గృష్ణుఁడు గానఁబడుచున్నాఁడు. పాండవులు ఖాండవప్రస్థమున వాసము చేయుచుండిరి. వారి రాజధానిసమీపమున ఖాండవ మను పేరుగలిగిన పెద్దయరణ్యమొకటికలదు. కృష్ణార్జునులు దానిని దగ్ధము గావించిరి. ఆవృత్తాంత మిది. ఇది కల్పనాకథవలెఁ గన్పట్టుచున్నది.

పూర్వకాలమున శ్వేతకియను రాజొకఁడు కలఁడు. అతఁడు గొప్పయాజ్ఞికుఁడు. చాలకాలము యజ్ఞము చేసెను. అతఁడుచేయు యజ్ఞములవలన ఋత్విక్కులైనబ్రాహ్మణులు చాలశ్రమపడిరి. రాజు వారలకుఁబీడ కలుగఁజేసెను. అంతట వారలు "ఇట్టికార్యము మావలనఁ గాఁజాలదు. నీవు రుద్రునియొద్దకుఁ బొమ్ము." అని చెప్పిరి. రాజు రుద్రునియొద్దకుఁ బోయెను. రుద్రుఁ డాతనిఁజూచి "నేను యజ్ఞముచేయను. ఆపని బ్రాహ్మణులది. దుర్వాసుఁడను నొక బ్రాహ్మణుఁడు కలఁడు; అతఁడు నాయంశమున జన్మించినవాఁడు. నేనాతనికి నీవిషయమును జెప్పితిని." అని చెప్పెను. రుద్రునియనుగ్రహమువలన దుర్వాసుఁడు రాజుచే యజ్ఞమును చేయించెను. అది ఘోరతరయజ్ఞము. పండ్రెండుసంవత్సరములవఱకు నగ్నియందాజ్యధారహోమము చేయించెను. ఆయాజ్యమును భక్షించుటవలన నగ్నిదేవునకజీర్ణరోగము సంభవించెను. అతఁడు బ్రహ్మయొద్దకుఁబోయి "అయ్యా! చాలవిపద్గ్రస్తుఁడ నయితిని. ఆజ్యభక్షణముచే శరీరమునఁ జాలబాధ

కలిగెను. దీనికుపాయమేమి ? ” అని యడుగఁగా బ్రహ్మయతనితో “మంచిది ! ఆజ్యభక్షణమున నీకుఁబీడ కలిగినయెడల మఱియును భక్షింపుము. ఖాండవవనమును భక్షించితివేని నీబాధనివర్తియగును” అని చెప్పెను. అది విని యగ్ని ఖాండవవనమును భక్షింపఁబోయియా వనమునాల్గుప్రక్కలను హాహాకారము సేయుచు జ్వాలింపనారంభించెను. కాని, యీవనమున ననేకములగుజీవజంతువులు వాసము చేయుచుండెను. అంతట నేనుఁగులు తమతుండములతో జలములను గొనివచ్చి యాయగ్నిని బోయఁదొడఁగెను. అట్లేసర్పములు ఫణములతో జలములనెత్తికొని యగ్నిలోఁబోయందొడఁగెను. ఈవిధముగ వనమునందు వసించుచున్నపశుపక్షిగణము లగ్ని నార్పఁదొడఁగినవి. అగ్ని యేడుపర్యాయములు విజృంభించెను. ఏడుపర్యాయములు నార్పి వేయబడెను. అగ్నియంతట బ్రాహ్మణరూపధారియై కృష్ణార్జునుల సమ్ముఖమునకు వచ్చి “ నేను మిగుల నాఁకలిగొని యున్నాను. విశేషముగ భుజింపవలయు నని యున్నాను. మీరు నన్ను భుజింపఁజేయుదురా ?” అనెను. అందులకు వారంగీకరించిరి. అప్పుడు తన సమాచారమంతయు వారికిఁదెలియఁజెప్పి నేను ఖాండవవనమును భక్షింపఁబోయితిని. కాని, యింద్రుఁడు వచ్చి వృష్టిధారలచే నన్ను నివారింపఁ జేసెను.” అని చెప్పెను. అప్పుడు కృష్ణార్జునులు శస్త్రధారులై వనముచుట్టును దిరుగసాగిరి. ఇంద్రుఁడు వచ్చి వర్షమును గురియఁజేసెను. కాని, అర్జునునిబాణపంజరమున వృష్టి బంధింపఁబడియెను. అది యెట్లు సంభవమయ్యెనో కలికాలపువారలకు మనకుఁ దెలియఁజాలదు. అట్లు శక్తియుండినయెడల నతివృష్టినుండి సస్యాదులను రక్షించుకొనుటకు మన మేర్పాటులు చేసికొని యుందుము. అది యేమైనను నింద్రుఁడు యుద్ధము చేయనారంభించెను. దేవత లందఱును స

స్త్రధారులై యాతనికిఁ దోడుపడ సాగిరి. కాని, యర్జునుని దొలఁగింప లేకపోయిరి. ఇంద్రుఁడాతనిపైఁ బర్వతము నెత్తి వైచెను. అర్జునుఁడు దానిని బాణములతోఁ జిన్నచిన్న ముక్కలుగఁ గొట్టివైచెను. (ఇట్టి విద్య యిప్పుడు మనకుఁ దెలిసియుండినయెడల రైలుమార్గములును, బిలమార్గములును గట్టుట చాలసుకరమై యుండును.) తుద కింద్రుఁడు వజ్రాయుధమున నతనిఁ గొట్టనుద్యమించెను. అప్పుడు దైవవాణి వీరు ప్రాచీనఋషులగు నరనారాయణు లని పలికెను. దైవవాణియొక గొప్పసుయోగము—ఎవరు చెప్పిరో తెలిసికొనుట కవకాశ ముండదు—కాని, చెప్పవలసినవిషయము ప్రకాశ మగును. ఆదైవవాణిని విని దేవతలు తిరిగి పోయిరి. అంతట కృష్ణార్జునులు స్వచ్ఛందముగ వనమునఁ దిరుగ సాగిరి. అగ్నిభయమువలనఁ బసుపక్ష్యాదులు పలాయనము నొందెను. వాని నన్నిటిని వారు బాణములతోఁ గొట్టసాగిరి. వాని మేదోమాంసములను దినుటచే నగ్ని కజీర్ణబాధానివర్త్తి యయ్యెను. విషమువలన విషము శాంతించును. అంతట నగ్ని కృష్ణార్జునులకు వరదానము చేసెను. పరాభూతులైన దేవతలుకూడ వచ్చి వారికి వరదానమును జేసిరి. సకలపక్షులవారును సుఖముగ వారివారియిండ్లకుఁ బోయిరి.

ఇట్టికల్పితకథ ననుసరించి యైతిహాసిక సమాలోచనమునకుఁ బ్రయత్నింతుమేని బాల హాస్యాస్పదుల మగుదుము. అంతియె కాని, వేఱొకఫల మేమియును లేదు. మనము వ్రాయఁబూనుకొనిన కృష్ణచరిత్రమున కిది యేమియు సహకారి కాఁజాలదు. ఇందేమైన నైతిహాసికతత్త్వ ముండినయెడల నది యింతమాత్రమే యైయుండును—పాండవుల రాజధానిసమీపమున నొక పెద్దవనముండె ననియును, నందనేకము లగుఘాతుకమృగములు వాసము చేయుచుండె ననియును,

కలిగెను. దీనికుపాం
“మంచిది! ఆజ్యభక్షి
క్షింపుము. ఖాండవ
అని చెప్పెను. అది
వనమునాల్గుప్రక్క
ను. కాని, యావన
చుండెను. అంతట
చ్చి యాయగ్నిని క
ములనెత్తికొని య
వసించుచున్న పశుప
ర్వ్యాఘ్రములు వి
బడెను. అగ్నియ
సమ్ముఖమునకు
ను. విశేషముగ
భుజింపఁజేయుదు
డు తన సమాచా
భక్షింపఁబోయితి
నివారింపఁ జేసెను
రులై వనముచుట్టు
యఁజేసెను. కా
ను. అది యెట్లు
జాలదు. అట్లు
క్షించుకొనుటకు
మైనను నిందుప్రేఁడ

ను లేవు. సభ యైతిహాసిక మైనయెడల దాని నిర్మించినవాఁడొక్కఁడవశ్యముగ నుండవలయును. దానిని నిర్మించినవాని నామము మయుఁడు. అతఁడనార్యవంశీయుఁడై యుండవచ్చును. ఇందువలన నాతనికి మయదానవుఁడను పేరు కలిగియుండవచ్చును. ఆతఁడు విపన్నుఁడై యుండి యర్జునసహాయమున జీవనలాభము నొంది, యందులకుఁ గృతజ్ఞతాపూర్వకముగ సభను నిర్మించు కార్యము చేసియుండవచ్చును. ఇది నిశ్చయమైనయెడల నాతఁడెట్లు విపన్నత నొంది యర్జునునిచే నుపకారమును బొందినదియు నా కథయంతయు ఖాండవదాహమున నేర్పడుచున్నది. కాని, యిది యంతయు యోచనాబలముననే సిద్ధాంతము చేయవలసివచ్చుచున్నది. అట్లే ప్రాచీనైతిహాసిక గ్రంథములు నిర్మింపఁబడినవి.

మయదానవుని వృత్తాంతమంతయును గవిసృష్టియైనదై యుండవచ్చును, ఎట్లయినను గవి కృష్ణార్జునుల చరిత్ర దీనికుపలక్ష్యము సేసికొని యెట్లు నిర్మించెనో, యది చాలమనోహరముగఁ గన్పట్టుచున్నది. దానిగూర్చి వ్రాయకుండ నుండఁజాలము. మయదానవుఁడు ప్రాణరక్షణము నొంది యర్జునుని జూచి "మీరు నాకుఁ బ్రాణదాన మొసంగితిరి; మీరు నన్ను రక్షించితిరి; కావున, మీకు నే నెట్టిప్రత్యుపకారము గావింతునో యాజ్ఞాపింపుఁడు." అని విన్నవించెను. అర్జునుఁ డేమియును బ్రత్యుపకారమును గాంక్షింపలేదు. కేవలము ప్రీతిభిక్ష నడిగెను. కాని, మయదానవుఁ డూరకుండక యేదో యొక కార్యము చేయకుండఁ బోనని యెను. అప్పు డర్జునుఁ డతనిఁ జూచి "ఓ మయుఁడా! నీవా నన్ను మృత్యువునుండి రక్షింపఁబడితినని చెప్పి నాకుఁ బ్రత్యుపకారము సేయ నిష్టపడుచున్నావు. ఇందుకొఱకు నీవలన నేమియుఁ బనిచేయించుకొన నాకిష్టము లేదు." అని చెప్పెను.

గృష్ణార్జును లావనమున కగ్ని నంటించి ఘాతుకమృగముల నప్పుడెచ్చి యందుఁ దిరుగుటకు యోగ్యమైనదానిఁగా నొనర్చి రనియును నిందు మనము యోచింపవలసి యున్నది. కృష్ణార్జును లిట్లొనర్చుటవలన నైతిహాసిక కీర్తిగాని, యశఃకీర్తిగాని, యేమియుఁ గలుగఁబోదు సుందర వనమును రక్షించువారు నిత్యము నిట్లు చేయుచునే యున్నారు.

ఇట్టివ్యాఖ్య Toll Boy's wheeler చేసియున్నాఁడు. కాని, మేముకూడ నిట్టితాత్పర్యమును సూచించుటకుఁ గారణ మొకటి యున్నది. ఖాండవదాహకథ చాలవఱకు మహాభారతమున మూలభాగము లోనిదై యున్నది. కాని, స్థూలకథ యేమాత్రమైనను, శ్రీమహాభారతమున లేదనిచెప్పుటకు వీలుపడదు. పర్వసంగ్రహాధ్యాయమునను, అనుక్రమణికాధ్యాయమునను దీని ప్రసంగమున్నది. ఈ ఖాండవదాహ కథనుండియే సభాపర్వము నందలికథ యేర్పడుచున్నది. ఈవనమధ్యమున మయదానవుఁడొకఁడు వాసముచేయుచుండెను. ఆతఁడుకూడ ఖాండవవనమునఁ బడి చచ్చుటకు సిద్ధమయ్యెను. ఆతఁ డర్జునునికడకుఁ బోయి ప్రాణభిక్ష నడుగుకొనియెను. అర్జునుఁడుకూడ శరణాగతుఁడైన యతని రక్షించెను. దీనికిఁ బ్రత్యుపకారముగ మయుఁడు పాండవుల కత్యుత్కృష్టమైన సభ నొకదానిని నిర్మించి యిచ్చెను. ఈసభనుండియే సభాపర్వమందలికథ యేర్పడుచున్నది.

సభాపర్వ మష్టాదశపర్వములలో నొకపర్వము. మహాభారత యుద్ధమునకు బీజ మిందేర్పడుచున్నది. కావున దీనినొక్క మాటుగఁ ద్రోలఁగించుటకు వీలు లేదు. అట్లయినమొదల నిందుఁ గొంత నైతిహాసిక తత్త్వముండవలయును. దానిని విచారించి తెలిసికొనుట యుచితము. సభయును, దానినుపలక్షించి రాజసూయయజ్ఞమును, మాలికములును, నైతిహాసికములు నని, తీసికొనుట కాక్షేపణము లేమియు

ను లేవు. సభ యైతిహాసిక మైనమొదలదాని నిర్మించినవాని [illegible]
ముగనుండవలయును. దానిని నిర్మించినవాని నామము మయుఁడు. ఆతఁ
డనార్యవంశీయుఁడై యుండవచ్చును. ఇందువలన నాతనికి మయదానవుఁ
డనుపేరు కలిగియుండవచ్చును. ఆతఁడు విపన్నుఁడై యుండి యర్జును
సహాయమున జీవనలాభము నొంది, యందులకుఁ గృతజ్ఞతాపూర్వకము
గ సభను నిర్మించు కార్యము చేసియుండవచ్చును. ఇది నిశ్చయ [illegible]
ల నాతఁడెట్లు విపన్నుఁడై నుండి యర్జునునిచే ముక్తుఁ డాయెనను [illegible]
నా కథయంతయు ఖాండవదాహమున చెప్పఁబడియున్నది. కాని, [illegible]
తయు యోచనాబలముననే సిద్ధాంతము చేయవలసివచ్చుచున్నది. [illegible]
ప్రాచీనైతిహాసిక గ్రంథములు నిర్మింపఁబడినవి.

మయదానవుని వృత్తాంతము [illegible] నిశ్చయముగఁ [illegible]
వచ్చును, ఎట్లయినను గవి కృష్ణార్జునుల [illegible] తీసికొని [illegible]
కొని యెట్లు నిర్మించెనో, యది చాలమనోహరముగ [illegible].
దానిగూర్చి వ్రాయుట [illegible]. మయదానవుఁడు [illegible]
ణము నొంది యర్జునుని జూచి "[illegible]
మీరు నన్ను రక్షించితిరి; కావున, మీకు [illegible]
గావింతునో యాజ్ఞాపింపుఁడు." అని విన్నవించెను. అర్జునుఁడు [illegible]
ను బ్రత్యుపకారమును గాంక్షింపలేదు. [illegible].
కాని, మయదానవుఁడు [illegible]
బోనని యెను. అప్పు డర్జునుఁడు [illegible] "మయుఁడా! [illegible]
మృత్యువునుండి రక్షింపఁబడితి [illegible]
య నిష్టపడుచున్నావు. [illegible]
కొన నాకిష్టము లేదు." అని చెప్పెను.

ఇదియే నిష్కామధర్మము. క్రైస్తవమతావలంబనమైన యూరోపాదేశమున నిట్లుకాదు. క్రైస్తవమతగ్రంథము (బైబిలు) విధించినప్రకారము స్వర్గముగాని, యీశ్వరప్రీతి గాని, వారికామ్యమైయున్నది. మనము వీనిని బరిత్యజించి పాశ్చాత్యగ్రంథములనుండి ధర్మమును, నీతిని, నేర్చికొనుటకై ప్రయత్నించుట మనదౌర్భాగ్యము. అర్జునవాక్యములలోఁ జివర నిట్టినిష్కామధర్మము స్పష్టముగఁ దేటపడుచున్నది. అర్జునున కేదైనఁబ్రత్యుపకారము చేయఁగలిగినయెడల మయుఁడు తానుసంతోషింతునని యనుకొనుచుండఁగా నర్జునుఁ డాతని నట్టిసంతోషమునుండి వంచించుట కిష్టములేనివాఁ డయ్యెను. కావున, నాతఁడతనినిజూచి నీయభిలాషము వ్యర్థముచేయుటకూడ నాయుద్దేశము కాదు. కావున, నీవు కృష్ణున కేదైన నొకకార్యమును జేసిపెట్టుము. అట్లైన యెడల నాకుఁ బ్రత్యుపకారమును జేసినవాఁడ వగుదువని చెప్పెను.

అనఁగా:—నీవలన నేదియైనఁ బనిచేయించుకొనవలసివచ్చిన యెడల నదికూడ నితరులపనియై యుండవలయును. నాకార్యమును జేయించుకొనఁగూడదు.

అప్పుడు మయుఁడు కృష్ణుని జూచి "నన్నేదైన నొకకార్యమందు నియమింపుము." అని ప్రార్థించెను. మయుఁడు దానవవిశ్వకర్మ—కృష్ణుఁడుకూడ తనకార్యమును జేయించుకొననిష్టపడలేదు. ఆతఁడు మయునిఁ జూచి "మనుష్యు లనుకరించుటకు వీలుకానిసభ నొకదానిని యుధిష్ఠిరునికొఱకు నిర్మింపుము." అనిచెప్పెను.

ఇది కృష్ణునిస్వకార్యము కాదు—కాని, స్వకార్యమువంటిదే. కృష్ణుఁడు తనజీవితమున రెండుకార్యముల నేర్పాటు చేసికొనియె నని యిదివఱకే చెప్పియుంటిమి. అది ధర్మప్రచారము; ధర్మరాజ్యసంస్థాపనము. ధర్మప్రచారవిషయ మింకను బాగుగఁ దెలియఁ జేయలేదు.

ఈసభానిర్మాణమే ధర్మరాజ్యసంస్థాపనమునకుఁ బ్రథమసూత్రము. ఇచ్చోటనే యాతఁడు దాని నభిసంధించుటనుగూర్చి ప్రథమపరిచయము కలుగుచున్నది. యుధిష్ఠిరుని సభ నిర్మింపఁబడినతరువాత జరుగువిశేషము లన్నియును ధర్మరాజ్యసంస్థాపనముగఁ బరిణమించినవి. ధర్మరాజ్యసంస్థాపనము జగత్కార్యము. అట్టిది కృష్ణునియుద్దేశ మైనయెడల నీసభాసంస్థాపనముకూడ నాతనిస్వకార్యమువంటిదే.

క్రిందటి యధ్యాయమున సమాజసంస్కరణమునుగూర్చి కొంత చెప్పఁబడియెను. ఆతఁడు సమాజసంస్థాపకుఁ డగుటకుఁ బ్రయాస పొందియుండలేదని యిదివఱకుఁ జెప్పియుంటిమి. దేశమునందలి నైతిక, రాజనైతిక, పునరుజ్జీవనమే (అనఁగా ధర్మప్రచారము, ధర్మరాజ్యసంస్థాపనము) యాతనియుద్దేశము. ఇవి నెఱవేఱినయెడల సమాజసంస్కారము దానియంతట నదియే జరుగును. ఇది నెఱవేఱనియెడల సమాజసంస్కారము జరుగనేరదు. ఆదర్శపురుషుఁడు దీని నెఱిఁగియుండును. వృక్షమునకుఁ బాదు చేసి నీరు పోయకుండఁ బైని నీరుచల్లినంతమాత్రమున నది ఫలింపనేరదని యాతనికిఁ దెలియును. మనము సమాజసంస్కరణ మన నేదో యొకయితరకార్య మని యెంచుకొని గందరగోళమును జేయుచున్నాము. మనఖ్యాతిప్రీతియే దీనికి ముఖ్యకారణము. సమాజసంస్కారులమై యుండినయెడల నాకస్మికముగ ఖ్యాతిలాభము నందవచ్చును. యూరపుఖండపద్ధతి నైనచో మఱియు విశేషము. పని లేనిదంభవాక్యములచే ననుమోదించుచుందురు. సంఘసంస్కరణము నెఱవేఱినను నెఱవేఱకున్నను శుష్కోపన్యాసములు జరుగుచునే యుండును. అవి చాల నామోదకరమైనవి. ధర్మోన్నతికి సంబంధి సమాజసంస్కరణ మెట్లు నెఱవేఱునో మేమీసాంప్రదాయకుల నడుగుచున్నారము. రాజనీతికిఁగూడ మూలము ధర్మోన్న

తియే. కావున, నందఱును ధర్మోన్నతియందే మనసుంచవలయును. అట్లయినయెడల సమాజసంస్కారణమునకు వేఱె ప్రయత్నింప నక్కఱలేదు. అట్లుకానియెడల దేనివలనను, సమాజసంస్కారము గాఁజాలదు.

పంచమపరిచ్ఛేదము.



కృష్ణుని మానవత్వము.

కృష్ణచరిత్రపర్యాలోచనమున మేము కృష్ణుని కేవలము మనుష్యుఁడుగనే పరిగణించితిమి. ఆతఁ డీశ్వరావతారుఁ డగునో, కాఁడో, మే మేమియును జెప్పుచుండుట లేదు. ఆ ప్రస్తావముతోఁ బాఠకుల కేమియును సంబంధము లేదు. ఏల యనినః—మామతమును స్వీకరింపుఁ డని మేము పాఠకులఁ గోరుట లేదు. అవలంబించుటయు, నవలంబింపకుండుటయుఁ బాఠకులచిత్తముమీఁదనే యాధారపడియున్నది. అవలంబింపుఁడని బలవంతపెట్టిన లాభము లేదు. స్వర్గము కారాగృహము కాదు; దాని కొకద్వారమైన లేదని నేను యోచింపను. ధర్మ మొకపదార్థము, దానిని సాధించునుపాయము లనేకము లున్నవి.— కృష్ణభక్తులును, క్రైస్తవులునుగూడ దానినిబొందవచ్చును. *

కావునఁ గేవలము కృష్ణధర్మము నవలంబింపనివారిని బతితులని యెంచుట లేదు. కృష్ణద్వేషులు గాని, ప్రాచీనవైష్ణవులు గాని, మమ్ములను నిరయగాములుగ భావింపవలదని వేఁడుచున్నారము.

---

* ధర్మమున కసంఖ్యములైనద్వారము లున్నవి. ఏపరిశారమునసైనను ధర్మమును స్థాన మొనర్చినయెడల నది నిష్ఫలము కాఁజాలదు. మహాభారతము, శాంతిపర్వము, ౧౭౪ అధ్యాయము.

ఆతనిమానుషప్రకృతినిమాత్రమే యిచట యోచించుచుంటిమని చెప్పుచుంటిమి. ఆతనిని మేమాదర్శపురుషుఁడని యోచించుచుంటిమి. ఇందువలన నాతనిమానవాతీతమైనప్రకృతి యేదియైన నుండినయెడల దానివికాసముమాత్రము ప్రతిషిద్ధమగుచున్నది. ఈశ్వరుఁడు లోకశిక్షార్థమాదర్శమనుష్యస్వరూపమున నీలోకాలయమున జన్మించి యుండిన నుండవచ్చునని యిదివఱకుఁ జెప్పియుంటిమి. అట్లయినయెడల నాతఁడు మానసికశక్తిమూలముననే జగమునందలి మానుషికకార్యము లొనర్చును. అతఁ డెన్నడును లోకాతీతమైనశక్తితో లౌకికకార్యములం గాని, యలౌకికకార్యములు గాని యొనర్పఁడు.

ఏలయనిన:—మానవున కలౌకికశక్తి లేదు. వాని నాధారము చేసికొని స్వకార్యసాధన మొనర్చునాతఁడు మనుష్యున కాదర్శపురుషుఁడు కాఁజాలఁడు. ఏశక్తి మనుష్యునకు లేదో, దానిని మనుష్యుఁ డెట్లనుకరింపఁగలఁడు ? *

* We foreget that Christ incarnate, was such as we are, and some of us are buttling him where he can be no example to us at all. Let no fear of losing the dear great truth of the divinity of Jesus make you lose the dear great truth of the humanity of Jesus. He took upon himself our nature, as a man of the like passions, he fought that terrible tight in the wilderness year by year, as an innocent, man was he persecuted by narrow-hearted jews, and his was a humanity whose virtue was pressed by all the needs of the multitude and yet kept its richness of nature, a humanity which, though given up to death on the cross, expressed all that it is within the capacity of our humanity, and if we really follow him we shall be holy even as he is holy."

Sermon by Dr. Brookly, delivered at Trinity Church, Boston, March 25th 1885.

శ్రీకృష్ణసంబంధమున దీనినే చెప్పుచున్నాను.

కావున, శ్రీకృష్ణుఁ డీశ్వరునియవతార మైనను, నతని కలౌకిక శక్తివికాసము కాని, యమానుష కార్యసిద్ధి గాని, తటస్థింప నేరదు. మహాభారతమునందుఁ గృష్ణుఁ డలౌకికశక్తిచే నొనర్చిన కార్యము లన్నియు నమూలకము లనియుఁ బ్రక్షిప్తము లనియు, నాయాకథాసందర్భములఁ దెలిపెదము. కృష్ణుఁ డెచ్చటను దానీశ్వరావతారుఁడ నని పరిచయము చేయలేనట్లు చెప్పవలసి యున్నది. ఆతని కమానుషశక్తి యుండిన ట్లాతఁ డెచ్చటను బ్రకటించి యుండలేదు. ఎవ్వరైన నాతని యం దీశ్వరత్వ మారోపించినప్పు డతఁడావిషయము ననుమోదించి యుండలేదు. మఱియును వారలయావిశ్వాసము దృఢీకృత మగునట్లుగ నెట్టియాచరణము నొనర్చి యుండలేదు. కాని, యొకచోట "నేను సాధ్యమైనంతవఱకుఁ బురుషకారము ప్రకాశము చేయఁగలను. దైవానుష్ఠానమున నా కెంతమాత్రమును శక్తిచాలదు." * అని స్పష్టముగా నాతఁడే చెప్పి యున్నాఁడు.

అతఁడు యత్నపూర్వకముగ మనుష్యోచితము లైనయాచార వ్యవహారముల నాచరించెను. ఇతరు లెవ్వరైనను దన్ను దేవునిగా భావించుపద్ధతి నాతఁ డెన్నఁడును సంచరింపలేదు.

ఈవిషయము లన్నిటికి నుదాహరణస్వరూపముగ నాతఁడు ఖాండవదహనానంతరము యుధిష్ఠిరునియొద్ద సెలవుదీసికొని ద్వారకకుఁ బయనమై పోవుతఱి నెట్లాచరించెనో యిచ్చోట నెత్తి చూపుచున్నారము. ఇది చాల మనుష్యోచితముగఁ గనఁబడుచున్నది.

---

* అహం హి తత్కరిష్యామి పరం పురుషకారతః। దైవంతు న మయా శక్యం కర్మ కర్తుం కథంచన.

ఉద్యో-78-అధ్యాయము.

“వైశంపాయనుఁ డిట్లు చెప్పెను. భగవానుఁ డైనవాసుదేవుఁడు పరమప్రీతులైనపాండవులచేఁ బూజింపఁబడి కొన్నిదినములు ఖాండవప్రస్థమున వసించెను. చివరకుఁ బితృసందర్శనార్థము చాల సుత్సాహము కలవాఁడై స్వభవనమునకుఁ బోవ నభిలషించెను. అతఁడు మొదట ధర్మరాజు నామంత్రణము చేసి పిదపఁ దనమేనయత్తయైన కుంతికి సాష్టాంగప్రణామంబు లాచరించెను. తరువాత వాసుదేవుఁడు తనసోదరియైనసుభద్రకడకుఁ బోయి యర్థయుక్తములును, హితకరములును, సల్పాక్షరసంయుతంబులును, నఖండములును నగువాక్యములతో నామె కనేకవిషయములు బోధపఱిచెను. భద్రభాషిణియైనసుభద్రకూడఁ దనతల్లి మొదలగుస్వజనమునకు విజ్ఞాపనీయము లగువాక్యములను జెప్పి యనేకవిధముల నాతనిఁ బూజించి యభివాదన మొనర్చెను. వృష్ణివంశావతంసుఁ డైనకృష్ణుఁ డామెకడ వీడ్కోలు వడసి ద్రౌపదీధౌమ్యులకడకు వచ్చెను; ధౌమ్యునకు యథావిధిగ వందన మొనర్చి ద్రౌపదితో సంభాషించి యామెను వీడ్కొని యర్జునునితోఁ గలసి యుధిష్ఠిరాదిభ్రాతృచతుష్టయముకడకు వచ్చెను. అయ్యెడ భగవానుఁడైనవాసుదేవుఁడు పంచపాండవులచేఁ బరివేష్టితుఁడై యమరగణపరివృతుం డైనమహేంద్రునివలె శోభిల్లుచుండెను.

“తరువాతఁ గృష్ణుఁడు ప్రయాణకాలోచిత మైనకార్యముల నొనర్చుతలంపుతో స్నాన మొనర్చి యలంకారపరిధానముల ధరించి మాలాజపనమస్కారములతోడను, నానావిధసుగంధద్రవ్యములతోడను, దేవతలను, భూసురులను బూజించెను. అతఁడు క్రమముగఁ దత్కాలోచితము లైనసమస్తకార్యముల నెఱవేర్చి స్వనగరగమనార్థము బహిర్ద్వారమును వెలువడియెను. స్వస్తివాచకు లగుబ్రాహ్మణులు దధిపాత్రము, స్థలపుష్పములు, నక్షతలు మొదలగుమంగళద్రవ్యములను దీసికొని యచ్చటికి వచ్చిరి. వాసుదేవుఁడు వారలకు ధనదానపూర్వకముగఁ బ్రదక్షిణ మొనర్చెను. తరువాత నత్యుత్కృష్టము లైనతిథివారనక్షత్రయుక్త మైనశుభముహూర్తమున గదాసిచక్రశార్ఙ్గప్రభృతులగునస్త్రములతోఁ గూడి గరుడకేతనాలంకృతమై వాయువేగగామి యగుకాంచనరథం బెక్కి స్వపురమునకుఁ బ్రయాణ మయ్యెను. ఆసమయమున మహారాజైనయుధిష్ఠి

రుఁడు స్నేహపరతంత్రుఁడై యారథము నెక్కి సారథియైనదారుకుని స్థానాంతరమునఁ గూర్చుండఁజేసి తానుస్వయముగ సారథియై పగ్గముల ధరించెను. మహాబాహుఁడైన యర్జునుఁడుఁగూడ రథము నధిరోహించి స్వర్ణదండవిరాజితమైన శ్వేతచామరముతో శ్రీకృష్ణునకు వీవఁదొడంగెను. మహాబలపరాక్రమవంతుఁడైనభీమసేనుఁడును, నకులసహదేవులును, ఋత్విక్కులును, బురోహితులును, గలసి వారిని వెంబడింపసాగిరి. శత్రునిషూదకుఁడైనవాసుదేవుఁడు యుధిష్ఠిరాదిభ్రాతృవరులచే ననుగమ్యమానుఁడై శిష్యగణానుగతుఁడైనగురునివలె శోభిలుచుండెను. అతఁడర్జునుని గాఢాలింగన మొనర్చి, యామంత్రించి, యుధిష్ఠిర భీమసేనులను బూజించి నకులసహదేవులతో సంభాషించెను. యుధిష్ఠిరభీమసేనార్జును లాతని నాలింగనము చేసికొనిరి. నకులసహదేవు లాతని కభివాదన మొనర్చిరి. తరువాత, క్రమముగ నర్ధయోజన మేగినపిదప శత్రునిషూదనుఁడైనకృష్ణుఁడు యుధిష్ఠిరు నామంత్రణ మొనర్చి, మరలవలసిన దని యాతనిపాదములఁ బడియెను. ధర్మరాజు తనచరణములఁ బడినభక్తపావనుఁడైనకమలలోచనుని లేవనెత్తి యాతనిమస్తకము నాఘ్రాణించి స్వభవనమునకుఁ బోవ నాజ్ఞాపించెను. అప్పుడు భగవానుఁడైనవాసుదేవుఁడు పాండవులతోఁ బ్రతిజ్ఞావాక్యము లాడుచు నతికష్టముమీఁద వారలను మరలించి యమరావతికిఁబోవుమహేంద్రునివలె ద్వారవతికిఁ బయనమై పోయెను. పాండవులు కృష్ణుఁ డెంతవఱకుఁగనఁబడుచుండెనో, యంతవఱకును ననిమిషనయనములతో నాతని వీక్షించుచు మనస్సులతో నాతని ననుగమింపసాగిరి. కృష్ణుని జూడ వారిమనసులు పరితృప్తిఁ బొందకపూర్వమే యాతఁడు వారలదృష్టిపథము దాఁటిపోయెను. అప్పుడు పాండవులు కృష్ణుఁడు కనఁబడుట లేదని యాతనివిషయమై యాలోచించుకొనుచు స్వనగరమునకు మరలిరి. దేవకీనందనుఁడైనకృష్ణుఁడుకూడఁ దనతో వచ్చుచున్నసాత్యకితోడను, సారథియైనదారుకునితోడను, వేగవంతుఁడైనగరుడునివలె సత్వరముగ ద్వారకాపురముఁ బ్రవేశించెను. యుధిష్ఠిరుఁడుగూడ భ్రాతృవరులతోఁ గలిసికొని సుహృజ్జనపరివృతుఁడై స్వపురమునఁ బ్రవేశించి తనసోదరులకును, మిత్రులకును, బాంధవులకును సెలవొసంగి ద్రౌపదితో నామోదప్రమోదములఁ బొందుచుఁ గాలక్షేపము సేయుచుండెను. ఇటఁగృష్ణుఁడు గూడఁబరమాహ్లాదముతో ద్వారకాపురము ప్రవేశించెను. ఉగ్రసేనుఁడు మొదలగుయదుశ్రేష్ఠు లాతని బూజించిరి. వాసుదేవుఁడు పురప్రవేశ మొనర్చి ప్రథమమున వృద్ధపిత యైనయాహుకునకును, యశస్విని యైనమాతకును, బలభద్రునకును, నభివాదన మొనర్చి పిదప బ్రద్యుమ్నానిరుద్ధగదసాంబచారుదేష్ణభానుకుల నాలింగన మొనర్చి, వృద్ధులయనుమతిఁ గైకొని రుక్మిణీమందిరమునకుఁ బోయెను.,,

షష్ఠపరిచ్ఛేదము.

జరాసంధవధపరామర్శ.

ఈవిధముగ సభానిర్మాణ మయ్యెను. యుధిష్ఠిరుని రాజసూయ యజ్ఞమునుగూర్చి ప్రస్తావ మయ్యెను. అంద ఱావిషయము నంగీకరించినను యుధిష్ఠిరుఁడు కృష్ణానుమతి లేకుండ దాని కీయకొనుట కనిష్టుఁ డయ్యెను. ఏల యనిన—కృష్ణుఁడే నీతిజ్ఞుఁడు; కావున, నాతఁడు కృష్ణునిఁ దోడితెచ్చుటకై చారుల నంపెను. కృష్ణుఁడుకూడ యుధిష్ఠిరుని వార్త వినినంతనే బయలుదేఱి ఖాండవప్రస్థమునకు వచ్చి చేరెను.

రాజసూయానుష్ఠాన సమయమున యుధిష్ఠిరుఁడు కృష్ణునితో నిట్లు సంభాషించెను. "నేను రాజసూయయాగము చేయ నభిలషించుచున్నాను. యజ్ఞము కేవలము నిచ్ఛతోడనే నెఱవేఱునది కాదు. ఏవిధముగ నెఱవేఱునో, యది నీకే విశద మగును. చూడుము! ఎవ్వనిచే సకలమును సంభవించుచున్నదో, ఎవఁడు సర్వత్రపూజ్యుఁ డగుచున్నాఁడో, ఎవఁడు పృథ్వీతలమున కీశ్వరుఁడో అట్టి వ్యక్తియే రాజసూయానుష్ఠానమున కుపయుక్తమైన పాత్రము."

అని చెప్పి యుధిష్ఠిరుఁడు కృష్ణుని జూచి "నేనట్టివాఁడనా? నావలన సకలమును సంభవించుచున్నదా? నేను సర్వత్ర పూజ్యుఁడనా? ఈపృథివి యంతకు నధినాథుఁడనా?" అని యడిగెను. యుధిష్ఠిరుఁడు తనభ్రాతృవరుల భుజబలమువలన నొకగొప్పరా జయ్యెననుట సత్యమే. కాని, యాతఁడు రాజసూయము సేయ సమర్థుఁడగు పురుషుఁ డయ్యెనా? ఎవరివిలువ యెట్టిదో, యది వారికి సహజముగఁ దెలియదు. దాంభికులును, దురాత్ములును దమ గొప్పతనమునుగూర్చి

తాము కృతనిశ్చయులై సంతుష్టచిత్తముల నుందురు. కాని యుధిష్ఠిరునివంటి సావధానచిత్తుఁడును, వినయసంపన్నుఁడును, నటు సేయఁజాలఁడు. నేను గొప్పరాజు నైతి నని యాతఁడు మనస్సునఁ దెలిసికొనెననుట సత్యమే. కాని తనవిలువయెడలఁ దాను విశ్వాసవంతుఁడై యుండలేకపోయెను. ఆతఁడు తనమంత్రివర్గమును, భీమార్జునాది సోదరులను బిలిచి "నేను రాజసూయమును జేయ సమర్థుఁడనా?" అని యడిగెను. "నీవవశ్యముగఁ జేయఁగలవు. నీవే దానికి యోగ్యమైనపాత్రుఁడవు" అని వారు ప్రత్యుత్తరము చెప్పిరి. తరువాత నతఁడు ధౌమ్యద్వైపాయనాది ఋషులను బిలిచి "నేను రాజసూయమును జేయఁగలనా?" అని యడిగెను. వారందఱును "అవశ్యముగఁ జేయఁగలవు. నీవందుల కుపయుక్తమగు పాత్రుఁడవు." అని చెప్పిరి. అప్పటికిని * సావధానచిత్తుఁడైన యుధిష్ఠిరునకు మనోనిశ్చయము కలుగలేదు అర్జునుఁడైనను, వ్యాసుఁడైనను—యుధిష్ఠిరునియొద్దఁ బరిచితులైనవారలలోఁ గృష్ణుఁడే యందఱికంటెను శ్రేష్ఠుఁడు. ఆతనియొద్ద నీవిషయమునకు సమాధానము వడయక యుధిష్ఠిరునిసందేహము పోఁజాలదు. అందుచే నాతఁడు మహాబాహుఁడును సర్వలోకోత్తముఁడును, నైనకృష్ణునితో నాలోచింప స్థిరపఱిచికొని "కృష్ణుఁడు సర్వకర్త; ఆతఁ డవశ్యముగ నాకు మంచియాలోచనమును జెప్పును." అని యోచించుకొనియెను. అందువలననే యాతఁడు కృష్ణుని దోడితెచ్చుటకై చారులను బంపెను; కృష్ణుఁడు వచ్చినతరువాతఁ దనవృత్తాంతము నాతనికిఁ జెప్పెను.

* బుద్ధిమంతులు పాండవులచరిత్రమును సమాలోచనము చేసేవయెడల యుధిష్ఠిరుని ప్రధానగుణము సావధానత యని తెలిసికొనఁగలుగుదురు. భీముఁడు దుస్సాహసి; అర్జునుఁడు తనబాహుబలగౌరవమును దెలిసికొనుటచే నిర్భయుఁడును నిశ్చింతుఁడును; ఈజగమున సావధానతయే యనేకస్థలముల ధర్మముగఁ బరిగణింపఁబడు చున్నది. ఈవిషయ మప్రస్తుత మైనను గురుతరవిషయ మని యిచ్చోటఁ జెప్పవలసి వచ్చినది. ఈసావధానతతో యుధిష్ఠిరుని ధ్యాతానురాగ మెంతవఱకు సంగతముగానున్నదో యావిషయమునుగూర్చి తెలుపుస్థాన మిది కాదు.

"నా సుహృద్వరులు యజ్ఞము చేయు నాలోచనమును జెప్పిరి. కాని నేను నీయాలోచనము దీసికొనక యే దానిని జేయ సమకట్ట లేదు. ఓకృష్ణా! కొందఱు బంధుభావమును బట్టి దోషప్రకటనమును జేయరు. కొందఱు స్వార్థపరులై ప్రియవాక్యములఁ జెప్పుదురు. మఱికొందఱు తమ కేది హిత మగునో, దానిని స్థిరపఱిచి బోధపఱుతురు. ఓమహాత్మా! ఈపృథివిలోఁ బైనిజెప్పినవారలే యధికముగ నుందురు. కావున వారియాలోచనమును దీసికొని యేకార్యమును జేయరాదు. పైని వివరించినదోషములు నీకడ లేవు. నీవు కామక్రోధవర్జితుఁడవు. కావున నాకు సత్యమైనయాలోచనమును జెప్పుము."

పాఠకులారా! చూడుఁడు! నిత్యమును కృష్ణునికార్యకలాపములఁ జూచుచున్న యాతనియాత్మీయు లాతనిగూర్చి యెట్లు యోచించుచున్నారో చూడుఁడు! మన మాతనిగూర్చి యెట్లుగా యోచించుచున్నారమో? కృష్ణుఁడు కామక్రోధవర్జితుఁ డనియును, అందఱికంటె సత్యవాది యనియును, సర్వదోషరహితుఁ డనియును, సర్వలోకోత్తముఁ డనియును సర్వజ్ఞుఁడనియును, సర్వకార్యకరుఁ డనియును వారలు యోచించుచున్నారు. ఆతఁడు లంపటుఁ డనియును నవనీతచోరుఁ డనియును కుచక్రి యనియును మిథ్యావాది యనియును, రిపువశీభూతుఁ డనియును, ఇతరదోషయుక్తుఁ డనియును మనము యోచించుచున్నారము. ఆతఁడు ధర్మమునకుఁ బరమాదర్శస్వరూపుఁ డని ప్రాచీనగ్రంథములు తెలుపుచున్నవి. ఏజాతి యాతని న్యూనతపఱిచెనో యాజాతి యందు ధర్మలోప మగు ననిన విచిత్ర మేమి?

యుధిష్ఠిరు డెట్లు భావించెనో, అట్లే జరగెను. అప్రియమునైనసత్యవాక్యము లెవ్వరును యుధిష్ఠిరునితోఁ జెప్పలేదు. కృష్ణుఁడు మాత్రమే చెప్పెను. యుధిష్ఠిరునిజూచి మధురవచనములతో "నీవు

యుధిష్ఠిరుఁ డెట్లు భావించెనో అక్లేజరిగెను. అప్రియము లైన సత్యవాక్యము లెవ్వరును యుధిష్ఠిరునితోఁ జెప్పలేదు. కృష్ణుఁడు మాత్రమే చెప్పెను. యుధిష్ఠిరునిజూచి మధురవచనములతో "నీవు రాజసూయమున కధికారివి కావు. ఏల యనిన:—సమ్రాట్టువు గాక రాజసూయమున కధికారివి కాఁజాలవు. నీవు సమ్రాట్టువు గావు. మగధాధిపతి యైనజరాసంధుఁ డిప్పుడు సమ్రాట్టుగ నున్నాఁడు. ఆతని జయింపకయె నీవు రాజసూయమున కధికారివి కాఁజాలవువు. దానిని సంపన్నము చేయఁజాలవు." అని చెప్పెను.

కృష్ణుని స్వార్థపరునిగను కుచక్రిగను భావించినవార లిది విని "ఇట్టిది కృష్ణమత మగుట సంగతముగనే యున్నది. జరాసంధుఁడు కృష్ణునిపూర్వశత్రువు. కృష్ణుఁడు స్వయముగ నాతని వెడలఁగొట్టలేక పోయెను. ఇప్పుడు బలవంతు లైనపాండవుల మూలకముగ నాతనివధ సాధన మొనర్చి తనయిష్టసిద్ధిఁ గావించుకొనుటకు మంచిసమయము వచ్చినదని యిట్టియాలోచనమును జెప్పియుండును." అని చెప్ప వచ్చును.

ఇంకొకమాట చెప్పవలసి యున్నది. జరాసంధుఁడు సమ్రాట్టే. కాని తైమూరులంగు నెపోలియనులవంటి యత్యాచారుఁ డగుసమ్రాట్టు. పృథివి యాతనియత్యాచారములచేఁ బ్రపీడిత మయ్యెను. జరాసంధుఁడు రాజసూయయజ్ఞార్థము ప్రతిన యొనర్చి బాహుబలమున సమస్తభూపాలురను బరాజయము నొందించి పర్వతకందరమధ్యమున గజసమూహమును బంధించినసింహమువలె వారిని గిరిదుర్గమున బం

ధించెను. రాజులను గారాగారమున నుంచుటకు మఱియొక భయానక మైనయుద్దేశము కలదు. ఆరాజులను యజ్ఞకాలమున మహాదేవునకు బలి యిచ్చుట యాతనియభిప్రాయము. పూర్వము యజ్ఞసమయములయం దెవ్వరైనను నరబలి యిచ్చియుండిన ట్లితిహాసజ్ఞు లెవ్వరును జెప్పియుండలేదు. * కృష్ణుఁడు యుధిష్ఠిరునిఁ జూచి "ఓభరతకులప్రదీపా! బలిప్రదానార్థమై తీసికొనిరాఁబడినరాజులు ప్రోక్షితులును, ప్రమృష్టులు నై పశువులవలెఁ బశుపతిగృహమున వాసము చేయుచు నతికష్టమున జీవనము గడపుచుండిరి. దురాత్ముఁ డైన జరాసంధుఁడు వారల నచిరకాలములోనే వధించును. దీనికై నేనాతనితో యుద్ధమునకు సంసిద్ధుఁడవు కావలసినదని యుపదేశించితిని. ఈదురాత్ముఁ డెనుబదియాఱుగురు రాజులను దీసికొని వచ్చెను. ఇఁకఁ బదునలుగురు మాత్రము కావలసి యున్నది. వారినిగూడఁ దీసికొనివచ్చినయెడల నీనృపాధముఁడు వారల నందఱ నేకకాలముననె సంహరించును ఓధర్మాత్మా! ఇప్పు డెవ్వరైనను దురాత్ముఁ డైనజరాసంధుని క్రూరకర్మమునకు విఘ్నము నాపాదించినయెడల వారల యశోరాశి భూమండలమున దేదీప్యమానముగఁ దేజరిల్లఁగలదు. ఆతని జయింపఁగల్గిన యాతఁడే యీసామ్రాజ్యమును నిశ్చయముగఁ బొందఁగలఁడు." అని చెప్పెను.

కావున జరాసంధుని వధించుటకు యుధిష్ఠిరుని బ్రోత్సాహపెట్టుటలోఁ గృష్ణుఁడు తనహితమును గోరి యుండలేదు. యుధిష్ఠిరుఁడు తనయిష్టసిద్ధి నొందుటకూడ నాతని యుద్దేశము కాదు. కారాబద్ధులైన రాజమండలిహితము గోరియును, జరాసంధుని యత్యాచారము

* ఇట్లు నరబలి యిచ్చుట సామాజికాచారము కాదు. నీవెచ్చోటను నరబలిని జూచియుండలేదు.'' అని కృష్ణుఁ డొకచోటఁ జెప్పి యున్నాఁడు. ధార్మికు లైనవార లీభయానకాచారమునకుఁ గడంగరు.

చే బ్రపీడిత మైనభారతవర్షహితము కొఱకియును ప్రజాహితమునకొఱకియును గృష్ణుఁడు యుధిష్ఠిరుని బ్రోత్సాహపఱిచెను. కృష్ణుఁడు తాను రైవతకగిరిదుర్గము నాశ్రయించియుండుటచే నాతఁడు జరాసంధుని బాహుల కతీతుఁడును నజేయుఁడు నైయున్నాఁడు. జరాసంధుని వధించుటలో నాతనికి స్వపక్షమున నిష్టానిష్టము లేవియును లేవు. ఒకవేళ నేవిమైన నుండినను దేనివలన లోకహిత మగునో, యట్టియాలోచనమునే చెప్ప నాతఁడు ధర్మబద్ధుఁడై యున్నాఁడు—అట్టియాలోచనమువలన స్వార్థసిద్ధి యేమియైన నుండినను దానినే చెప్ప బాధ్యుఁడు. ఈకార్యమున లోకహితసాధన మగుట సత్యమే. కాని, "యిందు నాకుఁగూడ నేదైన స్వార్థసిద్ధియుండును—ఇట్టియాలోచనము చెప్పుటవలన లోకులు నన్ను స్వార్థపరుఁ డని యనుకొందురు. కావున నిట్టియాలోచనములు చెప్పను."అని యెవఁడు తలఁచునో, నిజముగ వాఁడే స్వార్థపరుఁడు; అధార్మికుఁడు; ఏలయన:—అట్టివాఁడు తనమర్యాదనే చూచుకొనును గాని, లోకహితమును గూర్చి యోచించువాఁడు కాఁడు. ఎవఁ డిట్టికళంకము నాదరపూర్వకముగ వహించి లోకహితసాధనమునకై పని చేయునో, యాతఁడే యాదర్శధార్మికుఁడు.

యుధిష్ఠిరుఁడు సావధానవ్యక్తి. సహజముగ జరాసంధునితోడి వివాదమున కొప్పికొనియుండలేదు. కాని, భీమునివీరగర్వోక్తులవలనను, అర్జునుని తేజోగర్భిత వాక్యములవలనను, కృష్ణుని యాలోచనమునకు కట్టకేలకు సమ్మతించెను. కృష్ణభీమార్జునులు మువ్వురును జరాసంధుని జయించుటకు బయలువెడలిరి. ఎవనియసంఖ్యాకములగు సైన్యమునకు భయమంది ప్రబలపరాక్రమవంత మైనవృష్ణివంశము రైవతక పర్వతము నాశ్రయించెనో యట్టి వానిని జయించుటకు మువ్వురుమాత్రమే ప్రయాణమైరి. ఇదియెట్టి యాలోచనము ! ఇట్టి

శ్రీకృష్ణుని యాలోచనము. ఈయాలోచనము కృష్ణునియాదర్శ చరిత్రముతో సంగతముగనే యున్నది. జరాసంధుఁడు దురాత్ముఁడు. అందువలన నతఁడు దండనీయుఁడే. కాని, యాతని సైనికు లేమియపరాధ మొనర్చిరి? అట్టిసైన్యముతోఁ బోరుటకు సైన్యమునుగూడఁ దీసికొని పోవలయును. ఇట్టిసైన్య యుద్ధమున నిరపరాధులుకూడ వధింపఁబడుదురు. అపరాధులకును నిష్కృతియగును. ఏలయనిన, జరాసంధునకు సైన్యబల మెక్కువగ నున్నది. పాండవసైన్యము దానితో సమము కాఁజాలదు. కాని, యప్పటికాలపు క్షత్రియులలో ద్వంద్వయుద్ధమున కాహూతుఁడైన యెడల నెవ్వఁడును విముఖత నందఁగూడదనుధర్మము ప్రచారములో నుండెడిది. కావున, సనర్థకముగ లోకక్షయము గావింపకయె తాము మువ్వురుమాత్రము జరాసంధుని సమ్ముఖమునకుఁ బోయి యాతని ద్వంద్వయుద్ధమునకుఁ బిలువవలయు ననియును, నామువ్వురితో యుద్ధము చేయుటకు నాతఁ డవశ్య మంగీకరించు ననియుఁ గృష్ణునియుద్దేశము. అప్పుడు, ఎవరికి శారీరకబలమును, సాహసమును, శిక్షయు, నెక్కువగ నుండునో, అతఁడే జయము నొందును. ఈ విషయమున నల్వురే శ్రేష్ఠులు. కాని, యుద్ధసంబంధమున నిట్లు సంకల్పము చేసికొని, వారు స్నాతకబ్రాహ్మణవేషధారులై పోయిరి. ఈకృత్రిమవేష మేల వేసికొనవలయునో, యది తెలియలేదు. గోపనముగ జరాసంధునిబట్టి వధించుట వారియుద్దేశ మైయుండదు. వారలు శత్రుస్థానమున ద్వారముకడ నున్న భేరుల నన్నిటిని భగ్నము గావించి ప్రాకారమును, యజ్ఞశాలను భగ్నము గావించి, జరాసంధునిసభలోఁ బ్రవేశించిరి. కావున, గుప్తభావమునఁ బ్రవేశించుట వారియుద్దేశము కాదు. కృత్రిమవేషమును ధరించుట

కృష్ణార్జునుల కయోగ్య మైనది. ఇది గాక మఱియొక విశేష మున్నది. అదికూడ శోచనీయ మనియును, కృష్ణార్జునుల కయోగ్య మైనదనియును బోధ యగును. జరాసంధుని సమీపించినతర్వాత భీమార్జునులు నియమస్థు లైరి. నియమస్థు లైనయెడల మాటాడఁగూడదు. వారేమియును మాటాడియుండలేదు. కావున, జరాసంధునితో మాటాడుభారము కృష్ణునిపైఁ బడెను. కృష్ణుఁడు జరాసంధుని జూచి "వీరలు నియమస్థులు; ఇప్పుడు మాటలాడరు. పూర్వరాత్రి మైనతర్వాత నీతో మాటాడుదురు." అనిచెప్పెను. జరాసంధుఁడు కృష్ణునిమాటలను విని వారల యజ్ఞాలయముననుంచి స్వగృహమునకుఁ బోయెను; అర్ధరాత్రి మైనపిదపఁ దిరిగి వారలసమీపమునకు వచ్చెను.

ఇదికూడ నొక కళా కౌశలము. కళాకౌశలమె కాని, విశుద్ధ మైనది కాదు—చాతుర్య మైనదియే. ధర్మాత్మున కిది యోగ్య మైనది కాదు. ఈకళాకౌశలమున నున్నయుద్దేశ మేమి? కృష్ణార్జునుల నింతవఱకు ధర్మాదర్శ స్వరూపులుగఁదలంచుచున్నాము. అకస్మికముగ వారి యీయపనతి యేల? ఈచాతుర్యమున కేదైన నుద్దేశ మున్నయెడలఁ దమయభీష్టసిద్ధికొఱకు వీర లిట్టిపన్నుగడను జేసియుండవచ్చును. ఈ కళాకౌశలమువలన శత్రువుల నిర్జించుటకే యీయుపాయ మవలంబించి యుండవచ్చును. కాని, యట్లయినయెడల వీరలు ధర్మాత్ములు కారనియును, కృష్ణచరిత్రము మనము తలంచినంతవిశుద్ధమైనది కాదనియును జెప్పవలసి వచ్చును.

జరాసంధుని వృత్తాంతము నెఱుఁగనివార లేల యిట్టిచాతుర్యమును బన్నవలయునని తలంపవచ్చును. నిశీథసమయమున జరాసంధుఁడసహాయుఁడుగా నున్నప్పు డాతనిపై నాకస్మికముగఁ బడి వధించుట యె యీచాతుర్యముయొక్క యుద్దేశము. ఆయుద్దేశముతోడనే నిశీథ

సమయమున నాతని సందర్శనము దొరకున ట్లుపాయమును బన్ని యుండవచ్చును. కాని, వాస్తవముగ నిట్టియుద్దేశము వారికి లేదు. ఇట్టి కార్యమును వారొనర్చియుండలేదు. నిశీథకాలమున వారలు జరాసంధుని సందర్శించిరి. కాని, యప్పుడు వాని నాక్రమించి యుండలేదు. అట్టి ప్రయత్నమునుగూడఁ జేసియుండలేదు. నిశీథకాలమున యుద్ధము చేయలేదు—పగటిపూటనే యుద్ధము చేసిరి. గోపనముగ యుద్ధము చేయలేదు—బహిరంగముగ సకలపౌరవర్గమును, మగధవాసులయుసమక్షముననే; ఇట్లొకరోజునమాత్రమే యుద్ధము జరుగలేదు. పదునాలుగు దినములవఱకు యుద్ధము జరిగెను. మువ్వురును యుద్ధమొనర్చి యుండలేదు. ఒక్కఁడే యుద్ధము చేసెను. ఆకస్మికముగ నాతని నాక్రమించి యుండలేదు. యుద్ధసన్నద్ధుఁడగుటకు జరాసంధునకు విశేషావకాశమీయఁబడెను—ఇంతి యేలకు? యుద్ధానంతరమున నేను చదివిపోవుదుననునుద్దేశముతో జరాసంధుఁడు తనపుత్రునకు రాజ్యాభిషేకమొనర్చునంతవఱకు కాలము కవకాశ మీయఁబడెను. అస్త్రముల ధరింపకయె వారు మువ్వురును జరాసంధుని యొద్దకు వచ్చియుండిరి. కాపట్యమేమియుఁ జేసియుండలేదు. జరాసంధుఁ డడిగినతోడనే కృష్ణుఁడు తమవృత్తాంత మంతయు నాతనికిఁ జెప్పెను. యుద్ధకాలమున జరాసంధుని పురోహితుఁడు యుద్ధమువలనఁ గలుగు శరీరవేదన నుపశమించుటకై యుపయోగకరము లైనయౌషధము లన్నియుఁ దీసికొనివచ్చెను. కృష్ణునిపక్షమున నట్టిసహాయ మేమియును లేదు. అట్లయినను, సవ్యాయయుద్ధమును నాతఁడేమియు నాక్షేపించి యుండలేదు. యుద్ధకాలమున జరాసంధుఁడు భీమునిచే విశేషముగఁ బీడింపఁబడుచుండెడి[illegible] నకృష్ణుఁడు భీముని నట్లు పీడింపవలదని వారించెను. ఇట్టిచరిత్ర కలవారలీకార్యమునఁ జాతుర్యమును జూపుదురా? ఇట్టియుద్దేశమున్న [illegible]

చాతుర్యము సంభవమా? నిర్బోధు లైనవార లుద్దేశశూన్యమైన యు ట్రికత్వమును జేయఁగలిగినఁ జేయఁగలుగుదురు. కాని, కృష్ణార్జునులు మఱి యేమైనను నిర్బోధులు మాత్రము కారని శత్రుపక్షమువారు కూడ నంగీకరింతురు. అట్లయినయెడలఁ జాతుర్యమును గూర్చిన కథ యెందుండి వచ్చెను? ఈజరాసంధపర్వాధ్యాయముతోడ సంబంధము లేనియీకథ యెందుండి వచ్చెను? ఎవరైన దీని నిందుఁ జొన్పియుండిరా? ఇది ప్రక్షిప్తమా? ఈగ్రంథమున దీనికిఁ బ్రత్యుత్తర మేదియును లేదు. కాని, ఈవిషయ మింకను గొంచెము విశేషముగ నాలోచించి చూడవలయును.

మహాభారతమున నొక్కొకచోట నొకయధ్యాయమును, నొక్కొక్కచోట నొక్కొక్కపర్వాధ్యాయమును బ్రక్షిప్తములై యుండినట్లు మనము చూచియున్నాము. అట్లయినయెడల నొకయధ్యాయమునఁ గాని, యొకపర్వాధ్యాయమునందలియంశవిశేషమునఁగాని, కొన్ని శ్లోకములు ప్రక్షిప్తములై యుండుట సంభవము కాదా? ఇంక విచిత్రమేమియును లేదు. ప్రాచీనసంస్కృతగ్రంథము లన్నియును నిట్టి మహాకృతిని బొందిన వనుట ప్రసిద్ధవిషయమే. ఇందువలననే వేదాములయందు భిన్నభిన్నములైన శాఖలును, రామాయణాదిగ్రంథములయందుభిన్నభిన్నములైనపాఠములును, శకుంతల, మేఘదూత మొదలగునాధునికగ్రంథములమార్పులు గానఁబడుచున్నవి. సకలగ్రంథములయందును, మౌలికాంశమున నిట్లే యొకటి రెండుశ్లోకము లక్కడక్కడఁ బ్రక్షిప్తములు చేయఁబడుచుండుట కానఁబడుచున్నది. మహాభారతమునందలి మౌలికాంశమునఁ బ్రక్షిప్తములు కానఁబడుచుండుటలో విశేష మేమున్నది?

కాని, నామతమునకు విరోధముగనున్న శ్లోకములను బ్రక్షిప్తములని విడిచిపెట్టుట లేదు. ఏది ప్రక్షిప్తమో, ఏది ప్రక్షిప్తము కాదో దానిని

నిదర్శనపూర్వకముగఁ బరిశీలింపఁదలంచుచున్నాను. ప్రక్షిప్తము లని నేను వేనిని విడిచిపెట్టుచున్నానో, వానియందుఁ బ్రక్షిప్తచిహ్నములు గానఁబడుచున్న వని నేనవశ్యము చూపింపవలసి యున్నది. చిహ్నము లనుబట్టియే నేను ప్రక్షిప్తము లని చెప్పుచున్నాను.

చాలఁ బ్రాచీనకాలమునఁ బ్రక్షిప్తముగఁ జేయఁబడినదానిని గ్రహించుట కాభ్యంతరికప్రమాణములు తప్ప మఱి యేమియు నాధారము లుండవు. ఆభ్యంతరిక ప్రమాణములలో నొకటి శ్రేష్ఠమైనప్రమాణము—అసంగతి—అనైక్యత—గ్రంథమున నేదైన నొకవిషయము చెప్పఁబడి, యది యాగ్రంథమునందలి యితరభాగములకు విరుద్ధముగా నున్నప్పు డది గ్రంథకారుని భ్రమప్రమాదవశమునఁ గాని, లిపికారుని భ్రమప్రమాదవశమునఁగాని, తటస్థించి యుండవలయును; కాక ప్రక్షిప్తమై యుండవలయును. ఇట్లు మనము నిర్ధారణము చేసికొందము. ఏది భ్రమప్రమాదమో, ఏది ప్రక్షిప్తమో, అదికూడ సహజముగ నిరూపణము చేయవచ్చును. రామాయణగ్రంథమున నెచ్చోటనైనను రాముఁ డూర్మిళను వివాహము చేసికొనియెనని వ్రాయఁబడి యుండినయెడల నది లిపికారుని భ్రమప్రమాదమాత్రమని మనము సిద్ధాంతము చేసికొనవచ్చును. కాని, రాముఁ డూర్మిళను వివాహమాడుటకు లక్ష్మణునితో వివాదపడె ననియును, తరువాత రాముఁ డూర్మిళను లక్ష్మణున కిచ్చివేసె ననియును వ్రాయఁబడియుండినయెడల, నది లిపికారునిగాని, గ్రంథకారునిగాని భ్రమప్రమాదమై యుండవచ్చును. భ్రాతృసౌహార్దరసమును గనఁబఱుచుటకు రసికునిరచన లిందుఁ బ్రక్షిప్తము చేయఁబడినవని చెప్పవచ్చును. జరాసంధవధపర్వాధ్యాయమునందలి పైనుదాహరింపఁబడినవిషయము విచారణము ననుసరించి యాపర్వాధ్యాయమునందలి యన్నిభాగములతోడను,

సంపూర్ణముగ విరుద్ధమై యున్నది. అది లిపికారుని భ్రమయని కాని, గ్రంథకారుని ప్రమాదమనిగాని, నిర్దేశము చేయుట కవకాశము లేదు. కావున, నావిషయములు ప్రక్షిప్తము లనుటకు మాకధికారము కలదు.

ఇట్టియసంబద్ధము లైనవిషయములఁ బ్రక్షిప్తములు సేయుటవలనఁ బ్రయోజన మేమని పాఠకు లడుగవచ్చును. ఇది యోచనీయమైనయంశమే. మహాభారతమునందలికథ మూఁడంతరములు కలదిగా నీవఱకే చెప్పియున్నారము. మూఁడవయంతర మనేకులచే రచింపఁబడినది. కాని, ప్రథమకోశ మొక్కరే రచించిరి. ద్వితీయకోశము కూడ నట్టిదియే. ఈయిరువురును శ్రేష్ఠకవులు; కాని వారిరచనాప్రణాళికలు స్పష్టముగ భిన్నభిన్నముగఁ గనఁబడుచున్నవి. ద్వితీయకోశమును రచించినయాతనిరచనలయందుఁ గొన్నిలక్షణములు కలవు. యుద్ధపర్వమునం దాతనిరచనలు విశేషముగఁ గానఁబడుచున్నవి. ఈపర్వములయందలిచాలభాగ మాకవిప్రణీతమే. ఆపూర్వవిషయము లాలోచించునప్పుడిది స్పష్టపడఁగలదు. ఆకవి కృష్ణుని జతురచూడామణియని కనఁబఱుచుటకుఁ జాల నిష్టుఁడై యుండిన ట్లాతఁడు రచించినరచనములయం దొకప్రధానలక్షణము కానవచ్చుచున్నది. అన్నిగుణములకంటె నీతఁడు బుద్ధికౌశలము నెక్కువగ నాదరించును. ఇట్టివారు కాలమునఁగూడ దుర్లభుఁడు కాఁడు. కుశలులైనబుద్ధిమంతులచాతుర్యమే మనుష్యత్వమున కాదర్శలక్షణమని యెంచువార లిప్పుడు సుశిక్షితులైనవారిలోఁ జాలమంది కలరు. ఐరోపియనుసమాజమున నిది చాలఁ బ్రియమైన యాదర్శము. దానినుండియే యాధునిక (Deplomacy) విద్య యేర్పాటు చేయఁబడినది. బిస్మార్కు ఒకప్పుడీజగత్తునఁ బ్రధానపురుషుఁడుగా నుండెను. థెమిస్టాక్లిస్ కాలము మొదలుకొని నేఁటివఱకును

నీవిద్యయందుఁ బరిపూర్ణులైనవారలై యైరోపాఖండమున మాన్యులు. (Francis desrless imitation of christ) అనుగ్రంథకర్తలెట్లు యోచించియున్నారు? మహాభారతమునందలి ద్వితీయకోశప్రణేత యగు కవికూడ నట్టియాదర్శమునే భావించి యుండెను. కృష్ణునియీశ్వరత్వమునం దాతనికి సంపూర్ణవిశ్వాసము. అందువలననే, యాతఁడు పురుషోత్తముని నతినిపుణునిగఁ బ్రదర్శించి యుండెను. ఆతఁడు మిథ్యావచన మూలకముగ ద్రోణవధసంబంధమునఁ బ్రఖ్యాతమైన యుపన్యాసములు రచించియున్నాఁడు. జయద్రథవధ సందర్భమున సుదర్శనచక్రముచే రవి నాచ్ఛాదనము చేసినట్లు నింక ననేకము లగుకృష్ణకృతాద్భుత కౌశలముల రచియించినకవి యితఁడే. జరాసంధవధ పర్వాధ్యాయము సందనర్థకమును, నసంబద్ధమును నైనయిట్టి కౌశలవిషయికము లైన శ్లోకముల రచించినయాతఁ డీతఁడే యనియును,నట్లయిన యెడల నందాతనియుద్దేశసంబంధమున వేఱుగ వ్రాయనక్కఱ లేదనియును, జెప్పవలసియున్నది. కృష్ణునికౌశల్యపరిపూర్ణునిగఁ బ్రతిపాదించుటయే యాతనియుద్దేశము. కేవల మీయూహయే యాధారముగఁ జేసికొని నేనింతయుఁ జెప్పుట లేదు. జరాసంధవధపర్వాధ్యాయమున నాతనిచేయి యెంతవఱకున్నదో యింకను జూపవలసియున్నది.

సప్తమపరిచ్ఛేదము.



కృష్ణజరాసంధసంవాదము.

జరాసంధుఁడు నిశీథకాలమున యజ్ఞాగారమునందు స్నాతకవేషధారు లైనయాముప్పురను సందర్శించి వారినిబూజించెను. వారు జరాసంధునిపూజను గైకొనిరో, లేదో యించుకయును జెప్పఁబడ లేదు.

కాని, యొకచోటునమాత్ర మున్నది. మూలముపై నెవ్వరో తమకవి త్వచాతుర్యమును జూపుటచే నిట్టిగందరగోళము కలిగినది.

వారు పరస్పరము సంభాషించుకొనినపిదప జరాసంధుండు వారలను జూచి "ఓ విప్రులారా! స్నాతకవ్రతచారులైన బ్రాహ్మణులు సభాగమన సమయమునందప్ప నెన్నండును *చందనమాల్యముల ధరింపరని నాకుం దెలియును. మీరెవ్వరు? మీవస్త్రములు రక్తవర్ణములు; శరీరములు పుష్పమాలికలచేతను, అనులేపనములచేతను శోభిల్లుచున్నవి. భుజములయందుజ్యాలాంఛనములు పొడకట్టుచున్నవి. ఆకారదర్శనమున క్షాత్రతేజము స్పష్టముగ గానంబడుచున్నది. కాని, మీరు బ్రాహ్మణులని చెప్పియున్నారు. కావున, సత్యమును జెప్పుండు. మీరెవ్వరు? రాజసమక్షమున సత్యమే ప్రశంసనీయ మైనది. మీరేల ద్వారమునుండి ప్రవేశింపక నిర్భయముగఁ జైత్యకపర్వతశృంగమును భగ్నముచేసి లోనఁబ్రవేశించితిరి? బ్రాహ్మణులు వాక్యములచేతనే తమతేజమును బ్రకాశింపఁజేయుదురు. కాని, మీరు కార్యములయందు తమప్రాభవమును గనంబఱచి చాల విరుద్ధముగ సంచరించితిరి. అంతియేగాక మీరలు నాసమీపమునకు వచ్చితిరి. నేను మిమ్ము విధిపూర్వకముగఁ బూజించితిని. అట్టిమీ రేల నాపూజను గైకొనలేదు? మీరిచ్చోటికి వచ్చినకారణ మేమో తెల్పుండు." అని యడిగెను.

---

* వారుమాలికల నొకమాలావిరచితునియొద్ద బలవంతముగఁ దీసికొనినట్లు వ్రాయఁబడి యున్నది. రాజసూయయజ్ఞమునకుఁ బ్రవృత్తులైనయంతటి ధర్మాత్ములైన సంతులు పుష్పమాలికలను గొనుటకు బదులుగ నిట్లొనర్చి రనుట చాల నసంభవము. ఆ పట ద్యూతాపహృత మైనరాజ్యమునే ధర్మానురోధమునఁ బరిత్యజించినవారు లిట్లు మాలాగ్రహణ మొనర్చి రనుట చాలనసంభవము. ఇవి యన్నియును ద్వితీయకోశమునందు రచించిన కవిరచనలు. దర్పోద్ధత మైనక్షత్రియతేజమును వర్ణించుటకీకథలు కల్పింపఁబడినవి.

దీనికిఁ బ్రత్యుత్తరముగఁ గృష్ణుఁడు [illegible] లిక మహాభారతమున నెచ్చటను గృష్ణుఁడు [illegible] గాని, క్రోధముతోఁ గాని, మాటాడినట్లు కనఁబడదు. [illegible] గ్రహము వశీభూతమై యున్నది.) నాతనిఁ జూచి "[illegible] లను జూచి స్నాతకబ్రాహ్మణు లని యనుకొనుచున్నావు. కాని, బ్రాహ్మణక్షత్రియవైశ్యు లనుమూఁడుజాతులవారును [illegible] మును బూనవచ్చును. వీరలకు విశేషనియమములును [illegible] ములును గూడఁ గలవు. క్షత్రియజాతివారలు విశేషనియమము లైన యెడల సంపత్తిశాలు రగుదురు. పుష్పధారులు [illegible] తు లగుదు రని మేము పుష్పములను ధరించితిమి. [illegible] బాహుబలముననే బలవంతులు; వాగ్వీర్యశాలురు కారు. [illegible] రలు ప్రగల్భవాక్యములు చెప్పవలసియున్నది." అనియెను.

ఈకథ శాస్త్రోక్తముగను, చాతుర్యముగను, [illegible] సత్యమే. కాని, కృష్ణునకు యోగ్యమైనట్లు లేదు. సత్యప్రియుఁ డైన [illegible]త్మునకుఁ దగినట్లు లేదు. కాని, కృత్రిమవేషమును ధరించిన [illegible] సహజముగ నిట్టిప్రత్యుత్తరమునే చెప్పును. కృత్రిమవేషము ద్వితీయ కోశమును రచించినకవి సృష్టియే యైనయెడల, నివాక్యములుకూడ నాతఁడు రచించినవే యైయుండవలయును. కృష్ణుని జతుర[illegible] గఁ బ్రదర్శింపఁదలఁచుకొనినయతఁడు, ఆతనిచే నిట్టిప్రత్యుత్తరముం బలికించుట సహజముగనే యున్నది. కాని, కృష్ణుఁడు తాను బ్రాహ్మణునివలె సంచరింప నుద్దేశము లేనట్లుగా [illegible] గనఁబడుచున్నది. తాము క్షత్రియుల మనియే యాతఁడు స్పష్టముగఁ జెప్పినాఁడు. అంతియేగాక, తాము శత్రుభావమున యుద్ధార్థము వచ్చినట్లుకూడఁ జెప్పియున్నాఁడు.

"విధాత క్షత్రియులకు బాహువులయందే బలమునిచ్చియున్నాఁడు. ఓ రాజా! నీకు మా బాహుబలమును జూడ నిష్టముండినయెడల నేఁడే చూడవచ్చును. సందేహము లేదు. ఓ బృహద్రథనందనా! ధీరులు శత్రుగృహమున నప్రకాశ్యభావముతోడను, సుహృద్గృహమునఁ బ్రకాశ్యభావముతోడను బ్రవేశింతురు. ఓ రాజా! మేము స్వకార్యసాధనార్థము శత్రుగృహమునకు వచ్చి యాతఁడొనర్చినపూజన గైకొనము. ఇది మా నిత్యవ్రతము."

ఇది గండరగోళ మనుట స్పష్టము. ఈయధ్యాయముతోడఁ గృత్రిమవేషసంబంధ మైన గండరగోళముకూడఁదగ్గును. కృత్రిమవేష సంబంధ మైనకథలోఁ దరువాతియధ్యాయమునఁ జెప్పఁబడిన కృష్ణ సంబంధ మైనసంభాషణము సంపూర్ణముగ దీనికి భిన్నప్రకారముగ నున్నది; ఇంతవఱకును గనఁబఱిచినయాతనియున్నతచరిత్రమునకు యోగ్యమైనట్లుగ నున్నది. పూర్వాధ్యాయమునందును, పరాధ్యాయమునందును వర్ణింపఁబడిన కృష్ణచరిత్రలో నింతవిశేషభేద ముండుట చూడ నిది యిద్దఱుకవులు రచించియున్నారని చెప్పవలసియున్నది.

జరాసంధునిగృహమును కృష్ణుఁడు తమశత్రుగృహ మని నిర్దేశించుట విని, జరాసంధుఁ డాతనిం జూచి "నేనెప్పుడైనను నీతో శత్రుత్వము పెట్టుకొనినట్లు కాని, నీకపకారములు చేసినట్లు గాని, నాకు జ్ఞప్తి లేదు. ఏకారణమున నిరపరాధినైననన్ను శత్రునిగఁ బరిగణించుచున్నావు?" అని యడిగెను.

దీనికిఁ బ్రత్యుత్తరముగ జరాసంధునితోఁగృష్ణున కెట్టిశత్రుత్వము కలదో దానినే చెప్పెను. జరాసంధునకును, దనకును గల వివాదమునుగుఱించి యేమియును బ్రస్తావించి యుండలేదు. తన తోడివివాదముకొఱకెవ్వరును శత్రువులు కాఁజాలరు. ఏల యనిన, అతఁడు సర్వత్ర సమదర్శి. శత్రుమిత్రులను సమముగఁ జూచును. అతఁడు పాండవులకు మిత్రుఁడనియు, కౌరవులకు శత్రుఁడనియు లోకులు విశ్వసించుచున్నారు. కాని, మౌలికమహాభార

తమునుగూర్చి విమర్శచేయు సందర్భమున నేను వాస్తవమును దెలుపుదును. అతఁడు ధర్మపక్షావలంబి. అధర్మమునకుఁ బ్రతికక్షి; ఇంతకంటె నాతనికిఁ బక్షపాతము లేవియును లేవు. ఆవిషయమునుగూర్చి ముందు యోచింతుము. కృష్ణుఁ డుపయోచకుఁడై జరాసంధున కాత్మపరిచయమును గలుగఁజేసెను. కాని, తనతోఁడివివాదమువలన నాతని శత్రునిగనుద్దేశించి యుండలేదు. మనుష్యజాతికి శత్రువైనయాతఁడు కృష్ణునకు శత్రుఁడు. ఏల యనిన, ఆదర్శపురుషుఁడు సర్వభూతములయందుఁ దనస్వరూపమునే చూచును. ఇంతకంటె నాతనికి వేఱువిధమైన యాత్మజ్ఞానము లేదు. అందువలనే జరాసంధునిప్రశ్నమునకుఁ బ్రత్యుత్తరముగఁ దనకుఁ జేసినయుపకారము నుగ్గడింపక లోకమునకుఁ జేసినయనిష్టమునే పేర్కొనియెను. "నీవు రాజులను మహాదేవునకు బలియిచ్చుటకుఁ గారాబద్ధులను జేసియున్నావు. అందువలనే యుధిష్ఠిరుని యాజ్ఞానుసారముగ నిన్నెదుర్కొన వచ్చితిమి." అని చెప్పి తనశత్రుత్వమును బ్రకటింపక కృష్ణుఁడు "ఓబృహద్రథనందనా! నీవుచేసినపాపమువలన మేముకూడఁ బాపాత్ములమగుదుము. ఏల యనిన మేము ధర్మచారులము; ధర్మరక్షణమునకు సమర్థులము." అని చెప్పెను.

ఈవిషయమునఁ బాఠకులు విశేషముగఁ దమహృదయముల నాలోచింతురని యింతవిపులముగ వ్రాసితిమి. ఇది పురాతనమైనను నీకథ చాలశ్రేష్ఠమైనది. ధర్మరక్షణమునకును, పాపదమనమునకును, సమర్థుఁడై యుండి, యట్లొనర్పనియతఁడు పాపమునకు సహకారి యగును. కావున, నీలోకమున నందఱును దమకు సాధ్యమైనంతవఱకుఁ బాపనివారణమునకుఁ బ్రయత్నింపలేని యది యధర్మమగును. "నేనేమియును బాపమొనర్చుట లేదు. ఇతరులేమి చేయుచున్నారో దాని

వలన నాకుదోష మేమున్నది?" అని యోచించుకొని నిశ్చింతగ నుండు వాఁడుగూడఁ బాపియగును. కాని, ధర్మాత్ములు కూడ నట్లే యోచించుకొని నిశ్చింతతో నుందురు. ఇందువలన జగత్తున జన్మించిన నరోత్తము లందఱును నిట్టిధర్మరక్షణమునకును, పాపనివారణమునకు నుబూనుకొనవలసియుండును. శాక్యసింహుఁడు, ఏసుక్రీస్తు మొదలగు వారు దీని కుదాహరణస్వరూపులు. ఈవిషయమే వారిజీవనచరిత్రలకు మూలసూత్రము. శ్రీకృష్ణునకుఁగూడ నిదియే వ్రతము. ఈమహావాక్యముల స్మరణయం దుంచుకొనక పోయిన యెడల వానిజీవనచరిత్రము బోధపడదు. శిశుపాలజరాసంధకంసాదులవధయును, మహాభారత యుద్ధమునఁ బాండవపక్షమున సహాయము సేయుటయును మొదలుగాఁగలకృష్ణునికార్యము లన్నియును నీమూలసూత్రసాహాయ్యముననే బోధపడఁగలవు. వీనికే పురాణకారులు పృథివీభారహరణ మని చెప్పి యున్నారు. క్రీస్తుచేసినను, బుద్ధుఁడొనర్చినను, కృష్ణుఁడుగావించినను నిట్టిపాపనివారణవ్రతమునకు ధర్మప్రచార మనిపేరు. ధర్మప్రచారము రెండువిధములుగ జరుగవచ్చును. ఒకటి వాక్యములచేతను, అనఁగా ధర్మసంబంధమైనయుపదేశములచేతను. రెండవది—కార్యములచేత, అనఁగా, కార్యముల నన్నిటిని ధర్మాదర్శములుగఁ బరిగణింపఁజేయుటచేతను. క్రీస్తు, శాక్యసింహుఁడు, శ్రీకృష్ణుఁడు, వీరీరెండువిధములనుగూడ నొనర్చి యున్నారు. క్రీస్తును, శాక్యసింహుఁడును, నొనర్చినధర్మప్రచార ముపదేశప్రధానముగ నున్నది. కృష్ణకృతధర్మప్రచారము కార్యప్రధానముగ నున్నది. ఇందులోఁగృష్ణునిదే ప్రధానమైనది. ఏల యనిన, వాక్యములు సులభములు; కాని, కార్యములు కఠినములు, అధికతరఫలప్రదాయకములు; కేవలము మానవునిమూలకముగ నిట్టివి సుసాధ్యము లగునో కావో, యావిషయమునుగూర్చి మేమిప్పుడు యోచింపఁదలఁచుకొనలేదు.

ఇందు మఱియొకవిషయము యోచింపవలసి యున్నది. కృష్ణుఁడు కంస శిశుపాలాదులను వధించుటను గూర్చి చెప్పియున్నాము. మఱియును, జరాసంధుని వధియింప వచ్చియున్నాఁడని చెప్పితిమి. కాని, పాపులను వధించుట యాదర్శమనుష్యునిపనియా ? సర్వభూతసమదర్శి యైన యాతఁడు పాపాత్ములను గూడ నాత్మసములుగ భావించి వారలకుఁగూడ హితకాంక్షి యేల కాఁగూడదు ? పాపులను జగత్తునుండి దుంచుటవలన జగత్తునకు శుభము కాదనుట సత్యమే. కాని, వారివధసాధనముమాత్రమే జగదుద్ధారణమున కేకమాత్రోపాయమా? పాపులను పాపములనుండి త్రిప్పి ధర్మప్రవృత్తులుగఁ జేసిన యెడల జగత్తునకును, బాపులకునుగూడ నేకకాలముననే శుభసిద్ధి చేయుట. ఇది పైయుపాయముకంటె నుత్కృష్టమైనది కాదా? ఆదర్శపురుషుఁ డిట్టిమార్గము నవలంబింపవలదా?ఏసుక్రీస్తు శాక్యసింహుఁడు చైతన్యుఁడు మొదలుగాఁగలవార లీవిధముగనే పాపుల నుద్ధరింపఁ బ్రయత్నించియుండిరి.

దీనికి రెండుప్రత్యుత్తరములు. మొదటిది:—కృష్ణచరిత్రయందుఁగూడ నిట్టిధర్మమున కభావము లేదు. క్షేత్రభేదమువలన ఫలభేదముకూడ ఘటిల్లినది. దుర్యోధనకర్ణాదులేమార్గమవలంబించినయెడల వారలు ధర్మపథావలంబులై జీవనములను, రాజ్యములను దక్కించుకొందురో అందులకై యాతఁడు యథావిధిగఁ బ్రయత్నించెను. మఱియు నా కార్యసంబంధమున "పురుషకారమువలన నెంతవఱకుసాధ్యమగునో, అంతవఱకును జేసి చూచితిని. కాని, దైవము నాయధీనమై యుండలేదు." అని యాతఁడు చెప్పెను. కృష్ణుఁడు మానుషశక్తితోడఁ గార్యసాధన మొనర్పఁ జూచెను. అందువలన స్వభావముగ నసాధ్యములైనపనులు ప్రయత్నములు చేసినను, నొకొక్కప్పుడు నిష్ఫలము ల

య్యెను. శిశుపాలుని శతాపరాధముల మన్నించెను. ఆవిషయ మనే కక్షమైనగాథలతోఁడ నిండియున్నది. యథాస్థానమున దానితాత్పర్యమును దెలుపఁ బ్రయత్నింతుము. కంసవధనుగూర్చి యిదివఱకుఁ జెప్పియుంటిమి.

ఖయిలేటును గ్రైస్తవమతావలంబకుని జేయుట క్రీస్తున కెంత సంభవముగ నుండెనో, కంసుని ధర్మమార్గమునకుఁ ద్రిప్పుట కృష్ణున కంతియే సంభవముగనుండెను. జరాసంధసంబంధమునఁగూడ నట్లే చెప్పవలసి యున్నది. అట్లయినను జరాసంధసంబంధమునఁగూడఁ గృష్ణుఁడొకసంభాషణమును జేసెను. జరాసంధుఁడు కృష్ణునికడ ధర్మోపదేశము నుగ్రహించుట యటుంచి కృష్ణున కీధర్మవిషయికమైన యొకయుపన్యాసము నిచ్చెను. చూడుము! ధర్మమునకుఁ గాని, యర్థమునకుఁ గాని, హాని కలిగిన యెడల మనోవేదన కలుగును. కాని, క్షత్రియకులమున జన్మించి ధర్మజ్ఞుఁడై యుండి నిరపరాధముగ లోకుల ధర్మార్థములకు హాని కలుగఁ జేసినయెడల నట్టివాని కిహమున నశుభమును, బరమున నరకమును సంభవించును; సందేహము లేదు.

ఇట్టిచో ధర్మోపదేశమువలన నేమియును బ్రయోజనము లేదు. జరాసంధుని సన్మార్గమునకుఁ ద్రిప్పుట కుపాయాంతర మున్నదో, లేదో, మాబుద్ధికిఁ దోఁచుట లేదు. అతిమానుషకీర్తిప్రచారమువలన నొకగ్రంథము గాఁగలదు. అట్లే యితరధర్మప్రచారకులలో ననేకులు కనఁబడుచున్నారు. కాని, కృష్ణచరిత్ర మతిమానుషశక్తికి విరోధి; శ్రీకృష్ణుఁడు భూతములను బోఁగొట్టియు, రోగముల నివర్తి చేసియు, ధర్మప్రచార మొనర్చుటఁ గాని, తనదేవత్వస్థాపన మొనర్చుటఁ గాని చేసియుండ లేదు.

జరాసంధునివధ కృష్ణోద్దేశము కాదని దీనివలనఁ దెలియుచున్నది. ధర్మరక్షణమే — అనఁగా నిర్దోషముగఁ బీడింపఁబడిన రాజుల నుద్ధరించుటయే యాతనియుద్దేశము. అతఁడు జరాసంధుని బాగుగఁ దెలిసికొని "నేను వసుదేవనందనుఁ డగుకృష్ణుఁడను; వీరిరువురును వీరపురుషులైనపాండుతనయులు. మేము నిన్ను యుద్ధమునకుఁ బిలుచుచున్నారము. ఈక్షణముననే సమస్తభూపాలురను విడిచి వేయుము. లేనియెడల యుద్ధ మొనర్చి యమాలయమునకుఁ బొమ్ము." అని చెప్పెను. కావున జరాసంధుఁడు రాజులను విడిచిన యెడల గృష్ణుఁ డాతనికి నిష్కృతి చేసియుండును. జరాసంధుఁ డందులకు సమ్మతింపక యుద్ధము చేయఁగోరెను. కావున యుద్ధమే యయ్యెను. జరాసంధుఁడు యుద్ధమునఁగాక యేయోచనవలనను యాథార్థ్యమును స్వీకరించుటకుఁ దగినపాత్రము కాఁడు.

ఏసుక్రీస్తు గాని, బుద్ధుఁడు గాని జీవనీత్యుపదేశమువలనఁ బతితోద్ధారణ మొనర్చుటవలెఁ గృష్ణుని జీవితమున నట్టిది జరుగలేదని నే నొప్పుకొనుచున్నాను. ఏసును, శాక్యసింహుఁడును, ధర్మప్రచారమునకుఁ బాటుపడియున్నారు. కృష్ణుఁడు ధర్మప్రచార మొనర్చియుండుట సత్యమే. కాని, ధర్మప్రచార మతని వ్యవసాయము కాదు. అది యాదర్శపురుషుని యాదర్శమైన జీవననిర్వాహకమున కానుషంగికమైన ఫలముమాత్రము. ఏసుక్రీస్తుయొక్క గాని, శాక్యసింహుని యొక్క గాని, ధర్మప్రచార వ్యవసాయమును గూర్చి యెంతమాత్రమును లాఘవ పఱుచుటకై తలంచుచుంటినని యిందుమూలమునఁ దలంపరాదు. ఏసును, శాక్యసింహుఁడును, నుభయులును మనుష్యశ్రేష్ఠులని నేను భక్తి చూపుచున్నాఁడను. వారిచరిత్రము నాలోచించి దానివలన జ్ఞానలాభమును బొంద హెచ్చరించు

చున్నాఁడను. ధర్మప్రచారకులవ్యవసాయము (వ్యవసాయ మనఁగా కర్మానుష్ఠానమున సర్వదా ప్రవృత్తుఁడై యుండుట) సకలవ్యవసాయములకంటె శ్రేష్ఠమైన దని నాకుఁ దెలియును. కాని, యాదర్శమనుష్యున కావ్యవసాయము మాత్రమే కాఁజాలదు. ఏల యనిన-ఆతఁ డాదర్శమనుష్యుఁడు; మానవున కనుష్ఠింపవలసిన కార్యము లెన్నియున్నవో, అన్నియు నాతని కనుష్ఠేయములే. ఏపని గాని యాతనికి వ్యవసాయము కాఁజాలదు. అనఁగా నితరకర్మలకంటెఁ బ్రధానత్వమును బొందియుండఁజాలదు. ఏసుగాని, శాక్యసింహుఁడుగాని యాదర్శపురుషులు కారు. కాని, మనుష్యశ్రేష్ఠులు. మనుష్యులకు శ్రేష్ఠములైన వ్యవసాయముల నవలంబించుటయే వారికి విధాయకమై యున్నది. వాని నవలంబించి వారు లోకహితసాధనమును జేయుదురు. ఈవిషయమున సకలశిక్షితపాఠకులును నిట్లూహింతు రని నేననుకొనను. అట్లనుకొనుటకుఁ బ్రతిబంధక మొకటి యున్నది. ఆదర్శపురుషులమాట చెప్పుచున్నాను. అనేకశిక్షితపాఠకు లాదర్శశబ్దమునకు "Ideal" అనియర్థము చెప్పుచున్నారు. ఈయనువాదమును దూష్యము కాదు. "Christian ideal" అని యున్నది. క్రైస్తవులయాదర్శపురుషుఁడు ఏసు; నేను బాల్యకాలమునుండియు క్రిస్టియన్‌జాతి సాహిత్యము నధ్యయనము చేసి యాయాదర్శమును హృదయంగమము చేసికొంటిని. ఆదర్శపురుషునికథ యైనట్లు, ఆయాదర్శవిషయమును యోచించుచున్నాను. ఏయాదర్శమాయాదర్శముతో నేకీభవింపదో దాని నాదర్శ మని గ్రహింపఁజాలను. క్రీస్తు పతితోద్ధారి. ఏదురాత్ముని గాని యాతఁడు ప్రాణహానిగా మొనర్చి యుండలేదు. అట్లొనర్చుటకు తను కలిగియుండలేదు. శాక్యసింహునియందును, చైతన్యునియందును, నట్టిలక్షణములు చూచుచున్నారము. అందువలన, వీర లాదర్శపురుషు లని చెప్ప సంసిద్ధులముగా

చున్నాము. కాని, కృష్ణుఁడు పతితపావనుఁ డనునామమును ధరించియును బ్రధానముగఁ బతితనిపాతి యనియే యితిహాసములఁ బరిచితుఁడై యున్నాఁడు. ఆకస్మికముగా నాతఁడు మన కాదర్శపురుషుఁడుగా నగపడఁడు. కాని మన మొకవిషయముమాత్ర మాలోచింపవలయును. ఈ "Christian Ideal" మానవజాతికి సత్యాదర్శమేనా? సకలజాతుల జాతీయాదర్శమును నిట్లే యుండవలయునా? అని—

ఈప్రశ్నయందు హిందువులకు జాతీయాదర్శ మొకటి యున్నదా లేదా యనుప్రశ్న మొకటి కలుగుచున్నది. "Hindu Ideal" ఉన్నదా లేదా? ఉన్నచో నెట్లున్నది? ఈప్రశ్న విద్వాంసుల నడిగినచో వారు బుఱ్ఱగోకికొనుటకంటె నేమియుఁ జెప్పఁజాలరని తోఁచుచున్నది. జటాధారులును, బలితశ్మశ్రుభూషితులు నగు వ్యాసవశిష్ఠాదిమహర్షులనామముల నెత్తి కొందఱు తర్కవితర్కములను జేయుదురు. కొందఱు "ఏదైన నుండవచ్చును. బూడిదయంతయును భస్మము కానేరదు" అని చల్లఁగఁ జెప్పి యూరకుందురు. ఆమాట నిజమే. అట్లేయైనచో నింతదుర్దశ యేల? కాని ప్రపంచమునందంతటను హిందూజాతియే ప్రధానమైయున్నదినము లొకప్పు డున్నవి. ఆజాతి కాదర్శపురుషుఁ డెవ్వఁడు? దీనికిఁ బ్రత్యుత్తరమును నేను గ్రహించినరీతి నిదివఱకే చెప్పియుంటిని. రామచంద్రాదిక్షత్రియపురుషు లాయాదర్శప్రతిమకు సమీపవర్తులుమాత్రమే—కాని హైందవజాతికి యథార్థముగ నాదర్శపురుషుఁడు శ్రీకృష్ణుఁడే యై యుండెను, మానవజాతికంతకు నాతఁడే యాదర్శస్వరూపుఁడు. క్రీస్తు మొదలగువారియం దట్టియాదర్శస్వరూపము సంపూర్ణముగఁ దోఁచుట లేదు.

క్రీస్తుధర్మతత్త్వమునందే మనుష్యత్వమును బోధించుటకుఁ

బ్రయత్నించెను. సకలవృత్తులసంపూర్ణస్ఫూర్తియును, సామంజస్యమును మనుష్యత్వ మగుచున్నది. అట్టియుత్కృష్టస్ఫూర్తి సామంజస్యములఁ గన్న యాతఁడే యాదర్శమానవుఁడు. క్రీస్తునం దట్టిపూర్ణత్వము లేదు. శ్రీకృష్ణునియం దున్నది. రోమకచక్రవర్తి క్రీస్తును యూదులకు శాసనకర్తగా నియోగించినచో నాతఁడు సమర్థుఁడై శాసింపఁగలఁడా? శాసింపఁజాలఁడు. రాజకార్యనిర్వహణమునకు సకలవృత్తులును బ్రయోజనీయములై యుండును. క్రీస్తున కట్టియనుభవము లేదు. అట్టి ధర్మాత్ముఁడే శాసనకర్తకూడ నైనచో సమాజమున కెంతయో క్షేమముగనే యుండును. శ్రీకృష్ణుఁడు నీతిజ్ఞులలో సర్వశ్రేష్ఠుఁడనునది ప్రసిద్ధమే. ఈవిషయమున మహాభారతమునందు లెక్కలేనన్నియుదాహరణము లున్నవి. ఉగ్రసేనుఁడును యుధిష్ఠిరుఁడునుగూడ నాతని యాలోచన లేకుండ నెట్టిరాజకార్యమును గావించుట లేదు. ఈవిధముగా గృష్ణుఁడు రాజు గాకుండియుఁ బ్రజల కనంతశుభ సంపాదియగుచుండెను. ఈజరాసంధునిచే బంధితులగువారిని విడిపించుటకూడ నిందులకొకయుదాహరణము—మఱియొకమాట.— ఒకవేళ యూదులే రోమకపీడితులై స్వాతంత్ర్యమును గోరి క్రీస్తును దమకు సేనాపతిగాఁ జేసికొన్నచో నప్పుడు క్రీస్తేమిచేయును? యుద్ధమునం దాతనికి శక్తియును లేదు; ప్రవృత్తియును లేదు—కృష్ణుఁడుకూడ యుద్ధమునఁ బ్రవృత్తిశూన్యుఁడే; కాని యాతనికి ధర్మార్థమున యుద్ధముచేయుట కూడఁ గలదు. అట్టియుద్ధమునం దాతఁ డగత్యముగఁ బ్రవేశించుచుండును. యుద్ధమునం దాతఁ డజేయుఁడే; క్రీస్తు విద్వాంసుఁడు కాఁడు. కృష్ణుఁడు సకలశాస్త్రపారంగతుఁడు. ఇతరగుణములయందిట్టి యంతరమున్నను నిరువురునుగూడ శ్రేష్ఠధార్మికులును ధర్మదీక్షితులు నై యుండిరి. కావునఁ గృష్ణుఁడే సత్యముగ నాదర్శపురుషుఁడు—Chritian Ideal కంటె Hindu Idieal శ్రేష్ఠమైనది.

ఇట్టిసర్వగుణసంపన్నుఁ డగు నాదర్శపురుషుఁడు కేవల మొక్క కార్యవిశేషమునకు జీవనము నర్పింపఁజాలఁడు. అట్లయినచో నితరకార్యము లననుష్ఠితములును, విపరీతానుష్ఠితములు నగుచుండును. మానవుఁడు చరిత్రావస్థావిశేష భేదములనుబట్టి భిన్నభిన్నకర్మములకును, భిన్నభిన్నసాధనములకు నధికారి యగుచున్నాఁడు. కాని యాదర్శపురుషుఁడు సకలవిషయములయందును నాదర్శస్వరూపుఁడు కావలయును. ఇందుచేతనే శ్రీకృష్ణునకు బుద్ధచైతన్యక్రీస్తులవలె సన్యాసగ్రహణమును వ్యవసాయస్వరూపావలంబనమును నసంభవ మయ్యెను. కృష్ణుఁడు సంసారియు, గృహస్థుఁడును, రాజనీతిజ్ఞుఁడును, యోధుఁడును, దండప్రణేతయుఁ, దపస్వియు, ధర్మప్రచారకుఁడునుగూడ నై యుండెను. గుణియు నట్టివారి కాదర్శస్వరూపుఁడై యుండెను. జరాసంధాదులవధ యాదర్శరాజపురుషునకును నాదర్శదండప్రణేతకును నవశ్యానుష్ఠేయ మైనది—ఇట్టిహైందవాదర్శముతో నసంపూర్ణంబు లగు బౌద్ధక్రైస్తవాదర్శములను బోల్చినప్పుడు మనము వానిని నత్యాదర్శములుగా నంగీకరింపఁజాలము.

కాని తెలిసికొనవలసినవిశేష మొకటి యున్నది. అది విస్మయకర మైనదియే. క్రైస్తవమతము నవలంబించినయూరపునందును, హైందవమతము నవలంబించిన భారతమునందును నాదర్శసంబంధమున విపరీతఫలము ఫలించుచున్నది. క్రైస్తవాదర్శపురుషుఁడు వినీతుఁడు; నిరీహుఁడు; నిర్విరోధి; సన్యాసి—కాని యిప్పటి క్రైస్తవులందఱు నిజముగాఁ దద్వ్యతిరిక్తులై యున్నారు. ఐరోపాఖండ మిప్పు డైహికసుఖలంపటులును, సశస్త్రులు నగుయోధవర్గమునకు విశాలశిబిరమాత్రమై యున్నది. హైందవాదర్శపురుషుఁడు సకలక్రియాసక్తుఁడు—కాని యిప్పటిహిందువులు సకలకర్మములయందు ననాసక్తులై యున్నా

రు. ఇట్టిఫలవైపరీత్యమునకుఁ గారణ మేమి ? ప్రత్యుత్తరము సులభ మే — ఉభయదేశములందును లోకులచిత్తములయం దాప్రాచీనాదర్శము విలుప్తమై పోయినది. ఒకప్పు డీయాదర్శములు రెండుదేశములందును బ్రబలములై యుండెను. ప్రాచీనక్రైస్తవులధర్మపరాయణతయు సహిష్ణుతయుఁ, బ్రాచీనహిందూరాజులసర్వసమర్థతయు నిందులకుఁ బ్రమాణము. హైందవహృదయమునుండి యట్టియాదర్శము దూరమైనప్పటినుండియు, మనము శ్రీకృష్ణచరిత్రమును జుల్కన చేసినప్పటినుండియు మనసంఘమున కవనతి యారంభమయ్యెను. అందఱును జయదేవుని కృష్ణునే యనుకరింపఁదొడంగిరి. మహాభారతకృష్ణు నెవ్వరును స్మరించుటయే లేదు.

కాని యిప్పుడు జాతీయహృదయమునం దట్టియాదర్శము జాగరిత మగుచున్నది. అందుల కీకృష్ణచరిత్రవ్యాఖ్యానము కొంచె మనుకూలపడు నని యనుకొనుచున్నాను. జరాసంధవధాధ్యాయమున నీసంగతు లన్నియును జెప్పవలసినప్రయోజన మంతగా లేదు. ప్రసంగవశమునఁ దత్త్వము నిర్ధరింపఁబడియెను. కాని యీసంగతి యెచ్చటనైన నెప్పుడైనను మేము చెప్పవలసియే యున్నది. ముందుగనే చెప్పుటవలన లేఖకపాఠకులకు మార్గము సుగమము కాఁగలదు.

అష్టమపరిచ్ఛేదము.

—ంంంంంం—

భీమజరాసంధయుద్ధము.

శ్రీకృష్ణచరిత్రసమాలోచనమున మేమింతవఱకు మహాభారతకృష్ణుని విష్ణునిగాఁ బరిచితుని జేసియుండలేదు. ఎవ్వరు నాతని విష్ణునిగా సంబోధించి సంభాషించి యుండలేదు. ఆతఁ డింతవఱకు మనుష్యునకతీతమగుశక్తితో నెట్టికార్యమును జేసినట్లు చూచియుండలే

డు. ఆతఁడు విష్ణునియవతారము కావచ్చును. కాకపోవచ్చును ! కృష్ణచరిత్రమునకు స్థూలమర్మము మానవత్వమే కాని దేవత్వము కాదని మరలమరలఁ జెప్పుచున్నాము.

కాని యాతరువాత మహాభారతమునం దనేకస్థలములలోఁ గృష్ణుఁడు విష్ణుఁడుగాఁ బరిచితుఁ డయ్యె ననుసంగతికూడ నంగీకరింపవలయును. అనేకులాతని విష్ణునిగా నుపాసించుటయుఁ గలదు. ఆతఁడొకప్పుడు లోకాతీతమగు విష్ణుశక్తిచేఁ గార్యములఁ గావించుటయుఁ గలదు. ఇంతవఱకు నాతని దైవభావము పరిచితము కాలేదు. కాని యిప్పుడే ప్రదర్శిత మయ్యెను. ఈభావద్వయమునకును బరస్పరవిరోధము లేదా?—అట్టివిరోధ మేదియు లేదనియు, దైవశక్తిని బ్రకటింపవలసినయావశ్యకము లేనప్పుడు కావ్యేతిహాసములయందు మానవశక్తియే ప్రకటింపఁబడు ననియు, నావశ్యకమైనప్పుడు దైవశక్తికూడఁ బ్రదర్శిత మగు ననియుఁ గొందఱు చెప్పవచ్చును. కాని మేమీప్రత్యుత్తరము సత్యము కాదని చెప్పెదము. ఇందు శ్రీకృష్ణుని దేవభావము నిష్ప్రయోజనముగ ననేకస్థలములయం దగపడుచున్నది. ఈజరాసంధవధయందే యందుల కొకటిరెండుదాహరణములఁ జూపెదము.

జరాసంధవధానంతరమునఁ గృష్ణుఁడు భీమార్జునులతో జరాసంధరథారూఢుఁడై బయలుదేఱెను. దేవనిర్మిత మగునారథమునం దెట్టియభావమును లేదు. అప్పుడు కృష్ణుఁడు గరుడుని దలంచుకొనియెను. స్మరణమాత్రముననే గరుడుఁడువచ్చి రథశిఖరము నధిరోహించెను. అతఁడు వచ్చి యేపనియును జేయలేదు. వచ్చుటకుఁ బ్రయోజనమును లేదు, కథకును సంబంధము లేదు. కేవలమును, కృష్ణుని దేవత్వమే దీనివలన సూచితమగుచున్నది. జరాసంధవధార్థ మెట్టిదైవశక్తియుఁ బ్రయోజనము లేకపోయెను; గాని రథమెక్కి—పోవునప్పుడు మాత్రము కావలసివచ్చెను !

మఱియును యుద్ధమునకుఁ బూర్వ మొకవిశేష మగపడుచున్నది. యుద్ధసన్నద్ధుఁ డగుజరాసంధునిం గాంచి కృష్ణుఁ డిట్లు చెప్పెను. "ఓ రాజా! మాముగ్వురిలో నీ వెవ్వరితో యుద్ధము చేయఁగోరెదవో చెప్పుము. యుద్ధమున కెవ్వరు సంసిద్ధులు కావలయును?" అనియెను. జరాసంధుఁడు భీమునితో యుద్ధము సేయఁగోరెను. జరాసంధుఁడు యాదవుల కవధ్యుఁడని బ్రహ్మ చెప్పుటచేఁ గృష్ణుఁ డాతని వధించుటకు యత్నింపలేదని యింతకుముందు వ్రాయఁబడి యుండెను.

ఈబ్రహ్మవచనముంగూర్చి మహాభారతమం దెచ్చటను వ్రాయఁబడలేదు. తరువాతిగ్రంథమునందున్నది. మూలభారతమునం దితరకవుల వ్రాఁతలు చేరియున్న ట్లిప్పుడైనను బాఠకులు విశ్వసింతురా? ఇఁకను గృష్ణునివిష్ణుత్వము లోలోన నుంచుటయే దీనియుద్దేశమా? మూలమునందుఁ గృష్ణునకు విష్ణుత్వసంబంధ మెచ్చటను వ్రాయఁబడలేదు. ఎందుచేత ననిన నీకృష్ణచరిత్రము మానవచరిత్రము కాని దేవచరిత్రము కాదు. కృష్ణునియందు దేవభావము చూపకుండుట పొరపాటని యెంచి తరువాతికవు లాయభావమును బూరించిరి.

బంధముక్తు లగురాజులు ధర్మరక్షకుఁ డగుకృష్ణునింగూర్చి ధన్యవాదములఁ గావించుపట్టునఁగూడ నెచ్చటను నట్టిభావము లేదు. ఒకచోటమాత్రము వారు కృష్ణుని "విష్ణూయని" సంబోధించియుండిరి. విష్ణునామముచేఁ గాని, తదర్థక మగునన్యనామముచేఁగాని కృష్ణుఁడు సంబోధింపఁబడిన ట్లిదివఱ కెచ్చటను నగపడుట లేదు. ఒకవేళ నప్పు డప్పు డాతఁడట్లు సంబోధింపఁబడుటయే యున్నను నది యస్వాభావముగాని యసంగతముగాని కానేరదు. లోకుల కాతనియం దట్టి విశ్వాస ముండవచ్చును. కృష్ణుఁ డిప్పుడు మానవశక్తి కతీతంబగు కార్యమును సాధించి యున్నచో నాతనింగూర్చిన విష్ణుసంబోధనము స

ముచితముగనే యుండును. కాని కృష్ణుఁ డట్టి కార్యమును గావించి యుండలేదు. అతఁడు జరాసంధుని వధింపనైన లేదు. అందఱియెదుట ను భీముఁడే జరాసంధుని సంహరించెను. ఆ కార్యమునకుఁ గారకుఁడు శ్రీకృష్ణుఁడే. కాని కారాబద్ధు లగు రాజుల కా సంగతి యేమియును దెలియదు. కావున నట్టి రాజులచే నాకస్మికముగఁ గృష్ణుఁడు విష్ణుఁడు గా సంబోధింపఁబడుట యితిహాసమునకును, మూలమునకునుగూడ విరుద్ధముగా నున్నది. కాని యిది గరుడస్మరణమునకును, బ్రహ్మాదేశ స్మరణమునకునుమాత్రమే సంబంధించియున్నది. జరాసంధవధకథాంశమునకుమాత్రము వీనితో సంబంధమే లేదు. ఈమూడువిషయము లు నొక్కచేతినుండియే వెలువడినవి. ఈమూఁడును మూలాతిరిక్తము లే యని పాఠకులు సులభముగా గ్రహింపవచ్చును.

అట్లు విశ్వసింపనివా రెవ్వరైన నున్నచో నట్టివారి కీకృష్ణచరిత్రిసమాలోచనమువలన నణుమాత్రమైనను లాభమగపడదు. ఏమని న — ఈ సర్వవిషయములకు నింతకంటె నధికప్రమాణములను జూపుటకు మాకవకాశము లేదు, జరాసంధవధసందర్భమునఁ గృష్ణునివిష్ణుత్వసూచనము ప్రక్షిప్త మని విశ్వసించువారిలో నెవ్వరైనఁ గృష్ణుని మాయవేషమును, గపటనటనమునుగూడ నేలప్రక్షిప్తము కాఁగూడదనియు, నీరెండును నొక్కప్రమాణముమీఁదనే యాధారపడియున్నవిగాదా యనియుఁ బ్రశ్నింపవచ్చును.

నిజముగా నీరెండువిషయముల నొక్కచోఁ జేర్చి చూచినచో నీజరాసంధవధపర్వాధ్యాయమునఁ దరువాతికవుల విలక్షణసృష్టి యున్న దనియు, నందుచేతనే యిట్టియసందర్భములు కలుగుచున్నవనియుఁ దోఁపక మానదు. ఇందితరకవిసృష్టి కలదనుట కింకొక నిదర్శనముం జూపెదను.

కృష్ణుఁడు యుధిష్ఠిరునితో జరాసంధునిపూర్వవృత్తాంతమును సవిస్తరముగఁ దెల్పియున్న ట్లిదివఱకే చెప్పి యుంటిమి. అప్పుడు కృష్ణుఁడు కంసవధకారణంబునఁ దనకును జరాసంధునకును గలిగినవైరముంగూర్చి తెలిపి యుండెను. ఆతరువాత నే మహాభారతకారుఁడు.—

"వైశంపాయనుఁ డిట్లనియె. రాజగుబృహద్రథుఁడు పత్నీద్వయముతోఁ దపోవనముననుండి చిరకాలము తపంబు చేసి స్వర్గమునకుఁ బోయెను—వారు జరాసంధచండకౌశికులవరములం గాంచి నిష్కంటకముగ రాజ్యపాలనముం గావించుచుండిరి. ఈసమయమున భగవానుఁడగు వాసుదేవుఁడు కంసుని సంహరించెను. కంససంహారకారణమునఁ గృష్ణునకు జరాసంధునితో మహావైరము కలిగెను."

అని చెప్పి యుండెను. ఇది యంతయును గృష్ణుఁడే చెప్పియుండెను. మఱియు సవిస్తరముగఁ జెప్పెను. మరల నిట్లు చెప్పుటెందులకు? ప్రయోజనము లేకపోలేదు. మూలమహాభారతకారుఁ డద్భుతరసరసికుఁడు కాఁడు—కృష్ణుని యలౌకికఘటనముంగూర్చి యాతఁ డేమియును జెప్పలేదు. ఆయభావ మిప్పుడు పూరింపఁబడుటకే యీపని జరిగినది. వైశంపాయనుఁ డిట్లు చెప్పెను.

"మహాబలపరాక్రాంతుఁ డగుజరాసంధుఁడు గిరివ్రజమధ్యమునం దుండి కృష్ణసంహారమునకై తనఘనగదాదండమును తొంబదితొమ్మిదిసారులుత్రిప్పి ప్రయోగించెను. ఆగద మధురలోనున్న యద్భుతచరితుఁ డగుశ్రీకృష్ణునిసమీపమున నేరోసశత యోజనాంతరమునఁ బతితమయ్యెను. ఆగదాపతనవృత్తాంతమును పౌరులు కృష్ణునకెఱింగించిరి. అదిమొదలుగా మధురయందా ప్రదేశమునకు గదావసానమను పేరు కలిగెను!"

ఈజరాసంధవధపర్వాధ్యాయమునందలి యీవిషయములన్నియు మూలమహాభారతాంతర్గతములే యనియు, నేకకవికృతములే యనియు, కృష్ణాదులు వేషధారులుగనే గిరివ్రజమునకు వచ్చిరనియుఁ బాఠకుల కింకను నమ్మకమే యున్నయెడల హిందువులీకఁ బురాణేతిహాసములలో నైతిహాసికతత్త్వానుసంధానమునకై ప్రయత్నము వద

లుకొని యితరశాస్త్రావలోకనమునఁ బ్రవృత్తులగుట యుచిత మని మనవి చేయుచున్నాము. వారిట్టిపనికిఁ బూనుకొనకుండుటయే మంచిది.

ఇఁక నీయధ్యాయమునందలి యవశిష్టవిషయములను దెలిపి ముగించెదము. అవి యన్నియును సరళము లైనవియే—జరాసంధుఁడు భీమునితో యుద్ధము చేయఁ దలంచి "యశస్వులగు బ్రాహ్మణులచేఁ గృతస్వస్త్యయనుండై క్షాత్రధర్మానుసారంబుగఁ గవచకిరీటముల నుజ్జగించి" యుద్ధసన్నద్ధుఁ డయ్యెను. అప్పుడు పౌరులగు బ్రాహ్మణక్షత్రియ వైశ్యశూద్రవనితావృద్ధ జను లందఱు నాసంగ్రామమును జూడ వచ్చిరి. రణరంగమంతయు జనాకీర్ణమైపోయెను. పదునాలుగుదినములు యుద్ధ మయ్యెను. (ఇది సత్యమే యైనచో నవకాశమునుబట్టి యప్పుడప్పుడు యుద్ధము జరగియుండవచ్చును.) పదునాల్గవనాఁడు "వాసుదేవుఁడు" జరాసంధుఁ డలసియుండుటం గాంచి భీమకర్ముఁడగు భీమసేనుని సంబోధించి "కౌంతేయా! క్లాంతుఁ డగుశత్రుని బీడించుట యుచితము కాదు. అతిపీడనంబున నీతఁడు మరణించును. కావున నీతఁడు పీడనీయుఁడు కాఁడు. భరతర్షభా! ఈతనితో బాహుయుద్ధముం గావింపుము. (అనఁగా—శత్రువును ధర్మానుసారముగ వధింపవలయును గాని పీడింపరాదు.)—"భీముఁడు జరాసంధుని బీడించియే వధించెను. భీమునకుఁ గృష్ణునితోఁ దుల్య మగుధర్మజ్ఞానము లేదు.

తరువాతఁ గృష్ణార్జునులును, భీముఁడును గారాబద్ధులగురాజులను విడిపించిరి. అదియే జరాసంధసంహారమున కేకమాత్రోద్దేశము. కావుననే రాజగణమును విడిపించినతరువాత నిఁక నేమియుం జేయ లేదు. దేశమునకు వెడలిపోయిరి. వారు(Annevationist) కేవలము నక్రమాక్రమణాశాపరులు గారు—తండ్రితప్పునకై పుత్రునిరాజ్యము

నపహరించువారు కారు. వారు జరాసంధుని జంపి యాతనిపుత్రుండగుసహదేవునకు రాజ్యాభిషేకముం గావించిరి; సహదేవుండొసంగినకానుకలనుగూడ గ్రహించిరి. అప్పుడు కారాముక్తు లగురాజులు కృష్ణునిం గాంచి "ఈభృత్యు లేమి చేయవలయునో యాజ్ఞాపింపుము" అని వేఁడుకొనిరి. కృష్ణుఁడు వారిం గాంచి "మహారాజగుయుధిష్ఠిరుఁడు రాజసూయాధ్వరముం గావింపనభిలషించుచున్నాఁడు. మీరా రాసామ్రాజ్యవాంఛితుఁడగుధార్మికునకు సాహాయ్యముం గావింపవలయునని ప్రార్థించెదను" అనియెను.

యుధిష్ఠిరుని సేంద్రస్థితునిం గావించి ధర్మరాజ్యస్థాపనముం గావించుటయే కృష్ణునిజీవితోద్దేశమై యుండెను. అందుచేతనే మాటిమాటికి నాతఁడాప్రయత్నమునే చేయుచుండెను. ఈజరాసంధసంహారముచేఁ గృష్ణచరిత్రమునకు విశేషమహిమ ప్రకాశితమయ్యెను. కాని తరువాతికవులవ్రాఁతలవలన నీసంగతిగందరగోళముగా నున్నది. ఈపైని శిశుపాలవధవిషయమునఁగూడ మఱియొకగందరగోళమున్నది.

తొమ్మిదవప్రకరణము.

అర్ఘ్యాభిహరణము.

యుధిష్ఠిరుని రాజసూయ మారంభమయ్యెను. నానాదేశాగతు లగురాజులును, ఋషులును, నితరజనంబులును రాజధానియంతటను నిండి యుండిరి. ఈఘనకార్యనిర్వాహణంబునకై పాండవులు తమ యాత్మీయులను వివిధకార్యనియోజితులంగావించి యుండిరి. భోజ్యాద్రవ్యసంపాదనమున దుశ్శాసనుఁడును, పరిచర్యయందు సంజయుఁడును, రత్నరక్షణదక్షిణాదానంబులయందుఁ గృపాచార్యుఁడును, నుపాయన

ప్రతిగ్రహణంబున దుర్యోధనుఁడును నీవిధముగా నందఱు నన్నిపనులయందు నియుక్తులై యుండిరి. శ్రీకృష్ణుఁ డేపనియందు నియుక్తుఁడయ్యెను? దుశ్శాసనాదులనియోజనముతోఁగూడఁ గృష్ణుని నియోజనము లిఖింపఁబడియే యుండెను. ఆతఁడు బ్రాహ్మణుల పాదములను గడుగుపనియందు నియుక్తుఁ డయ్యెను.

ఇది కేవల మనుచితముగా నున్నది. భృత్యుఁడు చేయఁదగిన యీపని శ్రీకృష్ణుఁడేల చేయవలసివచ్చెను? ఇతనికి యోగ్యమగు వేఱొకపనియే లేదా ? కాక బ్రాహ్మణపాదప్రక్షాళనమే మహత్తర కార్యమా? అట్టిశ్రీకృష్ణు నాదర్శపురుషునిగాఁ జేసికొని పాఠకులందఱును బ్రాహ్మణోత్తముల పాదములను గడుగుటకై యల్లాడవలయునా యేమి? ఇదియే నిజమైనచోఁ గృష్ణుఁ డాదర్శపురుషుఁడు కాఁడని మేము ఘంటాపథముగాఁ జెప్పెదము. ఈవిషయముంగూర్చి యనేకవిధముల వ్యాఖ్యానము చేయవచ్చును. బ్రాహ్మణులచేఁ బ్రచాలితంబును, బ్రస్తుతప్రచారితంబును నగువ్యాఖ్యానమున "శ్రీకృష్ణుఁడు బ్రాహ్మణగౌరవమును వర్ధిల్లఁజేయుటకే సర్వకార్యములను విడిచి యీపనియందు నియుక్తుఁడయ్యెను " అని తేలును. ఈవ్యాఖ్యానము కేవల మగ్రాహ్యమని మాకుఁ దోఁచుచున్నది. శ్రీకృష్ణుఁ డితరక్షత్రియులవలెనే బ్రాహ్మణులనుగూడ గౌరవించుచుండె ననుమాట సత్యమే. కాని యాతఁడెప్పుడును బ్రాహ్మణగౌరవ ప్రచారమునందే విశేషాసక్తుఁడై యున్నట్లగపడదు. ఇంతియకాక యనేకస్థలములయందుఁ దద్వ్యతిరిక్త మార్గమునుగూడ నవలంబించెను. వనపర్వమునందలి దుర్వాసాతిథ్య వృత్తాంతము మూలభారతాంతర్గతమే యని విశ్వసించినచో నాతఁడు పాండవాశ్రమమునందు బ్రాహ్మణపరాభవముం గావించినట్లు బోధ

యగుచున్నది. కృష్ణుఁడు కేవలమును సర్వసమత్వముం గూర్చిన శిక్షి వాఁడి. గీతాధర్మమే కృష్ణధర్మమైనచో:—

శ్లో విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని
శుని చైవ శ్వపాకేచ పండితాః సమదర్శినః”

గీ. ౧౮

అనునదియే యాతనిమతము, ఆతనిమతమున బ్రాహ్మణులు, గోవులు, గజములు, శునకములు, చండాలురు నందఱును సమానులే. అట్టిచో నాతఁడు బ్రాహ్మణపాదప్రక్షాళనమునకు నియోగింపఁబడె ననుట యసంభవము.

శ్రీకృష్ణుఁ డాదర్శపురుషుఁడు కావున వినయాదర్శమును బ్రక టించుటకై యీభృత్యకార్యభారమును వహించె నని కొందఱు చెప్ప వచ్చును. అట్లయినచో బ్రాహ్మణపదప్రక్షాళనమునందే నియుక్తుఁడు కానేల? వయోవృద్ధు లగుక్షత్రియుల యడుగులఁ గడుగుటకుఁగూడ నియోగింపఁబడరాదా? మఱియు నిట్టివినయము వినయమున కాదర్శ మనికూడ మేము విశ్వసింపఁజాలము. ఇది దంభవినయ మని చెప్పె దము.

శ్రీకృష్ణచరిత్రము సమయోపయోగమైనదని మఱికొందఱు చె ప్పవచ్చును. ఆసమయమున బ్రాహ్మణభక్తి యతిప్రబలమైయుండె న నియు, ధూర్తుఁ డగుకృష్ణుఁడు దానిని బ్రకటించుటకై యట్లు చేసె ననియు వారి యుద్దేశము—కాని, యీశ్లోకము ప్రక్షిప్త మని మేము చెప్పె దము. ఎందుచేతననిన:—శిశుపాలవధ సర్వాధ్యాయమునకుఁ దరువాతి యధ్యాయమున శ్రీకృష్ణుఁడు బ్రాహ్మణపద ప్రక్షాళనమునకు నియో గింపఁబడినట్లు కాక యాతఁడు క్షత్రియోచితంబును వీరోచితంబును నగుకార్యాంతరమున నియుక్తుఁ డైనట్లు చెప్పఁబడియెను. అందు “మ

హా బాహుఁడగు వాసుదేవుఁడు శంఖచక్రగదాధరుఁడై సమాపనపర్యం తమును యజ్ఞరక్షణముం గావించుచుండెను ” అని చెప్పఁబడియెను—— ఇవి రెండును బ్రక్షిప్తములే కావచ్చును. ఈపరిచ్ఛేదమున నీవిషయ ముంగూర్చి విశేషాందోళనము కలిగించుట యంతయావశ్యకముగా మాకుఁ దోఁచుట లేదు. ఇది యంతముఖ్యవిషయమును గాదు. కృష్ణ చరిత్రవిషయంబున నిట్లే మహాభారతమున ననేకస్థలములఁ బరస్పర విరుద్ధభావము లున్నవని తెలుపుటకే యింతవఱకుఁ జెప్పితిమి. చాల చేతులు పడుటచేతనే యిట్టియసందర్భములు కలిగినవని.

ఈరాజసూయమహాయజ్ఞమునఁ బ్రబలపరాక్రముఁడగు శిశు పాలమహారాజు కృష్ణునిచే నిహతుఁ డయ్యెను. పాండవులకు మిత్రమా త్రుఁడై యుండి శ్రీకృష్ణుఁడస్త్రధారణముం గావించుట యీయొక్క పర్యాయమే యని చెప్పవచ్చును. ఖాండవదహనసమయయుద్ధము కే వలము మౌలికము కాదను సంగతి పాఠకులకు జ్ఞప్తియందుండవచ్చును

ఈశిశుపాలవధపర్వాధ్యాయమునందు గురుతర మగు నొక యైతిహాసికతత్త్వము నిహితమై యున్నది. ఇట్టి యితిహాసతత్త్వము మ హాభారతమునం దిఁక నెచ్చటను లేదనియే చెప్పవచ్చును. జరాసంధ వధకుఁ బూర్వమెప్పుడును శ్రీకృష్ణుఁ డీశ్వరావతారముగా మూలమ హాభారతమున వ్రాయఁబడి యుండలేదు. జరాసంధవధయందే యీ విషయ మస్పష్టముగా నున్నది. ఈశిశుపాలవధయందే కృష్ణునింగూర్చి యాతనిసమకాలికులు జగదీశ్వరుఁడని చెప్పి యంగీకరించి యుండిరి. ఇం దుఁ గురువంశమునకుఁ దాత్కాలికప్రభువగు భీష్ముఁడే యీమతమును బ్రచారము చేసెను.

ఇప్పట్టున నైతిహాసికంబగు నొకసందేహము కలుగుచున్నది. కృష్ణుఁడు తనజీవితప్రథమభాగమున నీశ్వరావతారముగాఁ బ్రదర్శింపఁ

బడలేదు. ఆతఁడు మొట్టమొదట నెప్పు డీశ్వరుఁడుగా స్వీకృతుఁ డయ్యెను? తనజీవితకాలమునందే యాతఁ డీశ్వరుఁడుగా నంగీకరింపఁబడియెనా?—ఈశిశుపాలవధ సందర్భమునందును దరువాత మహాభారతమునందలి యితరసందర్భములయందును నాతఁ డీశ్వరుఁడుగాఁ బ్రతిపాదింపఁబడియెను. కాని శిశుపాలవధ యందలి యాయాభాగములు ప్రక్షిప్తములై యుండవచ్చును. ఈప్రత్యుత్తరమునం దేపక్షమవలంబనీయమైనది?

దీనినిగూర్చి మేమిప్పు డేమియును జెప్పఁజాలము. దీనికిఁ బ్రత్యుత్తరము క్రమముగాఁ దనయంతనే పరిస్ఫుట మగు నని భావించుచున్నాము. కాని శిశుపాలవధ పర్వాధ్యాయ మంతయు మూలమహాభారతభాగమే యైనచోఁ గృష్ణునియం దప్పటినుండియే యీశ్వరత్వము సుప్రతిష్ఠిత మైయుండు నని చెప్పుచున్నాము. ఈవిషయమున నాతనికి స్వపక్షులును, విపక్షులునుగూడ నున్నారు. ఆతనిస్వపక్షులలోఁ బ్రధానులు భీష్ముఁడును బాండవులు నై యుండిరి. ఇఁక విపక్షులలో నొక మహారాజగు శిశుపాలుఁ డున్నాఁడు. శిశుపాలవధ వృత్తాంతమున స్థూలమర్మ మేమనిన:—భీష్మాదులు సభామధ్యమున శ్రీకృష్ణునిప్రధానత్వమును స్థాపింపఁ బ్రయత్నించుటయు, శిశుపాలుఁ డాతనికి విరోధియగుటయు నై యున్నది. అందువలన నతితుములవివాద ముపస్థించి పెంపొందెను. అప్పుడు శిశుపాలుని గృష్ణుఁడు వధించెను. దానితో నల్లరి యంతయు నడఁగిపోయెను. ఎట్టివిఘ్నమును లేకుండ యజ్ఞము నిర్వహింపఁబడియెను.

ఈసకలవృత్తాంతమునందును జరిత్రాంశ మేమైన నున్నదా లేదా యని యాలోచించుటకుఁ బూర్వమే యీశిశుపాలవధాధ్యాయము మౌలిక మగునా కాదా యని విమర్శింపవలసి యున్నది. దీనికిఁ

ప్రత్యుత్తరము సులభమైనది కాదు. మహాభారతమునందలి స్థూలసంఘటనములతో శిశుపాలవధకు విశేషసంబంధ మున్నదని చెప్పుట కవకాశము లేదు. కాని, యంతమాత్రమున దీనిని బ్రక్షిప్త మనియును జెప్పుటకు వలను గాదు. ఇంతకుంబూర్వముకూడ ననేకస్థలములయందుం బ్రబలపరాక్రముండగు శిశుపాలుని నామము మహాభారతమునం దగపడుచున్నది. తరువాత నాతం డెచ్చటను నగపడ లేదు. ఈనను మనే యధ్యాయము వ్రాతుండై యుండవలయును. పాండవసభయం దాతండు కృష్ణునిచేం జంపంబడె ననుటకు విరోధముగ నెట్టికథయును లేదు. అనుక్రమణికాధ్యాయమునను బర్వసంగ్రహాధ్యాయమునను గూడ శిశుపాలవధకథయున్నది. రచనాప్రణాళికనుబట్టి చూడంగా శిశుపాలవధపర్వాధ్యాయము మౌలికమహాభారతాంశమే యని బోధయగుచున్నది. మూలమహాభారతమునందలి కొన్ని భాగములవలెనే యీశిశుపాలవధచరిత్రము నాటకముగా రచియింపంబడి విశేషోత్కృష్టముగా నుండియున్నది. కావున దీని నమౌలికమని యొక్కసారిగాం బరిత్యజింపంజాలము.

అయినను జరాసంధవధపర్వాధ్యాయమునందువలెనే యీయధ్యాయమునందును రెండు చేతులవ్రాంతలగపడుచున్నవని చెప్పుచున్నాము. మొత్తముమీంద నాయధ్యాయమునకంటె దీనియందే కృత్రిమవైచిత్ర్యము విశేషముగా నగపడుచున్నది. కావున శిశుపాలవధ స్థూలముగా మౌలికమే యయినను, దీనియందు ద్వితీయహస్తముల యొక్కగాని, తరువాతి లేఖకులయొక్కగాని చేతులుకలసియున్నవని యనిసిద్ధాంతముచేయుటకు మేము సాహసుల మగుచున్నాము. ఇంక నిప్పుడు శిశుపాలవధ వృత్తాంతము సవిస్తరముగాం దెలుపుచున్నాము.

ఇప్పటికింగూడ మనదేశమునం దొకవాడుక యున్నది. ఒకనా

ప్పవాని యింట సభ జరగినప్పుడు సభయందలి ప్రధానవ్యక్తికి ముందుగఁ బుష్పచందనముల నర్పించుట సుప్రసిద్ధమై యున్నది. దీనిని "మాలాచందన" మని యందురు. ఇది యిప్పుడు పాత్రగుణముల ననుసరించి యొసంగఁబడుట లేదు. వంశమర్యాదలనుబట్టి యర్పింపఁబడుచుండెను. కులీనుల మందిరములయందుఁ గోష్ఠీపతికే మాలాచందన మర్పింపఁబడుచుండెను. ఏమనిన — కులీనులలో గోష్ఠీపతివంశమే విశేషమాననీయమైనది. కృష్ణునికాలమున నీపద్ధతి మఱియొకవిధముగా నుండెను. అప్పుడు సభయందలి సర్వప్రధానునకే యర్ఘ్యప్రదానము గావింపఁబడుచుండెను. వంశమర్యాదలనుబట్టి యొసంగఁబడుట లేదు. పాత్రనిగుణములనుబట్టియే యర్పింపఁబడు చుండెను.

యుధిష్ఠిరునిసభయం దర్ఘ్య మర్పింపవలసి యుండెను. దీనికిఁ దగినవాఁడు? భారతవర్షమునందలి మహారాజు లందఱును సభకు విచ్చేసి యుండిరి. ఇందు సర్వశ్రేష్ఠుఁ డెవ్వరనుసంగతి విచారింపవలసి యుండెను. శ్రీకృష్ణుఁడే సర్వశ్రేష్ఠుఁ డసియు, నాతనికే యర్ఘ్యము నర్పింపవలయు ననియుఁ గురువృద్ధుఁడగుభీష్ముఁడు చెప్పి యుండెను. ఆతఁడు పప్రథమమున శ్రీకృష్ణునియందు దేవభావమును సూచించినట్లగపడదు. తేజోబలపరాక్రమములయందు శ్రీకృష్ణుఁడే శ్రేష్ఠుఁ డనియు, నాతనికే యర్ఘ్య మీయవలయు ననియు భీష్ముఁడు చెప్పెను. క్షాత్రముచేఁ గృష్ణుఁడు క్షత్రియలోకమునకెల్ల శ్రేష్ఠుడనికూడఁ జెప్పి యుండెను. దీనినిబట్టిచూడఁగా భీష్ముఁడు కృష్ణుని మానవచరిత్రమునే ప్రదర్శించి యుండెనని బోధ యగుచున్నది.

ఈతనియాలోచననుబట్టియే కృష్ణున కర్ఘ్య మొసంగఁ బడెను. కృష్ణుఁడుకూడ దానిని బరిగ్రహించెను. ఇది శిశుపాలునకు సహింపరాని దయ్యెను. అప్పుడు శిశుపాలుఁడు సమకాలికులగు భీష్మ

కృష్ణపాండవాదులను దిరస్కరించి పలికిన పలుకులు విదేశపార్లమెంటు మహాసభయందు వచింపఁబడినచో నుచితగౌరవము నందియుండును. అతని యుపన్యాసమునందలి ప్రథమభాగమున వాగ్మిత్వమును విశుద్ధతయుఁ దీవ్రతయుఁ బొడకట్టెను "కృష్ణుఁడు రాజు కాఁడు. అట్టిచో నిందఱురాజు లుండఁగా నాతఁ డర్ఘ్యము నేల గ్రహించెను ? వృద్ధుఁడను కారణమున నాతని బూజింపఁదలఁచినచో నాతనితండ్రియైన వసుదేవు నేల పూజింపరాదు ? ఆతఁడు మీకాత్మీయుఁడును బ్రియంకరుఁడు నని యెంచి పూజించితిరా ? అట్లయినచో మామ యగుద్రుపదుఁ డుండఁగా నీతని నేల పూజింపవలెను ? కృష్ణుని * గురునిగాఁ దలంచితిరా ? ద్రోణాచార్యుఁ డుండఁగా గృష్ణు నర్చించు టేల ? † ఋత్విజుఁ డని యాతని కర్ఘ్య మిచ్చితిరా ? వేదవ్యాసుఁ డుండఁగాఁ గృష్ణుఁ డేల ?" అని యీవిధముగా మహారాజగుశిశుపాలుఁ డుపన్యసించుచు నితరవక్తలవలెనే యాతఁడును గోపోద్రిక్తుఁ డయ్యెను. అప్పుడాతఁడు తర్కమునువదలి బలవంతమున కారంభించెను. ఆలోచనను విడిచి తిట్టుట కారంభించెను. పాండవులను వదలి కృష్ణు నెదుర్కొనియెను. అలంకారశాస్త్రమును విలక్షణముగాఁ బ్రయోగింప నారంభించి మొట్టమొదట "ప్రియచికీర్షువు, అప్రాప్తలక్షణుఁడు" అనువాక్యము లాదిగాఁ దుదకు "ధర్మభ్రష్టుఁడు, దురాత్ముఁడు" నను నీమొదలగుదూషణములకు దిగియెను. తుట్టతుదకుఁ గృష్ణుఁడు వెన్నదొంగ, దారపరిగ్రహుఁ డగు ‡ నపుంసకుఁడు నని తిట్టఁ దొడంగెను.

* కృష్ణుఁడు అభిమన్యుసాత్యకి ప్రభృతిమహారథులకును నొకప్పుడు స్వయముగ నస్త్రశస్త్రసహిత యుద్ధవిద్యాగురుఁడై యుండెను.

† కృష్ణుఁడు సుప్రసిద్ధవేదజ్ఞుఁడని విఖ్యాతి యున్నది.

‡ కృష్ణుఁ డపుంసకుఁడు కాఁడు—కాని యింద్రియపరాయణు లగువారు జితేంద్రియుల నిట్లే దూషింతురు.

ఆమాటలన్నియును విని శాంతగుణాధారుండును బరమయోగియు నాదర్శపురుషుండు నగుకృష్ణుఁ డెట్టిప్రత్యుత్తరము నీయలేదు. తత్క్షణమే శిశుపాలుని దండింపఁగలశక్తి శ్రీకృష్ణున కున్నది. పాఠకులకు ముందుముందు దానంగతి తెలియఁగలదు. ఇంతవఱకుఁ గృష్ణుఁ డిట్టి పరుషవచనములచే నెన్నఁడును దిరస్కరింపఁబడి యున్న ట్లగపడదు. అయిన నాతఁ డీతిరస్కారవచనములకు భ్రూవిక్షేపమైనను గావించి యుండలేదు. ఆతఁ డాంగ్లేయమతానుసారముగా "శిశుపాలా! శాంతమే పరమధర్మము. నేను నిన్ను క్షమించితిని" అని చెప్పక నిశ్శబ్దముగనే శత్రువును క్షమించెను.

యజమాని యగుయుధిష్ఠిరుఁడు సమాహరాతుఁ డగుశిశుపాలుని క్రోధముం గాంచి యాతని శాంతింపఁ జేయఁ బ్రయత్నించెను; కృష్ణుని నిందించుచున్న యాతనిని మధురవాక్యములచే బుదలింపఁజూచెను. వృద్ధుఁ డగుభీష్ముఁడు సుస్థిరుఁడై యుండెను.—ఆతని కది యంతయును బాగుగ నగపడలేదు. "కృష్ణునర్చించుట కిష్టము లేని యీయాతని నింతగా ననునయించుటయు, బ్రతిమాలుటయు ననుచితము" అని యాతఁడు స్పష్టముగాఁ జెప్పివైచెను—కురువృద్ధుఁ డగుభీష్ముఁ డప్పుడు సార్థకంబులగు వాక్యపరంపరలచే శ్రీకృష్ణునర్చించుటకుఁ గారణములను సవిస్తరముగ స్పష్టముగఁ దెలియఁజేసెను. ఆవాక్యములయందలి సారాంశమును మేమిందుఁ జూపుచున్నాము! కాని యందొకవిధ మగుగూఢభావ మున్నది. దానిని ముందుగనే తెల్పుచున్నాము. అందుఁ గొన్నివాక్యములలో "సకలమానవులకంటెను నధికగుణంబులు గలక్షత్రియవీరులలో శ్రీకృష్ణుఁడు సర్వశ్రేష్ఠుఁడు గావున నీతని కర్ఘ్యమీయవలయును" అనుభావ మున్నది. మఱికొన్నివాక్యములలో "శ్రీకృష్ణుఁడు సాక్షాజ్జగదీశ్వరుఁడు కావున నెల్లరు నాతని నర్చింపవల

యును” అనుభావ మున్నది. మేమీరెండువిషయములను వేఱువేఱుగఁ జూపెదము. వాని తాత్పర్యమును గ్రహించుటకుఁ బాఠకులే ప్రయత్నింతురుగాక ! భీష్ముఁ డిట్లు చెప్పెను.

“ఈమహాసభయందలి మహారాజ మండలంబునఁ దేజోబల బలములచే శ్రీకృష్ణుని మించినవాఁ డొక్కఁడును లేఁడు,,

ఇది మనుష్యత్వవాదము తరువాతనే దేవత్వవాదము.

“ఈయచ్యుతుఁడు కేవలము మనకర్చనీయుఁడు. ఇట్టివాఁడు లేఁడు. ఈమహాభుజుఁడు త్రిలోకపూజ్యుఁడు. ఈతఁడు రణాంగణమున నసంఖ్యాకక్షత్రియవీరగణంబులను బరాజితులం గావించెను మఱియు నీయఖండబ్రహ్మాండ మాతనియందే ప్రతిష్ఠితమై యున్నది ,,

మరల మనుష్యత్వవాదము.—

“శ్రీకృష్ణుఁడు పుట్టినది మొదలు గావించినపనుల నన్నిటిని ప్రజలవలన నేనెన్నియోసారులు వినియుంటిని. ఈతఁడు కేవలము బాలుఁడై యున్నను మనమాతని బరీక్షించి యుంటిమి, కృష్ణుని శౌర్యవీర్యకీర్తి విజయములు సమస్తమును సుప్రసిద్ధములై యున్నవి ,,

పిమ్మట నప్పుడే దేవత్వవాదము:—

“అట్టిభూతసుఖావహుఁడును జగదర్చితుఁడును నగునచ్యుతుని బూజింపవలయునని చెప్పితిని,,

మరల మనుష్యత్వారోపము:—

“కృష్ణుని బూజించుటకు రెండుకారణము లున్నవి. ఆతఁడు నిఖిలవేదవేదాంగపారదర్శి; సమధికబలశాలి; మానవలోకమునం దంతటిబలవంతుఁడును వేదవేదాంగసంపన్నుఁడును మఱియొకఁ డగపడుట లేదు. దానము, సామర్థ్యము, శ్రుతము, శౌర్యము, కీర్తి, బుద్ధి, వినయము విపులశ్రీసమృద్ధి ధైర్యము సంతోషము మొదలగుసద్గుణము లన్నియు శ్రీకృష్ణునియందు నియతములై విరాజిల్లుచున్నవి. కావున సర్వసద్గుణసంపన్నుండును నాచార్యపితృగురుస్వరూపుండును, బూజార్హుండును నగుకృష్ణునియెడల వినయప్రదర్శనముం గావించుట మీకెల్లవిధములఁ గర్తవ్యమై యున్నది. ఆతఁడు ఋత్విజుఁ

డు; గురుఁడు ; సంబంధి; స్నాతకుఁడు; రాజు: మఱియుఁ బ్రియపాత్రుఁడుకూడనై యుండెను. ఇక్కారణముచేతనే యచ్యుతుఁ డర్చింపఁబడియెను.

మరల దేవత్వవాదము:—

«కృష్ణుఁడే యీచరాచరప్రపంచమునకు సృష్టిస్థితిలయకారణుఁడు ! అతఁడవ్యక్తప్రకృతి; సనాతనుఁడు; కర్త; సర్వభూతేశ్వరుఁడు; కేవలమును బూజనీయుఁడు. ఇందుల కింకను సందేహమా ? బుద్ధి, మనను మహత్తు, పృథివ్యాది పంచభూతములును శ్రీకృష్ణునియందే యేకమాత్రప్రతిష్ఠితములై యున్నవి. చంద్రసూర్యగ్రహనక్షత్రదిగ్విదిక్సముదాయ మంతయుఁ గేవలమీతనియందే యున్నది. ఇత్యాది»

కృష్ణు నర్చించుటకు భీష్ముఁడు రెండుకారణములను జెప్పెను. అందు మొదటిది బలవంతులలో సర్వశ్రేష్ఠుఁడగుట—రెండవది యీతనితోఁ దుల్యు లగు వేదవేదాంగపారగులు లేకుండుట—అతఁ డద్వితీయపరాక్రముఁ డనుట కనేకప్రమాణములు చూపఁబడినవి. కృష్ణుఁ డద్వితీయవేదజ్ఞుఁ డనుటకుఁ బ్రమాణము భగవద్గీత. మనము పాఠము సేయుచుండుభగవద్గీత కృష్ణప్రణీతము కాదు. అది వ్యాసప్రణీతమనియే ప్రసిద్ధి. "వైయాసికసంహిత" యని దాని పేరు. దీనిని రచియించినవాఁడు వ్యాసుఁడైనను మఱియొకఁడైనను నాతఁడు శ్రీకృష్ణునినోటినుండి వెలువడినమాటలనే సేకరించుకొని యీగ్రంథసంకలనము గావించియుండలేదు. ఇది మూలమహాభారతమునందలి యొకభాగముగా మాకుఁ దోఁచుట లేదు. కాని గీత శ్రీకృష్ణునిమతోద్దేశముల సంకలనమాత్రమే యని మానమ్మకము. కృష్ణమతావలంబి యగునెవ్వఁడో యొకవిద్వాంసుఁడు దీని నీరూపమున సంకలితముం గావించె ననియు నిది మహాభారతమునఁ బ్రక్షిప్తమై ప్రచారమునకు వచ్చియుండు ననియుఁ దోఁచుచున్నది. ఇప్పుడు చెప్పవలసిన దేమనిన:—ఈగీతోక్తధర్మమును రచియించినవాఁ డద్వితీయవేదవిదుండగుపండితుఁడై యుండవలయును. ధర్మసంబంధమున నాతఁడు వేదములు సర్వోత్కృష్టస్థాన

మునసం దుంచలేదు—అప్పుడప్పుడు వేదమునుగూడ నించించుక నిందించియే యుండెను. అట్లయినను నద్వితీయవేదజ్ఞుఁడు కాక మఱియొకని కీగీతోక్తధర్మమును రచించుట సాధ్యము కాదు. ఈసంగతి గీతను వేదమునుగూడ నధ్యయనము గావించినచో సులభముగా బోధపడఁగలదు.

ఈవిధముగాఁ బరాక్రమము, పాండిత్యము వీర్యము, శిక్ష, కర్మము, జ్ఞానము, నీతి, ధర్మము, దయ, క్షమ మొదలగువానియందు సమానముగ సర్వశ్రేష్ఠుఁడగు వాఁ డొక్కఁడే యాదర్శపురుషుఁడు కాఁగలఁడు.

పదియవ ప్రకరణము.

శిశుపాలవధ

భీష్ముఁడు తనయుపన్యాసమును ముగించి శిశుపాలు నతితీవ్రముగఁ బరాభవించి "శ్రీకృష్ణునిఁ బూజించుట శిశుపాలున కసహ్యము గాఁదోఁచెనేని ఆతఁడు తనయిచ్చవచ్చినట్లు చేసికొనవచ్చును" అనియెను. అనఁగా నిష్టము లేకున్నచో లేచిపోవచ్చునని భావము.

శ్రీకృష్ణుఁ డట్లు పూజింపఁబడుటం గాంచి యప్పుడు మహాపరాక్రముఁడగు సునీధుఁ డను నొకవీరపురుషుఁడు క్రోధకంపితాంగుఁడై యారక్తనేత్రుఁడై సకలరాజలోకమును సంబోధించి "నేనిదివఱకే సేనాధిపతినై యుంటిని. యాదవపాండవకులంబుల నుమ్మూలించుటకై యిప్పుడే సమరసాగరమున నవగాహనము సేయవలయును," అనెను. చేదిపతి యగుశిశుపాలుఁడు మహీపతుల యుత్సాహసందర్శనమున నుత్సాహితుఁడై యజ్ఞమును కలతరా యముంగూర్చుట కాలోచింపఁదొడంగెను; యుధిష్ఠిరాభిషేకమును, కృష్ణపూజయుఁ గాకుండుటకై మన మెల్లవిధములఁ బ్రయత్నింపవలయు నని రాజమండలికి బోధించు చుండెను. రాజులందఱును నిర్వేపయుక్తులై క్రోధపరవశులై యాలోచించు చుండుటం గాంచి వారు యజ్ఞవిఘ్నప్రయత్నము చేయుచున్నట్లు శ్రీకృష్ణుఁడు స్పష్టముగా గ్రహించెను.

మహారాజగు యుధిష్ఠిరుఁడు సాగరసదృశం బగు రాజమండలము క్షోభపరిచలితం బగుటం గాంచి ప్రాజ్ఞతముఁడును బితామహుండు నగుభీష్ము నుద్దేశించి "పితామహా! ఈమహారాజసముద్రము సంక్షుభితం బగుచున్నది. ఇప్పు డవశ్యకర్తవ్య మేమియో నిర్దేశింపవలయును" అనియెను. శిశుపాలవధకు యథార్థకారణ మిదియే. అతని నిప్పుడు వధింపకున్నచో నాతఁ డారాజులతోఁ గలసి యజ్ఞమునకు విఘ్నము కావింపక మానఁడు.

శిశుపాలుఁడు మరల భీష్ముని, గృష్ణుని ననేకవిధముల దూషింపఁదొడంగెను. ఆతఁడు వారిని మిగుల నెవ్వానాడెను; దురాత్ముఁడు, గోపాలుఁడు దాసుఁడు నని యతినీచముగఁ దిరస్కరించెను. పరమయోగి యగుశ్రీకృష్ణుఁ డీసారికూడ శాంతముతో నిశ్శబ్దముగా నుండెను. కృష్ణుఁడు బలమున కెట్టి యాదర్శమూర్తియో శాంతమునకుఁ గూడ నట్టియాదర్శమూర్తియే. భీష్ముఁడు మొదట నేమియు ననలేదు. కాని భీముఁడత్యంతక్రోధపరవశుఁడై శిశుపాలు నాక్రమింప నుద్యోగించెను. అప్పుడు భీష్ముఁ డాతని వారించి శిశుపాలునిపూర్వవృత్తాంతము నాతనికిఁ దెలియఁజేసెను. ఈవృత్తాంతము కేవలమసంభవమును, నస్వభావమును, నవిశ్వసనీయము నైయున్నది. ఆకథ యీక్రిందివిధముగానున్నది.

శిశుపాలుఁడు పుట్టినప్పు డాతనికి మూఁడు కన్నులును, నాలుగుచేతులు నుండుటేకాక యాతఁడు గాడిదవలె రోదనము చేయఁ దొడంగెను. ఇట్టి దుర్లక్షణములుగల పుత్త్రుని బరిత్యజించుటే శ్రేయంబని యాతని తల్లిదండ్రులు తలంచిరి. ఆసమయమున నాకాశవాణి వారిని వారించెను. పుక్కిటిపురాణములు చెప్పువారి కాకాశవాణి తోకుండ నేకథయును నడవదు. "ఈబిడ్డ మంచివాఁడే. ఈతని త్యజింపవ

లదు. బాగుగఁ బ్రీతిపాలింపుఁడు; యముఁడైన నీతని నేమియునుఁ జేయఁజాలఁడు; కాని యీతని వధించువాఁ డిదివఱకే పుట్టియున్నాఁడు" అని దైవవాణి చెప్పెను. ఆతనిపేరు చెప్పవలయు నని తలిదండ్రులు ప్రశ్నించిరి. అప్పు డాకాశవాణి కృష్ణునిపేరు చెప్పివైచినచోఁ గథ ముగిసియే యుండును. కాని యట్లుచెప్పినచోఁ గథాసంవిధానమున మనోజ్ఞతయేమున్నది. ? అందుచే నప్పుడాకాశవాణి "ఈబిడ్డనెవ్వని యొడిలో నుంచినప్పుడీతని యెక్కువకన్నును, మిక్కిలిసేతులును మా యమగునో యాతఁడే యీతనికి మారకుఁడు" అని చెప్పెను.

శిశుపాలునితండ్రి యగపడినవారి కెల్లఁ దనబిడ్డనందించుచుండెను. ఎవ్వరి యొడిలోనను బిల్లవానివికృతాకారము మారలేదు. కృష్ణశిశుపాలురు సమవయస్కులని తోఁచుచున్నది. ఏమనిన నిరువురు నొక్కసమయముననే రుక్మిణిని బెండ్లియాడుటకుఁ బ్రయత్నించిరి. ఆకాశవాణియును "పుట్టియున్నాఁడు" అని చెప్పెను. దీనినిబట్టికూడనట్లే బోధయగుచున్నది. కాని యట్టిస్థితిలోఁగూడ శ్రీకృష్ణుఁడు ద్వారకనుండి చేదిదేశమునకుఁ బోయి శిశుపాలు నెత్తుకొనియెను. తోడనే శిశుపాలునియాకృతిమారిపోయెను. !

శిశుపాలునితల్లి కృష్ణునకు మేనత్త. ఆమె శ్రీకృష్ణుని బలవంతముగ నిరోధించి "అబ్బాయీ! నీవు నాయీబిడ్డను జంపవలదు" అని కోరెను. ఆమాటకుఁ గృష్ణుఁ డంగీకరించి శిశుపాలుని శతాపరాధములను క్షమించెద నని బాస చేసెను.

అనైసర్గికవిషయమును మేము విశ్వసింపఁజాలము. పాఠకులు కూడ నట్లే యుందురని నేననుకొందును, ఏయితిహాసమునందైన నస్వభావవిషయ మగపడినప్పుడు దానిని లేఖకులో తరువాతికవులో చేర్చి యుందురని యందఱకును దోఁచక మానదు. క్షమాగుణమహాత్వమును

శ్రీకృష్ణచరిత్రమహిమయు బాగుగ నెఱుంగనికవి యెవ్వఁడో కృష్ణునియ ద్భుతక్షమాశీలము నెఱుంగక శిశుపాలునియెడ నాతఁడుచూపినక్షమా ప్రభావమును తరువాతివారికి స్పష్టముగఁ బ్రదర్శించుటకై యిట్టియ ద్భుతకల్పనమును జేసియుండును. అసురవధార్థమె యవతరించిన శ్రీ కృష్ణుఁ డట్టియసురుల యపరాధములనే క్షమించె ననుట సుసంగతము గాలేదు.కృష్ణుఁడసురవధార్థమేయవతరించెనని తలఁచినచో నీక్షమాగు ణమునకు విశేషము లేదు. కాని యాతఁ డాదర్శపురుషుఁడని భావిం చినచో, మనుష్యత్వాదర్శనమును వికసింపఁ జేయుటకే యవతరించెనని తలంచినచో నాతనిసకలకార్యములును విస్పష్టముగ గ్రాహణీయము ల గుచున్నవి. శ్రీకృష్ణచరిత్ర మనురత్నభాండారమును దెఱచుటకుఁ దా ళ మాదర్శపురుషతత్త్వమే.—

శిశుపాలుని కటూక్తులను శ్రీకృష్ణుఁడు చాలవఱకును సహించు టచేతనే యాతనిక్షమాగుణ మతితరముగఁ బ్రశంసనీయమగుచుండు టలేదు. శిశుపాలుఁ డిదివఱకు శ్రీకృష్ణున కనేకాపకారములను గావిం చి యుండెను. కృష్ణుఁడు ప్రాగ్జ్యోతిషపురమునకుఁ బోయియున్నప్పుడు శిశుపాలుఁడు ద్వారకానగరమును దగ్ధముగఁ జేసి పాఱిపోయెను. ఒక ప్పుడు కృష్ణుఁడు రైవతకోద్యానవిహారమునకుఁ బోయియున్నప్పుడు వచ్చి యాదవులను జాలమందిని జంపి కొందఱిని బంధించెను. మఱి యును వసుదేవునియశ్వమేధతురంగము నపహరించెను, ఇవియన్ని యునునప్పటి క్షత్రియులలో మహాపరాధములుగాఁ బరిగణితములైన పనులు ! ఇట్టి శిశుపాలుని దుష్కార్యముల నన్నిటినిఁగూడ శ్రీకృష్ణుఁ డు క్షమించెను. ఆతఁడు కేవలమును శిశుపాలుని వైరాచరణమునుమా త్రమే క్షమించి యుండలేదు. జరాసంధుఁడుకూడ నాతని ననేకవిధ ములఁ బీడించియుండెను. సశక్తిచేఁగాని పరమశక్తిచేఁగాని శ్రీకృష్ణుఁ

డు జరాసంధుని మదమడంచుటకు సమర్థుఁడే. అయినను జరాసంధుఁ డు రాజమండలమును బంధించి పశుపతికిఁ బలికాదానముం గావించుటకు సంసిద్ధుఁడు కానతవఱకు శ్రీకృష్ణుఁ డాతనియెడల నెట్టివైరాచరణమును గావించియుండలేదు. అంతియ కాక యుద్ధము చేయుటచేఁ బ్రజాక్షయమగుననిశంకించి తానే యించుక తప్పించుకొని రైవతకాద్రియం దొకదుర్గమును నిర్మించుకొని యందుండెను. ఇట్లే శ్రీకృష్ణుఁడు తనయందే శాత్రవము చూపుచున్నంతవఱకు శిశుపాలున కెట్టియనిష్టముఁ నుగలిగింపలేదు. ఆతఁడిప్పుడు పాండవయజ్ఞమునకు విఘ్నముచేసి ధర్మరాజ్యస్థాపనమున కభ్యంతరముం గూర్చుటచేఁ గృష్ణుఁ డాతని వధించెను. ఆదర్శపురుషునిక్షమ క్షమాపరత్వమున కాదర్శము——కావున నాతని కెవ్వరనిష్టముం గూర్చినను నాతఁడు వారియెడల నెట్టివైరసాధనమును గావింపఁడు. కాని యాదర్శపురుషుఁడు దండప్రణేతలకుఁగూడ నాదర్శకుఁడగుటచే సమాజమున కనిష్టముం గూర్చువారి నాతఁడు దండించుచుండును.

కృష్ణుని క్షమాగుణమునుగూర్చి ప్రశంసవలసినప్పు డాతఁడు కర్ణదుర్యోధనాదులయెడలఁ జూపిన క్షమాభావముంగూర్చి చెప్పక పోలులేదు. ఆయుద్యోగపర్వకథ యిప్పుడు చెప్పదగినది కాదు——కర్ణదుర్యోధను లప్పు డాతని నేయవస్థలో బంధింపఁ బ్రయత్నించిరో, యాయవస్థలో నెవ్వరి నెవ్వరు బంధింపఁజూచినను నేనుక్రోస్తుతప్ప మఱియెవ్వఁడును శత్రువును క్షమింపఁజాలఁడు. కృష్ణుఁడు వారిని క్షమించెను. మఱియు బంధుభావమునఁ గర్ణునితోఁ గథోపకథనముం గావించెను; మహాభారతయుద్ధమున వారికి విరుద్ధముగ నెన్నఁడును శస్త్రధారణముం గావింపలేదు.

అప్పుడు భీష్మశిశుపాలుర కొకింత వాదము జరిగినది. శ్రీకృ

ష్ణుఁ డిప్పుడు నీ తేజమును హరించునని భీష్ముఁడు శిశుపాలుని ధిక్కరించెను. శిశుపాలుఁడు క్రోధముచే మండిపడుచు భీష్ము ననేకవిధముల దూషించుచుఁ దుట్టతుదకు "నీజీవితమీభూపాలమండలాధీనమైయున్నది. వీరు తలంచినచో నిమిషములో నిన్ను సంహరింపఁగలరు!" అనియెను. భీష్ముఁ డప్పటి క్షత్రియవీరులలో నెల్ల శ్రేష్ఠయోధుఁడు. అప్పుడు భీష్ముఁడు కోపముతో "నేను వీరిని తృణసమానులుగఁగూడ బరిగణించుట లేదు" అనియెను. ఆమాట విని యచ్చటి మహారాజులందఱును గర్జించుచు నేకవాక్యముగా "ఈభీష్ముని పశువుంబోలి వధింపవలయును; కాదేని ప్రదీప్తహుతాశనదగ్ధునిం గావింపవలయును" అని విజృంభింపఁదొడంగిరి. అప్పుడుభీష్ముఁడు "ఏమిచేసెదరో చేయుఁడు. నేనిదిగో మీతలపైఁబదాఘాతముఁగావించెదను." అని యుత్తరమిచ్చెను. పరాక్రమముననఁగాని వివేచనముననఁగాని వృద్ధుఁడగు భీష్ముఁడుసామాన్యుఁడు కాఁడు. అప్పు డాతఁడు రాజులందఱంగాంచి వారి సంశయము సులభముగఁ దీఱుటకై యొకయుపాయముం జూపించెను. ఆతఁడు వారినుద్దేశించి "మంచిది. కృష్ణుని బూజించితి మని మీరు గోలపెట్టుచున్నారు. ఆతని శ్రేష్ఠత్వమును మీరు విశ్వసించుట లేదు. ఈయల్లరివలన నేమిలాభము ? ఆతఁడు మీయెదుటనే యున్నాఁడు. ఒకసారి పరీక్షింపఁగూడదా ? చావవలయునని తొందర కలవారొక్కసారి కృష్ణుని యుద్ధమున కాహ్వానించి చూడఁగూడదా!" అని యుద్బోధించెను.

ఆమాట విని శిశుపాలుఁ డూరకుండఁగలఁడా ? తోడనే యాతఁడు కృష్ణునిం గాంచి "రమ్ము! యుద్ధమునకురమ్ము!" అని పిలిచెను.

శ్రీకృష్ణుఁ డిప్పటికి మాటలాడెను. శిశుపాలునితోఁ గాదు. క్షత్రియుఁడైన కృష్ణుఁడిప్పుడుయుద్ధమున కాహూతుఁడయ్యెను. ఇఁకయు

ద్ధాముఖుఁ డగుట కవకాశము లేదు. మఱియు ధర్మానుసారముగా యుద్ధమునకుఁ బ్రయోజనముకూడ నున్నది. అప్పుడు శ్రీకృష్ణుఁడు సభాసదు లగురాజులనందఱను సంబోధించి శిశుపాలుఁడు తనకుఁగావించినయపకారముల నన్నిటిని నొక్కొక్కటిగా వెల్లడించి "ఇంతకాలమువఱకు నేనీతని క్షమించితిని. ఇఁక క్షమింపఁజాలను" అని చెప్పెను.

ఈకృష్ణుని యిప్పటి సంభాషణములో నాతఁడుతనమేనత్తప్రార్థనము ననుసరించియే శిశుపాలునిసర్వాపరాధములును క్షమించినట్లు చెప్పియున్నాఁడు. ఇదివఱకుఁ జెప్పినట్లుగా నీసంగతికూడ నేల ప్రక్షిప్తము కాఁగూడదు?" అని పాఠకులు ప్రశ్నింపవచ్చును. దీని కుత్తరమేమనిన—ఇదియును బ్రక్షిప్త మైనను గావచ్చును. కాని ప్రక్షిప్తమని యోచించుటవలన నెట్టిప్రయోజనము సగపడుట లేదు. ఇం దస్వాభావవిషయ మేదియును లేదు. ఇంతేకాక యిది కేవలమును స్వాభావసిద్ధముగా నున్నది. తనకుమారుఁడు దుర్మార్గుఁడు; కృష్ణద్వేషి; కృష్ణుఁడో మిగుల బలవంతుఁడు. తలఁచుకొన్నచో శిశుపాలునవలీలగఁ జంపివైవఁగలఁడు. ఇట్టిస్థితిలో మేనత్త తనసోదరసూనుఁడగు శ్రీకృష్ణునింగూర్చి యీవిధముగా వేఁడుకొనెననుటలో నస్వాభావ మేమియును లేదు. క్షమాశీలుఁడగు శ్రీకృష్ణుఁడు స్వయముగనే శిశుపాలుని క్షమించినను, మేనత్తప్రార్థనముకూడ మనసునందుంచుకొనియుండును. ఇదియును స్వాభావమే—మఱియు మేనత్తకుమారుని వధించుట కేవలమును నిందనీయ మగుకార్యము. కృష్ణుఁడు తనమేనత్తమొగమునైనను జూచినాఁడు కాఁడని లోకు లనుకొందురు. వారి కాతఁడు ప్రత్యుత్తర మీయవలసి యుండెను. కావుననే కృష్ణుఁ డప్పు డిట్లు చెప్పుట యెంతయు సుసంగతమై యున్నది.

దీనితరువాతనే మరల నొకయస్వాభావసంఘటన మగపడుచు

న్నది. శ్రీకృష్ణుఁడు శిశుపాలసంహారమునకై తనచక్రాయుధమును స్మరించెను. స్మరించినంతనే చక్రమాతనిహస్తము నలంకరించెను. అప్పుడు శ్రీకృష్ణుఁ డాచక్రప్రయోగమున శిశుపాలునిశిరంబును ఖండించివైచెను.

ఈయస్వాభావికవ్యాపారము చరిత్రాంశమే యని యేపాఠకుఁడును నంగీకరింపఁజాలఁ డని మేమనుకొనియెదము. ఈశ్వరావతారుఁ డగుశ్రీకృష్ణుఁ డేమిచేసినను సంభవమే యని యెవ్వరైన భావింతురు గాక. చక్రమే శిశుపాలుని వధింపఁగలిగి యున్నప్పుడు శ్రీకృష్ణుని మానవశరీరధారణముతోఁ బ్రయోజన మేమున్నది? చైతన్యవిశిష్టమగు జీవముం బోలి శ్రీకృష్ణునియాజ్ఞానుసారముగాఁ జక్రము వచ్చుచుఁ బోవుచున్నట్లు కానఁబడుచున్నది. అట్లయినచో వైకుంఠము నందే యుండి విష్ణుఁడు దానిని శిశుపాలవధార్థమై యేల పంపఁగూడదు? ఇట్టికార్యములను నిర్వహించుటకై యాతఁడు మానవావతారము నెత్తుటవలన నేమిప్రయోజన మున్నది. ఈశ్వరుఁడు తన నైసర్గికనియముచేఁగాని, కేవలేచ్ఛామాత్రముచేఁగాని యొకమానవుని జంపఁజాలకయేనా యిట్లు మానవుఁడై యవతరించుట? అట్లవతరించియు నాతఁడు తనస్వీయశక్తిచే నొక్కమానవుని నిర్జింపఁజాలనంతటిహీనబలుఁ డగుటయేల? ఈశ్వరశక్తిమూలమున దైవతాస్త్రమును స్మరించి యేల తీసికొని రావలయును? ఈశ్వరుఁడే యింతటి యల్పశక్తుఁడైనచో మానవునకు నాతనికిని విశేషభేద మేమున్నది?—శ్రీకృష్ణుని యీశ్వరత్వము నందు మాకును నవిశ్వాసము లేదు. కాని మామనసునం దాతని మానవశక్తినిగూర్చియేగాని, యీశ్వరశక్తింగూర్చిన యాలోచన లేదు. ఆతఁడు మానవోచితశక్తిమూలముననే సర్వకార్యనిర్వహణముం గావించెనని మాయభిప్రాయము. ఈయస్వభావంబగుచ

క్రిస్మరణవృత్తాంతము కేవలము ప్రక్షిప్తము. శ్రీకృష్ణుఁడు మానవోచితయుద్ధమునందే శిశుపాలుని వధించినట్లు మహాభారతమునం దింకొకచోట నగపడుచున్నది. ఉద్యోగపర్వమునందు ధృతరాష్ట్రుఁడు శిశుపాలవధేతిహాసము నిట్లు చెప్పెను!—

"పూర్వము రాజసూయాయగసమయమునఁ జేదికరూశాది దేశాధీశ్వరులగు మహారాజులుసముచిత పరికరులై యసంఖ్య వీరపురుషులతోఁగలసి యొక్కచోఁ గూడియుండిరి. వారిలోఁ జేదిరాజతనయుండగు శిశుపాలుఁడు సూర్యునివలెఁ బ్రతాపశాలియు ధనుర్ధరశ్రేష్ఠుఁడు ను సంగ్రామమునం దజేయుఁడు నై యుండెను. భగవానుఁడగు కృష్ణుఁడు నిమిషములో నాతని బరాజితునింగావించి క్షత్రియవీరు లందఱికి నుత్సాహభంగముం గావించెను. మఱియు శిశుపాలుని సన్మానించుచు నాతనిపక్షమును వహించియున్న కరూశనాథుఁడు మొదలగు రాజులందఱును సింహపరాక్రముండగు శ్రీకృష్ణుని-రథారూఢునింగాంచి, చేదిపతిని బరిత్యజించి క్షుద్రమృగములవలెఁ బలాయితులైపోయిరి. అప్పుడు కృష్ణుఁడవలీలగా శిశుపాల సంహారంబుచేసి పాండవయశోగౌరవములను వర్ధిల్లఁజేసెను."

ఇందెచ్చటను జక్రప్రశంసయే యగపడుట లేదు. శ్రీకృష్ణుఁడురథారూఢుఁడై మానుషికంబగు సంగ్రామమున యథోచితముగఁ బ్రవృత్తుఁడై శిశుపాలుని జంపి యాతనియనుచరులఁ బరాభూతులం గావించిన ట్లగపడుచున్నది. ఒకగ్రంథమునం దొక్కవిషయమే రెండువిధముల వర్ణింపఁబడియున్నది. అందొకటి స్వభావముగను, మఱియొకటియస్వాభావముగను గానవచ్చుచున్నప్పు డస్వభావమును ద్యజించి స్వభావవిషయమునే యైతిహాసికముగా గ్రహించుట న్యాయమైయున్నది. పురాణేతిహాసములయందలి సత్యాన్వేషణముం గావింపఁగోరు

వారిసంగతిని జ్ఞప్తియందుంచుకొనవలయును. అట్లు కాకున్నచోఁ బరిశ్రమ యంతయును విఫలమైపోవును.

శిశుపాలవధసందర్భమును విమర్శించుపట్టున నందలిసంఘటనములలో రాజసూయమహాసభయందు సకలక్షత్రియలోకంబునెదుట శ్రీకృష్ణునిసర్వశ్రేష్ఠత్వము స్వీకరింపఁబడెనను విషయమే స్థూలముగా నైతిహాసికతత్త్వ మని మనమూహింపవలసి యున్నది. ఇందు శిశుపాలాదులగు కొందఱుక్షత్రియవీరులు క్రోధాన్వితులై యజ్ఞధ్వంసముం గావింప నుద్యోగించుటచే యుద్ధము తటస్థించెను. శ్రీకృష్ణుఁడు వారితో యుద్ధముచేసి వారినందఱను బరాజితులం గావించి శిశుపాలుని నిహతునింగావించెను. తరువాత యజ్ఞము నిర్విఘ్నముగఁ బరిసమాప్తం బయ్యెను.

శ్రీకృష్ణుఁడు కేవలమును యుద్ధమునంగీకరించుస్వభావము కలవాఁడు కాఁడు. అట్టిచో రణక్రియాదక్షు లగునర్జునాదిపాండవవీరులుండఁగా యజ్ఞవిఘ్నకారులతోఁ దాను యుద్ధము చేయుట కేల పూనుకొనియెను? ఆతఁడు రాజసూయమునం దెట్టికార్యభారమును వహించియుండెనో పాఠకు లించుక జ్ఞప్తికిఁ దెచ్చుకొన్నయెడల దీనికి సదుత్తరము బోధ కాఁగలదు. యజ్ఞరక్షణభారము కృష్ణునియందుండె నని యిదివఱకుఁ జెప్పియుంటిమి. అది యాతని కనుష్ఠేయకర్మమై యుండెను. అట్టివిధాయకకృత్యమును సాధించుటకే యాతఁడు యుద్ధమునకుఁ బూనుకొని శిశుపాలసంహారము కావించి యుండెను.

ఏ కా ద శ్శ ప రి చ్ఛే ద ము.



పాండవ వనవాసము.

రాజసూయము ముగిసినతోడనే కృష్ణుఁడు ద్వారకానగరమునకు వెడలిపోయెను. సభాపర్వమునం దిక నాతఁ డగపడుట లేదు. కాని యొక్కచోటమాత్ర మాతనిపేరు ప్రశంసితమై యుండెను.

ద్యూతక్రీడయందు యుధిష్ఠిరుఁడు ద్రౌపది నోడిపోయెను తరువాత ద్రౌపదీకేశాకర్షణమును సభామధ్యమున వస్త్రాపహరణమును జరిగెను. మహాభారతమునం దీభాగముంబోలిన కావ్యోత్కృష్టరచన ప్రపంచమునందలి యేసాహిత్యమునందును దుర్లభమై యున్నది. కాని మన మిప్పు డాలోచింపఁదగినది కావ్యవిషయము కాదు—ఇం దైతిహాసిక విశేష మేమయినను న్నదా లేదా యనుసంగతియే పరీక్షింపవలసి యున్నది. దుశ్శాసనుఁడు మహాజనసభామధ్యమున ద్రౌపదీవస్త్రాపహరణమును గావింపఁ బ్రయత్నించునప్పుడు నిరుపాయ యగుద్రౌపది తనమనంబున శ్రీకృష్ణునింగూర్చి ప్రార్థింపఁదొడంగెను. ఆ భాగము నిచ్చటఁ జూపెదము:—

"గోవింద ద్వారకావాసిన్ కృష్ణ గోపీజనప్రియ"

ఈవిషయమునఁ జెప్పవలసినదంతయు నిదివఱకే చెప్పియుంటిమి.

తరువాత వనపర్వము. ఆవనపర్వమున మూఁడుసారులుమాత్రము కృష్ణసాక్షాద్దర్శనము కానఁబడుచున్నది. పాండవులు వనంబునకుఁ బోయి రని విని వృష్ణిభోజాదు లందఱును వారిని జూడవచ్చిరి. వారితోఁ గృష్ణుఁడుకూడ వచ్చియుండెను. వనపర్వమునం దీరాకయే మొదటిసారి. కృష్ణుఁ డట్లు వచ్చియేయుండవచ్చును. కాని యీభాగమునందు వర్ణితమగువృత్తాంతముమాత్రము మహాభారతమున మొదటితరగ


తిరచనం బోలి యుండలేదు. రెండవతరగతి రచనవంటిదియును గాదు. చారిత్రికవిశేషముకూడ నిం దేమియును లేదు. కృష్ణుఁ డెచ్చటను గ్రోధావిష్టుఁ డైనట్లగపడుట లేదు. కాని యిప్పుడాతఁడు యుష్ఠిరుని యొద్దకు వచ్చి క్రోధోజ్జ్వలుఁ డయిపోయెను. ఎట్టికారణమును లేదు. అచ్చటికెట్టి శత్రువును వచ్చి యుండలేదు. ఎవ్వరు నేమియు ననియైన నుండలేదు. కేవలము దుర్యోధనాదులను నాశనము చేయవలయు ననియే యింతకోపము! కృష్ణునియాకోపము యుధిష్ఠిరుఁ డెన్నియో విధములఁ బ్రస్తుతించినఁగాని తగ్గలేదు. మహాభారతయుద్ధమునం దస్త్రధారణము చేయ నని కృష్ణుఁడు ప్రతిజ్ఞ చేసినట్లు వ్రాసినకవి యిట్లువ్రాసియుండఁడని నిశ్చయముగాఁ జెప్పవచ్చును. తరువాతఁ గృష్ణుఁడు "నేనున్నచో నింతపనిజరగునా? నేనప్పు డింటియొద్ద లేను" అని చెప్పెను. అప్పుడు యుధిష్ఠిరుఁడు కృష్ణుఁ డెచ్చటికిఁ బోయెనో తెలిసికొనఁగోరెను. దానిపై సాళ్వవధవృత్తాంతము వెలువడియెను. కృష్ణుఁడు సాళ్వునితో యుద్ధమునకుఁ బోవలసి వచ్చినట్లు చెప్పెను. ఇది యాకయద్భుతకథ- సౌభ యనునది సాళ్వునిరాజధాని- అది యాకాశమున కెగసి తిరుగుచుండును. సాళ్వుఁడు దానియందుండియే యుద్ధము చేయును. అట్టియవస్థయందే కృష్ణునితో యుద్ధముజరిగెను. ఆయుద్ధసమయమునఁ గృష్ణునకుఁ జాలకష్టములు తటస్థించెను. సాళ్వుఁడు మాయావసుదేవుని గల్పించి కృష్ణుని యెట్టయెదుట వధించెను. అదిచూచి శోకావేగముచేఁ గృష్ణుఁడు మూర్ఛితుఁడయ్యెను. ఇది జగదీశ్వర ప్రకృతియునుగాదు; మఱియెట్టిమానుషప్రకృతియును గాదు. అనుక్రమణికాధ్యాయమునందుఁగాని పర్వసంగ్రహాధ్యాయమునందుఁగాని యీ వృత్తాంతముంగూర్చిన యెట్టిప్రసంగమును లేదు. ఇట్టికథనుగుఱించి యే పాఠకుఁడును సమాలోచనముం గావింపఁగోరెఁ డని మేము విశ్వసించుచున్నాము.

తరువాత రెండవసారి సశిష్యుఁడగుదుర్వాసునకు విందుచేయు సందర్భమునఁ గృష్ణదర్శనమైనది. అది కేవలము నస్వభావముగ నున్నది. అనుక్రమణికాధ్యాయమునం దాకథయున్నను దాని కెట్టియైతిహాసికవిశేషమును లేదు. కావున నదియును మాకు విమర్శనీయము కాదు.

పిమ్మటమూఁడవసారి వనపర్వాంత్యభాగమున మార్కండేయ సమస్యాపర్వాధ్యాయమున మరలఁ గృష్ణుఁ డగపడుచున్నాఁడు. పాండవులు కామ్యకవనమునకు వచ్చియుండిరని విని కృష్ణుఁడు వారిని మరలఁ జూడవచ్చెను. ఈసారి యొక్కఁడును రాలేదు. తనచిన్నరాణియగు సత్యభామతోఁగూడ వచ్చెను. ఈయధ్యాయమొక పెద్దగ్రంథమని చెప్పినను జెప్పవచ్చును. కాని మహాభారతముతో సంబంధించినకథదానియం దేమియును లేదు. అది యంతయును బ్రక్షిప్తమనియే తోఁచుచున్నది. పర్వసంగ్రహాధ్యాయమునందుమార్కండేయసమస్యాపర్వాధ్యాయప్రశంసయున్నమాట నిజమే కాని యది యనుక్రమణికాధ్యాయమున లేదు. మహాభారతమునందలి యొకటిరెండు త్రరగతులరచనములతో దీని కెట్టిసాదృశ్యమును లేదు. కాని యిది మౌలికమహాభారతభాగ మగునో కాదో విమర్శించుటకుఁ గూడ మా కెట్టిప్రయోజనమునుగ పడుటలేదు, ఏమనిన—కృష్ణుఁడిందు జేసినపని యేదియును లేదు. ఆతఁడు వచ్చి యుధిష్ఠిరుఁడు ద్రౌపది మొదలగువారికిఁ గొన్ని మంచిమాటలనుమాత్రము చెప్పెను. మఱియువారివలనఁ గొన్నిప్రియవచనములను వినియెను. తరువాత వారును వీరునుఁ గలసి మార్కండేయునికల్పనాకథల నన్నిటిని బాగుగ నాలకించిరి. ఆకథలు పూర్తియైన తరువాత సత్యాద్రౌపదుల కించుక సంభాషణము జరిగెను. పర్వసంగ్రహాధ్యాయమున ద్రౌపదీ సత్యభామా సంవాదము పేర్కొనఁబడినది.

కాని యనుక్రమణికాధ్యాయమునం దీప్రసంగమే లేదు. ఇది యెట్లు ప్రక్షిప్తమో. యింతకు ముందే చెప్పియున్నాము.

తరువాత విరాటపర్వము. విరాటపర్వమునఁ గృష్ణుఁ డగపడ లేదు. అంత్యభాగమున మాత్ర ముత్తరావివాహ సమయమున నాతఁడు వచ్చియుండెను. అప్పుఁ డాతఁడు చెప్పిన విషయము లన్నియు నుద్యోగపర్వమునం దున్నవి. ఉద్యోగపర్వమునందుఁ గృష్ణునిగూర్చి యనేక విషయము లున్నవి. వానిని క్రమముగా సమాలోచనము గావించెదము.



శ్రీరామచంద్ర.

శ్రీకృష్ణచరిత్రము

ద్వితీయ సంపుటము.

పంచమ ఖండము.

ఉపక్రమణిక.

సర్వభూతాత్మభూతాయ, భూతాదినిధనాయచ
అక్రోధద్రోహమోహాయ తస్మై శాంతాత్మనే నమః.

శాంతిపర్వము ౪౭ అధ్యాయము.

ప్రథమ పరిచ్ఛేదము.

మహాభారత యుద్ధోద్యోగము.

ఇప్పు డుద్యోగపర్వవృత్తాంతముంగూర్చి యాలోచింపవలసి యున్నది.

సమాజమునం దపరాధు లుందురు. మానవు లెల్లప్పుడును బరస్పరము నపరాధములం గావించుచుందురు. అట్టియపరాధముల నడంచుటయే సమాజమునకుం బ్రధానకార్యము. రాజనీతి, రాజదండము, వ్యవస్థాశాస్త్రము, ధర్మశాస్త్రము, చట్టము, న్యాయస్థానము మొదలగువాని ముఖ్యోద్దేశ మంతయు నిదియే.

అపరాధివిషయమున నెట్లు వ్యవహరింపవలయునో యీసంగతింగూర్చి నీతిశాస్త్రమున రెండుమతము లున్నవి. దండమూలమున నఁగా శిక్షచేసి దోషము నడఁగించుట యొకమతము. అపరాధమును క్షమించుట రెండవమతము. శిక్ష, క్షమ యనునీరెంటికిని బరస్పర విరోధ మున్నది. అందుచేనీరెండుమతములును సత్యములు గానేరవు. మఱియు నీరెంటిలో నేయొక్కమతమునైనను గేవలమును బరిహరించుట కవకాశము లేదు. సకలాపరాధములనుగూడ క్షమించినచో సమాజ మొక్కసారిగా ధ్వంసమైపోవును. మఱియు సకలాపరాధులును శిక్షితులైనచో మానవులకుఁ బశుత్వము సంప్రాప్తించును. కావున శిక్షాక్షమలసామంజ్యసమే నీతిశాస్త్రమునందలి యొకవిధమగునతికఠినతత్త్వమని తోఁచుచున్నది. ఆధునికసుసభ్యులగు యూరోపియను లింతవఱకు నీసామంజస్యమును వెలువరింపఁజాలకయే యుండిరి. ఐరోపీయులక్రీస్తుమతము సకలాపరాధములను క్షమింపవలయు నని బోధించుచున్నది. వారి రాజనీతి సకలాపరాధులను శిక్షింపవలయు నని విధించుచున్నది. వారికి మతముకంటె రాజనీతియే ప్రధానమైనది. అందుచే యూరపుఖండమున క్షమాగుణము లుప్తప్రాయమైపోయినది; బలప్రయోగమే ప్రచండత్వముం గాంచినది.

బలక్షమాగుణంబుల యథార్థసామంజస్యమే యీయుద్యోగపర్వమునందలి ప్రధానతత్త్వము. శ్రీకృష్ణుఁడే యాతత్త్వమునను మీమాంసకుఁడు—ఈయుద్యోగపర్వమునకుఁ బ్రధాననాయకుఁడు కూడ శ్రీకృష్ణుఁడే. బలక్షమాప్రయోగసంబంధమున నాతఁడెట్టి యాదర్శకార్యములను గావించి యుండెనో మన మిదివఱకే చూచి యున్నాము. ఆతఁడు తనకుమాత్రమే యనిష్టముం గూర్చువారిని క్షమించెను; లోకమున కనిష్టముం గూర్చువారినిమాత్రము బలప్రయోగ

పూర్వకముగ దండించెను. కాని యీవిధానమునకు వ్యతిరేకముగఁ గూడఁ గొన్ని కార్యములు జరిగిన ట్లనేకస్థలములయందుఁ గానవచ్చుచున్నది. కొన్ని కార్యములందు బలమునుపయోగింపవలయునో, క్షమను పయోగింపవలయునో తెలిసికొనుట దుస్సాధ్యముగా నున్నది— ఎవ్వరైనమనయాస్తి నపహరించి కొనిపోయి రని భావింతము తత్సంపత్తిని గాపాడుకొనుట సామాజికధర్మము. అందఱునుగూడఁ దమతమ సంపదభిక్షణవిషయంబున విముఖులై యున్నచో నచిరకాలములోనే సమాజము విధ్వస్తమైపోవును. కావున నపహృతసంపత్తి నుద్ధరించుట విధాయకకృత్యముగాఁ దోఁచుచున్నది. కాని యిట్టిపరిస్థితి సంభవించి న్యాయస్థానసాహాయ్య మేమియు లభింపనప్పుడు బలప్రయోగము కావించుట ధర్మసంగత మగునా? బలక్షమాసామంజస్యసంబంధమునందిట్టితర్కవితర్కములు కలుగుచునే యుండును. సాధారణముగ మనమునందుఁ దలఁచుగా బలవంతుఁడు బలప్రయోగమునే గావించుచుండుటయు, దుర్బలుఁడు క్షమాభిముఖుఁడై మెలంగుటయుఁ గానంబడుచున్నది. కాని బలవంతుఁడును, క్షమావంతుఁడునుగూడ నగువానికర్తవ్యమేమి? ఈమీమాంస యుద్యోగపర్వారంభమునందే కృష్ణవాక్యములవలన మనము తెలిసికొనఁగలము.

పాండవులు శకునితో జూదమాడియోడిపోయి తమరాజ్యమును దుర్యోధనునకొసంగ తాముపండ్రెండేండ్లు వనవాసమును నొకయేఁడజ్ఞాతవాసమును జేయుటకు బాధ్యులైనసంగతి పాఠకులకిదివఱకే తెలిసియే యుండవచ్చును. ఒకవేళ నజ్ఞాతవాససమయమున బైలుపడినచో వారికి మరల రాజ్యగ్రహణాధికారము లేకుండఁబోవును; మఱియు వారు మరల పండ్రెండుసంవత్సరములు వనవాసము చేయవలసివచ్చును. అజ్ఞాతవాసము ముగించి వారిట్లు కున్నచో దుర్యోధనుకడనుండి మరల వారికి రాజ్యము లభింపవలె

చెను. ఇప్పుడు వారు ద్వాదశవర్షవనవాసమును బూర్తిగావించి విరాటనగరమధ్యమునం దొకయేఁ డజ్ఞాతవాసమును గూడఁ గావించిరి. ఆవత్సరమధ్యమునం దెవ్వరును వారిని గ్రహింపలేదు. అందుచే వారు సుయోధనునియొద్దనుండి తమరాజ్యమును గైకొనుటకు న్యాయముగను ధర్మమునను నధికారులైయుండిరి. కాని సుయోధనుఁడు రాజ్యమును మరల వారికొప్పగించునా? ఒప్పగింపఁ డనియే యూహింపవలయును. అట్టిస్థితిలో నేమి చేయవలయును? యుద్ధము చేసి వారిని వధించి రాజ్యమును బునరుద్ధరించుట కర్తవ్యము గాదా ?

అజ్ఞాతవాసవత్సర మతీతమైనతోడనే పాండవులు విరాటునకుఁ దమపరిచయమును నెఱింగించిరి. విరాటుఁడును బాండవులఁ దెలిసికొని పరమానందభరితుఁడై తనతనయ యగునుత్తర నర్జునపుత్త్రుడగునభిమన్యున కొసంగి వివాహము కావించెను. ఆవివాహమున కభిమన్యుని మేనమామ లగుకృష్ణబలరాములును, నితర యాదవులును గూడ వచ్చియుండిరి. మఱియుఁ బాండవులమామయగుద్రుపదుఁడును నితరబాంధవులునుగూడ వచ్చిరి. వారందఱును విరాటుని సభామందిరమున నాసీనులైయున్నప్పుడు పాండవరాజ్య పునరుద్ధరణమును గూర్చి ప్రసంగమయ్యెను. అప్పుడు రాజులందఱును శ్రీకృష్ణునివంకఁ దృష్టిపాతముఁ గావించుచు మౌనము నవలంబించి యుండిరి. ఆసమయమున శ్రీకృష్ణుఁడు రాజులను సంబోధించి పూర్వావస్థలను, బూర్వసంఘటనములనుగూర్చి యథారూపముగ నుగ్గడించి యనంతరము "ఇప్పుడు కౌరవులకును, బాండవులకునుగూడ హితకరంబును ధర్మ్యంబును, యశస్కరంబును, నుపయుక్తంబును నగుపద్ధతిని మీరందఱు నాలోచించి నిశ్చయింపవలయును" అని చెప్పెను.

రాజ్యపునరుద్ధరణమున కేమి చేయవలయునో యాప్రశ్నము

గావింపవలయునని శ్రీకృష్ణుం డెప్పుడు చెప్పియుండలేదు. ఏమనిన — హితమునకును, ధర్మమునకును, యశంబునకును విరుద్ధమగు రాజ్యమును నెవ్వరును వాంఛింపఁ దగదని యాతని యుద్దేశము. అందుచేతనే శ్రీ కృష్ణుండు మరల నొకసారి "ధర్మరాజగు యుధిష్ఠిరుఁ డధర్మాగతం బగు సురసామ్రాజ్యమునైనను వాంఛింపఁ బోఁడు; కాని ధర్మార్థసంగతం బగు నేకగ్రామాధిపత్యమునైనను నధికతరంబుగ నభిలషించుచుండును." అని యుగ్గడించి యుండెను. ఆదర్శపురుషుండు సన్న్యాసియై యుండుట వలన లాభము లేదనియు, నాతఁడు సంసారియై పరిభ్రష్టుఁడై యుండవలయుననియు మీకింతకుమున్దే చెప్పియుంటిని. అందు కితఁడే యాదర్శస్వరూపుఁడు. అధర్మాగతంబగు సురసామ్రాజ్యమునైనను నేను కామింపఁబోను; కాని ధర్మానుసారముగ నేను దేని కధికారినో దాని యందలి సూక్ష్మతమాంశమునైనను వంచకులను విడువఁజాలను; అట్లు విడిచినచో విచారము నాకే కాదు; నాకంటెవలన విచారమే లేకుండ వచ్చును; కాని సమాజవిధ్వంసనకారణంబగు రూపం బగు పాపము మాత్రము నిశ్చయముగ నన్ను స్పృశింపక మానదు.

తరువాతఁ గృష్ణుండు కౌరవుల లోభత్వమును, శఠత్వమును గూర్చియు, యుధిష్ఠిరుని ధార్మికత్వమును గూర్చియు నుగ్గడించి యూరకుండక సమరాల సంబంధమేర్పడుటకై బాగుగ నాలోచించి యొక మార్గమును నిశ్చయింపవలయు నని రాజులందఱిని ప్రార్థించెను. దుర్యోధనుఁడు యుధిష్ఠిరున కర్ధరాజ్యమును న్యాయముగా నొసంగు నట్లు సంధి సేయుటకుఁ దగిన ధార్మికశ్రేష్ఠుఁడగు నొకదూత నాతనియొద్దకుఁ బంపుట యుచిత మనికూడ శ్రీకృష్ణుఁడు తనయభిప్రాయము నొక్కించుక వ్యక్తపఱిచెను. కృష్ణుని నిశ్చితాభిప్రాయము సంధియే కాని యుద్ధము కాదు. అర్ధరాజ్యప్రాప్తిమాత్రముననే సంతుష్టిఁ జెంది సం

చేసికొనవలయు నని యాతఁడు సూచించెను. ఏవిధముచేనైనను యుద్ధము తప్పనియెడలఁ దానట్టియుద్ధమున నరశోణితమును బ్రవహించుటకై యెట్టియాస్త్రము నుపయోగింపనని యాతఁడు శపథముగూడఁ జేసి యుండెను. దీనినిబట్టి చూడఁగా శ్రీకృష్ణుఁడు యుద్ధమునిన నెంతవఱకు విముఖుఁడై యుండెనో బోధ యగుచున్నది

కృష్ణుఁ డిట్లు చెప్పినతరువాత బలదేవుఁడు కూడ వాని వాక్యముల నామోదించి జూదమాడినందుకు యుధిష్ఠిరు నించుక నిందించెను, మఱియు నాతఁడు తుట్టతుదను “ సంధిరూపమున సంపాదితమగునర్థమే సార్థకము, కాని సంగ్రామమూలమున నుపార్జిత మగునర్థమమాత్రము కేవలము నిరర్థకమైనది ” అని తనయభిప్రాయమును వెలియఁజేసెను. బలదేవుఁడు సురాపాయియైనను నాతని యీవాక్యములు సువర్ణాక్షరములుగా లిఖించుకొని యాగపుఖండమునఁ బ్రతిగృహమునందును నుంచుకొనఁ దగినవిగా నున్నవి. అట్లు గావించినచో మానవజాతి కించుక శ్రేయోదాయకముగా నుండును.

బలదేవునియుపన్యాసము ముగిసినంతనే సాత్యకి లేచెను. (ఆ కాలమునందుఁగూడఁ “Parliamentary procedure” పార్లమెంటరీప్రొసీజరున్నదని పాఠకులు తెలిసికొనవలయును.) అప్పుడు సాత్యకి ప్రతివాదమును గావించెను. ఆతఁడు స్వయముగా మహాబలవంతుఁ డగుశూరపురుషుఁడు. శ్రీకృష్ణునకు శిష్యుఁడు; మఱియు మహాభారతరణంబునఁ బాండవపక్షవీరులలో నర్జునాభిమన్యులతరువాత నాతఁడే ప్రశంసింపఁదగినవాఁడు. కృష్ణుఁడు సంధిప్రస్తావముం గావించుటచే సాత్యకి యేమనుటకును సాహసింపఁజాలకపోయెను. కాని యాతఁడు బలదేవునివాక్యములను విని క్రుద్ధుఁడై యాతని ననేకవిధముల నిందించెను. బలదేవుఁడు యుధిష్ఠిరుని ద్యూతవిషయమున నిందించినందుకు

సాత్యకి [illegible] పించుచుఁ "పాండవులకు [illegible] రాజ్యభా గము ను ప్రత్యర్పణము [illegible] పనులంబును [illegible] ముగ [illegible] గావింపవలసినదే" అని [illegible] ప్రకటించెను.

తరువాత [illegible] [illegible] [illegible]. అతఁడు సాత్యకిమతమునే యవలంబించెను [illegible] [illegible] యుద్ధమునకుఁ బ్రయత్నింపవలయు ననియు, సైన్యమును [illegible] యనియు, [illegible] రాజమండలికంతకు దూతను బంపవలయు ననియుఁ [illegible] చెను. [illegible] దూతను బంపవలయు [illegible] వాతఁడు [illegible] జేసెను.

[illegible] [illegible] [illegible]. [illegible] [illegible] రాజు [illegible], [illegible] [illegible]. [illegible] [illegible] [illegible] మాటలను [illegible] [illegible] [illegible]. కాని యుద్ధమే జరిగినచో నేను [illegible] [illegible] [illegible] యుద్ధమును [illegible]. [illegible] [illegible] [illegible] ను "కురుపాండవులకు [illegible] [illegible] [illegible] [illegible] మానవులను [illegible] [illegible] వింపఁజాలము. మేమందఱము [illegible] వివాహమునకు [illegible] వచ్చితిమి. నీవును [illegible] వచ్చితివి. ఇప్పుడు వివాహకార్యము [illegible] [illegible]. పరమార్థమునకై [illegible] [illegible] [illegible] కు వారము పోవచ్చును." అనియెను. పెద్దవాఁడగువానిని [illegible] [illegible] నింకేమనవలయును? తరువాత శ్రీకృష్ణుఁడు "[illegible] [illegible] ర్యోధనుఁడు సంధి కంగీకరింపనిచో [illegible] [illegible] దూ తను బంపినతరువాతఁ [illegible] [illegible] [illegible]

చ్చును (అనఁగా నీయుద్ధమునందుఁ బ్రవేశించుట నా కెంతమాత్రమును నిష్టము లేదు)" అని చెప్పి ద్వారకకు వెడలిపోయెను.

దీనినిబట్టి శ్రీకృష్ణుఁడు యుద్ధమునకుఁ గేవలమును వ్యతిరేకపక్షమువాఁ డైయున్నట్లు కానవచ్చుచున్నది. మఱియు నాతఁడు కురుపాండవులయెడఁ బక్షపాతశూన్యుఁ డై యుండెను. ఆయుభయపక్షములయందును దనకుఁ దుల్యసంబంధమున్నట్లు స్వయముగాఁ జెప్పి యుండెను. తరువాతిసంఘటనమునుబట్టి యీవాక్యములకుఁ బ్రబలప్రమాణము కానవచ్చుచున్నది.

ఇరుదెగలయందును యుద్ధప్రయత్నములు జరుగుచుండెను. సేనలు సంగ్రహింపఁబడుచుండెను. రాజులకడకు దూతలు పంపఁబడుచుండిరి. ఆయుద్ధమునందుఁ గృష్ణసాహాయ్యము నర్థించుటకై యర్జునుఁడు స్వయముగా ద్వారకానగరమునకుఁ బోయెను. దుర్యోధనుఁడు కూడ నట్లే చేసెను. ఆయిరువురు నొక్కదినముననే యొక్కసమయముననే శ్రీకృష్ణునియొద్దకు వచ్చిరి. అప్పుడుజరగినవృత్తాంతమంతయును మహాభారతమునుండి యథారూపమున నీక్రిందఁ బొందుపఱుచుచున్నాను:—

"వాసుదేవుఁ డప్పుడు శయ్యపై నిదురించుచుండెను. మొట్టమొదట దుర్యోధనుఁడాశయనమందిరమునఁ బ్రవేశించి కృష్ణుని తలవైపుననున్న యొకయుత్తమాసనముపైఁ గూర్చుండి యుండెను. తరువాత పిందరినందనుఁ డగునర్జునుఁడు వచ్చి వినయముతోఁ గృతాంజలియై యాదవేశ్వరునిపాదసమీపమున నాసీనుఁ డై యుండెను పిమ్మట శ్రీకృష్ణుఁడు మేల్కాంచి ముందుగా నర్జునుని, దరువాత దుర్యోధనుని గాంచి కుశలప్రశ్నంబు చేసి సగౌరవంబుగ వారి యాగమనకారణంబునడిగెను. అప్పుడు దుర్యోధనుఁడు హాసవికసితవదనముతో "కృ

యాదవా! ఇట్లు జరుగనున్న యుద్ధమునందు నాకు సాహాయ్యము నొసంగుము. మేమిద్దఱము నీకు సమానబంధువులము, నిన్నిద్దఱము నేనే ముందుగా వచ్చి నిన్ను దర్శించితిని. పూర్వజనులు మొదట వచ్చిన వారికే సహాయము చేయవలెనని చెప్పిన శాస్త్రము; నాకు సహాయము చేసిన నీవు సదాచారమును పాలింపవలయును" అనెను. అప్పుడు శ్రీకృష్ణుఁడు "ఓ మహావీరా! నీవు ముందుగనే వచ్చితివనుటకు నా కేమియు సందేహము లేదు. కాని నేను నిద్దుర మేల్కొనినపుడు మొట్టమొదట కిరీటిని చూచితిని. అందుచే నేనిప్పుడు మీ యిద్దఱికిని సాహాయ్యము చేయవలయును. కాని మొట్టమొదట చిన్నవారికోరిక తీర్పవలయు ననుట సుప్రసిద్ధాచారము. కావున ఇప్పుడు అర్జునుఁడే ముందుగఁ గోరుకొనుట యుచితము" అని చెప్పి ధనంజయునివైపు తిరిగి ధనంజయునితో "ఓ కౌంతేయా! ముందుగా నీవే కోరుకొనుము. నాతో సమానులగు పదివేలసంఖ్యగల నారాయణగోపాలురొకపక్షము—సమరవిముఖుఁడను, నిరస్త్రుఁడనైన నేనొకపక్షము. వారు యుద్ధము చేయుదురు; నేను చేయను. ఈ రెంటిలో నేదియైనను దానిని కోరుకొనుము" అని చెప్పెను. అప్పుడు ధనంజయుఁడు వెంటనే శత్రుమర్దనుఁ డగుజనార్దనుండు యుద్ధము సేయకున్నను నిరాయుధుఁడైయుండినను వానినే కోరుకొనెను. సుయోధనుఁడు శ్రీకృష్ణుని సమరవిముఖునిగా భావించి నారాయణగోపాలబలమును సంతోషపూర్వకముగఁ బడసి మరలిపోయెను."

ఉద్యోగపర్వములోని యీభాగమును విమర్శించినచో మన కీక్రిందిసంగతులు తెలియవచ్చుచున్నవి.

మొదటిది:—ఎప్పుడైనను ధర్మార్థసంగతం బగు తమ యధికారమును బరిత్యజించుట కర్తవ్యము కాకపోయినను, బలప్రయోగము కంటె శాంతివలన జయమే సర్వోత్కృష్టకార్యమనియును, నట్టిచో బలమును బ్రయోగించుటకంటె నయ్యధికారమునం దర్ధభాగమును ద్యజించుటయే యుక్తమనియును శ్రీకృష్ణుని యభిప్రాయము.

రెండవది:—కృష్ణుఁడు సర్వసమదర్శి. ఆతఁడు పాండవపక్షపాతి యనియు గౌరవవిపక్షుఁడనియు సామాన్యాభిప్రాయమున్నది. కాని పైసంగతులబట్టి చూడఁగా నాతఁడీరెండుపక్షములయెడలను సంపూర్ణముగాఁ బక్షపాతశూన్యుఁడని కానఁబడుచున్నది.

మూఁడవది:—ఆతఁడు స్వయముగ నద్వితీయవీరపురుషుఁడయ్యును యుద్ధవిషయమున విశేషవిరక్తుఁడై యుండెను. మొట్టమొదట నాతఁడు యుద్ధము తటస్థింపకుండుపద్ధతినే బోధించెను! తరువాత యుద్ధము తటస్థించి దానిని దప్పించుట యసంభవమైనప్పుడు తానెవ్వరిపక్షమునందైనను నిరాయుధుఁడుగనే యుండవలయునని శ్రీకృష్ణుఁడు శపథముచేసికొనియెను. ఇట్టిమహాత్మ్యము మఱియే క్షత్రియవీరుని యందైనను గానవచ్చుట లేదు. జితేంద్రియుఁడగు భీష్మునియందుఁ గూడ నిట్టి గొప్పతనము లేదు.

తరువాతఁగూడ శ్రీకృష్ణుఁడీయుద్ధము నెట్లయిన లేకుండఁ జేయవలయు నని యెన్నియోప్రయత్నములను జేసినట్లగపడుచున్నది. ఇందాశ్చర్యవిషయ మేమనిన:—సకలక్షత్రియవీరులందును శ్రీకృష్ణుఁ డొక్కఁడే సమరవిముఖుఁడై యుండెను. ఆతఁడొక్కఁడే సర్వత్ర సమదర్శనుఁడై యుండెను. ఇట్టిస్థితిలో నాతఁడే యుద్ధమునకుఁ బ్రధానకారణుఁ డనియు, ననుష్ఠాత యనియుఁ బాండవపక్షమునఁ బ్రధానతాంత్రికుఁ డనియును లోకులు భావించుచున్నారు. అందుచేతనే

యింతవిస్తరముగా శ్రీకృష్ణచరిత్రమును విమర్శింపవలసివచ్చినది. తరువాత నర్జునుఁడు నిరాయుధుఁ డగు శ్రీకృష్ణుని యుద్ధమునం దేకార్యమున నియోగింపవలయు నని యాలోచించి యాతనిం దనకు రథసారథిగా నుండవలయు నని ప్రార్థించెను. క్షత్రియవీరులగువారికి సారథ్యము చేయుట యనునది యతినీచకార్యము. కర్ణునకు సారథిగా నుండవలయునని శల్యుని బ్రార్థించినప్పు డాతఁడు విశేషముగఁ గోపించియున్నాఁడు. కాని యాదర్శపురుషుఁ డగువాఁ డెప్పుడు నహంకారశూన్యుఁడై యుండును. కావుననే శ్రీకృష్ణుఁ డర్జునునకు సారథిగా నుండుట కప్పుడే యంగీకరించెను. ఆతఁడు సర్వదోషశూన్యుఁడు! సర్వగుణాన్వితుఁడు!

ద్వితీయపరిచ్ఛేదము.

సంజయయానము.

ఉభయపక్షములవారును యుద్ధోద్యోగముం గావించుచుండిరి. ఇటు ద్రుపదాలోచనము ననుసరించి యుధిష్ఠిరుఁడు సంధిప్రస్తావముం గావించుటకై ద్రుపదపురోహితుని ధృతరాష్ట్రసభకుఁ బంపించెను. కాని యాపురోహితుఁడుమాత్రము కృతప్రయత్నుఁడు కాఁజాలకపోయెను. ఏమనిన ... వాఁడిసూదిమొనమోపినంతటినేలయైనను పాండవులకు మరల నిచ్చుటకు సుయోధనుఁ డంగీకరింపలేదు. ఒకవంక భీమార్జునులును * శ్రీకృష్ణుడు ననిన ధృతరాష్ట్రుఁడు చాల భయపడుచుండెను. అందుచేతనే పాండవులు యుద్ధమునఁ బ్రవేశింపకుండునట్లు

---

* ఈవిషయమున విపక్షులుకూడ శ్రీకృష్ణునిసర్వప్రధానత్వము నంగీకరించిన ... గా నుద్యోగపర్వమునం దనేకప్రమాణము లున్నవి. ధృతరాష్ట్రుఁడు పాండవపక్షీయులం గూర్చి వేర్వేఱుగ నుగ్గడించుచుఁ దుట్టతుదకు వృష్ణిసింహుఁ డగుకృష్ణుఁ డు

తి నుపదేశించుటకై ధృతరాష్ట్రుఁడు తనయమాత్యుఁడగు సంజయుని పాండవుల చెంతకుఁ బంపెను. "మీరాజ్యమును మేమధర్మముగా నపహరించి కైకొంటిమి. కాని మీరుమాత్రము దానికొఱకు యుద్ధమునకుఁ గడంగవలదు. యుద్ధమనునది కేవలము ననుచిత మగుకార్యము" అని యీవిధముగా నసంగతవాక్యముల నెంతటిసిగ్గులేనివాఁడైనను జెప్పుటకు సాహసింపఁగలఁడా ? కాని దూతగాఁ బోయినవానికి సిగ్గేమున్నది ? కావుననే సంజయుఁడు పాండవసభాస్థానమునకుఁ బోయి దీర్ఘోపన్యాసముం గావించెను. ఆయుపన్యాసమునందలిస్థూలమర్మమేమనినః—"యుద్ధము చాల గురుతర మగునధర్మకార్యము. మీరట్టియధర్మకార్యమునఁ బ్రవృత్తులైయుంటిరి. అందువలన మీరధార్మికు లగుచున్నారు" యుధిష్ఠిరుఁడు దానికిఁ బ్రత్యుత్తరముగా ననేకవచనములను జెప్పియుండెను. వానిలో మనకుఁ బ్రయోజనీయములగుకొన్నిటి నీక్రిందఁ జూపుచున్నాము—

"ఓసంజయా! ఈపృథివియందు దేవతలకుఁగూడ వాంఛనీయంబులగునను స్తసంపదలు నున్నవి. వానినిగాని, ప్రాజాపత్యమునుగాని,

---

ర్వారిపక్షమున సహాయుఁడై యుండునో వారిపరితాపమును సహించుట యెవ్వరికి సాధ్యమగును? అట్టికృష్ణుఁ డిప్పుడు పాండవులకు రక్షకుఁడై యుండెను. ఎంతటివిజయాభిలాషి యగుశత్రువైనను యుద్ధమున సమానముగ నాతని నెదిరించి నిలువఁగలఁడా? (౭౦ అధ్యాయము) సంజయా! కృష్ణుఁడు పాండవులకొఱకుఁ బ్రకటించినపరాక్రమముంగూర్చి వినియుంటిని. అతనిచర్యలను నిరంతరము స్మరించుకొనుటచే నాహృదయమునకు శాంతిలేదు. కృష్ణుఁడగ్రగామియై యుండఁ బాండవపక్షమును నిర్జించుసమర్థు లెవ్వరున్నారు. కృష్ణుఁడర్జునునకు సారథిగా నుండుట కంగీకరించె ననివిని నాహృదయము కంపించిపోవుచున్నది." అనియెను. మఱియు నింకొకచోట నాతఁడేకాని కేశవుఁ డధృష్యుఁడు; లోకత్రయాధీశ్వరుఁడు; మహాత్ముఁడు. కేవలము నాతఁడు సర్వలోకవరేణ్యుఁడు. ఏమానవుఁ డాతనియెట్టయెదుట నిలువఁబడఁగలఁడు" అని యీవిధముగా నెన్నియో సంగతులను జెప్పెను.

స్వర్గసుఖమును గాని, బ్రహ్మలోకమును గాని, మఱి దేనిని గాని యధర్మానుసారముగాఁ బడయుటకు నేను వాంఛించుట లేను. ఎట్లయినను శ్రీకృష్ణుఁడు ధర్మపరిపాతయు, నీతిసంపన్నుఁడును, బ్రాహ్మణగణంబుల కుపాసకుఁడు గూడ నైయున్నాఁడు. ఆతఁడు కౌరవపాండవకులంబులు రెంటికిని హితాకాంక్షియును, మహాబలపరాక్రాంతులగు నసంఖ్యభూపతిగణంబులకు శాసనకర్తయు నైయుండెను. నేను సంధిపథమును బరిత్యజించినచో నిందనీయుఁడ నగుదునో, కాక యుద్ధమునుండి నివృత్తుఁడ నైనచో స్వధర్మభ్రష్టుఁడ నగుదునో యీవిషయమునుగూర్చి యీకృష్ణుఁడే నిర్ణయింపవలయును. మహాప్రభావులగుయదువృష్ణిభోజాంధకులును, కుకురసంజయవంశీయులునుగూడ వాసుదేవునిబుద్ధిప్రభావముచేతనే శత్రుదమనము గావించి సుహృద్గణము నానందింపఁజేయుచుందురు. మహేంద్రకల్పులగు నుగ్రసేనాదివీరు లందఱును, మహాబలపరాక్రమిలును, బుద్ధిమంతులును, సత్యపరాయణులు నగు యాదవులందఱు నెప్పుడును కృష్ణోపదేశమున ననుసరించియే మెలంగుచుందురు. కృష్ణుఁడే రక్షకుఁడును గర్తయు నని నమ్మియుండుటచేతనే కాశీరాజగు బభ్రుఁ డుత్తమసంపత్తి లభించెను. గ్రీష్మావసానమున జలదమాలికలు ప్రజాపతికి జలప్రదానము గావించినట్లు వాసుదేవుఁడు కాశీశ్వరునకు సర్వాభీష్టసిద్ధియును ధనప్రదానమును గావించెను. కర్మనిశ్చయజ్ఞుఁ డగు కేశవుఁ డిట్టిసద్గుణసంపన్నుఁడు. ఈసాధుసత్తముఁడు నాకెల్లవిధములఁ బ్రియుఁడు. మేమెన్నఁడు నితనియుపదేశమునకు విరుద్ధముగఁ జరింపఁజాలము."

అప్పుడు వాసుదేవుఁడు కూడ నిట్లనియెను "సంజయా! నేను నిరంతరమును బాండవుల యవినాశనమును, సమృద్ధిని, మఱియు సపుత్రకుఁడగుధృతరాష్ట్రుని యభ్యుదయమును వాంఛించుచుందును. కౌరవపాం

డవ్రులు పరస్పరమును సంధిచేసికొని సుఖింపవలయుననియే నాకోరిక. నేను వీరికింతకంటె బోధింపవలసిన దేదియును లేదు. ఇతరపాండవు లును, మహారాజగు యుధిష్ఠిరుండును గూడ సంధినే కోరుచుండుటను నేను చాలసారులు వినియుంటిని, కాని మహారాజగు ధృతరాష్ట్రుండును నాతనిపుత్రులును గూడ నత్యంతము నర్థలుబ్ధులై యున్నారు. ఇట్టిస్థితిలో వారికిఁ బాండవులతో సంధికుదురుట కేవలము దుష్కరమై యున్నది. ఇందువలనఁ గ్రమక్రమముగా వివాదమే వర్ధిల్లు ననుటలో నాశ్చర్య మేమున్నది? సంజయా! ధర్మరాజగు యుధిష్ఠిరుఁడును, నేనును గూడ నెన్నటికిని ధర్మమార్గమునుండి విచలితులము కాఁజాలము. ఈసంగతి నెఱింగియుండియు వినియుండియు నీవిప్పుడు స్వకర్మసాధనోద్యతుండు ను నుత్సాహసంపన్నుఁడును, స్వజనపరిపాలకుండు నగు యుధిష్ఠిరు న ధార్మికుండని యెట్లు నిర్దేశించెదవు?"

శ్రీకృష్ణుఁ డింతవఱకు నుపన్యసించి ధర్మమునకు వ్యాఖ్యానము గావించుట కారంభించెను. ఈవాక్యములు కృష్ణచరిత్రమునందు మిగులఁ బ్రయోజనీయములు. ధర్మరాజ్యసంస్థాపనమును, ధర్మప్రచారమును శ్రీకృష్ణజీవితమునకు ముఖ్యకారణములని మేము చెప్పియుంటిమి. ఆతని ధర్మరాజ్యసంస్థాపనముంగూర్చి మహాభారతమున సవిస్తరముగ వర్ణితమైయుండెను. కాని యాతఁడు ప్రచారముగావించిన ధర్మము భీష్మపర్వాంతర్గత మగు గీతాపర్వాధ్యాయమునందే యున్నది. గీతయందుఁ జెప్పఁబడిన ధర్మము గీతాకారమునఁ గృష్ణునిముఖమునుండియే వెలువడిన ట్లున్నది. కాని యాధర్మము కృష్ణప్రచారితమో కృష్ణప్రణీతమో నిశ్చయించుట కవకాశమేమున్నది? అదృష్టవశమున గీతాపర్వాధ్యాయమునందేగాక భారతమునందలి యితరభాగములందుఁగూడ శ్రీకృష్ణుని ధర్మోపదేశములు కానవచ్చుచున్నవి. బాగుగ విమర్శించినచో గీతలయందలి యభినవధర్మమునకు మహాభారతమునందితరస్థ

లములయందు శ్రీకృష్ణుఁడు బోధించినధర్మమునకును సామ్యము గా నంబడుచున్నది. కావున నీధర్మము కృష్ణప్రణీతమును, బ్రచారితమునుగూడ నైయుండె నని మనము చెప్పవచ్చును. మహాభారతము నితిహాసముగా నంగీకరించినచో, మహాభారతకారుఁ డందందుఁ గావించిన ధర్మవ్యాఖ్యానము శ్రీకృష్ణునిపై నారోపించి యున్నట్లు తెలిసికొనఁగలిగినచో, నది యెల్లయెడలను నేకప్రకృతిధర్మముగనే దోఁచుచున్నది. మఱియు నదిప్రచలితధర్మమునకు భిన్నప్రకృతిధర్మముగా నగపడుచున్నది. కావున నీధర్మము కృష్ణప్రచారితమే యని చెప్పవచ్చును. మఱియు గీతయందు నవిస్తరముగను, సంపూర్ణముగను బోధించినధర్మమునకును కృష్ణప్రచారితధర్మమునకును నైక్యము కానవచ్చుటవలన నిగీతోక్తధర్మము శ్రీకృష్ణప్రణీత మనికూడ నిశ్చిత మగుచున్నది.

శ్రీకృష్ణుఁ డిప్పుడు సంజయునిఁ గూర్చి చెప్పినమాటలను బరిశీలింపవలసి యున్నది:—

"శుచియును గుటుంబపరిపాలకుఁడునై వేదాధ్యయనముం గావించుచు జీవితమును గడపవలయు నని శాస్త్రనిర్దిష్టవిధి యున్నను బ్రాహ్మణాగ్రణులలో ననేకవిధంబులగుమతంబు లుత్పన్నంబులై యున్నవి. కర్మనాశంబుననే, మోక్షము లభించు నని కొందఱును, గర్మపరిత్యాగంబు గావించి కేవలమును వేదాధ్యయనంబు గావించుటచేతనే మోక్షము కలుగు నని మఱికొందఱు నీవిధముగా భిన్నాభిప్రాయములను గలిగి యుండిరి. కాని భోజనము చేయకుండఁ దృప్తి కలుగనట్లే కర్మానుష్ఠానము గావింపకుండఁ గేవలము వేద[illegible] యున్నంత మాత్రమున బ్రాహ్మణులను ముక్తిలాభము కలుగదు. నానావిద్యములలో మునఁ గార్యసంసాధన మగునో యావిద్యయే ఫలదాయక మగును. ఎట్టి కర్మానుష్ఠానవిధానమును లేనివిద్య కేవలమును నిష్ఫలమైనది యే—

పిపాసార్తుఁ డగు వ్యక్తి జలపానంబు గావించినంతనే పిపాసాశాంతి యగుచున్నది. అట్లే యిహకాలంబున సకలకర్మంబులకును ఫలము ప్రత్యక్షసిద్ధమై యున్నది. కావున నట్టి కర్మానుష్ఠానముం గావించుట యవశ్యకర్తవ్యము. ఓ సంజయా! కర్మమూలముననే యిట్టివిధి విహితమై యున్నది. కేవలము కర్మమే సర్వప్రధానమైనది. కర్మముకంటె నితరం బగు నే విషయమునైనను నుత్కృష్టంబుగ భావించువాని సకలకర్మంబులును నిష్ఫలములై పోవును.

దేవతలు కర్మబలంబుననే ప్రభావసంపన్నులైరి. సమీరణుండు కర్మబలంబుననే సదాగతి యగుచున్నాఁడు. దివాకరుఁడు కర్మబలంబుననే జాడ్యశూన్యుఁడై యహోరాత్రము లేకవిధముగఁ బరిభ్రమణంబు గావించుచున్నాఁడు. చంద్రుఁడు కర్మబలంబుననే నక్షత్రమండలపరివృతుఁడై యర్ధమాసపర్యంతము నభ్యుదితుం డగుచున్నాఁడు. హుతాశనుఁడు కర్మబలంబుననే ప్రజాగణంబులకుఁ గర్మసాధనంబు గావించుచు నవిచ్ఛిన్నముగ వేఁడిమిని గల్పించుచున్నాఁడు. పృథ్వి కర్మబలంబుననే యతిదుర్భరభారమున ననాయాసముగా వహించుచున్నది. స్రోతస్వినులన్నియును గర్మబలంబుననే ప్రాణులకుఁ దృప్తిం గల్పించుచు నుదకధారణముం గావించుచున్నవి. మహాబలశాలి యగు దేవేంద్రుఁడు దేవతలలోఁ బ్రధానత్వముం గావించుటకై బ్రహ్మచర్యానుష్ఠానముం గావించెను. ఆతఁడు కర్మబలంబుననే దశదిశలును నభోమండలమును బ్రతిధ్వనించునట్లు వారివర్షణముం గావించుచుండును మఱియు నాతం డప్రమత్తచిత్తముతో భోగాభిలాషను విసర్జించి ప్రియవస్తుసముదాయమును బరిత్యజించి శ్రేష్ఠత్వలాభమును, సత్యధర్మదమక్షమాదిగుణంబులఁ బ్రతిపాలించి దేవరాజ్యాధికారమును బడసి యుండెను భగవానుఁ డగు బృహస్పతి సమాహితచిత్తుఁడై యిం

ప్రార్థనముచే బ్రహ్మచర్యవ్రతానుష్ఠానంబు చేసి తత్కారణంబున నఖిలదేవతలకు నాచార్యుండయ్యెను. రుద్రులు, ఆదిత్యులు, యముండు, కుబేరుఁడు, గంధర్వులు, యక్షులు, అప్సరలు, విశ్వావసులు మొదలగువారందఱును గర్మప్రభావముననే విరాజితులై యుండిరి. మహర్షులును బ్రహ్మచర్యాదిసత్క్రియాకలాపంబుల ననుష్ఠించుటచేతనే సర్వశ్రేష్ఠులై యుండిరి."—

కర్మవాదము శ్రీకృష్ణునకుఁ బూర్వమునుండే వ్యవహారమునం దున్నది. కాని యాకర్మ ప్రచలితధర్మానుసారం బగు వేదోక్తక్రియాకలాపమాత్రమే—ఆకర్మశబ్దము మతమునందుఁ బాశ్చాత్యులచే "duty" యని చెప్పఁబడు నవశ్యానుష్ఠేయములగు సకలకర్మములను వర్తించుట లేదు. కర్మశబ్దమునకుఁ బూర్వప్రచలితార్థము [illegible]రితమైన కర్తవ్యమును (duty) "డ్యూటీ" నవశ్యానుష్ఠేయమనునదియే కర్మమని నిర్దేశింపఁబడినట్లు గీతలయందే కనఁబడుచున్నది. మఱియు నీస్థానమున భాషాగతంబగు విశేషప్రభేద మున్నను, నర్థము మాత్ర మొక్కటియగును. ఈయర్థమును, గీతలయందలియర్థమును గూడ నిర్వచించినవాఁ డొక్కఁడే యని నిశ్చయింపవలసి యున్నది

అనుష్ఠేయకర్మముల యథావిహితనిర్వాహము నామాంతరముచే స్వధర్మపాలన మగుచున్నది. గీతాప్రకరణ ప్రారంభమునందే శ్రీకృష్ణుఁ డర్జునునకు స్వధర్మపాలనముంగూర్చి యుపదేశించి యుండెను. ఇప్పుడుగూడ గృష్ణుఁడు స్వధర్మపాలనమునే యుపదేశించెను—

"ఓ సంజయా! నీవు బ్రాహ్మణక్షత్రియవైశ్యాదుల ధర్మమును సవిస్తరముగ నెఱింగియుండియుఁ గౌరవహితసాధనమునే మనమునం దుంచుకొని పాండవులను నిగ్రహించుట కేల ప్రయత్నించెదవు? [illegible]

జగుయుధిష్ఠిరుఁడు వేదజ్ఞుఁడును, రాజసూయాశ్వమేధాదియజ్ఞాతయు
నైయున్నాఁడు. మఱియు నీతఁడు యుద్ధవిద్యయందుఁ బారదర్శి; కరి
తురగరథచాలనమున నిపుణుఁడు. ఇప్పుడు పాండవులు కౌరవులను
హింసింపకుండ భీమసేనుని శాంతపఱుచుచు రాజ్యసంపాదనమున కితర
ోపాయమును దేనినైన నవలంబించినచో నది స్వధర్మరక్షణముం
గావించు సత్కర్మమే యైయుండును. అట్లుగాక వీరు క్షత్రియధర్మపా
లనముంగావించి స్వధర్మసాధనంబుకొఱకు దురదృష్టవశంబున మృ
త్యుముఖపతితులైనను మంచిదియే. నీవు సంధియే సర్వశ్రేయస్సాధ
నమని యూహించినట్లు తోఁచుచున్నది. కాని క్షత్రియులకు స్వధ
ర్మరక్షణము యుద్ధము చేయుటవలన నగునో, యుద్ధము చేయకుండుట
వలన నగునో యాలోచించి నీవే చెప్పుము! ఇందేమార్గ ముత్తమమై
నదిగా నిశ్చయింపఁబడునో యామార్గమునే నేననుసరించెదను"

తరువాత శ్రీకృష్ణుఁడు చతుర్వర్ణములవారిధర్మములనుగూర్చి
యు నుపన్యసించెను గీతయందలి యష్టాదశాధ్యాయమునందుఁ జె
ప్పఁబడినబ్రాహ్మక్షత్రియవైశ్యశూద్రధర్మములకును వీనికిని నెట్టిభేద
మును లేదు. గీతోక్తధర్మమునకును మహాభారతమునందచ్చటచ్చట
శ్రీకృష్ణునిచేఁ జెప్పఁబడినధర్మమునకును భిన్నత్వము లేనట్లుగా ననే
కోదాహరణములను జూపవచ్చును. గీతోక్తధర్మము కృష్ణధర్మమే
యగుటచే నది కేవలమును గృష్ణనామముచేఁ బరిచిత మగుచుండెనను
టయే కాదు—అది నిజముగాఁ గృష్ణప్రణీతధర్మ మనియే యొకవిధ
ముగా నిశ్చిత మగుచున్నది. కృష్ణుఁడు సంజయున కింకను ననేకవిష
యములను బోధించెను. అందొకటిరెండువిషయములనుమాత్రమే
యుదాహరించితిమి.

ఐరోపీయులయాలోచనమునందుఁ బరరాజ్యాపహారణముకంటె

గౌరవకార్యము వేఱేదియును లేదు. దానిపేరు విజయమనియుఁ, గీర్తియనియు, సామ్రాజ్యవర్ధన మనియు నాదేశభాషలయందుఁ గీర్తింపఁబడుచుండును. కేవలము నొక "కీర్తి" శబ్దమునందలి మోహముచే ముగ్ధుండై ప్రష్యాప్రభుఁడగు ద్వితీయ ఫ్రెడిక్ మూఁడుసారు లైరోపాఖండమును సమరానలముచేఁ బ్రజ్వలింపఁ జేసి లక్షలకొలఁది జనుల ప్రాణనాశనమునకుఁ గారకుఁ డయ్యెను. ఇట్టిరుధిరపిపాసు వగు రాక్షసునకుఁ దక్క మఱియెవ్వరికైనను నీ "కీర్తి" యనునది తస్కరత్వమునకంటె భిన్న మైనది కాదని సులభముగా బోధపడక మానదు. కేవల పరరాజ్యాపహారకుఁడు చోరశిఖామణి—తదితరుఁడు సామాన్యచోరుఁడు * కాని యార్యక్షత్రియవీరులుకూడ దిగ్విజయవాంఛచే ముగ్ధులై యనేకసమయములందు ధర్మాధర్మములను మఱచి ప్రవర్తించిరని చెప్పవలసి యున్నది. ఐరోపాయందలి యొకవీరుఁ డలెగ్జాండరునుగూర్చి "సవాకగోప్తదస్యుసమానుఁడన్నమాత్రమే" అని చెప్పియుండెను. భారతవర్షమునందును శ్రీకృష్ణుఁడు పరరాజ్యలోలుపు లగు రాజులంగూర్చి యట్లే చెప్పి యుండెను. చిన్నచిన్నదొంగలు దాఁగియుండి దొంగతనము చేయుదు రనియుఁ, బెద్దదొంగలు బహిరంగముగనే దొంగిలించెద రనియు నాతఁడు చెప్పియుండెను. ఆతఁ డేమిచెప్పెననఁగా—

"అగపడియో, యగపడకుండఁగనో యాకస్మికముగ సర్వస్వము నపహరించువారు దొంగలు. ఈరెండుతరగతులవారును నింద్యులే. కేవలము నిప్పటిదుర్యోధనుని కార్యమునం దట్టితస్కరస్వభావము కానవచ్చుచున్నది"

* అయినను కేవలపరోపకారమునకై పరరాజ్యమును హస్తగతము చేసికొన్నవ్వారినియెడల నీమాట వర్తింపకపోవచ్చునేమో! అట్టి కార్యమువంటి మంచివిషయము విమర్శించుటకు మాకు శక్తి చాలదు. ఏమనిన:—మే మంతటి రాజనీతిజ్ఞులము కాము.

ఇట్టితస్కరులహస్తములనుండి స్వసంపత్తిని రక్షించుకొనుట యే పరమధర్మ మని శ్రీకృష్ణుఁడు నిర్ణయించి యుండెను. ఆధునిక నీతిజ్ఞులమతముకూడ నట్టిదియే. చిన్నదొంగలచేతులనుండి తమధన మును రక్షించుకొనుట కింగ్లీషుభాషయందు జస్టిస్ (Justice) అనియుఁ బెద్దదొంగలచేతులనుండి రక్షించుకొనుటకు పేట్రియాటిజమ్ (Patriotism) అనియును నామములు. ఈరెంటికిని గూడ దేశీయనామము స్వధర్మపాలనము. కృష్ణుఁ డిట్లు చెప్పెను !—

"ఈరాజ్యముకొఱకుఁ బ్రాణములనుగూడఁ బరిత్యజింపవలసి యుండును. అయినను మంచిదే. కాని పైతృకం బగురాజ్యము నుద్ధ రించుకొనువిషయమున విముఖులై యుండుట యెంతమాత్రము నుచిత ము కాదు"

కృష్ణుఁ డప్పుడు సంజయునిశుష్కధర్మోపన్యాసమును విని స ముచితముగ నాతని దిరస్కరించుచు "నీవిప్పుడు రాజగుయుధిష్ఠిరునకు ధర్మోపదేశమును గావింపఁ గుతూహలపడుచుంటివి. కాని యాసమ యమున (సభామధ్యమున దుశ్శాసనుఁడు ద్రౌపదియెడల వినరాని వినరానియత్యాచారముం గావించినప్పుడు) దుశ్శాసనునకు నీవెట్టియు పదేశముం గావించితివి ?" అనియెను. కృష్ణుఁడు స్వభావముచేఁ బ్రియ వాదియే—కాని యథార్థముగ దోషనిర్ణయముం గావించునప్పుడు మాత్రము కేవలమును స్పష్టవాదియై యుండును. సత్యమే సర్వకాల ములయందు నాతనికిఁ బ్రియమైనది.

కృష్ణుఁడిట్లు సంజయుని దిరస్కరించి "ఈయుభయపక్షములహిత సాధనముంగూర్చియుఁ బ్రయత్నించుటకు స్వయముగ నేనే హస్తినా పురమునకు వచ్చెదను. పాండవులకు కర్థహాని కాకుండునట్లును, గౌరవు లు సంధికి సమ్మతించునట్లును విశేషప్రయత్నము చేయువలయును.

అది జరగినచో నొకపుణ్యకార్యము సాధించినట్లగును. అందువలనఁ గౌరవులుమృత్యుపాశమునుండి విడివడఁగలుగుదురు" అని చెప్పెను.

లోకహితార్థమును, నసంఖ్యమానవజీవనరక్షార్థమును, విశేషించి కౌరవరక్షార్థమును శ్రీకృష్ణుఁ డీదుష్కరకార్యమును సాధించుటకై స్వయముగ నుపయాచకుఁడై ప్రవృత్తుఁ డయ్యెను. ఇది మనుష్యశక్తికి దుష్కరకార్యము. ఏమనిన:—పాండవులు శ్రీకృష్ణునిం గోరుకొని తమపక్షమునకుఁ జేర్చుకొని యుండిరి. అందుచే నాతఁ డిప్పుడు కౌరవులకు శత్రుపక్షమువాఁడై యుండెను. అయినను శ్రీకృష్ణుఁడు లోకహితార్థమై నిరాయుధుఁడుగనే శత్రునగరమధ్యమునఁ బ్రవేశించుట శ్రేయమని నిశ్చయించుకొనియెను.

తృతీయపరిచ్ఛేదము.

యానసంధి.

ఇప్పుడు సంజయయానపర్వాధ్యాయము సమాప్తమయ్యెను. ఈయధ్యాయమునకుఁ గడపటిభాగమునఁ గృష్ణుఁడు హస్తినగరమునకుఁ బోవుటకుఁ గోరఁబడినట్లగపడుచున్నది. నిజముగా నాతఁ డాతరువాతనే హస్తినాపురమునకుఁ బోయెను. కాని సంజయయానపర్వాధ్యాయమునకును, భగవద్యానపర్వాధ్యాయమునకును నడుమ ప్రజాగరము, సనత్సుజాతము, యానసంధి యనుమూఁడుపర్వాధ్యాయము లున్నవి. ఇందు మొదటిరెండును బ్రక్షిప్తము లనుట కెట్టిసందియమును లేదు. వానిలో మహాభారతకథ యించుకంతయును లేదు. అత్యుత్కృష్టధర్మములును, నీతికథలునుమాత్ర మందున్నవి. కృష్ణుని యేవృత్తాంతము నందు లేదు. మనకీరెండుపర్వములతో నెట్టిప్రయోజనమును లేదు.

ఈయానసంధిపర్వాధ్యాయమున సంజయుఁడు హాస్తినాపురమునకు వచ్చి ధృతరాష్ట్రునితోఁ జెప్పినమాటలును, నావాక్యములను విని ధృతరాష్ట్రుఁడు దుర్యోధనుఁడు మొదలగు కౌరవు లందఱును గావించిన వాదప్రతివాదములును గానఁబడుచున్నవి. ఆయుపన్యాసము లన్నియు నతి దీర్ఘములును, బునరుక్తులచే నత్యంత సంకలితంబులును జాలచోట్ల నిష్ప్రయోజనములు నై యుండెను ఇందు రెండుచోట్లను మాత్రమే కృష్ణప్రసంగమున్నది.

మొదటిసారి యాతనిప్రస్తావ నష్టపంచాశత్తమాధ్యాయమున వచ్చినది. ధృతరాష్ట్రుఁడు సవిస్తరముగ నర్జునుని వాక్యములను సంజయునివలన విని యాకస్మికముగా "సంజయా! వాసుదేవుఁడును, ధనంజయుండును బలికినపలుకులను విననలయునని కుతూహలముగా నున్నది. కావున నాకింగూర్చి తెలుపవలయును" అని ప్రశ్నించెను.

దానికిఁ బ్రత్యుత్తరముగ సంజయుండాసభాస్థలంబున జరిగిన సంగతుల నెంతమాత్రమును దెలుపకుండఁగనే లోకాభిరామాయణమును జెప్ప నారంభించెను. అభిమన్యుప్రభృతికుమారులకుఁ గూడ నగమ్యంబగు పాండవాంతఃపురంబునకుఁ బోయి కృష్ణార్జునులను దర్శించినట్లును, నప్పుడు కృష్ణార్జునులు మిగులనాసవపానంబుఁ గావించి సత్యాద్రౌపదుల పాదంబులపైఁ బాదములనుంచి కూర్చుండి యున్నట్లును నప్పుడు కృష్ణుఁడు దంభముగా "నేను సహాయుఁడనై యుండగా నీయర్జునుఁడు సకలశాత్రవసమూహంబును నిర్మూలంబు చేయఁగలఁడు" అని చెప్పినట్లును సంజయుఁడు చెప్పి యుండెను.

తరువాత నర్జునుఁ డేమనెనో యామాటలను సంజయుఁడు చెప్పనే లేదు. కాని ధృతరాష్ట్రున కాతని మాటలను విననలయునని యుండెను.—తరువాత నష్టపంచాశత్తమాధ్యాయమునఁ దుదిభాగము

న మహావీరుఁ [illegible] విని పర మానందపులకి[illegible] [illegible]. [illegible] యు [illegible] [illegible] [illegible]. అ య[illegible] [illegible] [illegible] డు సంస్థాపన[illegible] [illegible] కూడ నున్నవి. [illegible] తనతంత్రికి [illegible]. [illegible] వ్యక్తి[illegible] [illegible] నట్లును, [illegible] లకుఁ దర్శనీ[illegible] [illegible]. [illegible] మనోవ్యధనులను [illegible]. [illegible] యుపదేశ[illegible] [illegible] [illegible] సభాసమా[illegible] [illegible] "[illegible]" [illegible] ప్పుడు సంజయుఁ [illegible] దరునాటిక[illegible] [illegible] ఇట్టిస్థితిలో నీ 59,60,61,62,63 64 [illegible] చెప్పుటను [illegible] [illegible] జరుగలేదు. [illegible] వచ్చును.

[illegible] ర్ణయించుటకు [illegible] ముకూడఁ బ్రత్యే[illegible] ములను [illegible]

యముంగూర్చి యింకను జెప్పవలసి యున్నది. ఇది కేవల మప్రాసంగికమును, నసంబద్ధము నగుటయే కాక పూర్వోక్తంబు లగు శ్రీకృష్ణ వాక్యంబులకు విరుద్ధంబుగఁగూడ నున్నది. ఇందలి వృత్తాంతములంగూర్చి యనుక్రమణికాధ్యాయంబునఁగాని, పర్వసంగ్రహాధ్యాయంబునఁగాని చెప్పియుండలేదు. ఎవ్వఁడో రసికుఁడగు లేఖకుఁ డసురనిపాతి యగుశౌరిని, సురనిపాతిని యగుసురను సేవించు భక్తాగ్రేసరుం డగుటచేఁ దన యుపాస్యదైవతములను రెంటి నొక్కచోఁ బ్రదర్శించు నుద్దేశముతో నీయష్టపంచాశత్తమాధ్యాయమును బ్రక్షేపించి యుండు నని తోఁచుచున్నది.

యానసంధిపర్వాధ్యాయమునందు శ్రీకృష్ణునింగూర్చిన ప్రథమప్రసంగ మింతే—ద్వితీయప్రసంగము సప్తషష్టితమాధ్యాయము మొదలు సప్తతితమాధ్యాయమువఱకు నాలుగధ్యాయములలో నున్నది. అందు సంజయుఁడు ధృతరాష్ట్రునిప్రశ్నను సారముగా శ్రీకృష్ణమహిమను వర్ణించి యుండెను. ఇదివఱకు మద్యపానోన్మత్తుఁడని వర్ణితుఁడైన శ్రీకృష్ణుఁ డప్పుడు జగదీశ్వరుఁడుగా వర్ణింపఁబడియెను. అందుచే నిదియును బ్రక్షిప్తముగనే తోఁచుచున్నది. ఇది ప్రక్షిప్తమైనను గాకపోయినను సరియే—గాని దీనితో మాకెట్టి ప్రయోజనమును లేదు. ఇతర ప్రధానకారణములచేతనే కృష్ణునియీశ్వరత్వము మనకు విశ్వసనీయమైనప్పు డీక సంజయునివాక్యములతో విశేషప్రయోజనమేమున్నది? శ్రీకృష్ణుఁ డీశ్వరుఁ డనువిశ్వాసమే మనకు లేనప్పుడు సంజయుఁ డీవిధముగా నెన్ని వాక్యములు చెప్పినను నాతనిబలవంతముచే విశ్వాసము కలుగదు. కావున నీసంజయునివాక్యములను విమర్శించుటవలన నెట్టిలాభమును లేదు. ఆతనియీమాటలలో శ్రీకృష్ణునిమానవజీవితముంగూర్చిన యెట్టివృత్తాంతమును మనకుఁ గానవచ్చుటలేదు.

మనకుం గావలసినది శ్రీకృష్ణచరిత్రము గాని సంజయోపన్యాసము గాదు. ఇప్పటికి యానసంధిపర్వాధ్యాయము సమాప్తమైనది.

చతుర్థపరిచ్ఛేదము.

శ్రీకృష్ణుని వాస్తవాభిప్రాయము.

శ్రీకృష్ణుడు పూర్వాంగీకృతం బగునంగీకారము ననుసరించి సంధిస్థాపనంబు గావించుటకై కౌరవులయొద్దకుం బోవలయు నని సంసిద్ధుం డయ్యెను. ప్రయాణసమయమునందుం బాండవులును, ద్రౌపదియు నాతనికిం గొన్నికొన్ని మాటలను జెప్పిరి. శ్రీకృష్ణుడు వాని కుచితములగు నుత్తరముల నొసంగెను. ఈవాక్యోపవాక్యము లన్నియు ఐతిహాసికములే యని గ్రహించుట కవకాశము లేదు కాని యితిహాసవేత్త యగుకవి కృష్ణునిచేం బలికించిన పలుకులబట్టి యాతండు కృష్ణు నేవిధముగా గ్రహించినదియు బోధ యగుచున్నది. ఆవాక్యములలోనుండి కొన్ని భాగముల నుదాహరించెదను.

ఒకచోటం గృష్ణుడు యుధిష్ఠిరుని మాటలకుం బ్రత్యుత్తరమిచ్చుచు "ఓమహారాజా! బ్రహ్మచర్యాదివ్రతములు క్షత్త్రియునకు విధేయములు గావు. సకలాశ్రమస్థులును క్షత్త్రియునకు భిక్షాచరణమును నిషేధించి యున్నారు. సంగ్రామ విజయలాభంబును, రణంబునం బ్రాణపరిత్యాగంబును క్షత్త్రియునకు నిత్యధర్మంబు లని విధాత నిర్దేశించి యుండెను. కావున దీనత్వము క్షత్త్రియున కత్యంతమును నిందనీయమైనది. అరిసూదనుండవగు నోయుధిష్ఠిరా! నీవు దీనత్వము నవలంబించినచో నీరాజ్యభాగమును బడయంజాలవు. కావున విక్రమమును బ్రదర్శించి శత్రుగణవినాశనముం గావింపుము" అని చెప్పెను.

ఈయానసంధిపర్వాధ్యాయమున సంజయుఁడు హస్తినాపురమునకు వచ్చి ధృతరాష్ట్రునితోఁ జెప్పినమాటలును, వాని వాక్యములను విని ధృతరాష్ట్రుఁడు దుర్యోధనుఁడు మొదలగు కౌరవు లందఱును గావించిన వాదప్రతివాదములును గాంచబడుచున్నవి. ఆయుపన్యాసము లన్నియు నతి దీర్ఘములును, బునరుక్తులచే నత్యంత సంకలితంబులును జాలచోట్ల నిష్ప్రయోజనములు నై యుండెను ఇందు రెండుచోట్లను మాత్రమే కృష్ణప్రసంగమున్నది.

మొదటిసారి యాతని ప్రస్తావ సప్తపంచాశత్తమాధ్యాయమున వచ్చినది. ధృతరాష్ట్రుఁడు సవిస్తరముగ నర్జునుని వాక్యములను సంజయునివలన విని యాకస్మికముగా "సంజయా! వాసుదేవుండును, ధనంజయుండును బలికినపలుకులను వినవలయునని కుతూహలముగా నున్నది. కావున వానింగూర్చి తెలుపవలయును" అని ప్రశ్నించెను.

దానికిఁ బ్రత్యుత్తరముగ సంజయుండాసభాస్థలంబున జరిగిన సంగతుల నెంతమాత్రమును దెలుపకుండఁగనే లోకాభిరామాయణమును జెప్ప నారంభించెను. అభిమన్యుప్రభృతికుమారులకుఁ గూడ నగమ్యంబగు పాండవాంతఃపురంబునకుఁ బోయి కృష్ణార్జునులను దర్శించినట్లును, నప్పుడు కృష్ణార్జునులు మిగులనాసవపానంబుఁ గావించి సత్యాద్రౌపదుల పాదంబులపైఁ బాదములనుంచి కూర్చుండి యున్నట్లును నప్పుడు కృష్ణుఁడు దంభముగా "నేను సహాయుఁడనై యుండగా నీయర్జునుఁడు సకలశాత్రవసమూహంబును నిర్మూలంబు చేయఁగలఁడు" అని చెప్పినట్లును సంజయుఁడు చెప్పి యుండెను.

తరువాత నర్జునుఁ డేమనెనో యామాటలను సంజయుఁడు చెప్పనే లేదు. కాని ధృతరాష్ట్రున కాతని మాటలను వినవలయునని యుండెను.—తరువాత నష్టపంచాశత్తమాధ్యాయమునఁ దుదిభాగము

న మహావీరుఁ డగు నర్జునుఁడు శ్రీకృష్ణునివాక్యము లన్నిటిని విని పరమానందపులకితుఁడై యేమేమో చెప్పినట్లు లేదు. ఆవాక్యము లన్నియు నూనషష్టితమాధ్యాయమునం దర్జునుఁడు చెప్పినమాటలే — ఆయధ్యాయ మంతయు నామాటలతోనే లేదు. అందు ధృతరాష్ట్రుఁడు సంధిస్థాపనవిషయంబున దుర్యోధనునకుఁ బ్రబోధించినమాటలు కూడ నున్నవి. అనంతరము షష్టితమాధ్యాయమున దుర్యోధనుఁడు తనతండ్రికిఁ దన దర్పోద్రేకమును స్పష్టముగా వెల్లడించినట్లున్నది. ఏకషష్టితమాధ్యాయమున మధ్యగాఁ గర్ణుఁడు వచ్చి యేమేమో మాటలాడినట్లును, భీష్ముఁ డాతనిని మందలించినట్లు నున్నది. అప్పుడు కర్ణ భీష్ములకుఁ దర్క-వితర్కములు జరిగెను. ద్విషష్టితమాధ్యాయమున భీష్మదుర్యోధనులకు వివాదమయ్యెను. త్రిషష్టితమాధ్యాయమున భీష్ముని యుపదేశములుండెను. చతుష్షష్టితమాధ్యాయమున మరల ధృతరాష్ట్రుని సభాసమావేశ మయ్యెను. అప్పు డంతకాలమునకుఁ దనవాని ధృతరాష్ట్రుఁడు "అర్జునుఁ డప్పుడేమనియెను?" అని ప్రశ్నించెను. అప్పుడు సంజయుఁ డష్టపంచాశత్తమాధ్యాయమునఁ జెప్పినసంగతులను దరువాతికథ నందుకొని యర్జునునిమాటలంగూర్చి చెప్పందొడంగెను. ఇట్టిస్థితిలో నీ 59,60,61,62,63 64 అధ్యాయములు ప్రక్షిప్తము లని చెప్పుటకు మాపాఠకులలో నెవ్వరును సందేహింపరని తలంచెదము. ఈయాఱధ్యాయములలోను భారతకథ యనుక్రమముగను ముందటికి జరుగలేదు. కావున నివి నిశ్చయముగాఁ బ్రక్షిప్తము లనియే చెప్పవచ్చును.

ఏకారణములచేత నీయాఱధ్యాయములును బ్రక్షిప్తములని నిర్ణయించితిమో యాకారణములచేతనే యష్టపంచాశత్తమాధ్యాయముకూడఁ బ్రక్షిప్త మని చెప్పవచ్చును — తనవారిచే నీయధ్యాయములను వరుసవరుసగాఁ బ్రక్షేపించి యుండిరి. అష్టపంచాశత్తమాధ్యా

ఈవిధముగనే శ్రీకృష్ణుం డర్జునునకుం గూడ బోధించినట్లు గీత యందగపడుచున్నది. దీనివలన నెట్టిసిద్ధాంతము తేలినదో యాసంగతి యిదివఱకే చెప్పి యుంటిమి. తరువాతఁ గృష్ణుఁడు భీమునిమాటలకుఁ బ్రత్యుత్తరముగా "మానవుఁడు పురుషకారమును బరిత్యజించి కేవలదైవమును గాని, దైవమును ద్యజించి కేవల పురుషకారమును గాని యవలంబించి జీవితమును గడపఁజాలఁడు. ఈయర్థంబును గ్రహించి కృతనిశ్చయుండై కర్మంబులఁ గావించువాఁడు కర్మఫలసిద్ధికి సంతోషము గాని వైఫల్యమునకు దుఃఖమును గాని బొందఁడు" అని బోధించెను.

శ్రీకృష్ణుఁ డర్జునుని మాటల కుత్తరముగా నిట్లు చెప్పినట్లు గీత యందున్నది.

"సస్యక్షేత్రమునందు నియమానుసారముగా నాఁగేటిచే దున్ని విత్తనములు చల్లినను వర్షము లేకున్నచో ఫలోత్పత్తి కానేరదు. పురుషుఁడు పురుషకార సహకారంబున నందు జలసేచనంబు గావించినను దైవప్రతికూల్యముచే నదియంతయు శుష్కించిపోవును. కావున నే ప్రాచీను లగుమహాత్ములందఱును దైవపురుషకారముల సామంజస్యముచేఁ గార్యములు సిద్ధించుచుండు నని సిద్ధాంతము చేసి యుండిరి. నేను యథాసాధ్యముగఁ బురుషకారము నుపయోగింపఁగలను. కాని దైవకర్మానుష్ఠానముం గావించుటకు నాకెంతమాత్రమును సామర్థ్యము లేదు"

మేమీసంగతి నిదివఱకే వ్రాసి యుంటిమి. కృష్ణుఁ డిచ్చట తనదేవత్వము నెంతమాత్రము బ్రకటించియుండలేదు. ఏమనిన. ఆతఁడు సకలకర్మములను మానవశక్తిచేతనే సాధించుటకుఁ బ్రవృత్తుఁడయ్యెను. ఈశ్వరశక్తిచేతనే కర్మసాధనముం గావించుట యీశ్వరోద్దేశమైనచో నిఁక నవతారమువలనఁ బ్రయోజన మేమున్నది?

చెప్పవలసినవారందఱును జెప్పినతరువాత ద్రౌపది కృష్ణునకుఁ గొన్నిమాటలను జెప్పెను. అప్పటియామెమాటలలో నొక మాట యున్నది. స్త్రీముఖమునుండి యట్టిమాట వెలువడుట మహాశ్చర్యకరమగువిషయము. ఆమె కృష్ణునిం గాంచి "అవధ్యులగువారిని వధించుట యెంతపాపమో, వధ్యులగువారిని వధింపకుండుటయు నంతపాపమే" అనియెను.

సాధారణస్త్రీ యిట్లు చెప్పుట విస్మయకరమే గాని ద్రౌపది వంటి రాజ్ఞీమణి యీవిధముగా భాషించుట వింతగాదు. మేము చిరకాలముక్రిందటనే వంగదర్శిని యనుపత్రికలో ద్రౌపదీచరిత్రము విస్పష్టముగ వ్రాసి యామెస్వభావగుణగణంబులను బ్రకటించి యున్నాము. ఈవాక్యములు స్త్రీ చెప్పఁదగిన వైనను గాకపోయినను నీపద్ధతియే పరిష్కృతధర్మ మనియును నిదియే కృష్ణమతమనియును మేము జరాసంధవధసమాలోచనసమయంబునను, మఱియు నన్యసమయంబులందును నిరూపించి యున్నారము.

ద్రౌపది యీవిధముగాఁ జెప్పుట ముగించినతరువాత నచ్చట నే నొకవిధమగునపూర్వకవితాకౌశల మగపడుచున్నది. దాని నీక్రిందఁ జూపుచున్నాము.

"అసితాపాంగవిలాసిని యగుద్రౌపది యాసంధిప్రస్తావము నాలకించి కుటిలాగ్రంబును, బరమరమణీయంబును, వివిధగంధసువాసితంబును, సర్వలక్షణసంపన్నంబును, మహాభుజంగసదృశంబును నగు తన కుంతలకలాపమును జేతఁ బూని యశ్రుపూర్ణనయనములతో దీనవదనముతో శ్రీకృష్ణునిం గాంచి మరల నిట్లు చెప్పందొడంగెను. "ఓజనార్దనా! దురాత్ముఁ డగు దుశ్శాసనుఁడు నాయీచికురదామము నాకర్షించి యున్నాఁడు. శత్రువులతో సంధిప్రస్తావముం గా

వించుసమయమున నీవీకేశకలాపమును జ్ఞప్తియం దుంచుకొనుము. భీమార్జునులు దీనులవలె సంధిచేసికొనుటకుఁ గృతసంకల్పులై యుండిరి. అంతమాత్రమున నాకెట్టి లోపమును లేదు. వృద్ధుఁ డగునాజనకుఁడు మహారథులగు తనపుత్రులంగూడుకొని వచ్చి శత్రువులతో సంగ్రామంబు గావింపఁగలఁడు. మహాబలపరాక్రాంతు లగునాయేవురుపుత్రులును నభిమన్యుపురస్సరులై పోయి రణరంగమున శత్రునిర్మూలనంబు సేయఁగలరు. దురాత్ముఁడగు దుశ్శాసనుని శ్యామలబాహువు తుత్తునియలై సంగ్రామరంగమున ధూళిలోఁ బొరలుచుండఁగాఁ జూచినప్పుడు గాని నాకు శాంతి యెట్లు లభించును? జ్వాలాభీలంబగు ననలంబుం బోలి నాహృదయంబునఁ బ్రదీప్తం బగుచున్నక్రోధము నెట్లో యడంచుకొని నేనతికష్టముతోఁ బదుమూఁడువత్సరములు ప్రతీక్షించి యుంటిని. ఇప్పటికిఁ బదుమూఁడవయేఁడుగూడఁ గడచిపోయినది. అయినను నాక్రోధజ్వాల యుపశమించుట కెట్టియుపాయము నగపడుట లేదు. ఇప్పుడు మరల ధర్మపథావలంబి యగునృకోదరుని వాక్యములను వాఁడిబాణములచే నాహృదయము విదీర్ణమైపోవుచున్నది"

నిబిడనితంబినియు, నాయతలోచనయు నగుకృష్ణాదేవి యిట్లు చెప్పి ప్రకంపితసర్వావయవయై బాష్పగద్గదస్వరంబున నేడువఁదొడంగెను. అగ్నిజ్వాల యీవిధముగ ద్రవీభూతంబయ్యెనా యనునట్లుగా నత్యుష్ణంబు లగుబాష్పధారలచే నారమణీమణిసమున్నతవక్షోభాగ మభిషిక్తం బగుచుండెను. అప్పుడు మహాబాహుఁ డగువాసుదేవుఁ డామె ననునయించుచు "ఓద్రౌపదీ! నీవు కొలఁదిదినములలోనే కౌరవకాంతలదుఃఖములను గన్నారఁజూడఁగలవు. నీవు దుఃఖించినట్లుగనే కురుకులకామినులు తమబంధువినాశనంబునకై పరిపరివిధంబుల దుఃఖం

కాఁగలరు. నేను యుధిష్ఠిరునియాజ్ఞానుసారంబుగ భీమార్జుననకులసహదేవులతోఁ గలసి కౌరవగణవధసాధనంబునకుఁ బ్రవృత్తుండనయ్యెదను. ధృతరాష్ట్రనందనులు కాలచోదితులై నావాక్యముల ననాదరింతురేని నిశ్చయముగ వారచిరకాలముననే నిహతులై శృగాలకుక్కురంబులకు భక్ష్యంబులు కాఁగలరు. హిమశైలము చలించినను, మేదిని యుత్క్షిప్తంబైనను, నాకాశమండలము నక్షత్రగణంబులతోఁ గూడ నిపతితంబైనను నావాక్య మెన్నటికి నసత్యంబు కాఁజాలదు. తల్లీ! నీవు బాష్పసంవరణంబు గావింపుము. నామాట నమ్ముము. శత్రుసంహారంబు చేసి రాజ్యలాభంబుఁ గాంచిననీభర్తలను నీ వచిరకాలముననె చూడఁగలవు—"

ఈమాటలు శోణితపిపాసువగువాని హింసాప్రవృత్తి కనుగుణ్యంబులైనవనిగాని, క్రోధశీలుఁడగువాని క్రోధాభివ్యక్తి కుచితంబులైనవనిగాని చెప్పుటకు వలనుపడదు. ఇవి సర్వత్ర ప్రసరించునట్టియు సర్వకాలమును వ్యాపించునట్టియు బుద్ధిప్రభావముచే భవిష్యమును స్పష్టముగఁ దెలిసికొని చెప్పినమాటలుమాత్రమే—దుర్యోధనుఁడు సంధిచేసికొని రాజ్యభాగము నెన్నటికిని బ్రత్యర్పణముఁ గావింపఁడని శ్రీకృష్ణుఁడునిశ్చయముగ గ్రహించియుండెను. ఇట్లుతెలిసియుండియు నాతఁడు సంధికొఱకు కౌరవసభకుఁబోవ నుద్యోగించెను. కారణమేమనిన నుత్కృష్టంబగుకార్యము పర్యవసానమున సఫలమైనను, విఫలమైనను నవశ్యము చేసియే చూడవలయును. అట్టిచో ఫలాఫలములను దుల్యములుగనే భావింపవలయును. ఇదియే శ్రీకృష్ణముఖవినిర్గతంబగునమృతమయగీతాధర్మము. ఆతఁడు న్యాయముగా నర్జుననకిట్లుపదేశించెను.

"సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే" అవ

ర్శపురుషుఁ డగు నాతఁ డట్టిసీతి ననుసరించియే భవిష్యత్తు నెఱింగియుం డియును సంధిస్థాపనార్థమై ప్రయత్నించుటకుఁ గౌరవసభకుఁ బోయెను.

పంచమపరిచ్ఛేదము.

యాత్ర.

శ్రీకృష్ణుఁడు తనప్రయాణసమయంబునఁ గావించిన కార్యము లన్నియును మానవానురూపంబులును, గాలోచితంబులు నైయుం డెను. ఆతఁడు కార్తికమాసంబున రోహిణీనక్షత్రయుక్తం బగుశుభది నంబున మిత్రముహూర్తంబునఁ గౌరవసభకు బయలుదేఱను ద్దేశించి విశ్వస్తు లగుబ్రాహ్మణుల పుణ్యావాక్యశ్రవణంబును, బ్రాతఃకృత్యస మాపనంబును, స్నానంబును, వసనభూషణాలంకరణంబును, వహ్ని సూ ర్యోపాసనంబును గావించెను. మఱియు వృషలాంగూలదర్శనంబును, బ్రాహ్మణాభివాదనంబును, నగ్నిప్రదక్షిణంబును, గల్యాణవస్తుసంద ర్శనంబును గావించి ప్రయాణమయ్యెను.

శ్రీకృష్ణుఁడు గీతామూలంబునఁ గావించిన ధర్మప్రచారమునం దుఁ గామ్యకర్మపరాయణంబగునప్పటివైదికధర్మము నిరసింపఁబడియుం డెను. కాని యంతమాత్రమున నాతఁ డెన్నఁడును వేదపరాయణుల గుబ్రాహ్మణుల నవమానించి యుండలేదు. ఆతఁ డాదర్శపురుషుఁడు; కావుననే యాకాలమునందు బ్రాహ్మణులవిషయంబున నెట్లు వ్యవహ రించుట యుచితమో యట్లే కావించెను. ఆకాలమునందలి బ్రాహ్మ ణులు విద్వాంసులును, జ్ఞానవంతులును, ధర్మాత్ములును, నస్వార్థపరు లునై సమాజవిషయంబున శుభసాధననిరతులై యుండిరి. అందుచే వారలితరవర్ణములవారిచేఁ బూజింపఁబడుటకు యోగ్యులై యుండిరి.

కృష్ణుఁడును నాకారణముచేతనే వారి నుచితరీతిని బూజించెను. దీని కుదాహరణముగా శ్రీకృష్ణునిమార్గమధ్యమునందలి ఋషిసమూహము ముం గూర్చినవర్ణన మిందుఁ బొందుపఱచుచున్నాము.—

"మహాభాగుఁ డగు కేశవుఁ డీవిధముగాఁ గొంతదూరము నరిగి త్రోవకిరువంకలను బ్రహ్మతేజోవిరాజితు లగుకొందఱు మహర్షులను సందర్శించెను. ఆతఁడు వారిం గాంచినంతనే యతిసంభ్రమంబున రథావతరణంబు సేసి యభివాదనపూర్వకంబుగ నిట్లు ప్రశ్నించెను. "ఓ మహర్షిశేఖరులారా! మీ రందఱును గుశలముగ నుంటిరా! మీసకలధర్మంబులు నుత్తమరూపంబున ననుష్ఠితంబు లగుచుండెనుగదా! క్షత్రియాది వర్ణత్రయంబును బ్రాహ్మణశాసనానుసారంబుగ మెలంగుచుండెనా? మీయాశ్రమంబు లెక్కడ? మీ రెక్కడికిఁ బోవుచున్నారు? మీ యాగమనమునకుఁ బ్రయోజనం బేమి? మీకు నేఁ జేయఁదగినకార్యం బేమైన నుండెనా?—"

అప్పుడు మహాభాగుం డగుపరశురాముఁడు శ్రీకృష్ణునిం గౌఁగిలించుకొని "ఓమధుసూదనా! మాలోఁ గొందఱు దేవర్షులును, గొందఱు బహుశ్రుతు లగు బ్రాహ్మణులును, గొందఱు రాజర్షులును, గొందఱుతపస్వులునుగూడ నున్నారు. మేము పెక్కు పర్యాయములు దేవాసురసమాగమమును గాంచియున్నారము. ఇప్పుడు సకలక్షత్రియులను, సభాసదులను, భూపాలుఁడగుధృతరాష్ట్రుని నిన్నును జూడవలయు ననుకోరికతో మేము బయలుదేఱి వచ్చుచున్నాము. మేము కౌరవసభామధ్యంబున నీవువచియించుధర్మార్థసంగతంబు లగువచనంబులను వినవలయు నని యభిలషించుచున్నాము. ఓయదుశేఖరా! భీష్మద్రోణవిదురాది మహాత్ములతో నీవు భాషించు హితకరంబులగు సత్యవాక్యముల నాకర్ణింపఁ గుతూహలపడుచున్నాము:—ఇప్పుడు నీవు

కురురాజ్యమునకు సత్వరముగ బయలుదేఱిపొమ్ము! అచ్చట సభామధ్యంబున దివ్యాసనాసీనుండవును తేజోమయుండవునగు నిన్ను మేము మరలఁ గనుంగొని నీతో సంభాషించెదము" అని చెప్పెను.

ఇచ్చట నింక నొకసంగతి చెప్పవలసియున్నది. ఈ జామదగ్న్యుఁడగు పరశురాముఁడు కృష్ణునిసమకాలికుఁడుగా నిందు వర్ణింపఁబడియెను. రామాయణమునందితఁడు రామునితో సమకాలికుఁడైనట్లున్నది. మఱియు బురాణములయందుఁ బరశురాముఁడు రామకృష్ణులకుఁ బూర్వుఁడుగను, విష్ణునియవతారాంతరుఁడుగను జెప్పఁబడి యుండెను—పురాణములయందలి దశావతారవాద మెంతవఱకు సంగతమో యీసంగతింగూర్చి మేము గ్రంథాంతరమున విమర్శించి యున్నాము.

ఈహస్తినానగరయాత్రావర్ణనంబునుబట్టి [illegible]బింపఁగా శ్రీకృష్ణుఁడు సాధారణజనులకుఁ గూడఁ బూజ్యుఁడై యుండెనని తోఁచుచున్నది. ఆవర్ణనమునందొకను గొంతభాగమును జూపెదము.

"దేవకీనందనుఁడు సర్వసస్యపరిపూర్ణంబులును, నతిరమణీయంబులును, సుఖాస్పదంబులును, బరమపవిత్రంబులును నగు బహువిధగ్రామంబులను హృదయానందకరంబుగా సందర్శించుచును, బహుపురంబులను, రాజ్యంబులను నతిక్రమించి పోవుచుండెను. [illegible]కురుకుల సంరక్షితులును, నిత్యప్రహృష్టులును, ననుద్విగ్నులును, వ్యసనరహితులు నగుపౌరులు మార్గమధ్యంబున శ్రీకృష్ణునిరాకకుఁ బ్రతీక్షించుచుండిరి. కొంతసేపటికి మహాత్ముఁ డగువాసుదేవుఁ డచ్చటికి వచ్చినతోడనే వారాతని విధ్యుక్తముగఁ బూజించిరి:—

"అంత భగవంతుం డగు నంశుమంతుఁడు తనకిర[illegible]లంబు నుపసంహరించి లోహితకాంతియుతుం డగుటయు నరిసూదనుం డగు

మధుసూదనుఁడు రథావతరణంబు చేసి రథ్యంబులఁ విడువఁ బనిచి యొకవృక్షమూలంబున నుపస్థితుఁడై సంధ్యోపాసనంబుఁ గావించు చుండెను. దారుకుఁడు కృష్ణుని యాజ్ఞానుసారంబుగ గుఱ్ఱంబుల పగ్గంబు లువదలించి వానికి యథోచితంబులగు పరిచర్యలను గావించుచుండెను. మహాత్ముఁడగు మధుసూదనుఁడు సంధ్యోపాసనంబు ముగించి తనపరి వారజనులం గాంచి "యుధిష్ఠిరుని యాజ్ఞానుసారంబుగ నీరాత్రి యిచ్చ టఁ గడపవలయును" అనెను. అట్లనే పరిచారకు లాతని యుద్దే శమును గ్రహించి నిమిషములో నొక పటకుటీరమును నిర్మించి వివిధంబులగు సుమృష్టంబులగు నన్నపానములను సిద్ధములుగాఁ జేసిరి. అనంతర మాగ్రామమునందలి స్వధర్మనిరతులగు బ్రాహ్మణులు మహాత్ముండగు హృషీకేశుని పాలికి వచ్చి యథావిధులగు నర్చనల నా తనిని విధిపూర్వకముగ సన్మానించి యాశీర్వదించి మాయిండ్లకు దయ చేయవలయు నని ప్రార్థించిరి. భగవంతుండగు కృష్ణుండును వారిమాట లను సమ్మతించి వారినందఱ గౌరవించి వారి యిండ్లకుఁ బోయి మరల వారితోఁ గలసి తన పటకుటీరమునకు వచ్చెను. తరువాత శ్రీకృష్ణుఁ డా బ్రాహ్మణులతోఁ గూడి యుత్తమమృష్టాన్నంబుల భుజించి సానందం దముతో నా రాత్రిని గడపివేసెను."

ఇది కేవలమును మనుష్యచరిత్రము కాదా? కాదు. ఆదర్శ పురుషుచరిత్రము! అతని నవ్వాఁడను దేవునిగాఁ దలంచి పూజించిన బ్రెప్పటను కానవచ్చుటలేదు. కాని, మనుష్యశ్రేష్ఠుఁ డన్నట్లుగను మాత్రము గాంచునో శ్రీకృష్ణుఁ డప్పుడు దర్శనమును తేర్చుచుండెను. మహిమ నాతఁ డాదర్శపురుషుండని తనే లోకములో వ్యవహరింపఁబడును.

షష్ఠ పరిచ్ఛేదము.

కరిపురంబునఁబ్రథమదివసము.

శ్రీకృష్ణుఁడు వచ్చుచుండెనని విని వృద్ధుఁడగుధృతరాష్ట్రుఁ డాతని నభ్యర్చించుటకై మిగులనాడంబరముగాఁ బ్రయత్నములను గావించుచుండెను; సభామండపమును నానారత్నసమాకీర్ణంబుగఁ జేయించెను. మఱియు నాతనికిఁ గానుక యొసంగుటకై యనేకరథగజతురంగములను, దాసులను, "అజాపత్యంబగు దాసీశతంబును" నమూల్యరత్నంబులను సంగ్రహించి యుంచెను.

ఈప్రయత్నముల నన్నిటిం గాంచి విదురుఁడు "మేలుమేలు! నీవెట్టిధార్మికుఁడవో యట్టిబుద్ధిమంతుఁడవు. కాని యిట్టిరణోపహారంబులవలన శ్రీకృష్ణుని వశపఱుచుకొనఁజాలవు. ఆతఁ డెందుకొఱకు వచ్చుచుండెనో, యాకార్యమును సంపన్నంబు గావించినచో నాతఁడు సంతుష్టుం డగును. అర్థలుబ్ధుఁడై యాతఁడు నీకు వశ్యుఁడు కాఁజాలఁడు" అని చెప్పెను.

ధృతరాష్ట్రుఁడు ధూర్తుఁడు; విదురుఁడు సరళహృదయుఁడు. దుర్యోధనున కీరెండుశక్తులునున్నవి! అప్పుడు దుర్యోధనుఁడు "కృష్ణుఁడు పూజనీయుఁ డనుమాట నిజమే. కాని యాతనిం బూజించుట యుచితము కాదు. యుద్ధము తప్పదైనప్పుడు మన మాతని సన్మానించు టెందుకు? మనము భయపడి యాతనిఁబూజించుచుంటి మని లోకు లనుకొందురు. ఈయన్నిటికంటెను నేనొక మంచియాలోచనమును స్థిరపఱుచుకొంటిని. మనమాతని బంధింపవలయును. పాండవులకు బలమైనను బుద్ధియైనను గృష్ణుఁడే—ఆతఁడు బంధితుఁడైనచో నతిసులభముగఁ బాండవులు మనకు వశీభూతులై పోవుదురు." అనియెను.

ధృతరాష్ట్రుఁ డామాటల నాలకించి కుమారుని దిరస్కరించు టకు బాధ్యుఁడయ్యెను. ఏమనిన—కృష్ణుఁడు దూతగా వచ్చుచుండెను. అప్పుడు కృష్ణభక్తుఁడగుభీష్ముఁ డనేకవిధంబులగుకటూక్తులచే దుర్యోధనుని నిందించి యాసభనుండి వెడలిపోయెను.

నాగరికులును, కౌరవులును మిగులసన్మానముతో శ్రీకృష్ణుని సభామందిరమునకుఁ దోడ్కొని వచ్చిరి. కృష్ణుఁడప్పుడు తనకొఱకెంత యోపప్రియత్నముతో నలంకరించిన యాసభాలంకారములఁ దన కడకంటనైనఁ దిలకింపలేదు. ఆతఁడు తిన్నఁగా ధృతరాష్ట్రభవనంబునకుం బోయి కౌరవసభయందుఁ గొంతసేపుండి యోగ్యులగుసభాసదుల నుచితముగ సంభాషించెను; అనంతరము రాజప్రాసాదమును బరిత్యజించి దీనబంధుఁ డగునాతఁ డొకదీనునియింటికిం బోయెను.

విదురుఁడు ధృతరాష్ట్రున కొకవిధమైనసోదరుఁడు. ఆయిరువురు ను వ్యాసదేవుని యౌరసపుత్రులు. కాని ధృతరాష్ట్రుఁడు మహారాజ గువిచిత్రవీర్యునకు క్షేత్రజపుత్రుఁడు; విదురుఁ డట్టివాఁడు కాఁడు. ఆ తఁడు విచిత్రవీర్యునిదాసి యగునొకవైశ్యస్త్రీగర్భమున జన్మించెను. ఆ తనిఁగూడ విచిత్రవీర్యుని క్షేత్రజునిగా గ్రహించినను వానిసకి జాతి నిర్ణితము కాలేదు. ఏమనిన—బ్రాహ్మణునకొరసుఁడైక్షత్రియక్షేత్రింబగువైశ్యస్త్రీగర్భమునం దాతఁడు జన్మించెను. ఆతఁడు సామాన్యవ్యక్తియైయున్నను బరమధార్మికుఁడై యుండెను.

మహాభారతమునందలి నాయకులకందఱకునుజాతిసంబంధమున నిట్టికళంకమే యుండెను. పాండవులవిషయమునఁగూడ నిట్టిగోలయేయున్నది. పాండవులకుఁ బ్రపితామహి యగుసత్యవతి దాశకన్య. భీష్ముని తల్లి దేజాతియో? దానిని దాఁచుటకు విశేషప్రయోజన మున్నదని తోఁచుచున్నది. అందుచే నాతఁడు గంగానందనుఁ డయ్యెను. ధృతరా

ష్ట్రుఁడును పాండురాజును క్షత్రియస్త్రీగర్భమున జనించినను బ్రాహ్మ
ణున కౌరసులై యుండిరి. వ్యాసభగవానుఁడు స్వయముగాఁ గన్యాయ
గుపల్లెదానికిఁ బుత్రుఁ డయ్యెను. అందువలన ధృతరాష్ట్రుఁడును, పాం
డురాజునుగూడ నీదినములలో నేజాతివారితో నైనను బంక్తిభోజనము
న కర్హులు లేనివారుగా నగపడుచున్నారు. పాండుపుత్రులు కుంతీగర్భ
జు లన్నమాట సత్యమే—కాని వారు తండ్రికిఁ బుట్టినబిడ్డలు కారు.
పాండురాజు స్వయముగాఁ బుత్రోత్పాదనముం గావించుట కసమర్థుఁ
డై యుండెను. కావునఁ బాండవు లిందాఁక కౌరసపుత్రులుగా న
గపడుచున్నారు. మఱియుం బరిశీలింతము—ద్రోణునితండ్రి భరద్వాజ
మహర్షియే కాని యాతనితల్లిమాత్ర మొకకలశము. కలశము గర్భ
ముం దాల్చుటనుగూర్చి విశ్వసింపనివారికి ద్రోణాచార్యుని మాతృకు
లముంగూర్చి సందేహము కలుగక మానదు. పాండవులకుఁ బిత్రవిష
యంబున నెంతగోల యున్నదో, కర్ణునికిఁగూడ నంతగోలయున్నది—వి
శేషించి యాతఁడు కానీనుఁడుకూడను—ద్రౌపదికిని, ధృష్టద్యుమ్నునికిని
దల్లిదండ్రులెవ్వరో యెవ్వరికిని దెలియుటయే లేదు. వారు యజ్ఞసంభూ
తు లనిమాత్రము చెప్పఁబడి యుండెను.

ఈసమయమున వివాహసంబంధములలో మాత్ర మెట్టిగొడవ
యును లేదు. అనులోమప్రతిలోమవివాహములనుగూర్చి చెప్పుచుండు
ట లేదు—అనేకమహర్షులధర్మపత్నులు క్షత్రియకాంతలై యుండిరి. అగ
స్త్యునకు లోపాముద్ర, ఋష్యశృంగునకు శాంతయును, ఋచీకుని భా
ర్యయును, జమదగ్నిభార్య యగు రేణుకయును క్షత్రియస్త్రీలే—పర
శురాముఁడు పృథ్విసంతను క్షత్రియశూన్యంబుగఁ జేయుటచేఁ దరువా
తిక్షత్రియు లందఱును బ్రాహ్మణుల కౌరసులుగనే జన్మించియుండిరని
యిప్పటికిని జెప్పుచుండుట కలదు. పక్షాంతరమున బ్రాహ్మణకన్యాయ

గు దేవయాని క్షత్రియుఁ డగుయయాతికి ధర్మపత్ని యయ్యెను. ఆ కాలమున నాహారవిషయంబున నట్టి యడ్డంకులును లేవు. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులునుగూడ నొకరియన్నము నొకరునిరాతంకముగ భుజించుచుండిరి.

శ్రీకృష్ణుఁడు రాజప్రాసాదమును వదలి విదురునియింటికిఁ బోయి యట నాతనియాతిథ్యము నంగీకరించెను. పాండవులకు జననియుఁ గృష్ణునకు మేనత్తయు నగుకుంతీదేవి యాయింటనే యుండెను. పాండవులు తమవనగమనకాలమునం దామెను విదురునింట విడిచి పోయిరి. కృష్ణుఁడు కుంతికిఁ బ్రణామము గావింపఁబోయెను. అప్పు డామె తన కొడుకులయుఁ గోడండ్రయు దుఃఖములను స్మరించుకొని కృష్ణునిసన్నిధి ననేకవిధముల దుఃఖింప నారంభించెను. ఆమెదుఃఖాలాపములకుఁ బ్రత్యుత్తరముగా నప్పుడుశ్రీకృష్ణుఁడు చెప్పినమాటలత్యంతము నమూల్యము లైనవి. మనుష్యచరిత్రమునందలి సర్వవిషయములను సంపూర్ణముగ గ్రహించినవానికిఁ దక్క నితరుని కెవ్వనికి నట్టియమూల్యతత్త్వము బోధపడనేరదు. మూర్ఖుల కీసంగతియే తెలియదు.

అప్పుడు శ్రీకృష్ణుఁడు. "పాండవులు నిద్ర, తంద్ర, క్రోధము, క్షుధ, పిపాస, శీతము, ఆతపము మొదలగువానిని లక్ష్యముసేయక వీరోచితసుఖనిరతులై యున్నారు. వారింద్రియ సుఖంబులను గణింపక వీరోచితసుఖసంతుష్టులై యున్నారు. మహాబలపరాక్రాంతులును, మహోత్సాహసంపన్నులు నగునావీరశేఖరు లల్పవిషయంబులకు సంతుష్టు లగువారు కారు. వీరపురుషులగువా రతితరక్లేశము లేకుండగనే యత్యుత్కృష్టంబు లగుసుఖంబుల ననుభవించుచుందురు. మఱియును వారింద్రియసుఖాసక్తులమధ్యమునందుండియు సంతుష్టులై యున్నారు. దుఃఖాకరం బగురాజ్యలాభమైనను, వనవాసమైనను వారికి సుఖనిదానమే" అని చెప్పెను.

"రాజ్యలాభమైనను, వనవాసమైనను" * అను వాక్యమును మాత్ర మాధునికహిందువులు గ్రహింపఁజాలరు. గ్రహించినచో వింతదుఃఖమే యుండనేరదు.

శ్రీకృష్ణుఁడు కుంతీదేవిం గాంచి మఱియును "శత్రువినాశనముం గావించి సకలలోకాధిపత్యముం గాంచి యతులైశ్వర్యము ననుభవించుచున్న నీపుత్రులను నీవచిరకాలముననే చూడఁగలవు" అని చెప్పియుండెను.

కావున శ్రీకృష్ణుఁడు సంధి కుదురదనియును, యుద్ధమేజరగుననియు దూరదృష్టిచే మున్దుగనే గ్రహించి నిశ్చయించినట్లగపడుచున్నది. అయినను నాతఁడు సంధికొఱకు హాస్తినాపురమునకు వచ్చియుండెను. తుదకు ఫలించినను ఫలింపకున్నను గర్తవ్యమును జేసియే తీరవలయును. ఫలాఫలములయందనాసక్తుఁడై కర్తవ్యసాధనముం గావింపవలయును. ఇదియే కర్మయోగమని శ్రీకృష్ణుఁడు గీతయందు బోధించియుండెను. మానవునకు యుద్ధముకంటె సంధియే హితకరమైనది. అందుచేతనే సంధిప్రయత్నమనుష్ఠేయమయ్యెను. కాని యథాసాధ్యంబగు ప్రయత్నము చేసినను సంధి కుదురనప్పుడు శ్రీకృష్ణుఁడే యుద్ధవిముఖుఁడగునర్జునునకు రణోత్సాహముం గల్పించుటయందుఁ బ్రధా

* క్షుద్రహృదయ యగుసైతాను "స్వర్గమునందలి దాసత్వముకంటె నరకమునందలి రాజత్వమే శ్రేష్ఠమైనది" అని చెప్పినట్లు మిల్టనుకవి వ్రాసియున్నాఁడు. ఈవాక్యములకును బైనివ్రాసిన మహావాక్యములకు నెట్టిభేదమును లేదని చెప్పుపాఠకుల నేకులుందురనియెఱుంగుదుము. వారికి సంపూర్ణముగ మానవత్వమున్నదను నాశ నాకెంతమాత్రము లేదు. లఘుహృదయుఁడు పరుల యధికారమును సహింపఁజాలఁడు; మహాత్ముఁడు కర్తవ్యానురోధముచే దానిని సహించును. మహాకాంక్షితంబులగు చిత్తవృత్తులకు మహాదుఃఖమో, మహాసుఖమో విస్ఫూర్తిం గల్పింపవలయును గాని తక్కినవేమియుం గూర్పఁజాలవని మహాత్మునకొక్కనికిమాత్రమే తెలియును.

ః సహాయుఁ డయ్యెను. ఏమనిన — సంధికుదురనప్పుడు యుద్ధమే కర్త వ్యమైయుండెను. కావుననే యాతఁడు గీతయందుఁ గర్మయోగము నుప దేశించియుండెను. ఆతఁడే స్వయముగ నావిషయమునఁ బ్రధానయో గియైయుండెను. ఆయాదర్శపురుషుని యుత్తమచరిత్రమును సాకల్య ముగ సమాలోచనముం గావించినచో మనుష్యత్వమన నేమో మనకు బోధపడు నని చెప్పుటకే మేమింతవఱకుఁ బ్రయాసపడవలసివచ్చినది.

కృష్ణుఁడు కుంతియొద్ద సెలవుం గైకొని మరలఁ గౌరవసభకుఁ బోయెను. అచ్చట దుర్యోధనుఁ డాతనిని భోజనమునకుఁ బిలిచెను. కాని యందుకు శ్రీకృష్ణుఁ డంగీకరింపలేదు. కారణమేమని దుర్యో ధనుఁడు ప్రశ్నించెను. అప్పుడు కృష్ణుఁడు ప్రప్రథమమున దుర్యోధ నునకు లోకనీతిని స్మృతికిఁ దెచ్చుచు "దూతలగువారు తమకార్యసిద్ధి యైనతరువాతఁ గాని భోజనమును, పూజాగ్రహణమును గావింపరా దు. కావున నేను కృతప్రయత్నుఁడ నగునంతవఱకును మీసపర్యలనం గీకరింపఁజాలను." అని చెప్పెను. అయినను దుర్యోధనుఁ డాపట్టువిడు వక శ్రీకృష్ణుని బలవంతపెట్టఁదొడంగెను.

అప్పుడు కృష్ణుఁడు లోకము దెవ్వరైనను బ్రీతిచేఁగాని,విపన్న తచేఁగాని పరాన్నభోజనముం గావింతురు. నీవు నాయందలిప్రీతిచే న న్ను భుజింపుమని కోరుటలేదు; నేను విపద్గ్రస్తుఁడనై యుండుటయును లేదు. ఇట్టిచో నీయన్నమును నేనేల భుజింపవలయును?" అనియెను.

భోజనవిషయమున నిమంత్రణగ్రహణ మనునది యొక సామా న్యకార్యము. కాని మనదైనికజీవన మంతయు మొత్తముమీఁదఁగొన్ని సామాన్యకార్యములసముదాయము మాత్రమే. సామాన్యకార్యము లను గావించుట కొకనీతి యున్నది — ఉండుట యుచితము. ఘనకార్య ములనీతి కేదిమూలమో యల్పకార్యములకుఁ గూడ నదియే. — కాని

నే మతమని చెప్పవచ్చును. అయినను సచ్చరిత్రులగు మానవులకును నల్పజ్ఞానులగువారికిని భేదమున్నది. అల్పబుద్ధులు మతవిముఖులు కాక యున్నను, సామాన్యకార్యములయందలినీతితత్వము ననుసరించుట క సమర్థులై యుందురు. వారందలినీతిమూలమును గ్రహింపఁజాలరు. ఆ దర్శపురుషుఁ డెట్టియల్పకార్యములయందైనను నీతితత్వమును బరిశీలించి మెలఁగుచుండును.—

ఆనిమంత్రణగ్రహణము శ్రీకృష్ణునకు సరళత్వమునకును సత్యమునకును విరుద్ధముగాఁ దోఁచెను. కావున నాతఁడు దుర్యోధనునకు సరళంబును, సత్యంబు నగునుత్తర మొసంగెను. పరుషమైనను స్పష్టభాషణముం గావించుట కాతఁడు సంకోచపడలేదు. ధర్మానుమతం బగునకపటవ్యవహారము పరుషముగాఁ దోఁచినప్పుడు మనము సంకోచించెదము. ఈధర్మవిరుద్ధం బగుసంకోచమే చాలవిషయములందు మనలను మెల్లమెల్లగా నధర్మవిపన్నులం గావించుచున్నది.

తరువాతఁ గృష్ణుఁడు కౌరవసభనుండి విదురునియింటికిఁ బోయెను. ఆరాత్రి యాతఁడు విదురునితో ననేకవిషయములంగూర్చి సంభాషించెను. దుర్యోధనుఁడు సంధి కంగీకరింపఁడనియు, నీవిచ్చటికి వచ్చుట యనుచిత మనియును విదురుఁ డాతని కెఱింగించెను. దానికిఁ గృష్ణుని ప్రత్యుత్తరమిది:—

"రథగజతురగపదాతివర్గంబులచే విపర్యస్తం బగుసేనాసముదాయముగల భూమండలమును మృత్యుపాశమునుండి తప్పించుట కెవ్వఁడు సమర్థుఁ డగునో యాతనికే సర్వోత్కృష్టంబగుధర్మలాభంబు సిద్ధించును."

ఐరోపాయందలి ప్రతిరాజప్రాసాదమునందును నీవాక్యములను

స్వర్ణాక్షరములతో లిఖించుకొనుట యుచితమైయుండును. కృష్ణుడు మఱియు నిట్లు చెప్పెను.—

"ఎవ్వడు వ్యసనగ్రస్తుడై బంధుకష్టవిమోచనంబునకై యథాసాధ్యముగఁ బ్రయత్నింపకుండునో యాతడు నృశంసుఁడని పండితులు చెప్పియున్నారు. ప్రాజ్ఞుఁడగువాఁడు మిత్రుని సర్వలక్షణములను గనుపెట్టుచు నాతని నకార్యములనుండి మరలించుటకుఁ బ్రయత్నింపవలయును. దుర్యోధనుఁడు హితకరంబులగు నావాక్యములను వినియును నావిషయమున సంశయించినచో నందువలన నాకెట్టినష్టమును లేదు. మీకుమిక్కిలి బంధూపదేశంబను నాకర్తవ్యకార్యము మఱియు నమూల్యంబగుచున్నది. జ్ఞాతికలహము పుట్టినప్పుడు సదుపదేశంబు గావింపనివాఁడాత్మీయుఁడు గాఁజాలఁడు"

శ్రీకృష్ణుఁడు కేవలమును బరస్త్రీలోలుఁడును బాపాత్ముఁడు నగు గోపాలుఁడనియూరపియనులనమ్మకము. ఈదేశమునందుఁ గూడఁ గొందఱికట్టినమ్మక మున్నది. ఆతఁడు ప్రజానాశనంబునకై యవతరించెనని కొందఱయుద్దేశము. కృష్ణుఁడు కూటతంత్రనిపుణుఁడని కొందఱియభిప్రాయము—కాని శ్రీకృష్ణుఁడు వీరిలో నెవ్వఁడును గాఁడు. ఆతఁడు లోకహితాకాంక్షులలో నగ్రగణ్యుఁడు; జ్ఞానులలో శ్రేష్ఠుఁడు. శ్రీకృష్ణుఁడు ధర్మోపదేశకులలో నుత్తముఁడు; ఆద్యపురుషుఁడు—ఈసంగతి తెలియుటకే యింతవఱకుఁ జెప్పవలసివచ్చెను.

సప్తమపరిచ్ఛేదము.

కరిపురమున ద్వితీయదినసము

మఱునాఁటి ప్రాతఃకాలమున స్వయముగా దుర్యోధనుఁడు శకునియును వచ్చి శ్రీకృష్ణుని విదురభవనమునుండి కౌరవసభకుఁ దీ

డొక్కనిపోయిరి. అప్పుడు గొప్పసభ జరిగెను. నారదుఁడు మొదలగు దేవర్షులును జమదగ్ని మొదలగు బ్రహ్మర్షులును నచ్చటికి వచ్చియుండిరి. అప్పుడు కృష్ణుఁడు ధృతరాష్ట్రునుద్దేశించి ప్రౌఢభాషణంబులతో సంధి విషయంబున దీర్ఘోపన్యాసంబు గావించెను. ఋషులుకూడ నట్లే చేసియుండిరి. కాని యెందువలనను నెట్టిలాభమును లేకపోయెను. అప్పుడు ధృతరాష్ట్రుఁడు „నేనేమి చేయఁగలను! దుర్యోధనునకు బోధింపవలయును” అని చెప్పెను. తరువాతఁ గృష్ణ భీష్మద్రోణాదులు దుర్యోధనున కనేకవిధముల బోధించిరి. అందువలన సంధి కుదురకుండుటయే కాక తుదకు దుర్యోధనుఁడు కృష్ణునింగూర్చి పరుషముగా మాటలాడెను. కృష్ణుఁడు వానికిఁ దగినయుత్తరమునే చెప్పెను. మఱియు నాతని దుశ్చరిత్రమును, బాపవర్తనమును ననేకరీతుల నిందించెను. దుర్యోధనుఁ డుగ్రుఁడై లేచిపోయెను.

ఆసమయమునఁ గృష్ణుఁడు సమస్తరాజనీతికి నేదిమూలసూత్రమో దానిననుసరించి పనిచేయవలయు నని ధృతరాష్ట్రున కెఱింగించెను. ప్రజారక్షణంబునకై దుష్క్రియానిరతుని దండించుటయే రాజ్యశాసనమునకు మూలసూత్రము. అనఁగా బహుజనహితంబునకై యొకదుర్జనుని దండించుట కర్తవ్యము. సమాజరక్షణంబునకై హంతకుని వధింపవలయును. ఎవ్వనివధింపకున్నచో నాతనిపాపాచరణముచే బహుసహస్రప్రాణి నాశనమగునో యట్టిదుష్టుని వధింపవలయు ననియే జ్ఞానులయుపదేశము. ఐరోపాయందలి సమస్తప్రభువులును, మంత్రులును జేరి యీవిషయము నాలోచించి క్రీస్తుశకము 1815 వ సంవత్సరమున నెపోలియనును యావజ్జీవమును బంధించిరి—అందువలననే నీతిజ్ఞశేఖరుఁడగు శ్రీకృష్ణుఁడు దుర్యోధనునిబంధించి పాండవులతో సంధి చేసికొను మని ధృతరాష్ట్రున కుపదేశించెను. శ్రీకృష్ణుఁడు

స్వయముగా యదువంశశిఖామణినయ్యు మేనమామయైనను గంసునివధించుటకు బాధ్యుడయ్యెను. శ్రీకృష్ణుడప్పుడు ధృతరాష్ట్రున కావిషయమునే యుదాహరణముగాఁ జూపించెను. ఈబోధ యంతయు నిరర్థకమయ్యె నని వేఱుగఁ జెప్పనక్కఱలేదు.

ఇట దుర్యోధనుడు క్రోధావిష్టుఁడై కృష్ణుని బంధింపవలయు నని కర్ణునితో నాలోచించుచుండెను. కృష్ణునకు జ్ఞాతివర్గములోనివా రగుసాత్యకి కృతవర్మాదు లాసభయందే యుండిరి. సాత్యకి కృష్ణునకు నితాంతము ననుగతుండును, బ్రియుండు నైయుండెను. మఱియు నాతఁ డస్త్రవిద్యయం దర్జునశిష్యుఁడు-ఎల్లవిధముల నర్జునునితో సమానుఁడు. ఇంగితజ్ఞుఁడును, మహాబుద్ధిమంతుఁడు నగుసాత్యకి వారిదుర్మంత్రమును గ్రహించి, యుతరయాదవవీరులను, గృతవర్మను ససైన్యముగఁ బురద్వారంబున నిలువ నియోగించి దుర్యోధనునిదురాలోచనమును గూర్చి కృష్ణునకును సభామధ్యమునందున్న ధృతరాష్ట్రాదులకును విస్పష్టముగ నెఱింగించెను.

ఆసంగతి విని విదురుఁడు ధృతరాష్ట్రునిం గూర్చి " పావకజ్వాలలం బడి పతంగములు భస్మములై పోవును. వీరికిఁగూడ నట్టిగతి కలుగవలయునా యేమి ? జనార్దనుఁడు తలంచినచో సమరరంగమున సకల దుశ్చరితులను శమనసదనంబున కనుపఁగలఁడు—" అని చెప్పెను.

తరువాతఁ గృష్ణుఁ డాదర్శపురుషుఁడైనందుకుఁ దగినట్లుగా సంభాషించెను. ఆతఁడు బలశాలి యయ్యును గ్రోధశూన్యుండును, క్షమాశీలుఁడు నై యుండెను. అప్పు డాతఁడు ధృతరాష్ట్రునితో నిట్లనియెను ! —

' దుర్యోధనాదులు కోపముతో నన్ను బలవంతముగ బంధింపఁదలంచుచున్నట్లు వినియుంటిని. కాని వీరు నన్నాక్రమించెదరో,

నేనే వీరినందఱ నాక్రమించెదనో నీవు చూచుచుండుము. ఏకాకినయ్యు నీయందఱను నేనాక్రమింపఁగలను. నాకట్టి సామర్థ్యమున్నది. కాని నిందితంబును, పాపజనకంబునునగు కార్యమును నేనెన్నటికిని జేయఁబోను. నీపుత్త్రులే పాండవులయర్థంబున శాసించి స్వార్థభ్రష్టు లయ్యెదరు. వాస్తవముగా వీరు నన్ను బంధింపఁదలంచుట యుధిష్ఠిరునిం గృతార్థునిగావించుటయే. నేనీక్షణమునందే వీరిని వీరియనుచరులనుగూడ నిర్జించి పాండవులకు రాజ్యప్రదానంబుఁ గావింపఁగలను. అందువలన నాకెట్టి పాపమునుగూడఁ గలుగఁబోదు. కాని క్రోధపాపజనితంబులును, గర్హ్యంబులు నగునిట్టికార్యములు నీవంటివాని యెదుట జరగఁగూడదు. నేననుమతించి సిద్ధముగా నున్నాను. దుర్నీతిపరాయణుండగుదుర్యోధనుఁ డిప్పు డేమి చేయఁదలంచెనో చేయునుగాక! "

ఇట్లు చెప్పినతరువాత ధృతరాష్ట్రుఁడు దుర్యోధనునిదన చెంతకుఁ బిల్పించి యతికఠినభాషణంబులచే నాతనిమందలించుచునిట్లనియెను:-

"నీవు కేవలమును నృశంసుఁడవును, పాపాత్ముఁడవును, నీచాశయుండవు నగుటంజేసి యసాధ్యుండవును, భయంకరుండవును, సాధుగర్హితుండవును, పాపాచరణసముత్సుకుండవు నైయుంటివి. కులదూషకా! మూఢునివలె దురాత్ములతోఁ గలసి యత్యంతమును దుర్ధర్షుఁడగుజనార్దనుని నిగ్రహింపఁదలంచుచున్నాఁడవు. బాలకుఁడు చంద్రునింబట్టుకొనుటకుఁ గుతూహలపడినట్లే యింద్రాది దేవగణంబులకుఁగూడ దురాక్రమ్యుఁడగు కేశవుని నీవు నిగ్రహింప నపేక్షించుచున్నావు. దేవమానవగంధర్వులును, నసురులు, నురగులునుగూడ సంగ్రామమునం దెవ్వాని పరాక్రమమును సహింప నసమర్థులగుచుందురో యట్టికేశవుని సామాన్యునిగా నీవు భావించుచుంటివా? వత్సా! వాయువును చేతులతో గ్రహించుట కెన్నఁడైన సాధ్య మగునా? అగ్నిజ్వాలను

హస్తములతోఁ బట్టుట సాధ్య మగునా ? మహీమండలమును మస్తకమున ధరించుసామర్థ్యమెవ్వని కున్నది ? తండ్రీ ! బలముచేఁ గేశవుని నిగ్రహించుట యెన్నటికిని సాధ్యము కాదు"

పిమ్మట విదురుండును దుర్యోధనున నేకవిధంబుల మందలించెను. విదురుఁ డట్లు బోధించినపిమ్మట వాసుదేవుఁ డుచ్చహాస్యంబు చేయుచు సాత్యకికృతవర్మల కరగ్రహణంబు గావించి కౌరవసభనుండి వెడలి పోయెను.

ఇంతవఱకును మహాభారతమునందుఁ జెప్పఁబడిన భగవద్యాన వృత్తాంత మంతయును సుసంగతముగను, స్వాభావికముగను నున్నది. అందెట్టిగొడవయును లేదు; అస్వాభావ విషయ మొక్కటియును లేదు; అవిశ్వాసమునకుఁ గారణ మేదియును లేదు. కాని ప్రక్షిప్త కారులుమాత్ర మీవిశేషమున కెంతమాత్రమును సహింపఁజాలక పోయిరి. ఇంతటిమహాద్భుతపారమునం దొకవిధముగు నస్వాభావాద్భుతవృత్తాంతమును జేర్పక యే యున్నచో నిఁక శ్రీకృష్ణునియీశ్వరత్వమును సంరక్షింపు వా రెవ్వరున్నారు? ఈసంగతిని బాగుగ నాలోచించియే వారుశ్రీకృష్ణునిహాస్యమునకును, నిష్క్రాంతికిని నడుమ నొకవిశ్వరూపప్రకాశము నుప్రక్షిప్తంబు గావించిరి. ఇట్లే మహాభారతమునభీష్మపర్వమున, భగవద్గీతాపర్వాధ్యాయమందుఁగూడ (అదియును ప్రక్షిప్తము కావచ్చును; కాక పోవచ్చును) మఱియొకసారి విశ్వరూపప్రదర్శనము వర్ణింపఁబడి యున్నది. ఆవిశ్వరూపవర్ణనమునకును, నీవర్ణనమునకును నెంతయో భేదమున్నది. గీతయందలి యేకాదశాధ్యాయమునం గలవిశ్వరూపవర్ణనము ప్రథమశ్రేణియందలికవిచే వర్ణితమైనది. సాహిత్యప్రపంచమునం దెంత వెదకినను నిట్టివర్ణనము మఱియొకచో లభింపదు. ఈ భగవద్యానపర్వాధ్యాయమున నీవిశ్వరూపవర్ణనముం గావించినవా

మునఁ గావ్యరచన యనునది కేవలమును విడంబనామాత్రమై యున్నది- భగవద్గీతయందలి యేకాదశాధ్యాయమున శ్రీకృష్ణుఁ డర్జునునం గాంచి “ఇంతకుముం దీవిశ్వరూపమునునీకంటె నితరు లెవ్వరును జూచియుండలేరు” అని చెప్పినట్లున్నది. కాని యీరూపము నర్జునునికంటె ముందుగా దుర్యోధనాదులు కౌరవసభయందే గాంచినట్లగుటవలనఁ దెలియుచున్నది- మఱియు శ్రీకృష్ణుఁడు భగవద్గీతయందు “వేదాధ్యయనము, యజ్ఞానుష్ఠానము, దానము, సత్క్రియాకలాపము, కఠోరతపస్సు మొదలగు సత్కర్మములు గావించినవారుగాక మానవులలో నితరు లెవ్వరును నీవలె నాయీవిశ్వరూపమును దర్శించుటకు సమర్థులు” కాఁజాలరు అని చెప్పినట్లున్నది. కాని యీవిశ్వరూప మిచ్చటఁ గుకవిహస్తమునం బడి జనసామాన్యమునకంతకును నతిసులభముగఁ బ్రత్యక్షమయ్యెను. మఱియు భగవద్గీతయందు “అనన్యసాధారణంబగుభక్తిని బ్రదర్శింపఁగలిగినచో నన్నీరూపముగా గ్రహింపవచ్చును. అట్టివాఁడు నన్నుదర్శించి నాయందువిలీనుండగుటకు సమర్థుండగును” అని చెప్పఁబడియెను. కాని యిచ్చట దుష్క్రియాపరులును, పాపాత్ములును, భక్తిశూన్యులు నగుశత్రువులకుఁ గూడ నట్టిదివ్యరూపసందర్శనము లభించినది.

మూర్ఖుఁడుకూడ నిష్ప్రయోజనముగా నేపనియును జేయఁ డనినప్పు డిఁక విశ్వమూర్తియగు శ్రీకృష్ణునిమాట చెప్పవలయునా ? ఇచ్చట విశ్వరూపప్రదర్శనమున కెంతమాత్రమును బ్రయోజనము లేదు. దుర్యోధనాదులు వట్టియాలోచనయేగాని యిచ్చట నెట్టిబలప్రయోగమును గావించి యుండలేదు. ఒకవేళ వారు బలప్రయోగము గావించినను నిరర్థకమని కృష్ణునకుఁ దెలియును. అతఁడు స్వయముగా నెంతటివారికైనను లొంగని బలశాలి. ఈసంగతి ధృతరాష్ట్రుఁడును విదురుఁడునుగూడఁ జెప్పియుండిరి. స్వయముగాఁ గృష్ణుఁడును జెప్పెను.

ఆత్మరక్షణమునకుఁ దనబలము చాలకపోయినను గృష్ణున కెంత మాత్రము నాభయము లేదు. సాత్యకికృతవర్మాదులును, మహాబల రాక్రాంతులగు వృష్ణివీరులును నాతనికి సహాయులై యుండిరి. వారి సైన్యములు రాజద్వారమున సంసిద్ధములై యుండెను. దుర్యోధనుఁడు సేనలలో సన్నద్ధుఁడైనట్లెంతమాత్రము నగపడుట లేదు. దుర్యోధను ని దుష్ప్రయత్నము ఫలించునేమో యని కృష్ణునకు సంశయమును లేదు. అంతమాత్రమున భయపడుటకుఁ గృష్ణుఁ డంతటిపిఱికివాఁడు కాఁడు. ఈకారణముల నన్నిటినిబట్టియుఁ జూడఁగా నిచ్చట విశ్వరూప ప్రదర్శనమున కెట్టిప్రయోజనమును లేదు. ఇట్టియవస్థలోఁ బుద్ధుఁడు ను గాంభీర్యుఁడునుదక్క మఱియెవ్వఁడును శత్రువునకు భయప్రదర్శ నము గావించుటకై ప్రయత్నింపఁడు. ఎవ్వఁడు విశ్వరూపుఁడో యాతఁడు దంభక్రోధశూన్యుఁడుగనే యుండును.

కావున నిచ్చటి విశ్వరూపవృత్తాంతము కుకవిప్రక్షిప్తంబగునల్పో పన్యాస మనిచెప్పి పరిత్యజించుటయే కర్తవ్యము. కృష్ణుఁడు మాన నశక్తిమాత్రమే యవలంబించి కార్యములు గావించువాఁడె నుగాని యీశ్వరశక్తి నవలంబించుట లేదని మేము మరల మరలఁ జెప్పుచున్నాము.

కౌరవసభనుండి కృష్ణుఁడు కుంతీదేవియొద్దకుం బోయి యామె తో సంభాషించెను. తరువాత నామెకడ సెలవుగైకొని పాండవులు నివసించియున్న యుపప్లావ్యనగరమునకుం బోవఁ బ్రయాణమయ్యెను. ప్రయాణసమయమునం దాతఁడు కర్ణుని దనరథముపైఁ గూర్చుండఁజేసి కొని బయలుదేఱెను.

(శ్రీ)కృష్ణుని నిర్బంధింపవలయు నని యాలోచించినవారిలోఁ గర్ణుఁడుకూడ నున్నాఁడు. ఇట్టిచోఁ గృష్ణుఁ డాతనిం దనరథముపై నె

క్రించుకొని తీసికొనిపోవుటకుఁ గారణ మేమో తరువాతిప్రకరణమున దెలిపెదము. ఈకథయందుఁ గృష్ణచరిత్రము పరిస్ఫుటముగాఁ గలుదు. సామదండోపాయములందుఁ గృష్ణునినీతిజ్ఞత నిదివఱకుఁ జూచియుంటిమి. ఇఁక భేదనీతియం దాతనిపారదర్శిత్వమును గాంచవలయును. దానిలోఁగూడ శ్రీకృష్ణునిదయయు, జీవహింసాశాంతియు, బుద్ధిప్రభావముఁగూడ లోకాతీతంబులనియును, నాతఁడు నిశ్చయముగా నాదర్శపురుషుఁడే యనియును బోధపడఁ గలదు.

అష్టమ పరిచ్ఛేదము.

కృష్ణ కర్ణ సంవాదము.

కృష్ణుఁడు సర్వభూతదయామయుఁడు. ఈమహారణంబున నెంత ప్రజాక్షయంబగునని యేక్షత్రియుఁడును విచారింపలేదు; కేవలమును గృష్ణుఁ డొక్కఁడే దుఃఖించెను. మొట్టమొదట విరాటనగరమున యుద్ధప్రస్తావము కలిగినప్పుడు కృష్ణుఁడు తనయసమ్మతమును దెలిపియున్నాఁడు. అర్జునుఁ డాతనిం దనకు యుద్ధసహాయుఁడవు కమ్మని కోరఁబోయినప్పుడు కృష్ణుఁడు నేను నిరాయుధుఁడనై యుండెదననియు స్వయముగా యుద్ధము చేయువాఁడఁ గాననియును బ్రతిజ్ఞ చేసెను. కాని యందువలనఁ గూడ యుద్ధము తప్పినది కాదు. అందుచే నుపాయాంతరము లేక ధైర్యశూన్యుఁడై యుండియు నాతఁడు సంధిస్థాపనంబునకై ధృతరాష్ట్రునిసభకుఁ బోయెను. దానివలనఁగూడ నేమియు లాభము లేకపోయెను; జీవహింసానివారణము కాకపోయెను. అప్పుడు రాజనీతిజ్ఞుఁడగు కృష్ణుఁడు జనసమాజసంరక్షణార్థ ముపాయాంతరము నాలోచించెను.

కర్ణుఁడు మహావీరపురుషుఁడు. అతఁడర్జునునకుఁ బ్రతికక్షి యగు రథికుఁడై యుండెను. అతని బాహుబలమునుబట్టియే దుర్యోధనుఁడు తాను బలవంతుఁడ ననుకొను చుండెను. అతని బాహుబలమునే యాధారముగఁ జూచుకొని దుర్యోధనుఁడు పాండవులతో యుద్ధముచేయుటకుఁ బూనుకొనియెను. కర్ణసాహాయ్యమే లేకున్నచో నాతఁడు యుద్ధమునఁ బ్రవేశింపఁజాలఁడు. కర్ణుఁడు శత్రుపక్షమునకు సాహాయ్యము గావించునని తెలిసినచో నాతఁ డవశ్యముగ యుద్ధమునుండి నివృత్తుఁడగును. అది యెట్లు సాధ్యమగునో యాకార్యముం గావింపవలయుననియే కృష్ణుఁడు కర్ణునిం దనరథముపై నెక్కించుకొని తీసికొనిపోయెను. ఆతనికిఁ గర్ణునితో సంభాషించుట యావశ్యకమై యుండెను.

కృష్ణుని యీయభిప్రాయసిద్ధి కుపయుక్తం బగునితరుల కెఱుకపడనిసహజోపాయముకూడ నున్నది.

కర్ణుఁ డధిరథుఁడనుసూతునకుఁ బుత్త్రుఁడుగాఁ బరిచితుఁడై యుండెను. వాస్తవముగా నాతఁ డధిరథుని పుత్త్రుఁడు కాఁడు; పాలిత పుత్త్రుఁడుమాత్రమే. ఆసంగతి కర్ణునకుఁ దెలియదు. ఆతనికిఁ దనజన్మవృత్తాంతము తెలియదు. ఆతఁడు సూతపత్నియగు రాధగర్భమున జనించినవాఁడు కాక కుంతీగర్భసంజనితుఁడును, సూర్యున కౌరసుఁడునైయుండెను. కాని కుంతి కన్యగా నున్నసమయమునం దాతఁడు జన్మించుటచే నామె యప్పుడే యాతనిం బరిత్యజించెను. వాస్తవముగా నాతఁడు యుధిష్ఠిరాదిపాండవులకు సహోదరుఁడును, జ్యేష్ఠభ్రాతయు నైయుండెను. ఈవృత్తాంతము కుంతికంటె నితరులెవ్వరు నెఱుఁగరు. శ్రీకృష్ణుఁ డొక్కఁ డెఱుఁగును. ఆతని యలౌకికబుద్ధికి సకలవృత్తాంతములును సహజముగా నెఱుకపడుచుండును. కుంతి యాతనికి మేనత్త. ఆమె భోజరాజగృహమందుండఁగా నిట్లు జరగుట తటస్థించెను.

కావునఁ గృష్ణుఁడు మానవోచితబుద్ధితోడనే యీసంగతిని గ్రహించుట యసంభవము కాదు.

కృష్ణుఁ డిప్పు డీవృత్తాంతమును రథారూఢుం డగుకర్ణున కెఱింగించెను. ఆతఁడు కర్ణునిం గాంచి "ఒక కన్యను బెండ్లియాడినవాఁ డాకన్య కన్యాత్వమునం గన్న పుత్రునకును దండ్రి యగునని శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. ఓకర్ణా! నీవును నీతల్లియగు కుంతీదేవికిఁ గన్యావస్థయందుఁ బుత్రుఁడవైతివి. ఆకారణముచేసి ధర్మశాస్త్రానుసారముగాఁ బుత్రుఁడవు. కావున నాతోరమ్ము. ధర్మశాస్త్రమునకు విరుద్ధంబైనను * నీవు రాజ్యేశ్వరుండ వయ్యెదవు," అని చెప్పెను. మఱియు నాతఁడు కర్ణునితో నీవు జ్యేష్ఠుఁడ వనియు నందుచే నీవే రాజవయ్యెద వనియుఁ బంచపాండవులును నీయాజ్ఞానువర్తులై నీపరిచర్యలం గావించుచుండెద రనియు నెఱింగించెను.

కృష్ణుని యీయుపదేశము సర్వజనులకును ధర్మవృద్ధికరంబును హితకరమునై యున్నది. ముందుగాఁ గర్ణునిపక్షమున హితకరమైనది. ఆతఁడు రాజ్యేశ్వరుఁ డగును. అదియే యాతనికి ధర్మముకూడను-ఏమనిన-భ్రాతృగణంబునెడల శత్రుభావమును బరిత్యజించి మిత్రభావము నవలంబించినట్లగును. ఇది దుర్యోధనుని పక్షమునకుఁగూడ హితమే. ఏమనిన-యుద్ధము జరిగినచో వారు రాజ్యభ్రష్టు లగుటయేగాక సమూలముగ నశించిపోవుదురు. యుద్ధము లేకున్నచో వారందఱును బ్రదుకుదురు; వారిరాజ్యము నిలుచును; కేవలమును బాండవులభాగ

* „విరుద్ధంబైనను„ అను నీమాట కాళీప్రసన్నసింహుని యనువాదమందున్నది. కాని, యిది యిచ్చట నసంగతముగాఁ దోఁచుచున్నది. మేము మాయొద్ద నున్న మూల మహాభారతమును జూచితిమి. అందు „నిగ్రహార్థమశాస్త్రాణామ్„ అని యున్నది. „నిగ్రహార్థాయశాస్త్రాణామ్„ అని యుండు ననితోఁచుచున్నది. అట్లయినచో నర్థము సంగతమగును.

ము మాత్రమే వారీయవలసియుందురు. మఱియు నిది పాండవులకుఁ గూడ హితమును ధర్మమునై యున్నది. యుద్ధరూపమున నృశంసవ్యాపారమునఁ బ్రవేశింపకుండఁగనే బంధుమిత్రజ్ఞాతివధంబు గావింపకుండఁగనే వారికిఁ గర్ణునితోఁగూడ స్వరాజ్యము ననుభవించుట తటస్థించును. ఇంతేకాక ధర్మాత్ముండగు శ్రీకృష్ణుని యీ యాలోచనమునకు ముఖ్యహితోద్దేశ మేమనిన—దీనివలన నసంఖ్యప్రజాగణంబులకుఁ బ్రాణరక్షణంబు కాఁగలదు.

కర్ణుండును శ్రీకృష్ణునివాక్యంబుల యుపయోగము నంగీకరించెను. ఈయుద్ధమున దుర్యోధనాదుల కెంతమాత్రమును రక్షణము లేదని యాతఁడును గ్రహించెను. కాని కృష్ణుని మాటలకు సమ్మతించినచోఁ దానేవేవియో మహాపరాధములను గావించినవాఁడనగుదునని కర్ణుఁడు భావించుకొనియెను. అధిరథుఁడును రాధయు నాతనిం బెంచియుండిరి. ఆతఁడు వారియాశ్రయమునందే యుండి సూతవంశమునం దొకకన్యను బెండ్లియాడి పుత్రపౌత్రాదులం గాంచి యుండెను. వారి నాతఁ డేవిధముచేతను బరిత్యజింపఁ జాలఁడు మఱియు నాతఁడు పదుమూఁడవయేఁటినుండియు దుర్యోధను నాశ్రయించి రాజ్యభోగముం గాంచియుండెను. దుర్యోధనుఁ డాతనిమీఁదనే యాధారపడియుండెను. ఇట్టిస్థితిలో దుర్యోధనుని బరిత్యజించి పాండవపక్షమునం జేరినచో లోకు లాతనిని గృతఘ్నుఁడనియుఁ బాండవైశ్వర్యలుబ్ధుఁడనియు నిందింపక మానరు; పాండవులకు భయపడిన పిఱికివాఁడనికూడ భావింతురు. ఈ కారణములచేఁ గర్ణుఁడు కృష్ణునివాక్యముల నెంతమాత్రమును నంగీకరింపఁజాలకపోయెను.

అప్పుడుకృష్ణుఁడు “నామాటలకు నీవు సమ్మతింపకుండుటంబట్టి చూడఁగా నివ్వసుంధరకు సంహారదశ సంభవించినదని నిశ్చయముగాఁ దోఁచుచున్నది” అనియెను.

కర్ణుండును నాతనిమాటల కుచితంబులగు ప్రత్యుత్తరముల నొసంగి శ్రీకృష్ణుని గాఢాలింగనంబు గావించుకొని విషణ్ణహృదయముతో సెలవుగైకొనియెను.

కృష్ణచరిత్రముం దెలిసికొనుటకై కర్ణచరిత్రమును విస్తారముగ విమర్శించుటవలనఁ బ్రయోజనము లేదు. అందుచే మేమీవిషయమున నేమియును జెప్పలేదు. కర్ణచరిత్రముకూడ నతిమాహాత్మ్యమును నతిమనోహరము నైనదియే.

నవమపరిచ్ఛేదము.

ఉపసంహారము.

కృష్ణుఁ డుపప్లావ్యనగరమునకుఁ దిరిగివచ్చినతోడనే యుధిష్ఠిరాదులు "నీవు హాస్తినాపురమునకుఁ బోయి యేమి చేసికొని వచ్చితివి అని యాతనినడిగిరి.

అప్పుడు కృష్ణుఁడు కౌరవసభలోఁ దాను జెప్పినమాటలను జెయు నితరులు చెప్పినమాటలను వారి కెఱింగించెను. కాని పూర్వాధ్యాయమున వర్ణింపఁబడిన యామాటలకును నీయధ్యాయమునందలి మాటలకును సంబంధము సరిగా లేదు. ఒకదానితో నొకటి కలయుట లేదు. కలసినను దీర్ఘసమాసపునరుక్తులతో నిండియుండెను. ఎవ్వఁడో యొకమహానుభావునిచేయి యిందుఁ బ్రవేశించి యుండు నని తోఁచుచున్నది.

ఇంతటితో భగవద్యానపర్వాధ్యాయము సమాప్తమైనది. దీని తరువాత సైన్యనిర్ణయ పర్వాధ్యాయము. ఇందు విశేష విషయము లేవియును లేవు. ఇందుఁ గొన్ని మౌలికవృత్తాంతము లున్నవి. కాని

మఱికొన్ని యమాలికమలుకూడ నున్నవి. కృష్ణునకు సంబంధించిన వృత్తాంతము లిందు స్వల్పముగా నున్నవి. కృష్ణార్జునుల యాలోచనా నుసారముగాఁ బాండవులు ధృష్టద్యుమ్నుని సేనానాయకునింగావించిరి. బలరాముఁడు మదిరాపాన వివశుఁడై వచ్చి శ్రీకృష్ణుని సమధురముగ నుందలించెను. ఏమనిన బలదేవుఁడు కురుపాండవులయెడల సముఁడై యుండలేదు—మఱియుఁ గురుసభయందు జరగిన వృత్తాంతము కూడ నిందుఁ గొంతయున్నది. ఇంతకంటె నీయధ్యాయమున మఱేమియును లేదు.

తరువాత, ఉలూకదూత పర్వాధ్యాయము. ఇది కేవలము ననుపయుక్తమైనది. కేవల ముభయపక్షములవారి యడావడితప్ప నిందేమియును లేదు. దుర్యోధనుఁడు శకుని ప్రభృతుల యుపదేశానుసారముగా నులూకుని బాండవులయొద్దకు దూతగాఁ బంపించెను. అట్లు పంపుట కుద్దేశమేమియును లేదు. కేవలమును బాండవులను గృష్ణుని నిందించుటయే యుద్దేశము. ఉలూకుఁడు వచ్చి యాయాద్వారను నిందించెను. వానికిఁ బ్రత్యుత్తరముగాఁ బాండవులును నిందోక్తులం బలికిరి. కృష్ణుఁడు విశేషముగ నేమియు మాటలాడలేదు. రోషామర్షశూన్యుఁడగు నాతనివంటివాఁడు పరుషసంభాషణముం గావించునా? వృథావాదము పెరుగకుండుటకై శ్రీకృష్ణుఁడు పాండవులుత్తరమిచ్చుటకు ముందుగనే యులూకునిం గాంచి "పాండవులు నీమాటల నాలకించి వానియర్థమును గ్రహించి యున్నారు. ఇప్పటిమీయభిప్రాయము సరిగ నేయున్నది. మఱియు మీతిరస్కారవచనములకు విశేషముగాఁ గృష్ణార్జునులే బాధ్యులైయున్నారు" అని చెప్పెను.

కాని యులూకుఁ డింకను దనదుర్బుద్ధిని విడువలేదు. ఆతఁడు మరల నిందించుట కారంభించెను. నిందింపకేమి? ఆతఁడు దుర్యోధ

నునిసోదరుఁడుకదా! అప్పుడు పాండునందను లొక్కొక్కరుగఁ బ్రత్యు త్తరమిచ్చి వడ్డితోఁగూడ నాతనియప్పును దీర్చివైచిరి. కృష్ణుఁడొకమా టచెప్పెను "నేనర్జునునకు సారథినైయుండుటకు మాత్రమే యంగీకరిం చుటచే యుద్ధము చేయనుగదా యని నిశ్చయించుకొని మొగసిపడవల దు. హుతాశనుఁడు తృణసమూహమును భస్మంబు గావించినట్లే నేను ను దుట్టతుదకుఁ గ్రోధావేశముచే సకలపార్థివ మండలమును సంహా రంబు గావించెదను; సందేహము లేదు"

ఉలూకదూతగమన పర్వాధ్యాయమున మహాభారత కార్యప క్షంబున నించుకంతయును బ్రయోజనము లేదు. ఇందలికవిత్వమున ర చనానైపుణ్యమును లేదు; మఱియు నచ్చటచ్చటఁ గొన్నిభారతాంశ ములకు వైరుధ్యముకూడఁ గానంబడుచున్నది. అనుక్రమణికాధ్యా యమున సంజయకృష్ణుల దౌత్యవృత్తాంతముమాత్రమే యున్నది; కాని యులూకదౌత్యవృత్తాంతము లేదు. ఈకారణములనుబట్టి యిది ప్రి థమ శ్రేణియందలి కవిరచనకాదని తోఁచుచున్నది.

దీని తరువాత రథాతిరథసంఖ్యానపర్వాధ్యాయము. పిమ్మట, అంబోపాఖ్యానపర్వాధ్యాయము. వీనిలోఁ గృష్ణవృత్తాంత మేమియు నులేదు. ఇంతటితో నుద్యోగపపర్వము సంపూర్ణ మయ్యెను.

శ్రీకృష్ణచరిత్రము

షష్ఠఖండము.

కురుక్షేత్రము.

యోనిష్ణోఖ వేదాత్రాదివాభవతి నిష్ఠితః
ఇష్టానిష్టస్యచదృష్టా తస్మైదృష్టాత్మనేనమః

శాంతిపర్వము ౪౭ అధ్యాయము.

ప్రథమపరిచ్ఛేదము.

భీష్మనియుద్ధము.

ఇప్పుడు కురుక్షేత్రమున మహాయుద్ధారంభమయ్యెను. మహాభారతమునందలి నాలుగుపర్వములలో నీమహారణము వర్ణింపఁబడియుండెను. దుర్యోధనునిసేనానాయకులనామముల ననుసరించి యానాలుగుపర్వములును భీష్మ ద్రోణ కర్ణ శల్య పర్వములుగాఁ బేర్కొనఁబడియెను.

ఈయుద్ధపర్వములకు మహాభారతమునందలి నికృష్టభాగముల లోనివానిగాఁ బరిగణింపవచ్చును. వీనియందుఁ బునరుక్తియు, నకారణ నీరసవర్ణనాబాహుళ్యంబును, నస్వాభావికతయు, నత్యుక్తియు, నసంగతియు నను దోషములు విశేషములుగా నున్నవి. ఇందాదికవిరచన స్వల్పభాగముగనే యున్నట్లుబోధయగుచున్నది. కాని యేభాగము మౌలికమో, యేది యమౌలికమో స్థిరపఱుచుట కష్టము. కంటకవనమునఁ బుష్పాపచయంబు గావించుట దుస్సాధ్యకార్యము. అయినను మాకిందుఁ గృష్ణచరిత్రకనుకూలించు విషయములు కానవచ్చినచో

టులనెల్ల యథాసాధ్యముగా విశదీకరించుటకుఁ బ్రయత్నించెదము. భీష్మపర్వమునకు మొదట జంబూఖండ వినిర్మాణపర్వాధ్యాయము కలదు దానితో యుద్ధమునకెట్టిసంబంధమును లేదు——మహాభారత కథకును సంబంధము స్వల్పముగా నున్నది. అందుఁ గృష్ణచరిత్ర మేమియును లేదు. తరువాత భగవద్గీతాపర్వాధ్యాయము. ఇం దిరువది నాలుగధ్యాయములకుఁ బిమ్మట గీత యారంభమైనది. ఈయిరువది నాలుగధ్యాయములలోనను గృష్ణసంబంధ మించుకంతయును లేదు. యుద్ధమునకుఁ బూర్వము దుర్గాస్తవముం గావింపుమని శ్రీకృష్ణుఁ డుపదేశించుటయు నర్జునుండు యుద్ధారంభసమయమున దుర్గాస్తోత్రముం గావించెను. గొప్పగొప్ప కార్యముల నారంభించుపట్టునఁ దమతమవిశ్వాసముల ననుసరించి దేవతారాధనముం గావించుట యవశ్యకర్తవ్యమై యున్నది. అట్లయినచో నీశ్వరారాధనము గావించిన ట్లగును. ఎవ్వరెట్లు ప్రార్థించినను నీశ్వరుఁ డొక్కఁడే కదా!

తరువాత గీత. ఇదియే శ్రీకృష్ణచరిత్రమునకుఁ బ్రధానాంశము గీతోక్తం బగునుపమపవిత్రధర్మప్రచారమే కృష్ణుని యాదర్శమానవత్వమునకైనను, దేవత్వమునకైనను బ్రధాననిదర్శనమై యున్నది.

కాని మేమిచ్చట గీతాసంబంధమున నెట్టిమాటయును జెప్పము. ఏమన——ఈగీతోక్తధర్మముంగూర్చి వేఱొకగ్రంథమున నించించుక వెల్లడించియుంటిమి * ఇఁకముందుఁగూడ T నొకగ్రంథమును వ్రాయుట కుద్యుక్తులమై యున్నాము. గీతాసంబంధమున మాకుఁ గల యభిప్రాయ మీరెండుగ్రంథములవలనను దెలియఁగలదు. ఇఁక నిచ్చటఁ బునరుక్తివలనఁ బ్రయోజనము లేదు.

* ఆగ్రంథముపేరు ధర్మతత్త్వము.

T. శ్రీమద్భగవద్గీతకు బంగాళా వ్యాఖ్యానము.

భగవద్గీతాపర్వాధ్యాయమునకుఁ దరువాత భీష్మవధపర్వాధ్యాయము. ఇచ్చటనే యుద్ధారంభము. యుద్ధమునందుఁ గృష్ణుఁ డర్జునునకు సారథిమాత్రమే. సారథులు చాలదురదృష్టవంతులు. మహాభారతయుద్ధమునఁ దఱచుగా ద్వైరథయుద్ధములే వర్ణితములై యుండెను. రథికులు యుద్ధముసేయునప్పు డొండొరులతురగసారథులను వధించుటకై ప్రయత్నించుచుందురు. కారణమేమనిన—గుఱ్ఱములో, సారథియో నశించినచో నిఁక రథము చలింపఁజాలదు. రథము కదలకుండినచో రథికుఁడు విపన్నుఁడగును. సారథులెన్నఁడును యుద్ధము సేయువారు కారు. వారు నిర్దోషులు; యుద్ధము సేయకున్నను నిహతులగుచుందురు. కృష్ణుఁడుకూడ నట్టిసుఖమునకే భాగహారియయ్యెను. అతఁడు మరణింపలేదు; కాని యుద్ధము జరుగుచున్న పదునెనిమిదిదినములును బ్రతినిమిషమునందును నాతఁడసంఖ్యశరాహతులచే విక్షతసర్వావయవుఁ డగుచుండెను. ఇతరసారథు లాత్మరక్షణవిషయంబున నసమర్థులై యుండిరి. వారందఱును వైశ్యులు; క్షత్రియులుగారు. కృష్ణుఁ డాత్మరక్షణంబునకు మిగుల సమర్థుఁ డయ్యును గర్తవ్యానురోధంబున శరాఘాతంబులకు సైరించుచుండెను.

మహాభారతయుద్ధమునందుఁ గృష్ణుఁడస్త్రధారణముచేయలేదు; అట్లుచేయనని ప్రతిజ్ఞకూడ గావించి యుండెను. కాని యొక్కదినమునందుమాత్ర మాతఁ డస్త్రధారణముం గావించెను. అస్త్రమును ధరించుటమాత్రమే కాని దానిని బ్రయోగింపలేదు. ఆసంఘటన మిట్లున్నది :—

భీష్ముఁడు దుర్యోధనునకు సేనానాయకుఁడై యుద్ధము చేసెను. అతఁడు మహారణమునం దతినిపుణుఁడు. పాండవసేనలో నొక్కయర్జును

నికంటె నాతనితో సమానులగువా రెవ్వరును లేరు. కాని యర్జునుఁడు తనసామర్థ్యమునంతను జూపి విశేషముగా నాతనితో యుద్ధము చేయలేదు. దానికిఁ గారణ మేమనిన:- భీష్ముఁడర్జునునకుఁ బితామహుఁడు; పితృవిహీనులగు పాండవులను జిన్నతనమునుండియును దండ్రిం బోలి ప్రతిపాలించెను. ఇప్పుడు భీష్ముఁడు దుర్యోధనునిప్రార్థనచే నిరపరాధులగు పాండుకుమారులకు శత్రుఁడై వారికనిష్టముంగూర్చుటకై యుద్ధము చేయుచుండెను. ఆకారణముచే నాతఁడర్జునునకు వధ్యుఁడైనను బూర్వవృత్తాంతమును స్మరించుకొనుచు నర్జునుఁడు భీష్ముని వధించుట కెంతమాత్రమును సమ్మతి లేనివాఁడై యుండెను. అందుచే నాతఁడు భీష్మునెదుర్కొనవలసివచ్చినప్పుడెల్ల మృదుయుద్ధమునుమాత్రమే కావించుచుండెను. ఏమిచేసినఁ దనమూలమున భీష్ముఁడుమరణించునో యని యాతఁడు సంకోచించుచుండెను. అందువలన భీష్ముఁడప్రతిహతపరాక్రముఁడై యసంఖ్యాంబగుపాండవసైన్యమును విధ్వంసముగావించుచుండెను. ఇది యంతయుంగాంచి యొకనాఁడు కృష్ణుఁడు భీష్మునివధింపవలయునను నుద్దేశముతోఁ జక్రహస్తుఁడై రథావతరణంబు సేసి పాదచారియై భీష్మునిమీఁదికి లంఘించెను.

అదియంతయుంగాంచి కృష్ణభక్తుఁడగుభీష్ముఁడు పరమాహ్లాదముతో నిట్లనియెను.

ఏహ్యేహి దేవేశ జగన్నివాస
నమోస్తుతే శార్ఙ్గగదాసిపాణే
ప్రసహ్య మాం పాతయ లోకనాథ
రథోత్తమాం భూతశరణ్య సంఖ్యే"

"ఓజగన్నివాసా! దేవేశా! రమ్ము! రమ్ము! ఓశార్ఙ్గగదాఖడ్గధారీ! నీకు నమస్కారము. ఓలోకనాథా! భూతశరణ్యా! ఆలస్యము

చేయకుండ నన్నీయుద్ధమున రథపతితునిగాఁ జేయుము."

అప్పు డర్జునుఁడును గృష్ణునివెన్నంటిపోయి యాతని ననునయించి సాధ్యానుసారముగా నేనే యుద్ధము చేసెద నని ప్రతిజ్ఞచేసి మరల వెనుకకుఁ దీసికొని వచ్చెను.

ఇట్టిసంఘటనము రెండుసారులు వర్ణితమై యుండెను. భీష్మని మూఁడవనాఁటియుద్ధమునం దొకసారియుఁ దొమ్మిదవనాఁటియుద్ధమునందు మఱియొకసారియు నిట్లుజరగియుండెను. శ్లోకములుకూడ రెండు చోట్లను నొకవిధముగనే యున్నవి; ఇది లేఖకునిప్రమాదమైనను గావచ్చును. ఒక్కటేసంఘటనము వేఱువేఱుసమయములయందుఁ దటస్థించినప్పుడు కవులుకూడ నిట్లు వ్రాయుట కలదు. సంస్కృతగ్రంథములయందుఁ జాలవఱ కిట్టిసాంప్రదాయ మగపడుచున్నది.

రచననుబట్టిచూడఁగా నిది మహాభారతమునందలి ప్రథమశ్రేణికిసంబంధించినకవిరచనవలెనే యగపడుచున్నది. కవిత్వము ప్రథమశ్రేణిదియే. భావమును భాషయు నుదారమై జటిలతాశూన్యమై యుండెను. ప్రథమశ్రేణికవిత్వము మౌలికమని యెంతవఱ కంగీకరింతుమో యీసంఘటనముకూడ మౌలికమని యంతవఱ కంగీకరింపవలసియున్నది.

ఈసంఘటనమునుగైకొని కృష్ణభక్తులుకృష్ణప్రతిజ్ఞంగూర్చియొకతర్కముంగావించి యున్నారు. కాశీదాసుఁడును, గథకులునుగూడ నీ ప్రతిజ్ఞాభంగము నాధారముగఁ జేసికొని కృష్ణమాహాత్మ్యమునుగీర్తించియున్నారు. యుద్ధారంభసమయమున భీష్ముఁడు కృష్ణునియెదుట నిలిచి "నీవీయుద్ధమున నస్త్రముం దాల్పనని ప్రతిజ్ఞచేసియున్నావు. నేను నీచే నస్త్రమును బట్టించెదను"అని ప్రతిజ్ఞ చేసినట్లు వారు తర్కించియున్నారు. కావుననే యిప్పుడు భక్తవత్సలుఁ డగుకృష్ణుఁడు తనప

తిజ్ఞనుగూడ లంఘించి భక్తునిప్రతిజ్ఞను రక్షించెనని వారిసిద్ధాంతము.

ఇట్టికల్పనమువలన నెట్టిప్రయోజనమును లేదు. భీష్ముఁడీవిధముగాఁ బ్రతిజ్ఞ చేసినట్లు మూలమహాభారతమునం దెచ్చటను నగపడుట లేదు. కృష్ణుఁడైనను దనప్రతిజ్ఞ నెంతమాత్రము లంఘింపలేదు. ఆతనిప్రతిజ్ఞయందలియుద్దేశము యుద్ధముచేయకుండుటయే. దుర్యోధనుఁడును, నర్జునుఁడును నేక కాలమునందే యాతని సాహాయ్యము నర్థించి వచ్చినప్పుడు కృష్ణుఁ డాయిరువురకును సమసాహాయ్యముం గావించుటకై "నాతో సమాన మగునారాయణీసేన నొక్కరు గైకొనుఁడు" అని చెప్పియుండెను. "అయుధ్యమానస్సంగ్రామేన్యస్తశస్త్రోహ మేకతః" అని మాత్రమే ప్రతిజ్ఞ. ఆప్రతిజ్ఞ పాలింపఁబడియే యుండెను. కృష్ణుఁడు యుద్ధము చేయలేదు. భీష్మవిషయంబున నిట్లు గావించుట కాతని యుద్దేశము, శక్తి కొలఁదిని యుద్ధము చేయకుండినయర్జునునకు యుద్ధమున దుత్తేజముం గూర్పవలయునని మాత్రమే. ఇది సారథులు చేయవలసినపనియే. ఇప్పుడాతనియుద్దేశము సఫలమైనది.

యుద్ధసమయమునఁ దొమ్మిదవనాఁటిరాత్రి శ్రీకృష్ణుఁ డీయభిప్రాయమునే సూచించియున్నాఁడు. భీష్ముఁడెంతకు నజేయుండై యుండుటం గాంచి యుధిష్ఠిరుఁడు తొమ్మిదవనాటిరాత్రి బంధుమిత్రగణంబులతోఁ గలసి భీష్మవధవిషయంబునుగూర్చి యాలోచించెను. అప్పుడు శ్రీకృష్ణుఁడు "నీవనుమతించినచో నేనుపోయి భీష్ముని వధించెదను. ఇది నీకిష్టము కాకున్నచో నీభారమంతయునర్జునునిమీఁద నే యుంచుము. ఈపని కర్జునుఁడును సమర్థుఁడే" అనియెను.

యుధిష్ఠిరుఁ డట్లుచేయుట కంగీకరింపలేదు. కృష్ణుఁడు తలఁచుకొన్నచో భీష్ముని వధింపఁగలఁడని యాతఁ డెఱుంగును; కాని యుధిష్ఠిరుఁ డప్పుడు "కృష్ణా! స్వార్థపరుఁడనై యాత్మగౌరవంబుకొఱకు నే

ను నిన్ను సత్యవాదినిగాఁ జేయుదలంచుకొనలేను. నిన్ను యుద్ధమునందేయు కూడఁగనే మాండు సాహాయ్యము చేయుదము" అనియెను. అప్పుడు యుధిష్ఠిరుఁ డశ్వత్థామనిపినయు ... యేమియును చెప్పలేదు. తానువారి కృష్ణునియనుజ్ఞ గొని పాండవులు కృష్ణునిఁ గలసి భీష్ముని చెంత కాతనివద్ద సాయము సెలవుకొనుటకై పోయిరి.

భీష్ముండు తనమరణోపాయమును చెప్పలేదు. అనిర్ధమనుగనే యీకార్యము జరిగినట్లు వ్రాసినను ... నిజముగా నట్లు జరిగలేదు. శ్రీకృష్ణుఁ డట్లు చెప్పినట్లు యుక్తము కాదు. అర్జునుఁడే భీష్ముని రథమువలనుండి గాండీవి ... యేసెను. మూలమహాభారతమునందు ద్వితీయ శ్రేణికి సంబంధించినవి తేఖలవు ... యసంగతములును, సిక్షయోజనంబును ... గు ... సాంఘికమును ... కృష్ణచరిత్రముతో వానికి సంపర్కమును లేదు. కావున మేమువానిని ... తెలుపుకొనలేదు.

ద్వితీయపరిచ్ఛేదము.

- - -

ద్రోణపర్వము.

భీష్మునితరువాత ద్రోణాచార్యుండు సేనానాయకుఁ డయ్యెను. ద్రోణపర్వప్రథమభాగమునఁ గృష్ణుండు గాండీవిని ... కార్యమేమి యు సగకుడుట లేదు. అతఁ డర్జునపుత్రుఁ డగు ... సారథ్యము ... గావించెను. కురుక్షేత్రయుద్ధమునకు ... యు, ... యు నాతఁడే యనుమాట యుచ్చుట సత్యముగ లేదు. ...

ధర్మార్జునులకు సదుపదేశములం గావించుటకంటె నాతఁ డేమియును జేసినది లేదు. ద్రోణాభిషేకపర్వాధ్యాయమునందలి యేకాదశాధ్యాయమున సంజయుఁడు కృష్ణునిబలపరాక్రమంబులను మహిమను గీర్తించుటకై యొకమహోపన్యాసముం గావించినట్లు కానఁబడుచున్నది. దానివలన నెట్టి ప్రయోజనమును లేదు. మహాభారతమునం దింకనునేకస్థలములయందుఁ గృష్ణసంకీర్తనమున కభావము లేదు; కాఁబట్టి యీయధ్యాయము ప్రక్షిప్తమనియే తోఁచుచున్నది. మనమాతనిమానవచరిత్రముంగూర్చి యాలోచించుటకుఁ గుతూహలపడుచుంటిమి. మానవచరిత్రము కార్యములయందే ప్రకాశితమగుచుండును. కావున మనము కృష్ణచరిత్ర మాతనికార్యములనుబట్టియే గ్రహింపవలయును.

ద్రోణపర్వమున ముందుగా భగదత్తవధయందు శ్రీకృష్ణుని కార్యమొకటి యగపడుచున్నది. భగదత్తుఁడు మహావీరుఁడు. పాండవపక్షమునం దితరులెవ్వరు నాతనితో యుద్ధము సేయఁజాలరైరి. తుద కర్జునుఁడే వచ్చి యాతనితో యుద్ధమునకుఁ దలపడియెను. భగదత్తుఁ డర్జునునితోయుద్ధముచేయుట కశక్తుఁడనని గ్రహించి యాతనిపై వైష్ణవాస్త్రమును బ్రయోగించెను. అర్జునుఁడుగాని, మఱియెవ్వరుగాని యాయస్త్రమును మరలించుటకు సమర్థులు కారు. కావుననే కృష్ణుఁ డప్పుడర్జునునకడ్డముగ నిలిచి యాయస్త్రమునకుఁ దనవక్షము నొడ్డెను. ఆయస్త్రము శ్రీకృష్ణునివక్షమున వైజయంతీమాలికయై వ్రేలాడెను.

ఈయస్త్రప్రయోగమనునది కేవలమునసంగతమును, నబోధ్యమును నైయున్నది. అస్వాభావవిషయములను విశ్వసింపవలయునని మేము మాపాఠకులకుఁ జెప్పుట లేదు. మఱియు నసైసర్గికసంఘటనములయందు మేమెట్టిసత్యస్థాపనమును గావించుట లేదు. కావున మే మీకల్పనమును బరిత్యజింతుము.

ద్రోణపర్వమున నభిమన్యువధానంతరమున మరల శ్రీకృష్ణుండు కర్మక్షేత్రమునం దగపడుచున్నాఁడు. సప్తరథికులును గలసి యన్యాయముగా నభిమన్యుని వధించినదినమునఁ గృష్ణార్జును లారణరంగమున నిలిచియుండలేదు. అప్పుడు వారు నారాయణబలంబులతో యుద్ధమునకుఁ బోయియుండిరి. ఈసేన శ్రీకృష్ణుఁడు దుర్యోధనున కిచ్చినదియే. ఒకపక్షమునకుఁ దనసేనను, మఱియొకపక్షమునకుఁ దన్నును నర్పించుకొని యాతఁడు రెండుపక్షములయెడలను సమత్వమును నిలుపుకొనియుండెను.

యుద్ధానంతరమున సాయంకాలమునకుఁ గృష్ణార్జునులు శిబిరమునకుఁ దిరిగివచ్చి యచ్చట నభిమన్యువధనుగూర్చి విని యుండిరి. అప్పు డర్జునుఁ డతితరశోకసంతప్తుఁ డయ్యెను. యోగీశ్వరుఁ డగు శ్రీకృష్ణుఁడు శోకమోహముల కతీతుఁడు. అర్జును నూఱడించుటయే యాతనికిఁ బ్రథమకర్తవ్యమై యుండెను. అప్పుడు కృష్ణుఁ డర్జునునివంటివానికి బోధింపఁదగినమాటలనే బోధించి యుండెను. ఆతఁడు గీతలయందే ధర్మమును నిర్దేశించెనో, యాధర్మము ననుసరించినమహావాక్యముల చేతనే యర్జునునిదుఃఖనివారణముం గావించెను. ఋషులందఱును యుధిష్ఠిరు నూఱడించుచు "అందఱికిని మరణమున్నది; అందఱును మరణింతురు" అని బోధించి యుండిరి. కాని కృష్ణుం డట్లు చెప్పలేదు. ఆతఁడు "యుద్ధోపజీవు లగుక్షత్రియవీరుల కిదియే త్రోవ—రణమరణమే క్షత్రియగణంబులకు సనాతనధర్మము" అని చెప్పియుండెను.

కృష్ణుం డభిమన్యునిజనని యగుసుభద్రకుఁగూడ నిట్లే బోధించి యుండెను—

"సత్కులప్రసూతుఁడును, ధైర్యశాలియు నగుక్షత్రియుం డెట్లు ప్రాణపరిత్యాగముం గావించుట యుచితమో యట్లే నీకుమారుఁడు

ప్రాణపరిత్యాగము గావించినాఁడు. కావున నందుకొఱకు దుఃఖింప వలసినయావశ్యక మేమియును లేదు. మహారథుండును, ధీరుండును, పితృతుల్యపరాక్రమశాలియు నగునభిమన్యుఁడు భాగ్యవశంబున వీరగణాభిలషితం బగుసద్గతిం గాంచి యున్నాఁడు. మహావీరుఁ డగునభిమన్యుఁడు భూరిశత్రుసంహారంబు సేసి, పుణ్యార్జనితంబును, సర్వకామప్రదంబును, నక్షయంబును నగులోకమునకుఁ బోయియున్నాఁడు. తపస్సు, బ్రహ్మచర్యము, శాస్త్రము, ప్రజ్ఞయు నగువానిసాహాయ్యమున సాధువు లెట్టిగతిం గాంచుట కభిలషింతురో నీకుమారున కట్టిగతి లాభము కలిగినది. కావున సుభద్రా! నీవు నీతనయునికై శోకించుట యుచితము కాదు"

ఇట్లు బుత్రశోకార్తుం డగునర్జునుఁడు కోపపరవశుండై యొక దారుణంబగుప్రతిజ్ఞచేఁ దన్నుఁదాను బాధించుకొనియెను. ఆతఁడు వినినసంగతులనుబట్టి యభిమన్యువధకు జయద్రథుఁడే ప్రధానకారణుఁడని నిశ్చయించుకొని "రేపటిసూర్యాస్తమయసమయమునకుఁ బూర్వమే జయద్రథుని వధించెదను. అట్లు చేయనైతినేని, స్వయముగా నగ్నిప్రవేశంబు చేసి ప్రాణంబులఁ ద్యజించెదను" అని యతికఠినం బగుప్రతిజ్ఞం గావించెను.

ఈప్రతిజ్ఞావచనము లుభయశిబిరములయందును బ్రతిధ్వనితము లగుచుండెను. పాండవసైనికు లతితరంబుగఁ గోలాహలంబు సేయుచు భేరీధ్వనులఁ గావించుచుండిరి. కౌరవులందఱును భయభ్రాంతులై యాప్రతిజ్ఞంగూర్చి సత్యమును దెలిసికొని జయద్రథరక్షణంబునకై యాలోచనలం గావించుచుండిరి.

అతికఠినవ్యాపారము తటస్థించినదని కృష్ణుఁడు తెలిసికొనియెను. అర్జునుఁ డెట్టియాలోచనయు లేకుండఁ గఠినప్రతిజ్ఞ గావించెను. దానిని సమర్థించుట యసాధ్యముగా నుండెను. జయద్రథుఁడు స్వయ

ముగా మహారాష్ట్రను దు; [illegible] దేశముల నరేశ్వరుండు; బహుసేనా నాయకుండు; విశేషించి సాహిత్యరసమునను భగవద్భక్తి. [illegible] రవద్యోగులందరును [illegible] నాతని రక్షించుటకు. [illegible] కొని యుండగా. [illegible] ప్రధాన యోగులాదులు [illegible] యుండెను. [illegible] (శ్రీ)కృష్ణుండే [illegible] దర్శనము [illegible] వలసివచ్చెను. [illegible] బంధించెను. ఆతండు [illegible] చేసెను—ఈ ప్రతిజ్ఞంగాన్ [illegible] యుండెను. [illegible] ర్యుండు [illegible] స్వకీయులు [illegible] [illegible]. [illegible] కొని మహా [illegible] యున్నను [illegible] ధ్యమై యుండును. [illegible] సిద్ధమై యుండును.

[illegible] నాయకుండ [illegible] కొను. ఆతండు [illegible] బిలిచి "నాయనా [illegible] మహాత్మ్యములు [illegible] సత్ర్ర[illegible]త్ర్రసరిపూర్ణ [illegible] ప్రభా తనయుండునను [illegible] చేసి యున్నాను" అని [illegible] చెను. ఒకవేళ [illegible] గొనించి [illegible] [illegible] తులం [illegible] స్వయముగ [illegible] నను స్వకీయ [illegible] బును, [illegible] బును [illegible] వలయు [illegible] (శ్రీ)[illegible]. [illegible] స్వకీయులు [illegible] బలము చే [illegible] నకు [illegible] యుండెను. ఒకవేళ [illegible]

డు యుద్ధము చేయవలసివచ్చినను, ఆయుద్ధము "అయుధ్యమానస్సం గ్రామేన్యస్తశస్త్రస్సా మేకతః" అనుప్రతిజ్ఞ కెట్టిభంగమును గల్గింపదు. ఆతఁ డిట్టిప్రతిజ్ఞ యేయుద్ధముకొఱకుఁ గావించి యుండెనో యాయుద్ధ మిది కాదు. నేఁటియుద్ధ మర్జునుని ప్రతిజ్ఞాజనితం బగుయుద్ధము. ఈ యుద్ధమునకు భిన్నోద్దేశమున్నది. ఇది యొకవంక జయద్రథుని ప్రాణములకును, మఱియొకవంక నర్జునుని ప్రాణములకును సంబంధించినయు ద్ధము. అర్జునునకుఁ బరాభవమైనచో నాతఁ డగ్నిప్రవేశమూలంబున నాత్మత్యాగము గావించుకొనవలసి యున్నది. ఈయుద్ధ మిదివఱకే చెప్ప డినపద్ధతిలోనిది కాదు. శ్రీకృష్ణునిప్రతిజ్ఞ యీయుద్ధమునకు వర్తింప దు. అర్జునుఁ డాతనికి సఖుండును, శిష్యుండును, బావయు నైయుండె ను. ఆతని యాత్మహత్యానివారణము కృష్ణున కవశ్యకర్తవ్యము—

తరువాతఁ బాండవయోధులందఱును, గృష్ణుండునుగూడ నిద్రించిరి. ఇచ్చట స్వప్నసంబంధ మగుకల్పనాకథ యగపడుచున్నది. స్వప్నమునందు మరలఁ గృష్ణుఁ డర్జునునొద్దకు వచ్చెను; ఇరువురును గలసి యారాత్రియే హిమాలయమునకుఁ బోయి యట నీశ్వరు నుపాసించిరి. పాశుపతాస్త్ర మర్జునున కిదివఱకే వనవాసకాలమున లభించి యుండెను. కాని మరల సంపాదింపవలయునని కోరిక కలిగె ను. ఈవిషయమును గూర్చియే యాకథ—ఇట్టివిషయములను విమ ర్శించుటవలన లాభము లేదు.

మఱునాఁటిసాయంకాలమునకుఁ బూర్వమే యర్జునుఁడు జయ ద్రథుని సంహరించెను. ఆయుద్ధమునఁ గృష్ణుఁ డెట్టి సాయమును జేయ వలసినయావశ్యకము లేకపోయెను. అయినను గృష్ణుఁ డాయపరాహ్ణ మున యోగమాయామూలంబున సూర్యునిఁ గప్పెననియు, జయద్ర థవధానంతరమున మరల సూర్యుని బ్రకాశింపఁజేసె ననియుఁ జెప్పఁ

బడియుండెను. ఎందుకొఱకు? సూర్యాస్తమయమయ్యెనని యెంచి జయద్రథుఁడర్జునునొద్దకు వచ్చునట్లు భ్రాంతిని గల్పించుటకా? ఇట్లు భ్రాంతిపడి జయద్రథుఁడును, నాతనిరక్షకులగు కౌరవవీరులును నసవ ధానులై యుందురనియేనా దీనియభిప్రాయము? ఇచ్చట నిక్కావ్యమునందు వేలువేలుతరగతులకవులచేతులు చేరియున్నట్లగపడుచున్నది. ఒకవిషయమును నాలోచించినచో నిట్టిభ్రాంతినిగల్పించుటవలన నెట్టిప్రయోజనమును లేదు. యోగమాయాప్రదర్శనమునకుఁ బూర్వమునందే యర్జునుఁడు జయద్రథునిం జేరుకొనఁగలిగెను. ఇంతేకాక వారియుభయులకిని సమ్ముఖయుద్ధముకూడ జరగుచుండెను. సూర్యునింగప్పినతరువాతఁగూడ నట్లే జరగుచుండెను. అదివఱకు కర్జునుఁడెట్లు యుద్ధము చేయుచుండెనో యప్పుడుఁగూడ నట్లే చేయుచుండెను. సకలకౌరవవీరులను బరాభూతులం జేయకుండ నర్జునుఁడు జయద్రథుని వధింపఁజాలకుండెను. మఱియొకవిషయము నాలోచించినచో సూర్యావరణకారిణియగు యోగమాయావికాస మిదివఱకుఁ జెప్పినవాని కన్నిటికిని విరుద్ధముగానున్నది. ఈభ్రాంతికల్పనముంగూర్చి పరపరిచ్ఛేదమునఁ దెలిపెదము.

తృతీయ పరిచ్ఛేదము.

ద్వితీయశ్రేణియందలికవి.

మనమింతవఱకును సుగమపథంబున ననుకూలగమనముం గావించి యుంటిమి. కాని యిక్కడినుండి చాలగందరగోళముగా నుండును. మహాభారతము మహాసముద్రమువంటిది. కాని యింతవఱకును

మన ముందలి నిర్మలజలమధ్యంబున మృదుమధురగంభీరశబ్దంబుల నాల కించుచు సుఖముగా నౌకాయాత్రను గావించితిమి. కాని యిచ్చటి నుండి యాకస్మికముగా నతిఘోరం బగుతుపానున దగులుకొని ప్రబలతరంగాభిఘాతంబులచే మాటిమాటికి నుద్ధ్వస్తవిధ్వస్తములు కావల సి యున్నది. మన మీమహాభారతమును దిద్దు నెల్లవిధములను రెం డవతరగతికవిచేతిలోఁ బడి యుంటిమి. అతనిచేతిలోఁ గృష్ణచరిత్రము సంపూర్ణముగాఁ బరివర్తితమై పోయినది. ఉదారంబగు చరిత్రమంతయు ను, క్షుద్రంబును, సంకీర్ణంబు నై పోయినది; సత్యమగునది యస త్యంబును వంచనాకరము నై పోయినది; న్యాయంబును, ధర్మానుమో దితంబునగునది, యన్యాయంబును, నధర్మానుమోదితంబు నై పోయినది. ఇక్కవిచేతులలోఁ గృష్ణచరిత్ర మట్టి వికారాకారమును గాంచినది.

కాని యెందుచే నిట్లు జరిగినది? ఈ రెండవతరగతికవి కేవల ము మూర్ఖుఁడు కాఁడు. అతని సృష్టికౌశలము జాజ్వల్యమానమైన దియే. అతఁడు ధర్మాధర్మజ్ఞానశూన్యుఁడు కాఁడు. అయినను నాతఁడు కృష్ణుని కీర్తిరాశిని సంకుచితింపఁజేయుటకుఁ గారణ మేమి? అతనిగూ ఢం బగునాతని తాత్పర్య మేమో తెలిసికొనవలయును.

మొదటి తరగతికవిచేఁ గృష్ణుఁ డీశ్వరావతారముగాఁ బ్రదర్శిం పఁబడ లేదని మనము మాటిమాటికిని జ్ఞాపకము చేయుచున్నాము. అతఁ డామాట యెత్తుకొననుండఁగనే యెల్లయెడలను గృష్ణుని మానవప్రకృ తిని బ్రదర్శించి యుండెను; మానవశక్తిచే నుపలబ్ధింపఁదగు కార్యము గావించినట్లు వ్రాసియుండెను. కవులందఱును దాదాపుగా శ్రీకృష్ణుని గూర్చి యిట్లే వర్ణించి యున్నారు. మొదటితరగతికవి వ్రాసినప్పుడెల్ల కృష్ణుఁ డీశ్వరావతారముగా నందఱిచేత నంగీకరింపఁబడ లేదని యే సూ చించియున్నాఁడు. అతనిహృదయమునందుఁగూడ నట్టిభావ మెల్లవేళ

లను గలుగుట లేదు. మహాభారతమున మొదటితరగతికవి వ్రాసినయం తయును జాలవఱకుఁ బ్రాచీనవృత్తాంతసంగ్రహముమాత్రమే. దానినే యుచితాలంకారములతో రంజితముఁ గావించెను. ఆరచనయంతయు నేకకథాసూత్రముచేఁ గ్రథితమైయుండెను. కాని మహాభారతము రెండవతరగతికవిచేయిపడినప్పుడు శ్రీకృష్ణుని యీశ్వరత్వము సర్వాంగీకృతమైనట్లగపడుచున్నది. కావున నాతఁడు కృష్ణునీశ్వరావతారునిగనే ప్రదర్శించెను. ఆతనిరచనయందుఁ గృష్ణుఁడుకూడ ననేకపర్యాయములు తనయీశ్వరత్వమును బ్రకటించియుండుటయే కాక యీశ్వరశక్తిమూలమునఁ గార్యములనుగూడఁ గావించియుండెను. కాని యీశ్వరుఁడు పుణ్యమయుఁడు. కవికిఁగూడ నాసంగతి తెలియకపోలేదు. అయినను నొక తత్త్వమును బ్రస్ఫుటముగఁ బ్రదర్శించుటకే యాతఁడు ప్రయత్నించినట్లగపడుచున్నది. ఐరోపీయులుకూడ నీతత్త్వమును గూర్చియే విశేషముగ నాలోచించుచుందురు. భగవంతుఁడు దయామయుఁడనియుఁ గరుణామూలముననే జీవులను సృష్టించెననియు, సర్వజీవమంగళమే యాతనియభీష్టమనియును వారు చెప్పుదురు. అట్లయినచో నీపృథ్వియందు దుఃఖ మేల ? ఈశ్వరుఁడు పుణ్యమయుఁడైన యీతనిచేఁ బుణ్యమే ప్రసాదింపఁబడుచున్నప్పుడు మరలనీప్రపంచమునకుఁ బాపమెక్కడినుండి వచ్చినది ? ఈతత్త్వమును నిర్ణయించుట క్రైస్తవులకుఁ జాలఁగష్టము. కాని హిందువులకుమాత్రమతిసులభమైనది. హిందూమతమునం దీశ్వరుఁడే జగత్తు. ఈశ్వరుఁడు స్వయముగాఁ బాప పుణ్యములకును సుఖదుఃఖములకు నతీతుఁడు. మనము సుఖదుఃఖములుగా భావించునవి యాతనికి సుఖదుఃఖములు కావు. మన పాపపుణ్యములాతని యెనుటఁ బాపపుణ్యములు కావు. ఆతఁడు విలాసముకొఱకీజగంబును సృజించెను. ఈజగం బాతనికంటె భిన్నమైనది కాదు.

ఆతనియందే మే ఆతఁడు తనశక్తిసవిద్యావ్యాప్తంబుగఁ గావించుటచే నది యే సుఖదుఃఖంబులకును పాపపుణ్యంబులకు నాధార మగుచున్నది. కావున నీసుఖదుఃఖాదు లన్నియు నాతని మాయవలననే గలుగుచుం డును. సుఖదుఃఖములు వానినుండియే కలుగును. దుఃఖమనుభవించు ట యాతని మాయవలననే. పాపముం జేయుట యాతనిమాయవలననే. విష్ణుపురాణకని కృష్ణపీడితుఁ డగు కాళీయుని నోటినుండి యీమాటల నే వెలువరించెను.

> "యథాహాం భవతా స్సృష్టో జాత్యా రూపేణ చేశ్వర
> స్వభావేన చ సంయుక్త స్తథేదం చేష్టితం మమ.

"నీవు నన్ను సర్పజాతిగా సృజించితివి. అందుచేతనే నేను హింస చేయుచున్నాను." అని దీనియర్థము. ప్రహ్లాదుఁడు విష్ణుస్తవంబు గావించినప్పుడు,

> "విద్యావిద్యే భవాన్ సత్యమసత్యం త్వం విషామృతం"

"విద్యయు నవిద్యయు నీవే; సత్యము నసత్యమును నీవే; విష ము నమృతమును నీవే" అని స్తుతించి యుండెను.—ఆతనికంటె భిన్నం బగు జగంబు లేదు. ధర్మాధర్మములును జ్ఞానాజ్ఞానములును సత్యాస త్యములును, న్యాయాన్యాయములును, బుద్ధ్యబుద్ధులును సర్వము నా తనినుండియే కలుగుచున్నవి. ఆతఁడు గీతయందు స్వయముగా నిట్లు చెప్పియుండెను.—

> "యే చైవ సాత్వికాభావా రాజసా స్తామసాశ్చ యే
> మత్త ఏవేతి తాన్ విద్ధి న త్వహాం తేషు తే మయి"—

"సాత్వికరాజసతామసభావము లన్నియును నావలననే యగు చున్నవని యెఱుంగుము. నేను వానికి వశుండను గాను; కాని యవి యన్నియు నాయధీనములై యుండును" అనియర్థము. శాంతిపర్వము

నందు భీష్ముండు కృష్ణునిగూర్చి "సత్యాత్మనే నమః; ధర్మాత్మనే నమః" అని స్తుతించినచోటనే "కామాత్మనే నమః; ఘోరాత్మనే నమః క్రౌర్యాత్మనే నమః ; తృష్ణాత్మనే నమః." అని యీవిధముగా నమస్కారములం గావించి యున్నాఁడు. మఱియుఁ గట్టతుదను "సర్వాత్మనేనమః అని నమస్కరించెను. ప్రాచీనహిందూశాస్త్రములనుండి యిట్టివాక్యముల నెత్తి చూపనెంచినచో నెన్నివందల పుటలైనను నింపవచ్చును.

ఆమాట నిజమే యైనను మానవున కొక గురుతరవిషయమును బోధింపవలసి యున్నది. దుఃఖము జగదీశ్వరప్రేరితము ; ఆతనికంటె దీనికన్య కారణ మేదియును లేదు. పాపాత్ముఁ డించుకొఱకు నిందితుఁడును దండనీయుఁడు నగుచున్నాఁడు. ఆవిషయమున లోకమునకు బోధింపవలసియున్నది. ఆతనిపాపబుద్ధి జగదీశ్వరప్రేరితము; కావున నాతని విచారించుటకు జగదీశ్వరుఁడే కర్త. మీరెవ్వరు?

ఈతత్త్వము నవగతింపఁజేయుటకే రెండవతరగతికవులు భారతమధ్యమునఁ బ్రవేశించిరి. శ్రేష్ఠులగు ప్రాచీనకవులెవ్వరును బ్రస్తుతకవులంబోలి భూమికలను వ్రాసి యుందు సమస్తవిషయములను స్పష్టపఱిచి కావ్యములను వ్రాసి యుండలేదు. అట్టివారి కావ్యములయందలి తాత్పర్యములను బ్రయత్నపూర్వకముగ గ్రహింపవలసినదే. షేక్స్పియరు రచించిన యొక్క నాటకమునందలి మర్మార్థమును గ్రహించుటకై యెన్నివేలమంది ప్రతిభావంతు లగువిద్వాంసులెన్నివిధముల భావించి యుండలేదు ? ఎన్నెన్ని వ్యాఖ్యానములను వ్రాయలేదు? మనము వానిని బోధపఱచుకొనుటకై తలఁ గొట్టుకొని యెంతపరిశ్రమ పడుచున్నాము. కాని మనయీయపూర్వమహాభారతగ్రంథమునందలి యొకయధ్యాయమునైనను జదివి దానిగూఢా

ర్థమును గ్రహించుటకై యెన్నఁడు నొకగంటయైనను బ్రయత్నించి యుండలేదు. హరిసంకీర్తనకాలంబున మృదంగముపై దెబ్బపడినంతనే కన్నుల నీరుపెట్టుకొని క్రిందఁబడి పొరలు మూఢభక్తులగు వైష్ణవు లొకవంకను, వారిం గాంచినంతనే యిదియంతయుఁ బిచ్చి యనియు, నల్లరి యనియు నిందించుచుఁ బ్రాచీనగ్రంథములపేరువిన్నంతనే మొగసిక్రిందఁబడు నవనాగరికు లొకవంకను మాత్రమున్నారు. మఱియు సమస్తమును మిథ్య, ఉపధర్మము, అశ్రావ్యము, పరిహార్యము, పరిహాసాస్పదము నని రాద్ధాంతము చేయువారుకూడ నున్నారు; కాని సత్యమును గ్రహింపఁ బ్రయత్నించువారు లేరు. శబ్దార్థములు బోధపడినంతనే యంతయుం దెలిసినట్లే భావించుచుందురు. విచారింపవలసిన విషయ మేమనిన:—ఎవ్వరైనఁ బోధింపఁ దలఁచినను వినువారు లేరు.

సమస్తము నీశ్వరుఁడే—ఈశ్వరునుండియే సమస్తము నగుచున్నది. ఆతనినుండియే జ్ఞానమును, జ్ఞానాభావమును, భ్రాంతియు, బుద్ధియు, దుర్బుద్ధియు, సత్యము, నసత్యమును, న్యాయము, నన్యాయను, గలుగుచున్నవి. భ్రాంతులును, దుర్బుద్ధులును, నసత్యభాషణులును, నన్యాయపరులును నీశ్వరప్రేరితులే. కాని జ్ఞానము, బుద్ధి, సత్యము, న్యాయము మొదలగునవి యాతనివలన నగుచున్నవని తెలుపవలసినప్రయోజనము లేదు. హిందువులకందఱకు నది సహజముగాఁ దెలిసినవిషయమే. అయినను భ్రాంతి, దుర్బుద్ధి మొదలగునవి కూడ నాతనివలననే కలుగుచుండెనని మానవులహృదయములకుఁ బట్టించుట యావశ్యక మయ్యెను. మహాభారతమునందలి రెండవతరగతికవి యీసంగతినే యాలోచించెను. మనము చంద్రమండలమునందలి యొకవైపునుమాత్రమే చూచుచుంటి మనియు, రెండవవైపు మనకెన్నఁడు నగపడుటయే లేదనియు నాధునికజ్యోతిర్విదులు చెప్పుచున్నా

రు. ఈకవి యిట్టియదృష్టపూర్వం బగు జగదతిహాస్యమునందలియువ్వాలి భాగమును మనకుఁ జూపింపఁ దలఁచెను. భ్రాంతి యీశ్వరప్రేరితంబని యాతఁడు జయద్రథవధయందును, దుర్బుద్ధి యీశ్వరప్రేరితం బని ఘటోత్కచవధ యందును, అసత్యమీశ్వరప్రేరితంబని ద్రోణవధయందును, అన్యాయ మీశ్వరప్రేరితం బని దుర్యోధనవధయందును జూపించియున్నాఁడు. జ్ఞానబల, బుద్ధిబల, సత్యబల, న్యాయబలములు, బాహుబలము చెంత నిలువఁజాలవని యొక్కనిదర్శనము మాత్ర మాతఁడు చూపవలసి యుండెను. విశేషించి రాజనీతియందు బాహుబలమే ప్రధానమైనది. మహాభారతమంతయును రాజనీతివిశిష్టంబగు కావ్యము. చరిత్రమును దెలుపు కావ్యము. కావున నీగ్రంథము బాహుబలప్రధానంబని యూహించి రెండవతరగతికవి బుద్ధ్యాదులయెడల నొకవిశేషము జూపుటకుఁ బ్రయత్నించెను; కేవలజ్ఞానభ్రాంతులును, బుద్ధ్యబుద్ధులును, సత్యాసత్యములును, న్యాయాన్యాయములును నీశ్వరనియోగాధీనములే యని చెప్పినంతమాత్రమున రాజనీతితత్త్వము కాలేదనియు, బాహుబలమును, బాహుబలాభావముఁగూడ నాతని యధీనమే యనియు నీరెండవకవి భావించెను. ఆభావమును స్పష్టపఱుచుటకే యాతఁడు మౌసలపర్వమును రచించెను. అందుఁ గృష్ణుఁడు లేనిసమయమున నర్జునుఁడు బలహీనుఁడై లగుడధారులగు కృషికులచేఁగూడఁ బరాజితుఁడై పోయెను.

ఈశ్వరనియోగమని మనము చెప్పునట్టిగాని, యీశ్వరప్రేరణమని యీద్వితీయస్తరమునందలికవి చెప్పునట్టిగాని యీవిషయమును గూర్చి యూరపియనులు లా (Law) యని చెప్పుదురు. ఈభారతకవులబుద్ధిలో నట్టిభావ మెచ్చుటనైననున్నదో, లేదో మేము చెప్పఁజాలము. కాని యొక్కసంగతిమాత్రము స్పష్టముగాఁ జెప్పఁగలము. వారు

"ల" అనునక్షరమున కేయచ్చును జేర్చినచో "లా" యగునో మాత్రము బాగుగ నెఱుంగుదురు. సర్వము నీశ్వరేచ్ఛయనియే వారు తెలిపియుండిరి. ఈకవి శ్రీకృష్ణుని గర్మక్షేత్రమునందవతరింపఁజేసి యీశ్వరేచ్ఛను బోధించుటకుఁ బ్రయత్నము చేసెను.

చతుర్థపరిచ్ఛేదము.

ఘటోత్కచవధ.

జయద్రథవధయందుఁ గృష్ణునింగూర్చిన యనైసర్గికవృత్తాంతమిం కొకటి యున్నది. అర్జునుఁడు జయద్రథునిశిరఃఖండనంబు గావించుట కుద్యుక్తుఁడైయున్నప్పుడు కృష్ణుఁడాతనింగాంచి "ఈతనితండ్రి పుత్రునికొఱకుఁ దపంబుచేసి యొకవరముంగాంచెను. ఈజయద్రథుని శిరము నెవ్వరు భూమిపైఁ బడనేయుదురో వారిశిరం బప్పుడే విదీర్ణంబై ఖండఖండములు కాఁగలదు. కావున నీవీతనితలను గ్రిందఁబడనీయకుము. బాణసంచాలనముచే నీతనిశిరంబును సంధ్యావందనము చేసికొనుచున్న యీతనితండ్రి క్రోడమునంబడునట్లుగాఁ జేయుము" అని యుపదేశించెను. అర్జునుఁ డట్లే కావించెను. ఆవృద్ధుఁడు సంధ్యావందనముం గావించి లేచుసమయమున ఛిన్నమస్తక మాతనిక్రోడమునుండి క్రిందఁ బడిపోయెను. తోడనే యాతనితల వ్రక్కలైపోయెను.

అనైసర్గికంబగు నీవృత్తాంతమును మేము పరిత్యజించుచున్నాము. ఇఁక ఘటోత్కచవధయందలి బీభత్సవృత్తాంతమును విమర్శింపవలసి యున్నది.

హిడింబుఁడను నొకరాక్షసుఁడు కలఁడు. హిడింబయను రాక్షసి
యాతనిసోదరి. ఒకప్పుడు భీముఁ డారాక్షసుని జంపి యాహిడింబను
బెండ్లియాడెను. ఈవధూవరుల పరస్పరానుకూలతంగూర్చి వేఱుగఁ
జెప్పనక్కఱలేదు. ఇంతేకాక యారాక్షసిగర్భమున భీమునకొకకుమా
రుఁడుకూడఁ గలిగెను. అతనిపేరు ఘటోత్కచుఁడు. వాఁడును, రాక్ష
సుఁడే; మహాబలవంతుఁడు. ఆతఁడు తనతండ్రులకు సాహాయ్యముఁ
జేయుటకై తనసేనతోఁగూడఁ గురుక్షేత్రయుద్ధమునందుఁ జేరుకొనియె
ను. కాని యాతనియందొక తెలివితక్కువతనముగపడుచున్నది—
ఆతఁడు ప్రతివీరులను భక్షించుట మాని మానవునింబోలి వారితో
బాణయుద్ధము గావించెను! ఆతని దురదృష్టవశమున దుర్యోధనసైన్య
మునందుఁగూడ నొకరాక్షసుఁ డుండెను. ఆయిరువురు రాక్షసులకును
మహారణము జరిగినది.

ఇచ్చట నీదినమునమాత్ర మొకభయంకరవ్యాపారము జరగి
నది. ఇదివఱకు దినములలోఁ బగటివేళనే యుద్ధము జరగుచుండెను.
నేఁడు దీపములను వెలిఁగించి రాత్రివేళ యుద్ధముం గావించిరి. నిశాచ
రులకు రాత్రులయందు బల మధికము. కావుననే ఘటోత్కచుఁడు దు
ర్నివార్యుఁ డయ్యెను. కౌరవవీరు లెవ్వరు నాతనిమొనుటఁ బడఁజాలక
పోయిరి. కౌరవబలమునందలి రాక్షసుఁడుకూడ మరణించెను. అప్పుడు
కేవలమును గర్ణుఁ డొక్కఁడే యాతని నెదిరించి పోరాడుచుండెను.
తుదకుఁ గర్ణుఁడుగూడ నలసిపోయెను. ఇంద్రునిచేఁ బ్రసాదింపఁబడిన
యేకపురుషఘాతిని యగు నొకశక్తిమాత్రము కర్ణునియొద్ద నున్నది.
ఈశక్తింగూర్చి యద్భుతముకంటె నత్యద్భుతం బగు నొకకథ యున్నది.
పాఠకుల కదియంతయుం జెప్పి పీడించుట నాకిష్టము లేదు. ఆశక్తినె
వ్వరును వ్యర్థముగాఁ జేయఁజాలరు; అది యొకసారి యెవ్వరిపైనైనఁ బ్ర

యోగించినచోఁ దిరిగి రా నేరదు. అది యేకపురుషఘాతిని మాత్రమే. కర్ణుఁ డయ్యమోఘశక్తి నర్జునవధార్థమై దాచుకొనియుండెను. కాని యిప్పు డాతఁడు ఘటోత్కచుని సమరవిజృంభణమును సహింపఁజాలక విపన్నుఁడై యాశక్తి నాతనిపైఁ బ్రయోగించెను. దానిచే ఘటోత్కచుఁడు మరణించెను. ఆతఁడు మరణసమయమున వింధ్యాచలపరిమితంబగు దేహముం దాల్చెను. ఆశరీరముక్రిందఁబడి యేకాక్షౌహిణీసేన మరణించెను !

ఇంతతప్పు చేసినను బ్రాచీనహిందూకవిని క్షమింపవలసినదే. ఏమనిన; ఈకథ బాలకులకును, విద్యావిహీనులకును స్త్రీలకునుజాల మనోహరముగనే యుండును. కాని యాతఁడు దీనితరువాత మఱియొక కల్పన గావించియున్నాఁడు. ఆకల్పన యాతనికిమాత్రమే మనోహరమైనదిగా నగపడుచున్నది—ఘటోత్కచుఁడు మరణించుటయుఁ బాండవులందఱును దుఃఖించుచుండిరిగాని కృష్ణుఁడుమాత్రము రథముపై నుండి నృత్యముచేయుట కారంభించెనఁట!—కృష్ణుఁ డిప్పుడు గోపబాలకుఁడు గాఁడు. ఆతఁడు పౌత్రులనుగూడఁ గనియుండెను. మఱియు నాతఁ డాకస్మికముగా వాతరోగగ్రస్తుఁ డయ్యెననికూడ గ్రంథకారుఁడు చెప్పియుండలేదు. కాని రథముపై నాతఁడు నాట్యముమాత్రము చేయుచుండెను. కేవలము నాట్యము చేయుటయే గాదు; సింహనాదము చేయుచు బాహుల నప్పళించుచుండెను. అప్పు డర్జునుఁ డాతనిం గాంచి "ఇది యేమి? అట్లు నృత్యము చేసెదవేల?" అనిప్రశ్నించెను. అందుపైఁ గృష్ణుఁడు "కర్ణునియొద్ద నొకయమోఘశక్తి యున్నది. దానినాతఁడు నిన్నుఁజంపుటకై దాఁచియుంచినాఁడు. అది యిప్పుడు ఘటోత్కచునికొఱకుఁ బరిత్యక్తమైపోయినది. ఇఁక నీకు భయము లేదు. నీవిప్పుడు కర్ణునితో యుద్ధము చేయవచ్చును" అని చెప్పెను. సైంధవ

వధనాఁటి యుద్ధమునందే కర్ణుఁ డర్జునునితోఁ దలపడి యుద్ధముచేసి పరాజితుఁడై పోయెను. అప్పుడీయిందరికిఁగూర్చినవృత్తాంత మెప్పు డీమనసునందును లేదు. కవిహృదయమునందును లేదు. కాని యప్పు డీవిమనసునందే యున్నచో సైంధవవధ కాకయే యుండును. కర్ణుఁ డాతని రక్షించియే యుండును. ఏమైననేమి—ఈశక్తిఁగూర్చినకథ కేవలము ననైసర్గికమై యున్నది. దీనినిఁగూర్చి యాలోచించుట నిష్ప్రయోజనము. ఏసంగతి చెప్పటకై మేమీఘటోత్కచసంహారవృత్తాంతము నెత్తియుంటిమో యాసంగతి యిది— అర్జునుఁడు ప్రశ్నించుటయుఁ గృష్ణుఁ డిట్లు చెప్పెను—

"ఎట్లయిన నేమి? నేను నీహితముకొఱకు వివిధోపాయముల నుపయోగించి క్రమక్రమముగా మహాబలపరాక్రాంతులగు జరాసంధుఁడు, శిశుపాలుఁడు, ఏకలవ్యుఁడు, హిడింబుఁడు, కిమ్మీరుఁడు, ఘటోత్కచుఁడు మొదలగువారిని వధించి యుంటిని"

ఈమాట సత్యము కాదు. కృష్ణుఁడు శిశుపాలుని వధించిన మాట సత్యమే కాని యది యర్జునహితార్థము కాదు. శిశుపాలుఁ డాతనిని సభామధ్యమున నవమానించెను. కృష్ణుఁడు యజ్ఞరక్షార్థమాతనివధించెను. జరాసంధవధకుఁ గృష్ణుఁడు కర్తగాకున్నను బ్రవర్తకుఁడై యుండెను. అదియును నర్జునునిహితమునకుఁ గాదు—కారాబద్ధులగు రాజులను విడిపించుటకు. కాని, బకహిడింబకిమ్మీరాది రాక్షసుల సంహారంబునందుఁగాని యేకలవ్యునియంగుష్ఠచ్ఛేదన విషయమునందుఁ గాని కృష్ణున కెంతమాత్రమును సంబంధము లేదు. ఆసంగతు లాతనికిఁ దెలియనే తెలియవు. ఆసమయములయం దాతఁడచ్చట లేఁడు. శ్రీకృష్ణుఁ డేకలవ్యుని వధించినట్లు మహాభారతమునం దొక్కచో నగపడుచున్నది. కాని యీయంగుష్ఠచ్ఛేదనకథకును దానికిని సంబంధము

లేదు. ఏకలవ్యుని యంగుష్ఠచ్ఛేదమును, రాక్షససంహారంబునుగూడఁ గేవలము నపక్రికృతంబులై యున్నవి.

ఇట్టిచో నీమిథ్యావచనములను గృష్ణునిచే ననిపించుట నుద్దేశ మేమి ?

ఈవిషయమున మఱియు నొకమాట చెప్పవలసియున్నది. శ్రీకృష్ణుఁ డిచ్ఛామూలంబున సర్వంబును గావించుచుండె ననియు నాతని యిచ్ఛామూలంబుననే హిడింబాదులవధయు, ఘటోత్కచుని పైఁ గర్ణుని శక్తిప్రయోగమును జరగియుండుననియు భక్తులు చెప్పుదురు. ఈమాట యసంగతమైనది. వివిధోపాయముల నుపయోగించితి నని కృష్ణుఁడే చెప్పి యున్నాఁడు. సర్వకర్త యగునీశ్వరుఁ డిచ్ఛావశంబుననే కార్య సాధనముం గావించినచో మానవశరీరముం దాల్చి యవతరించుటకుఁ బ్రయోజన మేమున్నది ? ఆతఁడెట్టికార్యము నిచ్ఛాశక్తిమూలంబునఁ గావించుట లేదనియుఁ, బురుషకారమునే యవలంబించి పనిచేసెననియు మేము మరలమరలఁ జెప్పుచున్నాము. ఈసంగతి నాతఁడు స్వయముగనే చెప్పియుండెను. ఇంతకుముం దావాక్యముల నుదాహరించి యుంటిమి. ఆతఁ డిచ్ఛ కలిగి ప్రయత్నించినను సంధిస్థాపనము చేయఁజాలనట్లగ పడుచున్నది. అట్లేయాతఁడు కర్ణుని యుధిష్ఠిరపక్షమునకుఁ జేర్పఁజాలక పోయెను—ఆతఁ డిచ్ఛావశంబుననే సర్వకార్యసాధనంబు గావించు చున్నచో భస్మసదృశంబును, జడపదార్థంబు నగు నొకయస్త్రముకొఱ కిచ్ఛామయుండగునాతని కింతయాలోచన మేల ?

దీనికిఁ బ్రధానోద్దేశ మేమియో పూర్వపరిచ్ఛేదమునం దెలిపి యున్నాము. బుద్ధియు, దుర్బుద్ధియుఁగూడ నీశ్వరప్రేరితములే యని కవి బోధింపఁదలఁచెను. కర్ణుఁ డర్జునునికొఱకు నింద్రశక్తిని దాఁచియుంచి యును దాని నిప్పుడు ఘటోత్కచునిపైఁ బ్రయోగించుట కాతనిదు

ర్బుద్ధియే కారణము. దీనిని నేనే కల్పించితి నని కృష్ణుఁడు చెప్పియుండెను. అనఁగా దుర్బుద్ధి యీశ్వరప్రేరితమని—శిశుపాలుఁడు దుర్బుద్ధి వశంబుననే సభాస్థలంబునఁ గృష్ణుని నసహ్యముగా నవమానించెను. జరాసంధుఁడు సైన్యసహాయుఁడై యుద్ధమే చేసినచో నజేయులగు పాండవులమాట యటుండనిమ్ము—కృష్ణసహితులగు యాదవులుగూడఁ గలసినను నాతని జయింపఁజాలరు. కాని శారీరకబలంబును బట్టి భీముఁడాతనికంటె శక్తిమంతుఁడు. అట్టిచో రాజరాజేశ్వరుఁడగు జరాసంధుఁడేకాకియై యొకమల్లునివలె భీమునితో యుద్ధముం గావించుటకుఁ గారణ మాతనిదుర్బుద్ధియే. అదియును నేనే కల్పించితి నని కృష్ణుఁడు చెప్పెను. ద్రోణాచార్యుఁ డనార్యుఁ డగు నేకలవ్యునిం గూర్చి నాకు గురుదక్షిణగా నీదక్షిణాంగుష్ఠము నీయవలయు నని కోరెను. ఆయంగుష్ఠము నిచ్చినచో నతిప్రయాసలబ్ధం బగు నాతని ధనుర్విద్య యంతయును నిష్ఫలమైపోవును. కాని యేకలవ్యుఁ డా గురుదక్షిణ నొసంగెను. ఇది యేకలవ్యుని దారుణాదుర్బుద్ధి. కృష్ణచరిత్రమునం దిదియంతయును కృష్ణప్రేరితమే యని సూచింపఁబడి యున్నది. అనఁగా నీశ్వరప్రేరితమని—రాక్షససంహార సంబంధమునఁ గూడ నిట్లే యున్నది. ఇట్టివన్నియును ద్వితీయస్తరమునకు సంబంధించిన కవికల్పనములే.

పంచమపరిచ్ఛేదము.

ద్రోణవధ.

ప్రాచీనభారతవర్షమునఁ గేవలమును క్షత్రియులుమాత్రమే యుద్ధము చేసియుండలేదు. బ్రాహ్మణవైశ్యయోధుల వృత్తాంతము

కూడ మహాభారతమునం దున్నది. దుర్యోధనుని సేనానాయకుల లో ముప్వురు ప్రధానవీరులు బ్రాహ్మణులు; ద్రోణుండు వాతనిస్వా లకుండగు కృపుండు, నాతనిపుత్రుండగునశ్వత్థామయు; ఇతరవిద్యలకు వలెనే యుద్ధవిద్యకుంగూడ బ్రాహ్మణు లాచార్యులై యుండిరి. కృ పద్రోణు లిట్టివారే. అందుచేతనే వీరికి ద్రోణాచార్యుం డనియు గృపాచార్యుండనియు నామములు కలిగెను.

మఱియును బ్రాహ్మణులతో యుద్ధము చేయుట చాల దుష్కరకార్యము. యుద్ధమునందైనను బ్రాహ్మణుని వధించినచో బ్రహ్మ హత్యాపాతకము సంఘటిల్లును. మొత్తముమీఁద నీమహాభారతకా రుం డీకారణముచేతనే యీబ్రాహ్మణయోధుల నెట్లో కాపాడుటకు మ హావిపన్నుఁడై పోయినట్లు స్పష్టముగా నగపడుచున్నది. ఈకారణ ముచేతనే కృపాశ్వత్థామలు యుద్ధమునందు మరణింపలేదు. కౌరవ పక్షయోధులందఱును మరణించిరి. కాని కేవలమువారుముగ్గురు మా త్రమే చావలేదు. వారమరులని చెప్పి గ్రంథకారుఁ డెట్లో నివృత్తిఁ గాంచియుండెను. కాని ద్రోణాచార్యుని మాత్రము చంపక తప్పినది కాదు. భీష్మునితరువాత నాతఁడే సర్వప్రధానుఁ డగు సేనానాయకుఁడు. ఆతఁడు జీవించి యుండఁగాఁ బాండవులు విజయలాభము పొందఁజా లరు. కాని పరమధార్మికు లగుపాండవపక్షయోధులలో నెవ్వనిచే నైన నాతని జంపించి యాబ్రహ్మహత్యాపాతకము వారినెత్తిఁ గట్టుట గ్రంథకారున కిష్టము లేకపోయెను. విశేషించి సమయోచితముగ నెది రించి ద్రోణాచార్యుని బరాజితునిం జేయఁగలిగినవాఁడు పాండవపక్ష మునం దర్జునునికంటె నితరుఁ డెవ్వఁడును లేఁడు. కాని, ద్రోణాచార్యుఁ డర్జునునకు గురుఁడు. కావున నర్జునుం డాతనివధింపఁగూడదు. అందుచే గ్రంథకారుఁ డొకకౌశలము నవలంబించుటకు బాధ్యుఁడు కావలసి వచ్చెను.

పాండవమహిషి యగు ద్రౌపదికి జనకుండగు ద్రుపదునితోఁ బూర్వము ద్రోణునకు గొప్పవివాద మైయుండెను. ద్రుపదుఁడు ద్రోణునితో సమానవిక్రముఁడు కాఁజాలకపోయెను. ఇంతే కాక యాతనిచే నవమానితుం డయ్యెను. అందుచే వాఁడు ద్రోణవధార్థమై యొక యజ్ఞముం గావించెను. ఆయజ్ఞకుండమునుండి ద్రోణవధకారి యగు ధృష్టద్యుమ్నుం డను పుత్త్రుం డుద్భూతుం డయ్యెను. ఆధృష్టద్యుమ్నుఁడు కురుక్షేత్రయుద్ధమునఁ బాండవసేనానాయకుఁడై యుండెను. ఆతఁడు ద్రోణుని వధించునని పాండవులకును ధైర్యమున్నది. బ్రాహ్మణవధార్థము దైవకర్మజాతుండగు వానికి బ్రహ్మహత్యాపాపముండదు.

కాని మహాభారతమునం దొక్కచోఁ గాక యనేకస్థలములయం దనేకకవుల నానావిధరచనలు యథేచ్ఛముగఁ జొప్పింపఁబడి యున్నవి. పంచదశదినములు యుద్ధము జరిగినను ధృష్టద్యుమ్నుఁడు ద్రోణాచార్యు నేమియుఁ జేయఁజాలకపోయెను. మఱియు నాతనిచేఁ బరాజితుఁడు కూడ నయ్యెను. కావున ద్రోణునిం జంపుట కుపాయమును ధైర్యమును లేకపోయెను. ప్రతిదినమునను పాండవపక్షసైన్యక్షయము జరుగుచుండెను. అప్పుడు ద్రోణసంహారార్థమై యొకవిధమగు ఘోరపాపాచరణముం గావింపవలయునని పాండవపక్షమున స్థిరపడియెను. ఈమహాపాపాలోచనముం గూర్చిన కళంకమంతయును శ్రీకృష్ణుని నెత్తిఁ బెట్టఁబడియెను. ఆతఁడే దీనికి బ్రవర్తకుఁడని యందుఁ జెప్పఁబడి యుండెను. కృష్ణుఁ డిట్లు చెప్పెను.

“ఓ పాండవులారా! అన్యాయమాట యటుండనిండు! సంగ్రామరంగమునం దీద్రోణాచార్యుని సాక్షాద్దేవేంద్రుఁడైనను జయించుట

కు సమర్థుఁడు కాఁజాలఁడు. కాని యాతఁడస్త్రశస్త్రములను బరిత్యజించినచో నాతనిజయించుట మనుష్యులకు సాధ్యంబు కాఁగలదు. కావున మీరిప్పుడు ధర్మమును బరిత్యజించి యాతనిం బరాజితునింగాఁ జేయుటకై ప్రయత్నంబు సేయుఁడు ”

కవి యింతకుఁ బూర్వ మింకొకచోట నిట్టికృష్ణునిచేతనే “ఏ స్థానమున బ్రాహ్మణుఁడు సత్యము, శౌచము, శ్రీ, లజ్జ, క్షమ, ధైర్యము ననునవి మూ ర్తీభవించియుండునో యాస్థానమునందే నేను నిలిచియుందు నని ప్రతిజ్ఞ చేసి చెప్పుచున్నాను. * ”అని పలికించి యున్నాఁడు.

ఎవ్వఁడు భగవద్గీతాపర్వాధ్యాయమున ధర్మసంరక్షణార్థమై నేను యుగయుగంబుల నవతరించుచుండెద నని చెప్పియుండెనో యెవ్వనిచరిత్ర మింతవఱకు నాదర్శధార్మికచరిత్రముగాఁ బ్రశంసిత మగుచుండెనో, యెవ్వని ధర్మదార్ఢ్యము శత్రువులచేఁగూడ సంగీకృతమై కీ ర్తింపఁబడియెనో† అట్టిమహాత్ముఁడేనా “మీరు ధర్మమార్గమును విడువుఁడు!” అని బోధించినవాఁడు? అందుచేతనే మహాభారతమున నానావిధ హ స్తరచనలు లున్నవని చెప్పుచున్నాము. ఎవరియిష్టము వచ్చినట్లుగా వారందఱు దమయుద్దేశములను జొప్పించి యున్నారు.

అప్పుడు కృష్ణుఁ డిట్లు చెప్పఁదొడంగెను. “నాసశ్చితాభిప్రాయమును దెలుపుచున్నాను, అశ్వత్థామమరణించెనని యాతని కెఱింగింపఁ గలిగినచో ద్రోణుఁ డిఁక యుద్ధము చేయఁజాలఁడు. కావున నెవ్వ

*ఘటోత్కచవధాధ్యాయము౧౮౩అధ్యాయము.

‡ ధృతరాష్ట్రవాక్యము చూడవలెను.

రైన నాతనిచెంతకుఁ బోయి రణరంగమున నశ్వత్థామనిహతుఁడయ్యె నని చెప్పవలయును.”

అర్జునుఁ డసత్యమాడుట కంగీకరింపలేదు. యుధిష్ఠిరుఁ డతికష్టముతో నందుకు సమ్మతించెను. భీముఁ డూరక వాక్యవ్యయము చేయక యశ్వత్థామనామకంబగు నొకగజంబును వధించి పోయి ద్రోణాచార్యుంగాంచి “అశ్వత్థామ మరణించెను. * ” అని చెప్పెను. తన కుమారుఁ డమితబలశాలి యనియు, శత్రుదుర్జయుండనియును ద్రోణాచార్యుఁడెఱుంగును. కావున నాతఁడు భీముని వాక్యములను విశ్వసింపలేదు. ఆతఁడు ధృష్టద్యుమ్నుని వధింపవలయు ననుదృఢప్రయత్నముతో యుద్ధము చేయుచుండెను; కాని యశ్వత్థామమరణముం గూర్చి మరల నొకసారి యుధిష్ఠిరునడిగెను. యుధిష్ఠిరుఁ డెప్పుడును గూడ నధర్మము చేయలేదు; అసత్యము చెప్పలేదు. అందుచేత నే ద్రోణుఁ డాతని నడిగెను. అశ్వత్థామయనుకుంజరము మరణించెనని యుధిష్ఠిరుఁడు చెప్పెను. కాని కుంజరమనుమాట స్పష్టముగా నుచ్చరింపలేదు.

అందువలన నేమి జరిగినది? ద్రోణుఁడప్పుడించుకవిమనస్కుఁడైనమాట నిజమే! కాని తత్క్షణమునందే మహాఘోరంబగుయుద్ధముం గావింపఁదొడంగెను. ఆతనికి మృత్యుస్వరూపుఁ డగుధృష్టద్యుమ్నుఁడు తనకు సాధ్యాతీతంబగు యుద్ధంబు చేసి ద్రోణునివలన నిరస్త్రుండును విరథుండును విపన్నుండు నయ్యెను. అప్పుడు భీముఁడు పోయి యాతని రక్షించి ద్రోణాచార్యునిరథంబుం బట్టుకొని యెన్నియోమాటలాడెను. ద్రోణుని యుద్ధమునందుఁ బరాజితునింగావించె ననుట కామాటలే చాలును.

---

* “అశ్వత్థామాహత ఇతిగజః ” ఈకథ భారతములోనిది కాదు. కథకులు దీని గల్పించియుందు రనితోఁచుచున్నది. మూల భారతమునం దిది లేదు.

"ఓ బ్రాహ్మణా! స్వధర్మమునఁ దనంతుష్టులగు బ్రాహ్మణులు శిక్షితాస్త్రులై యుద్ధమునఁ బ్రవేశించినంతమాత్రమున క్షత్రియవీరుల కెన్నటికిని వినాశనంబు కలుగఁబోదు. హింస చేయకుండుటయే ప్రధానధర్మం బని పండితులు నిర్దేశించి యాధర్మమును బ్రాణపణంబుగఁ గాపాడుకొనుచుందురు. అట్టిధర్మమును బ్రతిపాలించుట బ్రాహ్మణుల కవశ్యకర్తవ్యము. నీవు బ్రాహ్మణశ్రేష్ఠుండ వయ్యును జండాలునిం బోలియజ్ఞానాంధుండవై పుత్రకళత్రపరివారంబగు సర్వలోభంబున వివిధప్రాణిగణవినాశనంబు గావించుచున్నావు; ఒక్కపుత్రునియుపకారముకొఱకు స్వధర్మమును బరిత్యజించి స్వార్థపరుండవై యసంఖ్యాకజీవనాశంబు చేయుచుంటివి! ఇది నీకు అజ్ఞానరంబుగఁ దోఁచుటలేదా?"

ఈమాట లన్నియును సత్యములే. ఇంతకంటెను దిరస్కారమేమున్నది? ఇట్టిమాటలవలన దుర్యోధనునివంటి దురాత్మునిమతము తిరుగకపోవచ్చును. కాని, ధర్మాత్ముండగు ద్రోణాచార్యుని కీమాటతిరస్కారము చాలును. ఈతరువాత నిఁక నశ్వత్థామమృత్యువుంగూర్చి చెప్పనక్కఱయే లేదు. కాని యాసంగతికూడ నిచ్చటఁ బునరుక్తం బయ్యెను.

ఈమాటలకుఁ దరువాతనె ద్రోణాచార్యుఁడు శస్త్రాస్త్రములను బరిత్యజించెను. అప్పుడు ధృష్టద్యుమ్నుఁ డాతనిశిరంబును ఖండించి తీసికొని వచ్చెను. ఈవర్ణింపఁబడిన సంగతు లన్నియు సత్యములే యైనచో నీవ్యాపారమునందుఁ జేరినవారందఱును మహాపాపాత్ము లనియె చెప్పవలయును. గ్రంథకారున కీసంగతి తెలియును. ఇంతవఱకును భూమికి నాలుగంగుళములపైనుండి నడచుచున్న ధర్మాత్ముఁడగు యుధిష్ఠిరునిరథ మప్పుడు భూమిని స్పృశించి నడచెననియు, నీయపరాధ

ముచేతనే యాతనికి నరకదర్శన మయ్యె ననియు గ్రంథకారుఁడు చె
ప్పి యున్నాఁడు. కాని యిట్లు విశ్వాసఘాతుకులై మిథ్యాప్రవంచన
మున గురుహత్యం గావించినవారికి నరకదర్శనమాత్రమున నుపయు
క్తదండన మైనట్లు కాదనియు నట్టివారి కనంతనరకప్రాప్తియే తగినశి
క్షయనియును మామతము.

ఈయపరాధమునకంతకు నీమహాపాపప్రవర్తకుఁ డగుకృష్ణుఁ
డే బాధ్యుఁడై యున్నాఁడు. కాని యాతని తప్పు నీవిధముగా సమర్థిం
చుచున్నారు. "ఎవ్వఁ డీశ్వరుఁడో, స్వయముగఁ బాపపుణ్యములకుఁ
గర్తయో, విధాతయో, పాపపుణ్యసృష్టయో యట్టివానికి మరలఁ బా
పపుణ్యము లననేమి ? పాపపుణ్యములాతని స్పృశింపఁజాలవు." అని-
ఈమాటసత్యమే. కాని యాతఁడు మానవావతారముం దాల్చినప్పు
డుకూడ నాతనికి ధర్మమాచరణీయ మగునా ? నేను ధర్మసంస్థాపనా
ర్థమై యవతరించితి నని యాతఁడు స్వయముగాఁ జెప్పియుండెను. కే
వలపాపాచరణము చేతనే ధర్మసంస్థాపన మగుననియా యాతని యుద్దే
శము ? ఆతఁ డెన్నఁడు నిట్లు చెప్పియుండలేదు. భగవద్గీతయం దా
తఁడు —

"జనకాదులు కర్మమూలముననే సిద్ధిలాభముం గాంచిరి. మా
నవులకు స్వధర్మమునందుఁ బ్రవృత్తిం గల్పించుటకు దృష్టాంతముగా
నీవు కర్మ చేయుము. శ్రేష్ఠులగువారు చేయుకార్యములనే యితరులు
నవలంబించి చేయుచుందురు. పెద్దలు మన్నించుమార్గమునే లోకు
లనుసరించుచుందురు. ఓపార్థా ! ఈమూఁడులోకములందును నాకుఁ గ
ర్తవ్య మేదియును లేదు. నాకుఁ బ్రాప్తవ్యము నప్రాప్తవ్యము నను
నది యేదియును లేదు. అయినను నేను గర్మమును జేయుదును. నేనెప్పు
డైనఁ బ్రమాదవశంబునఁ గర్మానుసరణంబు గావింపకున్నచో లోకు

లు కేవలమును నన్నే యనుకరించి కర్మభ్రష్టు లైపోవుదురు” అని బోధించెను.

శ్రీమద్భగవద్గీత ౩ అధ్యాయము. ౨౦, ౨౩.

తాను మానవుఁడయి జన్మించి తన కార్యములే దృష్టాంతములుగాఁ జేసి ధర్మరాజ్యస్థాపనముం గావించుట తనయుద్దేశ మని శ్రీకృష్ణుఁడే స్వయముగాఁ జెప్పియుండెను. కావున మహాపాపములకు దృష్టాంతము లగుకార్యములం గావించుట యెన్నటికి నాతనియుద్దేశము కాదు.

అట్లయినచో నీగొడవయంతయు నేమి? ఈవిూమాంస స్థిరపఱుచుకొనకుండఁగా మేమీకృష్ణచరిత్రమునఁ బ్రవేశింపఁజాలము. ఏమనిన— “బృందావనమున గోపీజనము” “అశ్వత్థామా హాతి ఇతి గజః” అను నీరెండే శ్రీకృష్ణునకుఁ బ్రధానాపవాదము లై యున్నవి!

“ఈగొడవయేమి?” అను నీప్రశ్న కివియన్నియు నలౌకికములనుటయే ప్రత్యుత్తరము. పాఠకులు నిశ్చలహృదయములతో మాయీగ్రంథమును బఠించినచో నీసమస్తమహాభారతమునుగూడ నేకకవిరచితము కాదనుసిద్ధాంతమును నిశ్చయముగా నంగీకరింపక మానరు. అందుఁగొంతభాగమే మౌలికమహాభారతమైయున్నది. తక్కిన భాగము తరువాతికవులచే మూలగ్రంథమునఁ బ్రక్షిప్తమైనది. అందు మౌలికమేదియో, యమౌలికమేదియో నిర్దేశించుట సులభసాధ్యము కాదు. అట్టిభేదమును నిరూపించుటకై మేమిదివఱకుఁ గొన్ని పద్ధతులను జెప్పియుంటిమి. వానిని మరల నిచ్చుటఁ బాఠకులస్మృతికిఁ దేవలసియుండెను.

(1) అందులో నొకపద్ధతి—

“శ్రేష్ఠకవిచే రచింపఁబడిన చరిత్రములందలి సర్వాంశములు

ను సుసంగతములై యుండును. అందెచ్చటనైన వ్యతిక్రమము కానవచ్చినచో నది ప్రక్షిప్తమైయుండు నని సందేహింపవచ్చును"

ఉదాహరణముకొఱకుఁ జూపుచున్నాము. ఎచ్చటనైన భీష్ముని పరదారపరాయణత్వముగాని, భీముని భీరుత్వముగాని కానవచ్చినచో నది ప్రక్షిప్తమనియే తెలిసికొనవలయును. ఇచ్చటికథ యట్లేయున్నది. ఒకసారి కాదు; ముమ్మాటికి నట్లేయున్నదని చెప్పవచ్చును. పరమధర్మాత్ముఁ డగు యుధిష్ఠిరుఁ డీవిధముగా నృశంసుఁడై విశ్వాసఘాతుకుఁడై మిథ్యాప్రవంచనమూలమున గురుహత్యం గావించె ననుటకంటె నసంగతవిషయము మఱియొకటి యేదియును లేదు. మఱియు మహాతేజస్వియు, బలగర్వశాలియు, భయశూన్యుండును నగుభీముఁ డిట్లుచేసె ననుటగూడ నసంగతమే. భీముఁడు బాహుబలమునుదక్క మఱిదేనిని బరిగణించువాఁడు కాఁడు. అతఁడు శత్రువులయెడల బాహుబలమును మాత్రమే యుపయోగించుచుండును. రాజ్యార్థముగాని, ప్రాణసంరక్షణార్థముగాని యాతనికి బాహుబలమే యేకమాత్రసాధనమైయుండెను. అశ్వత్థామ నారాయణాస్త్ర మనుపేరుగల యనివార్యమగు దైవతాస్త్రము నొకప్పుడు ప్రయోగించెను. అది జగంబునంతను ధ్వంసముగఁ జేయఁగలదు. దివ్యాస్త్రవేది యగు నర్జునునకుఁగూడ దానిని వారించుటకు సామర్థ్యము లేదు. పాండవసైన్యమంతయును వినాశనంబగుట కారంభించెను. ఈయస్త్రమునుండి తప్పించుకొనుట కొకటేయుపాయమున్నది. ఈదేవతాస్త్రము సమరవిముఖు లగువారినిమాత్రము స్పృశింపదు. కావున శ్రీకృష్ణునియుపదేశానుసారముగాఁ బ్రాణరక్షణంబు సేసికొనఁగోరి పాండవసైనికులందఱును దమతమ వాహనంబులనుండి భూతలంబున కవతీర్ణులై యస్త్రశస్త్రములఁ బరిత్యజించి రణవిముఖులైయుండిరి. కృష్ణాజ్ఞచే నర్జునునకుఁగూడ నట్లే చేయవలసివచ్చెను. కే

వలమును భీముఁడొక్కఁడు మాత్రమే యట్లు చేయుటకంగీకరింపక "నేను నాశరనికరంబులచే నశ్వత్థామదివ్యాస్త్రమును బరాజితముగఁ జేసి వైచెదను. సువర్ణమయంబగు నాఘనగదాదండముచే నేనీద్రోణపుత్రునినారాయణాస్త్రమును విమర్దితముగఁ జేసి రణస్థలంబున నంతకునింబోలి విహరించెదను. ఈభూమండలమున సూర్యునిమించిన జ్యోతిష్పదార్థము లేనియట్లెనన్ను మించిన పరాక్రమశాలియగుమానవుఁడెవ్వఁడును లేఁడు. ఐరావతకుండసదృశంబును, సుదృఢంబును నగునాయీ భుజదండము హిమాలయపర్వతము నైన నిపాతితముంగావింపఁగలదు. నేనయుతనాగబలశాలిని. దేవలోకమునఁ బురందరునింబోలి యీభూలోకమున నేనప్రతిద్వంద్విని. నేనిప్పుడు ద్రోణపుత్రునిదివ్యాస్త్రమును నివారించుటకే యుద్యోగించితిని. మీరందఱును నాబాహువీర్యముం గాంచెదరుగాక ! ఈయస్త్రము నెదిరించువీరు లెవ్వరును లేకయే యున్నచో నీసమస్తకురుపాండవసేనాసమక్షమునను నేనే దీనికిఁ బ్రతిద్వంద్వినైనిలిచెదను" అనియెను. ఇది కల్పనాకథయే యని యంగీకరింతము-అట్లేకావచ్చును. ఇది సత్యముగా నెవ్వరును విశ్వసింపనక్కఱలేదు. చరిత్రరచనమునం దనుకూలాననాశముంబట్టి కవి యిట్లు వర్ణించుచుండును. నారాయణాస్త్రప్రయోగమే మౌలికము కాకపోవచ్చును. కాని మౌలికమహాభారతమునం దంతటను భీమునిప్రకృతి మాత్రమిట్టిదిగనే కానవచ్చుచున్నది. ఇట్టి భీమునిచరిత్రమునకును, ద్రోణవధవిషయంబునఁ గావించిన యాజంబుకప్రవంచనమునకును నేమైనసంబంధమున్నదా? స్త్రీలుగూడఁ గల్పింపఁదగని యిట్టిశత్రువధోపాయమును భీమునివంటి మహాపరాక్రమశాలి యవలంబించునా? ద్రోణాచార్యునికంటె నారాయణాస్త్రము సహస్రగుణముల భయంకరమైనది.అట్టినారాయణాస్త్రమునెదుట సింహమునవలె విజృంభించిన భీ

ముఁడు - ప్రళయానలసదృశం బగునారాయణాస్త్రము నెదుటనుండి యె
వ్వరిచేనైనను బలవంతముగఁగాని మరలింపఁబడని భీముఁడు- కేవలము
నర్జునునకుఁబ్రతియోధమాత్రుఁడగు ద్రోణాచార్యునకై భయపడి న
క్కవలె నిట్టిమోసముం గావించె నని యేకవి వర్ణించి యుండెనో, యా
కవికిఁ గవిత్వ మెక్కడనున్నది ? అట్టికవికి మహాభారతరచనము సాధ్య
మగునా ?

ఈచంపఁబడిన యశ్వత్థామయను నేనుఁగుకథ భీమునిచరిత్ర
కెంతవిరుద్ధమో యుధిష్ఠిరునిచరిత్రకుఁగూడ నంతవిరుద్ధముగ నే యగ
పడుచున్నది. కాని యీభీమయుధిష్ఠిరుల చరిత్రములతో నీకథ యెం
తయసంగతమో, శ్రీకృష్ణునిచరిత్రముతో నిది యంతకంటెను విశేషా
సంగతముగా నున్నది. మేము చెప్పినకారణముల నన్నిటిని బాఠకులు
బాగుగ గ్రహింపఁగలిగినచో నిది యెంతవఱకసంగతమో వారికిబోధ
పడఁగలదు; ఆలోకమునకు నంధకారమునకును, కృష్ణత్వమునకును శ్వే
తత్వమునకును, దాపమునకు శైత్యమునకును, రోగమునకు స్వాస్థ్య
మునకును, మాధుర్యమునకుఁ గర్కశత్వమునకును, భావమునకు నభా
వమునకు నెంతయసంగతియో యంతయసంగతి యున్నది. మౌలిక
చరిత్రముతో, ఒకటికాదు-మౌలికములగుమువ్వురిచరిత్రములతో నీక
థయసంగతమగుటవలన నిది ప్రక్షిప్త మనియు, నన్యకవిప్రణీత మని
యు భావించి మేము దీనిని బరిత్యజించుచున్నాము.

(2) మేము చెప్పవలసిన దింకను ముగియలేదు. ఏది మౌలిక
మో, యేదియమౌలికమో గ్రహించుటకై మేమునిర్దేశించినకొన్ని ప
ద్ధతులలో నొకదానినిబట్టి పరీక్షింపఁగా నీహతగజవృత్తాంత మమౌలి
క మని తేటపడినది. మఱియొకపద్ధతినిబట్టికూడఁ బరీక్షించి చూతము.
"రెండువర్ణనములు పరస్పరవిరుద్ధములుగా నగపడినచో నందొకటి ప్ర

క్షిప్త మని గ్రహింపవలయును" అని యింకొకసూత్రము-ఇచ్చటనే మహాభారతమునందు హాతగజకథతోఁగూడ ద్రోణవధకు మఱియొక కారణ మగపడుచున్నది. ఆవిషయమును భారతమునుండియెత్తి చూపుచున్నాము. దానినిగూర్చి యాలోచించుటకు ముందుగనే ద్రోణుఁడధర్మయుద్ధముం గావించె ననుసంగతి పాఠకులకుఁ దెలుపవలసియున్నది. బ్రహ్మాస్త్ర మనునది మహాభారతమున వర్ణింపఁబడినయాన్యాన్యదైవాస్త్రములలో నొకటి. కార్యసిద్ధివిషయంబున నెల్లవిధముల సర్వార్థంబగుసాధనముంగూర్చిలోకులిప్పటికిని "బ్రహ్మాస్త్రము" అని వాడుకొనుచుండుట కలదు. ఈబ్రహ్మాస్త్రము, నస్త్రానభిజ్ఞు లగువారిపైఁ బ్రయోగించుట నిషిద్ధము,నధర్మము నయ్యుండెను.ఇది మహాత్ములమతము. ద్రోణుఁడట్టి బ్రహ్మాస్త్రమూలమున నస్త్రానభిజ్ఞులగుసైనికుల నెందఱినో వధించెను.

'విశ్వామిత్రుఁడు, జమదగ్ని, భరద్వాజుఁడు, గౌతముఁడు, వశిష్ఠుఁడు, అత్రి, భృగుఁడు, అంగిరసుఁడు, మొదలుగాఁగల మహాత్ములందఱును జగంబంతయునిఃక్షత్రంబుగావింపఁజూచుచున్న యాచార్యుం గాంచి యాతనిని బ్రహ్మలోకంబునకుంగొనిపోవలయుననుద్దేశముతో నతిశీఘ్రంబుగ నాతనిచెంతకు వచ్చి "ఓద్రోణా! నీవధర్మయుద్ధంబు సేయుచున్నావు. కావుననే యిప్పుడు నీకు వినాశనసమయము తటస్థించినది. నీవాయుధములను బరిత్యజించి యొకసారి మావంకఁ దిలకింపుము. ఇట్టికార్యానుష్ఠానము నీకుఁ గర్తవ్యము కాదు. నీవు వేదవేదాంగవేదివి; సత్యధర్మపరాయణుండవు. కావున నిట్టికార్యంబు సేయుట నీకనుచితము. నీవవిముగ్ధుండవై యాయుధపరిత్యాగంబు సేసి శాశ్వతపరావస్థానంబు గావింపుము. ఇప్పుడు నీకు మర్త్యలోకనివాసకాలముసంపూర్ణమైనది. ఓవిప్రా! బ్రహ్మాస్త్రప్రయోగంబుచే నస్త్రానభిజ్ఞు

లను వినాశనంబు నందించుచు నసత్కార్యానుష్ఠానముం గావించుచు న్నావు. కావున సత్వరము నీవాయుధత్యాగంబు సేయుము. ఇంకం గ్రూరకార్యానుష్ఠానము నీకుం గర్తవ్యము కాదు.”

ఇందువలననే ద్రోణాచార్యుఁడు యుద్ధవిరతుఁడయ్యెను. అశ్వత్థామ మరణవృత్తాంతమును యుధిష్ఠిరునివలన వినియును నాతఁడు యుద్ధమును విడువలేదు. ఆనంటనే యాతఁడు ధృష్టద్యుమ్నుని వధించుటకై విజృంభించెను. అప్పుడు యదువంశీయుఁడగు సాత్యకివచ్చి యాతని రక్షించెను. సాత్యకితో యుద్ధము చేయుటకు సమర్థులగువా రెవ్వరును లేరు. ద్రోణుండును నాతని నెదిరింపఁజాలక పోయెను. యుధిష్ఠిరుండప్పుడు స్వపక్షవీరులనందఱనుద్దేశించి— “ఓవీరవరులారా! మీరు యత్నపూర్వకంబుగా ద్రోణాభిముఖులై చనుఁడు! మహావీరుఁడగు ధృష్టద్యుమ్నుఁడు ద్రోణసంహారంబునకు యథాసాధ్యంబుగఁ బ్రయత్నించుచున్నాఁడు. నేఁడాతని కార్యదీక్షం గాంచినచో నాతఁడు క్రుద్ధుఁడై యొక్కొ ద్రోణుని సమరాంగణమున నిహతునిం గావించునని యే స్పష్టముగాఁ దోఁచుచున్నది. కావున మీరందఱు నొక్కసారిగ ద్రోణునిపైఁ బడి యుద్ధంబు సేయుఁడు” అని ప్రబోధించెను.

అంతట నే పాండవపక్షయోధు లందఱును ద్రోణాభిముఖులై విజృంభించిరి—

“ మహారథుఁడగు ద్రోణుండును మరణంబునకుఁ గృతనిశ్చయుండై యతిత్వరితంబుగ నావీరగణంబు నెదుర్కొనుచుండెను. సత్యసంధుండును, మహావీరుండు నగు ద్రోణాచార్యుఁ డుద్యతుండై యమ్మహారథుల నెదిరించునప్పుడు మేదినీమండలమంతయుఁ గంపింపఁదొడంగెను; ప్రచండవాయువులు సేనాగణంబును భయప్రకంపితముగఁ జేయుచు నతిప్రబలముగ వీవఁదొడంగెను. అతిభయంకరముగ రవిమం

డలమునుండి యుల్కాపాతము లగుచుండెను. ద్రోణాచార్యునిసకలా స్త్రములును బ్రజ్వలితము లగుచుండెను. రథభీషణనిస్వనంబులును, న శ్వగణాశ్రుపాతంబులు నగుచుండెను. అప్పుడు మహారథుఁ డగుద్రో ణుఁడు కేవలమును నిస్తేజుఁడై యుండెను. అతనివామనయనమును, వా మబాహువును నదరుచుండెను. అప్పు డాతఁ డెదుట నున్నధృష్టద్యు మ్ను నవలోకించుచు నత్యంతమును వికలహృదయుఁడై బ్రహ్మవాదు లగుఋషులవాక్యములను స్మరించుకొని ధర్మయుద్ధావలంబనపూర్వక ముగఁ బ్రాణత్యాగముం గావింపవలయు నని నిశ్చయించుకొనియెను"

ఇప్పటిద్రోణునిప్రాణత్యాగాభిలాషకుఁ గారణములలో నశ్వ త్థామమరణసంవాదము పరిగణింపఁబడలేదని పాఠకులు గ్రహించియే యుండవచ్చును. వివేచకులగువారి కీయొక్కనిదర్శనమే చాలును.

ద్రోణుఁ డప్పటికిని యుద్ధముసేయుట మానలేదు. తరువాతఁ గూడ నాతఁడు ముప్పదివేలసైన్యమును విధ్వంసంబు గావించెననియు, మఱియొకసారి ధృష్టద్యుమ్నుని బరాభూతునిం గావించెననియు, నీసారి భీముఁడు ధృష్టద్యుమ్నుని రక్షించె ననియు, నాతఁడే యభ్యాసానుసా రముగా ద్రోణాచార్యునిరథమును బట్టుకొని మనుపటివలెనే యాతని నధిక్షేపించె ననియు, నట్టితిరస్కారమువలననే ద్రోణుఁ డస్త్రత్యాగ ముం గావించె ననియు మహాభారతమునం దున్నది.

" తరువాత ద్రోణుఁడు రథోపరిభాగమున సకలాస్త్రశస్త్రము లను బడవైచి యోగావలంబనపూర్వకముగ సకలజీవాభయప్రదాన ముం గావించెను. ఆసమయమున మహావీరుఁ డగుధృష్టద్యుమ్నుఁడు తనరథంబున సకలాయుధంబులనుంచి కరవాలంబు గేలం గీలించి క్రిం దికి లంఘించి ద్రోణాభిముఖుండై పరుగెత్తెను. ఈవిధముగా ద్రోణా చార్యుఁడు ధృష్టద్యుమ్నునకు వశీభూతుండయ్యె నని సమరాంగణంబు

న హాహాకారంబు పుట్టెను. ఇట జ్యోతిర్మయుండును, మహాతపుఁడు నగుద్రోణాచార్యుం డస్త్రపరిత్యాగపూర్వకంబుగా సమభావము నవ లంబించి యోగదృష్టితో ననాదిపురుషుం డగువిష్ణుని ధ్యానింపఁదొ డంగెను. మఱియు నాతఁడింపుక యున్నతవదనుండై వక్షస్స్థలంబును వికసింపఁజేసి, నిమీలితనయనయుగళుండై, విషయవాంఛలం బరిత్య జించి సాత్వికభావావలంబన పూర్వకంబుగ నేకాక్షరమాత్రం బగు నోంకారమును బరాత్పరుండగు వాసుదేవుని సంస్మరించుచు సాధుజన దుర్లభం బగుస్వర్గలోకగమనంబు గావించెను ”

తిరువాత ధృష్టద్యుమ్నుఁడు వచ్చి యామృతదేహమునందలిమ స్తకమును ఖండించి తీసికొనిపోయెను—

కావున ద్రోణవధంగూర్చి మహాభారతమున రెండు వేఱువేఱు సంఘటనములగపడుచున్నవని చెప్పితిమి. ఆరెండును సంపూర్ణముగ నొకదానికొకటివిరుద్ధములుగాఁ గాక యొకసూత్రమునందే కూర్పఁబడి యుండెను. కాని సమన్వయము బాగుగఁ గుదురలేదు. ఈరెంటిలోను ద్రోణమృత్యువున కొక్కకారణమే చాలుననియు, రెండుకారణముల తోఁ బ్రయోజనము లేదనియు స్పష్టమగుచునే యున్నది. ఈవిధము గా నిట్టిభిన్నకారణముల నొక్కచో నుపయోగించుట యొక్కకవికా ర్యమే యని యూహించుట కవకాశము లేదు. ఇవిరెండు నిరువురుక వులరచనలని సులభముగనే బోధ యగుచున్నది. ఇంపుఁ బ్రక్షిప్తమే ది ? ద్రోణునిప్రాణత్యాగమునుగూర్చి మహాభారతమునుండి యుదా హరించినకారణము లన్నిటితో డను నశ్వత్థామమృత్యుసంవాదము సం బంధించుట లేదు. కావున నావృత్తాంతము ప్రక్షిప్త మగుట యసంభ వము. ఇదివఱకు నిర్ణయింపఁబడిన సూత్రములనుబట్టి యీవిషయమును బరీక్షించినచో నీసత్యము బోధపడఁగలదు.

పరస్పరవిరుద్ధము లగు రెండుభిన్నవిషయములు కానవచ్చినప్పు డందొకటి ప్రక్షిప్తమైయుండు ననుమాట నిశ్చయమే కాని యందేది ప్రక్షిప్తమో నిర్ణయింపవలసివచ్చినప్పు డిదివఱకు సుప్రసిద్ధములైనయితరలక్షణములనుబట్టి పరీక్షింపవలయును. అట్టిలక్షణములతో నం దేది సరిపడకుండునో యది ప్రక్షిప్తమని తెలిసికొనవలయును. అశ్వత్థామవధసంవాదము కృష్ణభీమయుధిష్ఠిరులచరిత్రములతోఁ గేవలము నసంగతముగా నున్నదని మే మిదివఱకుఁ జూపియే యున్నాము. ఇట్టియసంగతి కానవచ్చినభాగము ప్రక్షిప్తముగా గ్రహింపవలయు నని సూత్రము నుగూడ నిర్దేశించి యుంటిమి. కావున నీయశ్వత్థామమృత్యుసంవాద వృత్తాంతము ప్రక్షిప్తమే. సందేహము లేదు.

(3) మఱియొకమాటకూడ నున్నది. అశ్వత్థామవధ సంవాదము వలన ద్రోణుఁడించుకంతయైనను యుద్ధమునుండి విముఖుఁడైనట్లుగనఁబడుట లేదు. అట్టిచోఁ గృష్ణుఁ డీమాట యనిపించుటవలనఁ బ్రయోజనమేమున్నది ? ద్రోణుఁడీమాటవలన యుద్ధవిముఖుఁ డగునని కృష్ణుఁ డాలోచించి యుండునా ? అట్లాలోచించుట కవకాశ మెక్కడిది ? అశ్వత్థామ చావులేనివాఁడని ద్రోణునకే తెలియును. ఇది యస్వాభావికమైనను, గాకపోయినను దీనిమాట యటుంచుఁడు ! సామాన్యమానవులమగుమాకును, మీకునుగలయంతటిబుద్ధియైనను శ్రీకృష్ణునకుండు నని యంగీకరించినచో నాతఁ డిట్టియుపాయము నుపయోగించి యుండఁడని స్పష్టముగా బోధపడఁగలదు. ద్రోణుఁడైనను మఱియెవ్వఁడైనను నిట్టి దుర్వార్తవిని యాత్మత్యాగము చేసికొననున్నప్పుడా వార్త నిజమో కాదో తనపక్షమువారి నెవ్వరినైన నడిగి తెలిసికొనుటకుఁ బ్రయత్నింపకుండునా ? ద్రోణుఁ డప్పు డశ్వత్థామవార్తం దెలిసికొనుట కెవ్వరినైన బంపకుండునా ? అట్లు పంపియే తీరవలయును. అట్లుజరిగినచో మోస

మంతయు నప్పుడే తెలిసి యుండును. శ్రీకృష్ణుఁ డింతమాత్రపు దూ
రాలోచన లేనివాఁడా ?

అట్లగుటంజేసి యీకథ ప్రక్షిప్తమనియు నసత్యమనియుఁ దోఁచుచున్నది. ఋషివాక్యములచేతనే ద్రోణుఁ డస్త్రత్యాగముం గావించి యుండు నని మేము చెప్పఁజాలము. ఆరణరంగమున కప్పుడు ఋషులు వచ్చి రనుటకూడ నస్వభావముగనే యుండుటచే మేమావిషయమును గూడ నప్రకృత మని త్రోసివైచుటకు బాధ్యుల మగుచున్నాము. ఇందు విశ్వాసయోగ్య మగు కారణ మొకటి యున్నది. ద్రోణుఁడు తన యధర్మాచరణముంగూర్చి భీముని తిరస్కార వాక్యములవలన స్పష్టముగా గ్రహించుకొనఁ గలిగెను. యుద్ధవిముఖుఁ డగుట కాతనికి సాధ్యము కాలేదు. అట్లు చేసినచో నసమర్థత, ఆపత్కాలమున దుర్యోధనుని బరిత్యజించుట యనునీరెండుదోషములకును గుఱి కావలసివచ్చును. కావున మరణించుటకే స్థిరపఱుచుకొనియెను. ఇంతవఱకు జనప్రవాద మున్నదిగదా — దాని నాధారముచేసికొనియే మహాభారత ప్రథమశ్రేణి సంబంధించిన కవి వ్రాసెను. అదియును యథార్థఘటనము కాకపోవచ్చును. ఏమైనను ద్రుపదపుత్రుఁడు ద్రోణునివధించెననుమాటమాత్రము సత్యము ! తరువాతిసంగతులనుబట్టి యదియే బోధయగుచున్నది. ప్రబలప్రతాపమగు పాంచాలవంశమును బ్రహ్మహత్యాకళంకమునుండి యుద్ధరించుటకై తరువాత ననేకవిధము లగు నుపన్యాసములు బయలువెడలినవి.

(4) అనుక్రమణికాధ్యాయమునందును బర్వసంగ్రహాధ్యాయమునందును నీవిషయమై యేమున్నదియో చూడవలయును. అనుక్రమణికాధ్యాయమున ధృతరాష్ట్రవిలాపమునం దిట్లున్నది —

యదాశ్రౌషం ద్రోణమాచార్యమేకం

ధృష్టద్యుమ్నేనాభ్యతిక్రమ్యధర్మం
రథోపస్థేప్రాయగతంవిశస్తం
తదానాశంసేవిజయాయసంజయ"

అర్థము_ఓ సంజయా! ప్రాయోపవిష్టావస్థయందు రథస్థుఁడై యున్న యేకాకి యగుద్రోణాచార్యుని ధృష్టద్యుమ్నుఁ డధర్మానుసారముగా వధించె నని యెప్పుడు వినియుంటినో యప్పుడే నేనిఁక జయమునుగూర్చి శంకించుట లేదు.

దీనినిబట్టిచూడఁగా ద్రోణవధవిషయంబున ధృష్టద్యుమ్నుఁడు తక్క నితరులెవ్వరు నెట్టియన్యాయమును జేయలేదని తోఁచుచున్నది. ధృష్టద్యుమ్నునికైనను బాప మేమనిన— ప్రాయోపవిష్టుఁడగువృద్ధుని వధించుటయే. ద్రోణునిప్రాయోపవేశమునకుఁ గారణ మిచ్చట నేమియును జెప్పఁబడియుండలేదు. దానికిఁ గారణము యుధిష్ఠిరవాక్యమో ఋషులయుపదేశమో, భీమునితిరస్కారమో యేమియును సూచింపఁబడలేదు. ఆతఁడు మిగుల శాంతుఁడై మరణించి యుండెను. బ్రాహ్మణుని ప్రాయోపవేశమున కాసన్నమృత్యువే తగినకారణమై యుండును.

(5) పర్వసంగ్రహాధ్యాయమున నీమాటయే లేదు. "ద్రోణో యుధిని పతితే" అనుటకంటె మఱియేమియును లేదు. హతగజవృత్తాంతము సత్యమే యైనయెడల నట్టిప్రసంగమవశ్యముగ నచ్చియే యుండును. అభిమన్యుఁ డధర్మయుద్ధమున మరణించినకథ యున్నది— అట్టిచో ద్రోణునికథకూడ నుండవలసినదే. అప్పటికింకను నీకథ సృష్టము కాలేదు. అందుచేతనే లేదు.

(6) తరువాత ద్రోణపర్వమునందలిసప్తనూట్యమాధ్యాయము లలో ద్రోణయుద్ధము సంక్షేపముగ వర్ణితమై యున్నది అందైనను నీ

మోసముగూర్చి యెట్టిప్రసంగమును లేదు. ధృష్టద్యుమ్నుఁడు ద్రోణుని వధించె ననిమాత్రమే యున్నది. ఈయధ్యాయములు రచింపఁ బడిన కాలమున నీకల్పకనాథ పుట్టి యుండలేదు.

(7) అశ్వమేధపర్వమునం దిట్లున్నది— కృష్ణుఁడు ద్వారకకుఁ బోయినంతనే వసుదేవుఁడు కృష్ణునివలన యుద్ధవృత్తాంతమునువినుటకుఁ గుతూహలపడియెను. కృష్ణుఁ డాతనికి యుద్ధచరిత్రము సంక్షేపముగఁ దెలియఁజేసెను. ఆతఁడు ద్రోణయుద్ధముంగూర్చి తెలుపుచు ద్రోణధృష్టద్యుమ్నుల కైదుదినములు యుద్ధము జరిగె ననియు ననంతరము ద్రోణుఁడు సమరశ్రమచే నతిశ్రాంతుఁడై ధృష్టద్యుమ్నునిచే నిహతుఁడయ్యెననియుఁ జెప్పెను— ఇదియే సత్యమని తోఁచుచున్నది. యౌవనుఁడగుధృష్టద్యుమ్నునితోఁ గావించిన యుద్ధమువలనం గలుగునాయాసమే వృద్ధుఁడగుద్రోణునియుద్ధవిరతికి యథార్థకారణమై యుండును. ఇఁకఁ దక్కినవన్నియును గవికల్పనలే. ఉపన్యాసములే. ఈసంగతి యీవిధముగాఁ గల్పితమని నిరూపించుచు నేఁడునిదర్శనములను జూపి యుంటిమి.

కాని యీకల్పనలలోఁ గృష్ణుఁడే యీమిథ్యాప్రవంచనమునకుఁ బ్రవర్తకుఁడని చెప్పుటకుఁ గారణ మేమి! కారణ మిదివఱకే చెప్పియున్నాము. జ్ఞాన మెట్టీశ్వరదత్తమో, భ్రాంతికూడ నట్టిదియే యని నిరూపించుటకే—జయద్రథవధయందుఁ గూడఁ గవి దానిని బ్రదర్శించి యున్నాఁడు. ఘటోత్కచవధయందు బుద్ధి యెట్టీశ్వరదత్తమో దుర్బుద్ధి కూడ నట్టిదియేయని కవి చూపి యున్నాఁడు. అట్లే సత్యమును నసత్యమునుగూడ నీశ్వరప్రేరితములే యని యీద్రోణవధవృత్తాంతమునందుఁ దెలిపియున్నాఁడు.

దీనితరువాత నారాయణాస్త్రమోక్షపర్వాధ్యాయము. దానిని సంక్షేపముగ విమర్శించెదము. విస్తరించుటవలనఁ బ్రయోజనము లేదు. నారాయణాస్త్రవృత్తాంతమస్వాభావమైనది. కావునఁ గేవలమును బరిత్యాజనీయము. కాని యీపర్వాధ్యాయమునందొకనిగూఢవృత్తాంత మున్నది.

ద్రోణుఁడు నిహతుఁడైనంతనే యర్జునుఁడు గురునికొఱ కత్యంతమును శోకకాతరుఁడయ్యెను. మిథ్యావాదియై గురుహత్యం గావించినందు కాతఁడు యుధిష్ఠిరుని నిందించెను; మఱియు ధృష్టద్యుమ్నుని గూడ నిందించెను. యుధిష్ఠిరుఁడు మంచివాఁడు గావున దాని కెట్టిప్రత్యుత్తరము నీయలేదు. కాని భీముఁడుమాత్రము నిష్ఠురముగ నర్జునుని దూలనాడెను. ధృష్టద్యుమ్నుఁడును విశేషముగ నర్జునుని దిరస్కరించెను. అప్పుడు పార్థశిష్యుఁడగుసాత్యకి యర్జునునిపక్షము నవలంబించి ధృష్టద్యుమ్ను ననేకవిధముల నిందించెను. ధృష్టద్యుమ్నుఁడును వడ్డిలోఁ గూడ నాతనియప్పును దీర్చివైచెను అప్పుడయ్యిరువురును గ్రమముగాఁ బరస్పరవధోద్యుక్తులైరి. కృష్ణునియింగితముచే నప్పుడు భీమసహదేవులు వారిని శాంతింపఁజేసిరి. మిథ్యావచనమూలమున ద్రోణునివధించుట కర్తవ్యమా, యకర్తవ్యమా యనువిషయమున నుభయపక్షములను సాధ్యానుసారముగ వాదప్రతివాదములు జరిగెను. కాని యెందెవ్వరును గృష్ణునితప్పొప్పులనుగూర్చి మాటలాడలేదు. కృష్ణునిమూలముననే యీపనిజరిగినట్లప్పు డెవ్వరును ననియుండలేదు. ఆవాదములోఁ గృష్ణునిపేరైనను రాలేదు. నాలుగైదుచేతులపనియే కాకున్నచో నింతగందరగోళము పుట్టుటకవకాశమే లేదు.

షష్ఠపరిచ్ఛేదము.

కృష్ణకథితధర్మతత్త్వము.

అశ్వత్థామవధసంవాదవృత్తాంతమును రచించినకవి యర్జునుని మాత్రము సర్వోన్నతస్థానమునం దుంచెను. కృష్ణయుధిష్ఠిరభీములకంటె నర్జునునిధార్మికత్వమే యధికమైనదని యాతఁడు మనకుఁ బరిచయముం గూర్చియున్నాఁడు. శ్రీకృష్ణునిచేఁ బ్రస్తావితమైనట్టియు భీమయుధిష్ఠిరులచే సంపాదితమైనట్టియు మిథ్యాప్రవంచనకార్య మధర్మమని యర్జునుఁడు గర్హించుటయే గాక యందుకొఱకు ధర్మరాజునుగూడఁ దిరస్కరించి యుండెను. కాని యిప్పుడు మేము చేయనున్నవిమర్శనమునుబట్టి యర్జునుఁడు కేవలమును మూఢుఁడుగను బాలుఁడుగను గానవచ్చుచున్నాఁడు. ఆతఁడు కృష్ణునియొద్దనే సదుపదేశముం గాంచి సత్యపథావలంబనముం గాంచి యుండెను. ఆవృత్తాంతమిది—

ద్రోణునితరువాతఁ గర్ణుఁడు దుర్యోధనునకు సేనాపతి యయ్యెను. ఆతనియుద్ధముచేఁ బాండవసేన చెల్లాచెదరై పోయెను దురదృష్టవశమున యుధిష్ఠిరుఁడే కర్ణు నెదుర్కొనవలసివచ్చెను. ఆయుద్ధమునందాతఁడు కర్ణునిచేఁదాడితుఁడై పాఱిపోయి శిబిరంబున దాఁగి పర్యంకమునఁ బడియుండెను. ఇట నర్జునుఁడు యుద్ధవిజయుఁడై రణక్షేత్రమున యుధిష్ఠిరునిం గానక చింతాకులితహృదయముతో నాతని నన్వేషించుటకై శిబిరమునకుం బోయెను. అప్పటికింకను గర్ణుఁడు నిహతుండు కాలేదు. అర్జునుఁ డింకను గర్ణునివధింపలేదని తెలియవచ్చినంతనే యుధిష్ఠిరుఁడు క్రోధోద్దీప్తుఁడైపోయెను. తానసమర్థుఁడైయుండియును దాను జేయఁజాలని కార్యము నితరులు చేయలేకపోయిరని వారిని నిందించుట కాపురుషస్వభావము. యుధిష్ఠిరుఁ డప్పు డతికఠినముగ నర్జునుని దిరస్కరించె

ను. "నీకు యుద్ధమున భీతికలిగినచో నిట్లు పలాయితుండవై వచ్చుట మాని శ్రీకృష్ణునకు నీగాండీవము నీయఁ జాలకపోయితివా?" అని తుట్టతుదకు నిందించెను.

ఆమాట విని యర్జునుఁడు కరవాలంబు చేఁబూని యుధిష్ఠిరుని పైకి లంఘించెను. అప్పుడు కృష్ణుఁడు "ఈఖడ్గముతో నెవ్వరిని వధించెదవు?" అనియెను. దానిపై నర్జునుఁడు "నాగాండీవము నెవరుల కిమ్మని యెవ్వరందురో వారిమస్తకచ్ఛేదనముం గావింతునని నేను శపథము చేసికొని యుంటిని. ఇప్పుడు నీయెదుటనే మహారాజగు యుధిష్ఠిరుఁడట్లు వచించి యున్నాఁడు. కావున నేనీధర్మభీరువగునరపాలుని వధించి ప్రతిజ్ఞాపాలనమునుగావించి సత్యవ్రతలాభంబున నిశ్చింతుఁడనై యుండెదను.

ఈమాటలు మూఢుఁడగు పామరుని మాటలవలె నున్నవి గాని యర్జునునివాక్యములుగా లేవు. గాండీవము నెవరుల కిమ్మని చెప్పిన వారిని వధింతునని ప్రతిజ్ఞ చేయుట కేవలమును మూఢునిపనియై యున్నది. ఇది గాక చిత్తోత్తేజనముం గూర్చుటకై పూజ్యపాదుఁడగు జ్యేష్ఠాగ్రజుఁ డిట్లు మాటలాడి యుండఁగా నాతని వధింపఁజూచుటకంటెఁ బాషండకార్యము మఱి యేమైన నున్నదా? కాని దీనిలో నొకవిశేష మున్నది. అది శ్రీకృష్ణునిచే విమర్శింపఁబడియెను. అందుచే నీమాటలనుగూర్చి వ్రాయుటకు మేము బాధ్యుల మైతిమి.

ఆమాట యిది. సత్యమే పరమధర్మము; అర్జునుఁడు యుధిష్ఠిరుని వధింపకున్నచో సత్యచ్యుతుఁడు కాఁగలఁడు. సత్యరక్షణమునకై యుధిష్ఠిరునివధించుట కర్తవ్యమా కాదా యని యర్జునుఁడు కృష్ణు నడిగెను. ఇప్పుడు చేయఁదగినపనియేమో నిర్ణయింపుమనికూడ నడిగెను.

కృష్ణుఁ డెట్టియుత్తర మిచ్చెనో చెప్పుటకు ముందుగనే మీరే మిచెప్పెదరో చెప్పుఁడని మాపాఠకులను బ్రశ్నించుచున్నాము. ఇట్టిసత్యపాలనముకొఱ కర్జునుఁడు యుధిష్ఠిరునివధించుట ధర్మము కాదనియే మాపాఠకులందఱు నేకవాక్యముగాఁ జెప్పెద రని భావించుచున్నాము. కాని పాశ్చాత్యనీతిపండితులగు నాధునికపాఠకు లేకారణమునుబట్టియట్టియుత్తరమును జెప్పుదురో యాకారణమునుబట్టిశ్రీకృష్ణుఁడుదీనికిఁ బ్రత్యుత్తరము చెప్పలేదు. ఆతఁడు ప్రాచ్యనీతినే యవలంబించి యీయుత్తరము నిచ్చెను. దానికిఁ గారణము చెప్పనక్కఱలేదు. శ్రీకృష్ణుఁడు భారతవర్షమున నవతరించెను గాని యింగ్లాండునందు గాదు గద! ఆతఁడు భారతవర్షనీతియందుఁ బండితుఁడు.

కృష్ణుఁ డర్జునునకు బోధించుటకై యేసమస్తతత్త్వము నవతరింపఁజేసెనో దానిస్థూలరహస్యము నిప్పుడు చెప్పుచున్నాము. మొత్తముమీఁద నేది వివాదాంశమో దాని నిచ్చట నుదాహరించుచున్నాము.

ఆతని మొదటిమాట "అహింసపరమధర్మము"—దీనికి మొట్టమొదటనే యాక్షేపము కలుగవచ్చును. సకలస్థలములయందును నహింస ధర్మము కాదని—కృష్ణుఁడు స్వయముగాగీతాపర్వాధ్యాయమున నర్జునున కేధర్మము నుపదేశించి యుద్ధమునకుఁ బ్రవృత్తిం గల్పించెనో యాధర్మమున కిది విరుద్ధమని రెండవయాక్షేపము.

అహింసాతత్త్వమునందలి యథార్థరహస్యము నెఱుంగఁజాలనివాఁడే యిట్టియాక్షేపములం గావించును. "అహింసపరమధర్మము"అనుమాటలో నేయవస్థయందైనను నేవిధముగానైనను హింసచేయుట యధర్మమే యనుతాత్పర్యము లేదు. ప్రాణిహింస చేయకుండ మన మొక్కక్షణమైనను జీవింపఁజాలము. ఇది యీశ్వరనియమము. జలపా

నను గావించువాఁడెల్ల వేలకొలఁదిజీవాణువులనుదరస్థములుగాఁ జేసికొనుచున్నాఁడు. మానవునిప్రతినిశ్వాసమునందును నసంఖ్యాకములగునట్టిజీవాణువులు నాసాపథంబున లోపలఁ బ్రవేశించుచున్నవి; ప్రతిపదక్షేపమునందును నట్టివి వేలకొలఁది దళితములై పోవుచున్నవి. ఒక్కయాకుకూరలో నొక్కదుంపకూరలో నెన్నియోజీవాణువులు భక్షింపఁబడిపోవుచున్నవి. ఇది యంతయు నజ్ఞానకృతం బగుహింస యనియు దీనివలనఁ బాపము లేదనియుఁ జెప్పినచో జ్ఞానకృతంబగుప్రాణిహింసకూడ లేకుండ మనము జీవింపఁజాలమని చెప్పుచున్నాము. విషసర్పము గాని వృశ్చికముగాని మనగృహమునందైనను మనశయ్యాయందైనను నాశ్రయించి యున్నప్పుడు మనము దానిని జంపకున్నచో నవి మనలను జంపివైచును. వ్యాఘ్రము మనలనుబట్టుటకై లంఘింపనున్నప్పుడు దానిని మనము చంపకున్నచో నది మనలనుజంపివైచును. శత్రువు మనలను జంపుటకుఁగృతనిశ్చయుఁడై యుద్యతాయుధుఁడై యున్నప్పుడు మనమాతనికి వినాశనముంగూర్పకున్నచో మనలనాతఁడు నాశము చేయును. దస్యువగువాఁడు ధృతాయుధుఁడై నిశీథమున మనయింటఁ బ్రవేశించి సర్వస్వము నపహరించుచున్నప్పుడు వధించుటకంటె నాతనినివారించుట కన్యోపాయము లేనప్పు డాతని నిహతునింగావించుటయే మనకవశ్యధర్మమైయున్నది. న్యాయస్థానమున న్యాయాధికారియెదుట హంతకునినేరము రుజువయి రాజశాసనమును బట్టి యాతనికి మరణదండనము విహితమైనప్పుడు మరణశిక్షవిధించుటకు న్యాయాధికారి బాధ్యుఁడగుచున్నాఁడు. వధార్హునివధించుభారమును వహించినరాజపురుషుఁడట్టివానిని వధించుటకు బాధ్యుఁడగుచున్నాఁడు. శికిందరుషాహి, గజినీమహమ్మదు తైమూరులంగు నాదరుషా రెండవఫ్రెడరిక్కు నెపోలియను మొదలగువారేనిపుణులగుతస్కరులను దీసికొని పరధనపరరాజ్యాపహరణమునకై పరరాష్ట్రముల నాశ

మించిరో యట్టివారు లక్షలకొలఁదిగ నున్నను ధర్మానుసారముగ వధ్యు లేయగుచున్నారు. ఇచ్చట హింసయే ధర్మ మగుచున్నది.

పక్షాంతరముచే నాకాశమం దెగురుచున్న పక్షిని దినుటకైనను గాని వినోదమునకై గాని వధించుట యధర్మము. నీటిపైఁ దేలియాడుచున్న చేఁపలను గ్రీడాశీలుఁడగు బాలకుఁడు పట్టుకొని నలిపిచంపుట యధర్మము. మనవలెనే జీవసూత్రము గాపించుటకై జన్మించిన మృగమును గాని కుక్కుటమునుగాని కుక్షింభరియగువాఁడు వధించితినుట యధర్మము. వాయుప్రవాహమునందును జలప్రవాహమునందును సంచరించు జీవులను బట్టి చంపితినుట యధర్మము

"అహింసపరమధర్మము" అను వాక్యమునకుఁ దాత్పర్యమేమని న—ధర్మప్రయోజనవ్యతిరిక్తం బగుహింసను విడుచుటయే పరమధర్మము. కాని హింసాకరులను నివారించుహింస యధర్మముకాదు. సరిగ దాపరమధర్మముకూడ నగుచున్నది. ఈయర్థమును స్పష్టీకరించుటకే శ్రీకృష్ణుఁడర్జునునకు వాలకేతిహాసమును జెప్పియుండెను. దానిస్థూలతాత్పర్యమేమనిన—వాలకుఁడను నొకవ్యాధుఁడు విశేషప్రాణినాశనహేతువగు నొకశునకమును వధించెను. శోడనే యాతనిపై నాకసమునుండి పుష్పవృష్టిగురిసెను. అప్సరలతిమనోహరముగ గీతవాద్యములఁగావించిరి. మఱియు నావ్యాధుని స్వర్గమునకుఁ గొనిపోవుటకై యొకవిమానముకూడ వచ్చెను. హింసాకరుని హింసించుటయే వ్యాధుఁడు చేసిన పుణ్యము!

అహింస పరమధర్మమని యీవిధముగా గ్రహింపవలయును. ధర్మప్రయోజనమునకు వ్యతిరేకముగ హింస చేయరాదు. ఈవిషయముంగూర్చినవాదోపవాదములు చిరకాలమునుండి జరగుచున్నవి. ధర్మసంబంధమైనప్రయోజనమన నేమి! ధర్మమననేమి? ఇన్క్విసిషన్(In

quisition) రోమనుకాథలికుచర్చివారి యాజ్ఞచే మనుష్యవధ యందు ధర్మసంబంధమగుప్రయోజనమున్నదను కారణమునఁ గోటికోటి మనుష్యులు యమాలయమున కంపఁబడిరి. సెయింటుపార్థాల్సుమెన్ (St partholsmen) హత్యాకాండ ధర్మముకొఱకే జరగినది. ధర్మాచరణోద్దేశముచేతనే క్రూసేడు యోధులవలన భూమండలము నరశోణితప్రవాహములచేఁ బంకిలమైపోయెను. ధర్మవిస్తారముకొఱకు ముసల్మానులు లక్షలకొలఁది మానవహత్యలనుగావించిరి. ధర్మసంబంధప్రయోజనము భ్రాంతిలోఁబడి మానవులెంతమందిమానవులను నశింపఁజేసిరో యంతమందిమానవులు మఱియేకారణముచేతను నశింపలేదని తోఁచుచున్నది.

అర్జునునకుఁగూడ నిప్పుడా భ్రాంతియే కలిగినది. సత్యరక్షణమను ధర్మముకొఱకు యుధిష్ఠిరుని వధించుట కర్తవ్యమని యాతఁడూహించుకొనెను. అందుచేతనే కేవలమును "అహింస పరమధర్మము" అనిచెప్పినంతమాత్రమున నాతని భ్రాంతి తీఱినదికాదు. కావున గృష్ణుఁడాతనికి మఱియొకవిధముగా బోధించెను.

ఆతనిరెండవవాక్యమేమనిన "అసత్యమాడినను సరియే; కాని యెన్నఁడును ప్రాణిహింస చేయరాదు *" అని—అహింస, సత్యము ననునీరెంటిలో నహింసయే శ్రేష్ఠధర్మమని దీనిస్థూలతాత్పర్యము. దీని యర్థమిది—దానము, తపము, దైవభక్తి, సత్యము, శౌచము, అహింస మొదలగు వివిధకర్మసముదాయ మంతయు ధర్మమనియే చెప్పవచ్చును. కాని యివియన్నియును సమానములే యని చెప్పరాదు. విశేషలక్షణములనుబట్టి వీనిలోఁ దారతమ్య మగపడుచున్నది శౌచమాహాత్మ్యమును, దానమాహాత్మ్యమును సత్యముతోఁగాని యహింసతోఁగాని తుల్యములగునా? అట్లు గాక తారతమ్యమే యున్నయెడ

ల నందు సర్వశ్రేష్ఠధర్మ మేది? అహింసయే సర్వశ్రేష్ఠధర్మ మని కృష్ణుఁడు చెప్పెను. సత్యము దానితరువాతిదే.

మనము పాశ్చాత్యుల శిష్యులము. మాపాఠకులలో ననేకు లీమాటవిని యులికిపడియెదరు. ఎట్టియవస్థయందైనను నసత్యము పలుకఁగూడ దనికదా పాశ్చాత్యులు చెప్పెదరు? అట్లు చెప్పకయే యున్నచో నిప్పుడీప్రసంగమునకుఁ బ్రయోజనమే లేకయుండును. కాని పాశ్చాత్యమతంబున హంతకునికంటె నసత్యవాది విశేషపాపుఁ డనిగాని, హంతకుఁడు నసత్యవాదియును దుల్యపాపులే యనిగాని యెవ్వరును జెప్పఁజాలరు. వారందఱును యైరోపీయదండనీతిశాస్త్రమే ప్రమాణమనికూడఁ జెప్పఁజాలరు. అట్లే యైనచో నిప్పుడు కృష్ణునితోఁ బాశ్చాత్యశిష్యులకు మతభేదము లేకయే యుండును. ఇచ్చటఁ గేవలమును బాపతారతమ్యమునుగూర్చియే ప్రశంస యగుచున్నది. ఎన్నఁడు నెట్టియధర్మమును జేయక, యెట్టినరహత్యను

* ఏవచనముపై శ్రీకృష్ణునిధర్మతత్వము సంస్థాపితమై యుండెనో యావచనమును మూల సంస్కృతరూపమునఁ జూపుచున్నాము.

"ప్రాణినా మవధ స్తాత సర్వజ్యాయా న్మతో మమ। అనృతాం వాధ వదేద్వాచం నతుహింస్యాత్ కథంచన"

"అహింసాపరమధర్మము" అనునది శ్రీకృష్ణవాక్యమునకు సరియైనయనువాదము కాదని పాఠకులు గ్రహించితిరిగదా! "ప్రాణిగణంబులను హింసింపకుండుటయేపరమధర్మము" ఇదియే దీనికి సరియగునర్థమని మాయుద్దేశము. ఈరెంటికిని నర్థగతభేదము విశేషముగ లేకుండుటచే "అహింస పరమధర్మము" అనుమాటయే యిందు వ్యవహృతం బయ్యెను.

గావింపక, యేవిధమగు నసత్యమును బలుకక యుండువాని కసత్యమాడవలసినయవస్థ తటస్థించినప్పుడు, అట్లు చేయకున్నచో నరహత్యచేయక తప్పనప్పుడు హత్యచేయుటకంటె మిథ్యావచనంబు నుపయోగించుటయే మంచిదని శ్రీకృష్ణునియుపదేశమునకుఁ దాత్పర్యము. మిథ్యాభాషణముకంటె నరహత్యచేయుటయే మంచిదని బోధించు ధర్మాత్ముఁడగువిజ్ఞుఁ డెవ్వఁడైన నున్నచో నాతనిధర్మమాతనిచెంతనే యుండుఁగావుత మనియు, నట్టినరకదాయకంబగునిషిద్ధధర్మము భారతవర్షమునం దెన్నఁడును వ్యాపింపఁజాలదనియు మేము ప్రత్యుత్తరము చెప్పుచున్నాము.

కృష్ణునిమత మిది. అర్జునుఁడు దీనననుసరించినచో భ్రాతృవధపాపమునుండి యాతని మరలించువిషయమున నిదియే చాలును. కాని యప్పు డర్జునుఁడు "ఇది నీధర్మము. కాని, లోకమునఁ బ్రచారమునందున్నమత మేమి? నీమతము సత్యమే యైయున్నను, బ్రచారమునందున్నమతము ననుసరింపకపోయినచో జనసంఘమునందు నాకు సత్యచ్యుతుఁడగువాపాత్ముఁ డనుకళంకము కలుగును." అని చెప్పెను. అందుచేఁ గృష్ణుఁడు తనమతమును బ్రకటించి ప్రచలితధర్మమునుగూర్చికూడ బోధింపఁదలఁచినవాఁడై "ఓధనంజయా! కురుపితామహుఁడగుభీష్ముఁడును, ధర్మరాజగుయుధిష్ఠిరుఁడును, విదురుఁడును, యశస్విని యగుకుంతియు నేధర్మరహస్యమునుపదేశించి యుండిరో యాధర్మమును బ్రశంసించెదను వినుము:—సాధువ్యక్తి యగువాఁడు సత్యమునే చెప్పుచుండును. సత్యముకంటె శ్రేష్ఠధర్మ మేదియును లేదు *

* "నసత్యాద్విద్యతేపరమ్" కృష్ణుఁడింతకుఁ బూర్వమున "ప్రాణినామవధస్తాత సర్వజ్యాయాన్మతో మమ" అని చెప్పియుండెను. ఈరెండును బరస్పరవిరుద్ధములై యున్నవి. దానికిఁగారణ మొకటికృష్ణునిమతమును, మఱియొకటి భీష్మాదులచేఁ గథితం బగు ప్రచలితధర్మనీతియు నైయుండుటయే—

సత్యతత్త్వ మతిసూక్ష్మ జ్ఞేయమైనది. సత్యవాక్యప్రయోగమే యవశ్యకర్తవ్య మనునది స్థూలనీతి. తరువాత వర్జితతత్త్వము చెప్పఁబడియెను.

"కాని యెచ్చట మిథ్య సత్యస్వరూపముగను, సత్యము మిథ్యాస్వరూపముగను నగుచున్నదో యచ్చట మిథ్యావాక్యప్రయోగము గావించినను దోషాకరము కానేరదు"

కాని యెప్పుడైన నిట్లగునా? అట్టిసమయమున మనమాతత్త్వో ముంగూర్చి యథాసాధ్యముగ విమర్శింపవలసియుండు ననుమాటకూడఁ బుట్టుచున్నది. తరువాతఁ గృష్ణుఁ డిట్లు చెప్పెను—

"వివాహము, రతిక్రీడ, ప్రాణవియోగము, సర్వస్వాపహారణము నగుకాలముననను, బ్రాహ్మణునినిమిత్తమును మిథ్యాప్రయోగముం గావించుటపాతకము కానేరదు"

ఇదియే ఘోరతరం బగువివాదస్థానము. కాని వివాదముమాట యిప్పు డట్లుండనిండు! కాళీప్రసన్నసింహునియనువాదము పైనివ్రాసినట్లే యున్నది. అది యొక్కశ్లోకమునకుమాత్రమే యనువాదము. కాని మూలమహానం దీవిషయమున రెండుశ్లోకము లున్నవి. ఆ రెండిటినిందుదాహరించెదము—

(1) ప్రాణాత్యయే వివాహేచ వక్తవ్య మన్నృతం భవేత్
సర్వస్వస్యాపహారే చ వక్తవ్య మనృతం భవేత్.

(2) వివాహకాలే రతిసంప్రయోగే
ప్రాణాత్యయే సర్వధనాపహారే
విప్రస్య చార్థే హ్యనృతంవదేత
పంచానృతాన్యాహురపాతకాని.

ఈరెండుశ్లోకములకు నర్థ మొక్కటియే. మొదటిశ్లోకమున బ్రాహ్మణప్రశంసమాత్రము లేదు. ఇదియే యీరెంటికిని భేదము.

ఒక్క టేయర్థముగల యీ రెండుశ్లోకములవలనఁబ్రయోజన మేమని యిప్పుడు పాఠకులకుఁ దమంతనే సంశయము కలుగవచ్చును.

దీనికిఁ బ్రత్యుత్తర మేమనిన—ఈరెండుశ్లోకములును మఱియొకచోటినుండి యుద్ధృతములే గాని, కృష్ణునిచే స్వయముగఁ జెప్పఁబడినవి కావు. సంస్కృతగ్రంథములయం దచ్చటచ్చట నిట్లుగ్రహింపఁబడినవచనములు కానవచ్చుచుండును. కాని యట్లు గ్రహింపఁబడినవచనము లేవియో నిశ్చయించుట దుస్సాధ్యముగనే యుండును. ఈమహాభారతమునందలి గీతాపర్వాధ్యాయమే దానికుదాహరణమని గ్రంథాంతరమున మేము చూపి యున్నాము.

ఈవచనములు రెండునుగూడ నట్టివే యని మేమనుమానమున్నపై నాధారపడి చెప్పుచున్నాము. ఇందు ద్వితీయశ్లోకమునం గల "వివాహకాలే, రతిసంప్రయోగే" అనువచనములు వశిష్ఠునివి. వాశిష్ఠము ౧౬ అధ్యాయము ౨౬ శ్లోకమునం దీవచనము కానఁబడుచున్నది. ఇదియే మహాభారతమునం దాదిపర్వమున ౩౪౧౨ శ్లోకమున (కృష్ణునితో నెట్టిసంబంధమును లేనిచోట) నించుకపరివర్తితమై యుగపడుచున్నది. చూడుఁడు !

"నధర్మయుక్తం వచనంహినస్తి
నస్త్రీషురాజన్న వివాహకాలే
ప్రాణాత్యయే సర్వధనాపహారే
పంచానృతాన్యాహురపాతకాని"

ఇందు నాల్గువిషయములే కాని యైదవది లేదు. అయినను వశిష్ఠోక్తంబగు "పంచానృతాన్యాహురపాతకాని" యనువచనమున్నది. ప్రచలితవచనమగుటచే కలుపురినోళ్ళం బడి యిట్లు వికృత మైయుం

...ను. ప్రథమశ్లోకమును బూర్వగామిశ్లోకముతోఁగూడఁ జేర్చి చూపెదము.

(క) భవేత్ సత్య మవక్తవ్యం వక్తవ్య మనృతం భవేత్
(ఖ) యత్రానృతం భవేత్ సత్యం సత్యంచా ప్యనృతం భవేత్
(గ) ప్రాణాత్యయే వివాహేచ వక్తవ్య మనృతం భవేత్
(ఘ) సర్వస్వస్యాపహారేచ వక్తవ్య మనృతం భవేత్.

ఇప్పుడు మహాభారతసభాపర్వమునుండి ౧౩౮౦౭౮ శ్లోకమును జూపెదము. ఆసందర్భమునఁ గృష్ణునితో నెట్టిసంబంధమును లేదు.

(చ) ప్రాణాంతికే వివాహేచ వక్తవ్య మనృతం భవేత్
(ఛ) అనృతేన భవేత్ సత్యం సత్యేనై వానృతం భవేత్

ఇందు గ, చ లును, ఖ, ఛ లును నొక్కటే యర్థమునం దున్నవి. సామాన్యముగ శబ్దములుకూడ నొక్కటియే. కావున నివియును బ్రచలితపురాతనవచనములే.

ఇది కృష్ణమతము కాదు. ఆతఁడుదానింగూర్చి తానామోదించినరీతి యని చెప్పి యుండలేదు; భీష్మాదులవలన వినినదానినే చెప్పియుండెను. తానంగీకరించినను, నంగీకరింపకపోయినను దీని నర్జునునకు బోధింపవలసివచ్చుటచే బోధించెను. ఈరీతింగూర్చినసత్యాసత్యవివేచనముతోఁ గృష్ణచరిత్రమున కెట్టిప్రయోజనమును లేదు.

కాని చెప్పవలసిన ముఖ్యవిషయ మట్లేయున్నది. అవస్థావిశేషముచే సత్యమే మిథ్యయగు ననియు, మిథ్యయే సత్యమగు ననియు శ్రీకృష్ణుఁడు మతియునందుఁగూడ నున్నది. అట్టి సమయములందు మిథ్యనే ప్రయోగింపఁ దగునని తరువాత నాతఁడు చెప్పి యుండెను.

ఎప్పుడు మిథ్య సత్యమగునో, సత్యముమిథ్యయగునో యాసంగతి ముందుగ నాలోచింపవలయును. ధర్మానుమోదిత మగునది స

త్యము; అధర్మానుమోదిత మగునది యసత్యము. ధర్మానుమోదితము మిథ్యకాదు; అధర్మానుమోదితము సత్యముకాదు. కావున సత్యాసత్యవివేచనము ధర్మాధర్మవివేచనముపై నాధారపడి యుండవలయును. అందుచేతనే శ్రీకృష్ణుడు ముందుగా ధర్మతత్త్వమును నిర్ణయించెను. ఆమాటలలో గీతోపాకారనీతుల గంభీరశబ్దములు వినబడుచున్నవి—

"ధర్మాధర్మతత్త్వనిర్ణయమునకొఱకు విశేషలక్షణము నిర్దిష్టమైయున్నది. కొన్నికొన్నిస్థలములయందు దుర్బోధమగుధర్మము ననుమానముచేఁగూడ నిర్ణయింపవలసి యుండును"

తరువాత మఱియును,

"అనేకులు శ్రుతినే ధర్మమునకుఁ బ్రమాణమని నిర్దేశించియున్నారు. నేను వారియందు దోషారోపము నాపాదించుట లేదు. కాని శ్రుతులచే సమస్తధర్మతత్త్వమును నిర్దిష్టంబు గాలేదు. అందుచేతనే కొన్నియెడల ధర్మము ననుమానముచేతనే నిర్దేశింపవలసి యుండెను."

ఈసంగతింగూర్చి యిప్పటికిని నాగరికప్రపంచమున గందరగోళ మగుచున్నది. వేదమైనను, బైబిలైనను, కొరానైనను నివి దైవోక్తములే యనియు, వానిలో నున్నదంతయు ధర్మమే యనియు, నందులేనిధర్మ మేదియును లేదనియు వాదించువా రిప్పటికిని బలవంతులై యున్నారు. దైవోక్తిచే నిర్దిష్టమగునదిమాత్రమే ధర్మముకాని, ధర్మమెన్నఁడు ననుమానమునకు విషయము కాదని వారిమతము. ఈమాట మానవజాతి యున్నతిమార్గమునకుఁ దీఱనికంటక మైయున్నది. మనదేశముమాటకేమి, ఐరోపాదేశమందుఁగూడ నిప్పటికి నీమతము మానవునియున్నతిపథమును నిరోధించుచునే యున్నది. మనదేశమున

కవనతి కలుగుట కిదియొక ప్రధానకారణము. ఇప్పటికిని భారతవర్ష మున ధర్మజ్ఞానము శ్రుతిస్మృత్యాదులచే నిరుద్ధమై యున్నది; అను మానపద్ధతి నిషిద్ధమై యున్నది. అతిదూరదర్శియు, మానవాదర్శస్వ రూపుఁడు నగు శ్రీకృష్ణుఁడు లోకోన్నతికి విషమవ్యాఘాతం బగునీవిష యమును జిరకాలముక్రిందటనే చూపి యున్నాఁడు. ఇప్పటిహిందూ సమాజమునందలి ధర్మజ్ఞానముం గాంచి విషణ్ణహృదయముతో మే మాకృష్ణునే శరణ్యునిగాఁ జేసికొ నఁదలఁచితిమి.

కాని యనుమానమున కొకమూల ముండవలయును. అగ్నిలేక ధూమోత్పత్తి యుండదనుమూలము ననుసరించి సమీపమున ధూ మవంతమైయున్న పర్వతముం గాంచి యది వహ్నిమంతమై యుండునని గ్రహించునట్లే యీకర్మము ధర్మమని గ్రహింపఁగల లక్షణమొకటి కావలసి యున్నది. శ్రీకృష్ణుఁ డాలక్షణమును నిర్దేశించి యుండెను.

"ధర్మము ప్రాణిగణంబును ధరించి యుండునది కావున దాని కి ధర్మనామము నిర్దిష్టం బయ్యెను. కావున "దేనివలనఁ బ్రాణిరక్షణ మగునో యదియే ధర్మము"

కృష్ణునిధర్మలక్షణనిర్దేశ మిదియే. ఈవిషయమున హెర్బర్టు స్పెన్సరు, బెంథామ్‌మిల్లు మొదలగు సంప్రదాయములశిష్యుల కెట్టియు నమ్మతియు నుండదని తలంచెదము. కాని యిది కేవలమును హితవా దమని యనేకులు చెప్పెదరు. అట్లే కావచ్చును. ధర్మతత్త్వమును హితవాదముతో వేఱుచేయఁగూడదని మేము గ్రంథాంతరమున విమ ర్శించి యున్నాము. జగదీశ్వరుని సార్వభౌమత్వమునుండియును, సర్వ మయత్వమునుండియును దీని ననుమతింపవలయును. సంకీర్ణ మగుక్రీ స్తుధర్మమునకు హితవాదము విరుద్ధమైనఁ గావచ్చును. కాని యీశ్వ రుఁడు సర్వభూతమయుండని ప్రశంసించుహిందూధర్మమున కీహితవా

ద మొకయంశమే యైయుండెను. ఈకృష్ణవాక్యమే యథార్థధర్మ లక్షణము.

ధర్మానుమోదితం బగునది సత్యమనియు, ధర్మానుమోదితము కానిది యసత్యమనియు నిదివఱకే తెలిపి యుంటిమి. కావుననే సర్వలోకహితకరం బగునది సత్యమును, లోకాహితకరం బగునది యసత్యము నగుచున్నది. ఈయర్థమునందు లౌకికసత్యము ధర్మానుసారముగా మిథ్యయగుచున్నది. లౌకికమిథ్య ధర్మానుసారముగా సత్యము కావచ్చును. ఇట్టిస్థలమునందు మిథ్యయే సత్యస్వరూపమును, సత్యమే మిథ్యాస్వరూపము నగుచున్నది.

శ్రీకృష్ణుఁడు దీని కుదాహరణస్వరూపముగా "ఒకఁడొకని జంపవలయు నను నుద్దేశముతో వచ్చి యాతనిం గూర్చి మఱియొకని బ్రశ్నించినప్పుడు ప్రశ్నింపఁబడినవాఁడు మౌనము నవలంబించుటయే యుచితము. ఒకవేళఁ బ్రత్యుత్తరము చెప్పక తప్పనప్పుడు మిథ్యా వాక్యమును బ్రయోగించుటయే కర్తవ్యము. ఇచ్చట మిథ్యయే సత్యస్వరూప మగుచున్నది.

ఈప్రస్తావమునకుఁ బూర్వమునందే కృష్ణుఁడర్జునునకుఁ గౌశికోపాఖ్యానమును జెప్పెను. ఆయుపాఖ్యానమిది.—

"బహుశ్రుతుండును, దపస్విశ్రేష్ఠుండు నగు కౌశికుండను నొక బ్రాహ్మణుఁడు గ్రామముల కనతిదూరంబునం గలయొక నదీసంగమస్థానమున నివసించుచుండెను. ఆతఁడు నిరంతరసత్యవాక్యప్రయోగరూపం బగువ్రతంబు నవలంబించి యాకాలమున సత్యవాది యనువిఖ్యాతిం గాంచి యుండెను. ఒకప్పుడు గొందఱుమార్గస్థులు దస్యుభయంబుచే నావనమధ్యంబున దాఁగుటయు, దస్యులు క్రోధోద్రేకంబుచే వారల నన్వేషించుచుఁ గ్రమముగా నాసత్యవాది యగుకౌశికుని

చెంతకు వచ్చి "ఓమహాత్మా! ఈమార్గమునఁ గొందఱు మనుష్యులు వచ్చియున్నారు; వారెట్లు పోయిరో మీ రెఱింగియున్నచో సత్యమును వచింపుఁడు" అని ప్రశ్నించిరి అప్పు డాకౌశికుఁడు తనసత్యపరిపాలనంబు గావించుకొనుటకై వారీతరుగుల్మలతావేష్టితం బగువనంబునఁ బ్రవేశించి రనిచెప్పెను. అనంతర మాకౄరకర్ము లగుదస్యులు వారిని వెదకి కనుంగొని యాక్రమించి వినాశముం గావించిరి. సూక్ష్మధర్మానభిజ్ఞుఁడగు నాసత్యవాది కౌశికుండును, సత్యవాక్యజనితం బగుపాపముచే లిప్తుండై ఘోరనరకనిపతితుం డయ్యెను"

ఆసమయమునఁ గౌశికునకు వారు దస్యులనియుఁ, బలాయితు లగు మార్గస్థులను హింసించుటయే వారియుద్దేశమనియుఁ దెలిసి యుండెను. అందుచేతనే యాతని కల్లు చెప్పుట పాపమయ్యెను. అట్లుగాకున్నచో సత్యము చెప్పుటవలన నాతని కెట్టిపాపమును లేకయే యుండును. కౌశికునిసత్యవచన మిప్పట్టునఁ గృష్ణమతానుసారముగాఁ బాపాచరణ మయ్యెను. ఈవిషయంబునఁ బ్రాచ్యులకును, బాశ్చాత్యులకును ఘోరతరం బగుమతభేద మున్నది. సత్యము నిత్యమైనదనియు, నది యెన్నటికిని మిథ్య కానేరదనియు, నెట్టిసమయమునందైనను మిథ్యాప్రయోగ మకర్తవ్య మనియుఁ బాశ్చాత్యపండితులవలన మనము నేర్చికొని యున్నారము. అట్టిసుశిక్షిత సంప్రదాయమువారిచే శ్రీకృష్ణమతము కేవలమును నిందింపఁబడుచున్నది. ఇట్లు కృష్ణమతమును నిందించువారినిగూర్చి కౌశికుఁ డిట్టిసమయమున నేమిచేసిన నుచితముగ నుండునో తెలుపవలయునని వేఁడుచున్నాము. మౌనమును వహించుట యుచిత మని చెప్పుటయే దీనికి సదుత్తరము. శ్రీకృష్ణుఁ డీమాట స్పష్టముగనే చెప్పియుండెను. ఈవిషయమున మతభేదము లేదు. కాని దస్యు లాతనిమౌనమును నిలువనీయక ప్రత్యుత్తరమున

ఘంబీడించినచో నేమి చేయవలయును ? ఎంతపీడించినను జావునకైన నంగీకరించి మానమును వీడకుండుటయే యప్పు డాతనికిఁ గర్తవ్యమని కొందఱు చెప్పవచ్చును. అదికూడ మేమును సంపూర్ణముగ నంగీకరింతుము. కాని యిట్టిధర్మము పృథ్వియందు సామాన్యముగఁ బ్రచారమునందుండుట కవకాశ మున్నదా లేదా యని సంశయము కలుగుచున్నది. ఈవిషయమున సాంఖ్యప్రవచనకారుని సూత్ర మొకటి మాకు జ్ఞప్తికి వచ్చుచున్నది. మహర్షియగుకపిలుఁడు "నాశక్యోపదేశవిధిరుపదిష్టేప్యనుపదేశః" * ఇట్టి ధర్మప్రచారమునకుఁ బ్రయత్నించుట నిష్ఫలమని తోఁచుచున్నది. సఫలమైనచో నది మానవజాతికిఁ బరమసౌభాగ్యమే.

"అవశ్యం కూజితవ్యేవా శంకేరన్ వాప్యకూజతః"

అట్లయినచో నేమి చేయవలయును? సత్యము చెప్పి బుద్ధిపూర్వకముగా నరహత్యకు సాహాయ్యము చేయవలయునా? ఈవిధముగా ధర్మతత్త్వమును బోధించువాని ధర్మవాదము సత్యమైనను, నసత్యమైనను నగుఁగాక! అది కేవలమును గ్రూరమైనదనుమాట మాత్రము నిశ్చయము. హంతకుని జీవనరక్షార్థమై మిథ్యాప్రమాణము చేయుట కూడ ధర్మమే యని యీకృష్ణనీతివలనఁ దేటపడుచున్నదని యెవ్వరైనఁ బ్రతివాదము చేయవచ్చును ఎవ్వఁడిట్టియాక్షేపము గావించునో, యాతని కిందలిసత్యతత్త్వము బోధపడలేదని చెప్పవచ్చును. హంతకుని దండించుట మానవజీవనరక్షణమున కత్యంతమును బ్రయోజనీయమైనది. హంతకుని దండింపకున్నచో నగపడినవానినెల్ల నాతఁడు చంపుచునే యుండును. కావున హంతకుని దండించుట ధర్మము. మఱియు నాతని రక్షించుట కసత్యమాడినవాఁ డధర్మము చేసినవాఁ డగుచున్నాఁడు.

* ప్రథమాధ్యాయము ౮ సూత్రము.

కృష్ణోక్తం బగు నీసత్యతత్త్వము నిర్దోషమైనదియో కాదో, యిది సర్వసాధారణముగ నాచరణీయమైన దగునో కాదో నిర్దేశించుట కు మేమిప్పుడు పూనుకొని యుండలేదు. కాని కృష్ణచరిత్రమును స్పష్టపఱుచుటకై యీవిషయమును బ్రస్ఫుటముగఁ జేయుటకు మేము బాధ్యులమైతిమి. సత్యము సకలసమయములందును సత్యమే యనియు నది యేయవస్థయందును బరిహరింపఁదగినది కాదనియుఁ బాశ్చాత్యు లేకారణమును జెప్పుచున్నారో దానికిమూలమునం దొకగొప్పవిషయ మున్నది. ఇది ధర్మమే యైనచో—మానవహితకరం బగుసమయమున సత్యము ధర్మ మనియు, మానవాహితకరంబగుపట్టున సత్యమైనను నధర్మమే యనియు బోధించుబోధ ధర్మమే యైనచో మానవజీవనము ను, మానవసమాజమునుగూడ విశృంఖలమైపోవును. మఱియు లోక హితోద్దేశము విఫలమైపోవును. అవస్థావిశేషము తటస్థించినప్పుడీసమ యమున సత్యమునవలంబింపవలయునా, యసత్యము నవలంబింపవల యునా యనుతర్కమును సిద్ధాంతము చేయువా రెవ్వరు? ఆమీమాంస చేయుట కారంభించినచో నది యెన్నఁడును ధర్మానుమోదితము కాఁజాలదు. శిక్ష, జ్ఞానము, బుద్ధియునుగూడఁ జాలమందికి సామాన్య ముగా నుండును. వానియందు సంపూర్ణు లెవ్వరును లేరు. సామాన్య ముగ నందఱకును బ్రథమమున విచారశక్తి యల్పముగా నుండునుఁ దానిపై నింద్రియావేగము, మమతావేగము, భయము, లోభము, మోహము మొదలగునవి ప్రకోపించి యుండును. సత్యము నిత్యపాల నీయ మనుధర్మవ్యవస్థ లేకయున్నచో మానవజాతి సత్యశూన్యమైపో వుట కవకాశ మున్నది.—అని.—

ప్రాచీనహైందవమహర్షు లీవిషయము నెఱుంగనివారు కారు. తెలిసియే వారు విశేషవిధులను గావించి యేయేస్థలములయందసత్య

ముపయోగింపవలయునో నిర్దేశించియున్నారు "ప్రాణాత్యయే" మొదలుగాఁగల యీవిధులను మేమిదివఱకే యుదాహరించి యున్నాము. మనుగౌతమాదిమహర్షులమతముకూడ నిట్లే యున్నది. వారేర్పఱచిన విశేషవిధులు ధర్మానుమతము లగునా కాదా యనువిమర్శనమువలనఁ బ్రయోజనము లేదు. కృష్ణకథితం బగుసత్యతత్త్వమును బరిస్ఫుటముగఁ జేయుటయే మాయుద్దేశము. విశేషవిధులు లేకుండ నీసాధారణవిధి ననుసరించుట జనసామాన్యమునకు దుస్సాధ్యమని యాధునిక యురోపి యనులవలెనే శ్రీకృష్ణుడును నెఱింగి యుండెను. కాని పైని జెప్పఁబడిన "ప్రాణాత్యయే" మొదలగు విశేషవిధులు చెప్పినంతమాత్రమున లోకమునకు ధర్మానుమతం బగుసత్యాచరణమును సంపూర్ణముగ బోధించినట్లు కాఁజాలదని శ్రీకృష్ణుఁడెఱింగియే యుండెను. అందుచే నాతఁ డేయవస్థయం దేవిషయమున సాధారణవిధి నుల్లంఘించుట యుచితమో చెప్పి యున్నాఁడు. మేము దానిని స్పష్టపఱుచుచున్నాము.

దానము, తపము, శౌచము, ఆర్జవము, సత్యము మొదలగు కార్యముల సముదాయమును ధర్మమని చెప్పవచ్చును. ఇవి యన్నియును సాధారణధర్మములు; మఱియు నివియే యవస్థావిశేషమునం దధర్మము లగుచున్నవి. అనుపయుక్తప్రయోగము గాని, యనుపయుక్తవ్యవహారముగాని యధర్మమగును. దానిసంబంధమున నాలోచింతము. సమర్థుఁడైనను జోరునకు ధనదానము నెన్నటికిని గావింపఁగూడదు. పాపాత్మునకు ధనదానంబు చేసినచోఁ బాపాచరణుం డగు నాతఁడు దాతనుగూడ హింసింపవచ్చును. సత్యసంబంధమునఁగూడ నిట్లే—ఈవిషయమున శ్రీకృష్ణుఁడు చూపినయుదాహరణములు రెంటిలో నొకదాని నిదివఱకే తెలిపియున్నాము. ఇఁక రెండవయుదాహరణ మేమనిన.

"మిథ్యాశపథమూలంబునఁ జోరసంసర్గమునుండి విముక్తిలాభము దొరకుచున్నప్పుడు మిథ్యావాక్యప్రయోగముం గావించుటయే శ్రేయము. ఆమిథ్య నిశ్చయముగ సత్యస్వరూపమే యగును" అని.

ఇంతేకాక ప్రచారమునందున్న ధర్మశాస్త్రమునుండి "ప్రాణాత్యయే" మొదలుగాఁగల వచనములు పునరుక్తంబు లయ్యెను.

శ్రీకృష్ణునిసత్యతత్త్వ మిట్టిది. దీనిస్థూలతాత్పర్య మిట్లున్నది.

(1) ఏది ధర్మానుమోదితమో యదియే సత్యము—ఏది ధర్మవిరుద్ధమో యది యసత్యము.

(2) ఏది లోకహితమో యది ధర్మము.

(3) కావున నేది లోకహితమో యదియే సత్యము. ఏది లోకవిరుద్ధమో యది యసత్యము.

(4) ఇట్టిసత్యమే యెల్లప్పుడు నెల్లయెడలను బ్రయోక్తవ్యము. దీనికంటె నుత్కృష్టంబగు సత్యతత్త్వ మెచ్చటనైనఁ జెప్పఁబడినట్లెవ్వరైనఁ జూపఁగలిగినచో మేము కృష్ణమతమును బరిత్యజించుటకు సిద్ధముగా నున్నారము. అట్లు లేకుండుటచేతనే యిది యాదర్శమనుష్యోచితవాక్యమని యంగీకరింపవలసి యున్నది.

పర్యవసానమున నీమాటకూడఁ జెప్పవలసి యున్నది. ఏమనిన నేసమూలమున లోకరక్షణము, లోకహితమును సాధితము లగునో యదియే ధర్మము. మనము భక్తిపూర్వకముగఁ గృష్ణోక్తమగు మతమునుండి హిందూధర్మమూలస్వరూపమును గ్రహింపఁగలిగినచో నచిరకాలమునందే హిందూధర్మమును, హిందూసమాజమును నభివృద్ధినందఁగలవు. అట్లయినచో నుపధర్మము లనియెడి భస్మరాశినుండి జగత్పవిత్రంబును ననమానంబునగు హిందూధర్మము ప్రజ్వలించి యచిరకాలముననే ప్రకాశింపఁగలదు. అందువలన శాస్త్రవిశ్వాసము నను

సరించియే చేయఁబడు కుక్రియలును, కుతర్కములును, వ్యర్థకాలక్షేపములును దేశమునుండి దూరీభూతములై సత్కర్మములతోడను. సదనుష్ఠానములతోడను హిందూసమాజము ప్రకాశాన్వితము కాఁగలదు. అందువలన మూర్ఖత్వమును, మతకలహములును, పరస్పరవిద్వేషములును ననిష్టచేష్టితములు నిఁక నుండఁబోవు. మనము గీతోక్తంబగు మహోత్తరకృష్ణనీతిని బరిత్యజించి శైవవైష్ణవమతముల నాశ్రయించుచున్నాము. లోకహితమును బరిత్యజించి,త్రిథిత త్త్వము, మూఢమానసతత్త్వము మొదలగు తత్త్వాన్వేషణములం బడి కొట్టుకొనుచున్నాము. మనజాతీయాన్నత్యమే మనకుఁ గావలయును గాని యితరజాతినిందతోఁ బ్రయోజనమేమున్నది? మనమదృష్టవంతులమైనచో హిందువుల మందఱము నొక్కటిగఁ గూడి "నమోభగవతే వాసుదేవాయ" అని శ్రీకృష్ణపాదపద్మములకుఁ బ్రణామంబు గావించి లోకహితంబగు తదుపదిష్టధర్మము ననుసరింపవలయును * అట్లయినచో మనము నిశ్చయముగా మనజాతీయాన్నత్యమును సాధింపఁగలము.

సప్తమ పరిచ్ఛేదము.

కర్ణవధ.

కృష్ణునియుపదేశము నర్జునుఁడు గ్రహించెను. కాని యర్జునుడు క్షత్రియుఁడు; ప్రతిజ్ఞాపాలనమునకై వ్యాకులపడుచుండెను. అందుచేత నేయప్పు డర్జునుఁడు "ఈరెండుధర్మములకును భంగము లేకుండు నట్టియుపాయమును బోధింపుము" అని కృష్ణుని బ్రార్థించెను.

---

* బేన్తామువాక్యము నింగ్లండు విశ్వసించెను. కృష్ణుని యుపదేశమును భారతవర్ష మాలింపఁగూడదా ?

అప్పుడు కృష్ణుఁడు "మానవంతున కవమానమే మృత్యుస్వరూపము. నీవు యుధిష్ఠిరుని వాగ్రూపమున నవమానింపుము. అట్లయినచో నాతని జంపినట్లే యగును" అని చెప్పెను. అర్జునుఁడప్పుడు యుధిష్ఠిరునింగూర్చి యవమానసూచకములగు వాక్యములతో నిందించెను. కాని యందువలనఁ గృష్ణునకు వేఱియొకకష్టము సంఘటిల్లెను. అనంతర మర్జునుఁడు కృష్ణునిం గాంచి "నేను నాయగ్రజు నవమానించి మహాపాపముం గావించితిని. కావున నేనాత్మహత్యఁ గావించుకొందును" అని చెప్పి యొరనుండి కరవాలమును దెమలించెను. కృష్ణుఁడాతని మరణమునకుఁగూడ నప్పుడొక స్పష్టవ్యవస్థం గావించి "సజ్జనుల కాత్మశ్లాఘనమే మృత్యుస్వరూపమనుమాట న్యాయసంగత మైనది" అని చెప్పెను. అర్జునుఁడప్పుడనేకవిధములఁ దన్నుఁదానుఁబొగడుకొనియెను. దానితో గందరగోళమంతయును వదలిపోయెను.

కృష్ణుఁ డర్జునునకు సారథియే కాని యాతఁ డర్జునాశ్వముల కెట్టినియంతయో, యట్లే యర్జునునకుఁగూడ నియంతయై యుండెను. ఒకప్పుడు కృష్ణుఁ డర్జునునియాజ్ఞానుసారముగనే రథము నడపుచుండెను. ఒకప్పు డర్జునుఁడే కృష్ణునియాజ్ఞానుసారము నడచుచుండెను ఇప్పుడు కృష్ణుఁ డర్జునుని గర్ణవధయందు నియుక్తునిం గావించెను.

ఈకర్ణవధము మహాభారతమునం దొకప్రధానసంఘటనము. చాలకాలమునుండి దీనికిసూత్రపాత మగుచున్నది. కర్ణుఁడే యర్జునునకుఁ బ్రతియోధుఁడు. భీమార్జుననకులసహదేవులు నలువురును యుధిష్ఠిరునికొఱకు దిగ్విజయముం గావించియుండిరి. కర్ణుఁడొక్కఁడే దుర్యోధనునకు దిగ్విజయముం గావించెను. అర్జునుఁడు ద్రోణశిష్యుఁడు. కర్ణుఁడు ద్రోణగురుండగుపరశురామునిశిష్యుఁడు. అర్జునునకు గాండీవమున్నట్లే కర్ణునకంతకంటెనుత్కృష్టం బగువిజయధను వున్నది. అర్జు

నునకుఁ గృష్ణుఁడు సారథి; మహావీరుఁ డగు శల్యుఁడు కర్ణునకు సారథి. కర్ణార్జును లిరువురును దివ్యాస్త్రవేదులే. ఇరువురు నొండొరులను వధించుటకొఱకుఁ జిరకాలమునుండి ప్రతిజ్ఞారూఢులై యుండిరి. భీష్మద్రోణులను వధించువిషయమున నర్జునుఁ డంతగా శ్రమపడలేదు కాని, కర్ణవధంబున కాతఁడతిప్రయత్నుఁడు కావలసివచ్చెను. కుంతీదేవి కర్ణున కాతనిజన్మవృత్తాంతమును దెలుపుసందర్భమున నాతనియొద్దఁ దన యేవురుపుత్త్రుల ప్రాణభిక్షమును యాచించెను. అప్పుడు కర్ణుఁడు ధర్మభీమనకులసహదేవులను మాత్రము రక్షింతు నని తల్లికి వరమొసంగెను. కాని యర్జునప్రాణభిక్షము నెంతమాత్రము నొసంగలేదు. ఆతనివధించుటయో, యాతనిచేఁ జచ్చుటయో జరుగవలయునని కర్ణుఁడు తల్లికిఁ దననిశ్చితాభిప్రాయము నెఱింగించెను.

ఈమహారణంబునకుఁ గృష్ణుఁ డిప్పు డర్జునుని దీసికొనిపోవలసి యుండెను ఇందుకొఱకే యాతఁడిప్పు డర్జునుని యుధిష్ఠిరశిబిరమునకుఁ దీసికొని వచ్చెను. యుధిష్ఠిరునిక్షేమవార్త దెలిసికొనిరమ్మని భీముఁడర్జునునితోఁ జెప్పినమాట నిజమే; కాని యుద్ధము ముగియకుండ శిబిరమునకు వచ్చుట యర్జునున కిష్టము లేదు. కృష్ణుఁ డొకయెత్తు వేసి యాతనిం దీసికొనివచ్చెను. కర్ణుఁడు క్రమముగా యుద్ధముచేసి పరిశ్రాంతుఁడు కావలయుననియు, నర్జునుఁ డంతవఱకును విశ్రాంతిలాభముం గాంచి పునస్తేజస్వి కావలయు ననియుఁ గృష్ణునియభిప్రాయము. మఱియు నాతఁ డర్జునుని రణరంగమునకుఁ గొనిపోవుసమయమునఁ దేజోవృద్ధికరంబుగా నాతనివీరత్వమును బ్రశంసింప నారంభించెను; ఇంతే కాక యాతనిపూర్వకృతంబు లగునతిలోకసామాన్య వీరకృత్యంబుల నుగ్గడించెను; ద్రౌపది యవమానము, అభిమన్యుని యధర్మరణహత్య మొదలగు కర్ణకృతంబులగు పాండవాపకారవృత్తాంతముల నన్నిటి

నాతని స్మృతికిఁ దెచ్చెను. ఈమాటలలో నేభాగమునైనను నిట ను దాహరింపవలసిన యావశ్యకము లేదు, కేవల మొక్కవిషయమునుమాత్రమే తెలుపవలసి యున్నది. అప్పుడు కర్ణుఁడు "పూర్వము దానవగణము విష్ణుదేవునిచే నిహతం బయ్యెను; పూర్వము విష్ణుదేవుఁడు దానవవినాశనముం గావించినట్లు" అని యిట్టిమాటలనే చెప్పెను. ఈమాటలనుబట్టిచూడఁగాఁ గృష్ణుఁ డెన్నఁడును దానువిష్ణునియవతారమ నని తెలుపుకొనలేనట్లు తోఁచుచున్నది. అతని దేవత్వము నెంతమాత్రమును బ్రకటింపకుండుట యే ప్రధమశ్రేణియందలి కవిలక్షణము. రెండవతరగతి కవిభావము దీనికి భిన్నమైనది.

తరువాతఁ గర్ణార్జునులకు యుద్ధారంభ మయ్యెను. ఆరణవర్ణనముతో మన కెట్టి ప్రయోజనమును లేదు. కర్ణునిసర్పముఖశరంబునుండి కృష్ణుఁ డర్జునుని రక్షించినట్లు మహాభారతమునవర్ణితమై యున్నది. అర్జునుఁ డాయస్త్రమును నివారింపఁజాలకపోయెను. అందుచేతనే కృష్ణుఁడు తనపదాఘాతమువలన రథమువంచుక భూభాగమునకుఁ గ్రుంగించి యశ్వములను మోకరిలఁబడునట్లుగావించెను. అప్పు డర్జునుఁడు కూడ వంచుక తల వంచికొనియెను. ఆకారణముచే నయ్యస్త్రాఘాతమున నాతనికిరీటముమాత్రము భగ్నమైపోయెను అర్జునుఁడు తలవంచుకొనుట చేతనే యట్టిలాభము కలిగినది. ఈవిషయము విమర్శకు యోగ్యమైనదిగా నగపడుట లేదు. శ్రీకృష్ణుని సారథ్యముం గూర్చినప్రశంస మహాభారతమునందుఁ దఱచుగా నగపడుచునే యున్నది.

యుద్ధమునందు శేషభాగమునఁ గర్ణునిరథచక్రము భూమిలోఁ గ్రుంగిపోయెను. దానిని పైకెత్తుటకై కర్ణుఁడు క్రిందికి దిగియెను. తన రథచక్రము నుద్ధరించుకొనువఱకును యుద్ధము నాపవలయునని కర్ణుఁ

డర్జునునిం గోరి యుండెను. అర్జునుఁ డట్లు యుద్ధమును మానినట్లు యగపడుచున్నది. ఏమనిన—తరువాతఁ గర్ణుఁడు మరల రథారూఢుఁడై పూర్వమువలెనే యుద్ధము చేసినట్లున్నది. కాని యిందుఁ గర్ణునివిరథ దృష్టమేమనిన—ఆతఁ డర్జునుని యుద్ధము మానుమని కోరినప్పుడు "యుద్ధధర్మానుసారముగా నీవిట్లు చేయుటకు బాధ్యుఁడవు!" అని యుగ్గడించి యుండెను. కృష్ణుఁ డధర్మమునకు శిక్షకుఁడు. అతఁడప్పుడు కర్ణునింగాంచి—

"ఓసూతపుత్రా! అదృష్టవశమున నీవిప్పుడైనను ధర్మమును స్మరించుచున్నావు. నీచుఁడు దుఃఖనిమగ్నుఁడైనప్పుడు తలఁచుచుఁ గాని దైవమునే నిందించును గాని తన దుష్కర్మములం గూర్చి యించుకైనను నాలోచించుకొనఁజాలఁడు. చూడుము! దుర్యోధనదుశ్శాసనులును, శకునియును నీమతము ననుసరించి యేకవస్త్రయగు ద్రౌపదిని సభామధ్యమున కీడ్చుకొని వచ్చినప్పుడు నీకీధర్మబుద్ధి యేమైపోయినది? దుష్టుఁ డగుశకుని దురాలోచనాపరతంత్రుఁడై నీయాలోచనముచేతనే ద్యూతక్రీడానభిజ్ఞుం డగుయుధిష్ఠిరుని బరాజితునిం గావించినప్పుడు నీయీధర్మమెక్కడకుఁ బోయినది? రాజగుదుర్యోధనుఁడు నీయుపదేశము ననుసరించి భీమసేనునకు విషాన్నముం బెట్టించినప్పుడు నీధర్మవేదిత్వ మేమంటఁ గలసిపోయినది? వారణావతనగరంబున లాక్షాగృహంబునఁ బ్రసుప్తులైయున్న పాండవులను దహించునుద్దేశముతో మీరందఱు నాలోచించి యగ్నిప్రదానముం గావించుసమయమున నీ యీధర్మప్రవృత్తి యేయేటఁ గొట్టుకొనిపోయినది? సభామధ్యమున దుశ్శాసనవశీభూతయైయున్న రజస్వలయగుద్రౌపదిం గాంచి నీవు "ఓ ద్రౌపదీ! పాండవులు భ్రష్టులై శాశ్వతనరకగాములై పోయిరి; ఇఁక నీవు నీకుఁదగినయన్యభర్తను వరింపుము." అని తూలనాడితివి! అప్పు

డనార్యులగు దురాత్ములు నిరపరాధిని యగు నామె నెన్ని యోవిధ ముల బాధించుచుండఁగా నూరక చూచుచు నీవుపేక్షించి యుంటివి. ఆసమయమున నీయీధర్మోపదేశము లేమూలఁబడిపోయినవి? మీరు రాజ్యలోభముచే శకుని నాశ్రయించి యాతనిమూలమునఁ బాండవు లను మాయాద్యూతమున కాహ్వానించినప్పుడు నీధర్మనిర్ణయ మేమై పోయినది? నీవు మహారథసహితుండవై బాలకుఁ డగునొక్కయభిమ న్యుని ముట్టడించి యన్యాయముగ వధించినప్పుడు నీధర్మాలోచన మే మైపోయినది? ఓకర్ణా! నీవిన్నియధర్మములను నిర్భయముగఁ గావిం చియు నిప్పుడు నోరెండుకొనిపోవునట్లుగా ధర్మాధర్మపరిశంస గావిం చుటవలన నేమిలాభమున్నది? ధర్మపరాయణత్వమున జీవన్ముక్తుండ ను గాఁగలనని నీవెన్నటికిని భావింపవలదు పూర్వము నిషధదేశాధీ శ్వరుండగునలచక్రవర్తి ద్యూతక్రీడయందుఁ బుష్కరునిచే విజితుండ య్యును మరల రాజ్యలాభముంగాంచినట్లే ధర్మపరాయణులగుపాండ వులును భుజబలంబుచే సర్వశత్రువినాశనంబు గావించి రాజ్యలాభంబు గాంచెదరు. ధర్మసంరక్షితు లగుపాండవులచేతులలో ధార్తరాష్ట్రు లవశ్యముగ నిహతు లయ్యెదరు" అనియెను.

కృష్ణునివాక్యముల నన్నిటి నాకర్ణించి కర్ణుండు లజ్జావనతవద నుండయ్యెను. తరువాత నాతఁ డెప్పటివలె మహారణంబు సేసి యర్జు నుశరంబులచే నిహతుం డయ్యెను.

అష్టమ పరిచ్ఛేదము

దుర్యోధనవధ

కర్ణుండు మరణించినంతనే దుర్యోధనుఁడు శల్యుని సేనానాయ కునిగాఁ జేసెను. పూర్వదినంబున జరగినయుద్ధమునందు యుధిష్ఠిరు

డు క్షత్రియుండయ్యును భీరుండనుశంకమునకుఁ బాల్పడియెను. అతని కీశంకమును బోఁగొట్టుకొనుట యత్యంతము నావశ్యకమై యుండెను. సర్వధర్మీయుఁడగుకృష్ణుఁడు నేఁటియుద్ధమున యుధిష్ఠిరునే ప్రధానునిగాఁ జేసెను. అతఁడుకూడ నతిసాహసముతో సమరంబుసేసి శల్యసహారంబు గావించెను.

ఈదినమున సమస్త కౌరవసైన్యమును బాండవులచే నిహతం బయ్యెను. ఇరువురుబ్రాహ్మణు లగుకృపాశ్వత్థామలును, యదువంశీయుఁడగుకృతవర్మయు, దుర్యోధనుఁడు నీలుగురుమాత్రమే జీవించియుండిరి. దుర్యోధనుఁడు పలాయితుఁడై పోయి ద్వైపాయనహ్రదంబున మునిఁగి యుండెను. పాండవు లాతనిని వెదకి పట్టుకొనిరి; కాని యుద్ధము సేయకుండ నాతని వధింపలేరు.

యుధిష్ఠిరునిచిరకాలస్థూలబుద్ధిమూలముననే పాండవుల కన్ని కష్టములు సంప్రాప్తించెను. ఆతఁడీసమయమునఁగూడ నపూర్వంబగునాస్థూలబుద్ధికి విశాసముంగల్పించెను. అప్పుడాతఁడు దుర్యోధనుం గాంచి "నీవు నీమనసువచ్చినయాయుధములను గైకొని మాలో నేవీరునితోనైనను యుద్ధము చేయుము. తక్కినవారందఱమును రణస్థలమున నిలిచి యేమియుం జేయక మీసమరవ్యాపారమును నిరీక్షించుచుందుము. అట్లు యుద్ధంబుసేసి నీవు మాలో నొక్కరుని జంపఁగలిగినచో సమస్తరాజ్యమును నీయదియే కాఁగలదు" అని చెప్పుటయు దుర్యోధనుండు "నేను గదాధరుండనై రణంబు చేసెదను" అనియెను, గదాయుద్ధమున భీముఁడుగాక పాండవులలో మఱియెవ్వరును దుర్యోధనుని జయింపఁజాలరని కృష్ణుఁ డెఱుంగును. ఇప్పుడు దుర్యోధనుఁడు పాండవులలో మఱియెవ్వరినైన యుద్ధమున కాహ్వానించినచోఁ బాండవులు మరల భిక్షావృత్తినే యవలంబింపవలసి యుందురు.—అప్పు

డెవ్వరు నేమియు ననలేదు. అందఱును బలగర్వితులై యుండిరి. ఇఁక యుధిష్ఠిరుని దిరస్కరించు భారమును కృష్ణుఁడే వహించి యాకార్యము నుచితప్రకారముగ నిర్వహించెను.

దుర్యోధనుండును నతిశయబలగర్వితుఁడై యుండెను. ఆతని గర్వముచే యుధిష్ఠిరుని బుద్ధిదోషము పరిమార్జిత మైపోయెను. అప్పుడు దుర్యోధనుఁడు "మీలో నిష్టమున్న వారెవ్వరైనను వచ్చి నాతో గదాయుద్ధము సేయవచ్చును" అనియెను. తోడనే భీముఁడు గదాధారియై రణంబున కగ్రసరుండయ్యెను.

ఇప్పుడు మరల మహాభారతస్వరము మార్పు చెందినది. ఈపదునెనిమిదిదినముల యుద్ధమునందును నెన్నియోసారులు భీమదుర్యోధనులకు గదారణము జరగినట్లును, ప్రతిపర్యాయమును దుర్యోధనుఁడే సంపూర్ణముగ భీమునిచే బరాభూతుఁడైనట్లును గానవచ్చుచున్నది. కాని యిప్పుడు క్రొత్తమాటపుట్టినది. ఇచ్చట భీముఁడు గదాయుద్ధమునందు దుర్యోధనునితో సమానుఁడు కాడని యీభారతమే చెప్పుచున్నది! నేఁడు భీముఁడే పరాభూతప్రాయుఁడైయుండెను. ముఖ్యవిషయము భీమసేనుని దారుణప్రతిజ్ఞయే-సభాపర్వమున ద్యూతక్రీడానంతరమున దుర్యోధనుఁడు ద్రౌపదిని గెలుచుకొని సభామధ్యమునకు రావించెను. అప్పుడు దురాత్ముఁడగు దుశ్శాసనుఁడేకవస్త్రయు రజస్వలయు నగుద్రౌపదిని కేశాకర్షణముఁగావించి సభలోనికీడ్చుకొనివచ్చి వివస్త్రం జేయుటకుఁ బ్రయత్నించెను. ఆసమయమున భీముఁడు "నేను దుశ్శాసనుని వధించి యాతనివక్షమును జీల్చి యందలిరక్తమును పానముచేసెదను" అని ప్రతిజ్ఞచేసెను. భీముఁడుమహాశ్మశానతుల్యంబగువికటరణస్థలంబున నట్టే దుశ్శాసనుని నిహతుం గావించి రాక్షసునింబోలి యాతనితప్తశోణితముం గ్రోలుచు నందఱకును వినఁబడునటు

గా "నేనమృతపానము చేయుచున్నాను" అని కేకవైచెను. మఱియు దుర్యోధనుఁడాసభామధ్యముననే మందహాసముచేయుచు ద్రౌపది వంక దృష్టిప్రసారముం గావించుచు సర్వలక్షణసంపన్నంబును వజ్రతుల్యంబును, కదళీదండగజతుండసన్నిభంబును నగు తనసవ్యోరుమధ్యము నామెకుఁ జూపించెను. అప్పుడు భీముఁడు "నేను మహారణంబున గదాఘాతముచే నీపాపాత్ముని యూరుభగ్నంబు గావింపనైతినేని మహానరకగామి నయ్యెదను" అని ప్రతిజ్ఞ చేసెను.

ఇప్పు డాయూరువు గదాఘాతముచే భంగితము కావలసియుండెను. కాని దాని కొకప్రతిబంధక మున్నది. నాభికధోభాగంబున నాఘాతంబు సేయరాదని గదాయుద్ధమున నొకనియమ ముండెను. అందుచే నిప్పుడు భీముఁ డన్యాయయుద్ధముచేతనే దుర్యోధనుని వధింపఁ గలిగినచో నాతనిప్రతిజ్ఞ విఫలమైపోవును.

ఎవ్వఁడు తనపెదతండ్రికుమారుని హృదయరుధిరమును పానము చేసి యానందతాండవముం గావించెనో యట్టిరాక్షసుని దృష్టియందుఁ దలపై గదాఘాతమునకును నూరువులపై గదాఘాతమునకును భేదమేముండును? ద్రోణునెట్లైన వధించుటకై మిథ్యాప్రవంచనమునకుం బూనుకొనిన యసత్యవాది యగుభీమునకు గదాఘాతంబున దుర్యోధనునియూరుభంగంబు సేయువిషయమున నితరులుపదేశింప వలసిన యావశ్యకమేమున్నది? కాని యట్లు జరుగలేదు. భీముఁడిప్పు డాయూరుభంగప్రతిజ్ఞమాటయే మఱచిపోయెను. (ఇది రెండవతరగతికవి కల్పన. ఇచ్చట నాతనిచేయి యగపడుచున్నది.) ఆతనికిఁ జరిత్రమునందలి సందర్భశుద్ధివిషయంబున నించుకంతయును దృష్టియే యుండదు. ఆతఁ డిచ్చట భీమచరిత్రమునం దట్టియౌచిత్యమును నిలుపలేదు. అర్జునుని విషయమునఁగూడ నట్లే చేసెను. అర్జునుఁ డిదివఱకు ద్రోణవధ

సమయమునఁ దనయస్త్రగురుండును, ధర్మాచార్యుండును, సఖుండును బరమగౌరవపాత్రుండునగు శ్రీకృష్ణునిచే నుపదేశింపఁబడియు నసత్య వాదమున కంగీకరింపఁజాలకపోయెను. అట్టివాఁ డిప్పుడు భీముఁడు తనప్రతిజ్ఞ మఱచిపోయినసంగతిని గ్రహించి తనయంత దానే యాతని నన్యాయయుద్ధమునకుఁ బ్రవృత్తునిం గావింపుటకై పూనుకొనియెను. అప్పుడు పరమధార్మికుఁ డగునర్జునుఁ డిప్పు డధర్మమునకు శంకింపలే దు. కాని యిందు శ్రీకృష్ణునిప్రోత్సాహము లేకుండఁ జేసినచోఁ గవియుద్దేశము సఫలము కాదు. అందుచేఁ గవి యాక్రిందివిధముగాఁ గల్పించెను.

అర్జునుఁడు భీమదుర్యోధనుల యుద్ధమును బరిశీలించుచు గదా యుద్ధమునందు వీరిలో నెవ్వరు శ్రేష్ఠులని శ్రీకృష్ణు నడిగెను. "ఈయిరువురిలో భీముఁడే బలాధికుఁడు; కాని గదాయుద్ధమునఁ బరిశ్రమయు ను నైపుణ్యమునుగూడ దుర్యోధనునకే యధికముగా నున్నది. మొట్ట మొదట రణరంగమునుండి పలాయితుఁడై మరల యుద్ధమున శత్రువునె దుర్కొనఁ బడినవానికి జీవితాశ లేకుండుటవలన సాహస మధికముగా నుండును. ప్రాణములకుఁ దెగించి యతిసాహసముతోఁ బోరాడువీరుని బరాభూతునిఁ గావించుట దుస్సాధ్యము. కావున భీముఁడిప్పుడు దుర్యోధను నన్యాయయుద్ధమున వధింపకున్నచో నాతఁడు యుధిష్ఠిరునివాక్యానుసారముగా సమస్తరాజ్యమును మరలఁ బడయఁగలఁడు." అని శ్రీకృష్ణుఁడు చెప్పెను.

ఆకృష్ణునిమాటలను విని యర్జునుఁ డప్పుడు తనవామజానువుపైఁ జరచుకొనుచు భీమునకు సంకేతముం గావించెను. పిమ్మట భీముఁడు దుర్యోధనుని యూరుద్వయమును భగ్నంబు చేసి పడఁగొట్టెను.

"న్యాయ మెట్లీశ్వరప్రేరితమో యన్యాయముకూడ నట్లీశ్వర ప్రేరితమే." అనునది రెండవతరగతికవియుద్దేశమై యున్నది.

ఆయుద్ధసమయమునఁ బ్రేక్షకులలో బలరాముఁడుకూడ నుండెను. గదాసాధనమున భీమదుర్యోధను లాతనిశిష్యులై యుండిరి. కాని వారిలో దుర్యోధనుఁడే యాతనికిఁ బ్రియశిష్యుఁడు. మఱియును బలరాముఁడు సర్వదా దుర్యోధనపక్షపాతియైయుండెను. ఇప్పుడు భీముఁడు దుర్యోధను నన్యాయయుద్ధమున జయించుటంగాంచి రేవతీవల్లభుఁడు క్రుద్ధుండై తనహలాయుధమును బైకెత్తి భీముని మీఁదికిలంఘించెను. ఆతనిభుజమునం దెప్పుడును హలాయుధ ముండుటచేతనే యాతనికి హలాయుధుఁ డనుపేరు వచ్చినదని చెప్పనక్కఱలేదు. ఇది యేమిక్రోధమని యెవరు ప్రశ్నించినను బలరాముఁ డెట్టియుత్తరమును జెప్పుటలేదు. ఏమైననేమి—కృష్ణుఁ డాతనిని శాంతింపఁజేయుటకై యతిప్రయత్నముం గావించెను. కృష్ణునిమాటలవలన హలధరుఁడు శాంతిని వహింపక చటాలున నచ్చటినుండి వెడలిపోయెను.

తరువాత నింకనొకబీభత్సవ్యాపారము తటస్థించెను. భీముఁడు నిహతుం డగుదుర్యోధనుని యుత్తమాంగమునఁ బాదాఘాతముం గావించెను. యుధిష్ఠిరుఁడు వారించుచునే యుండెనుగాని భీముఁడు మాత్రమామాటల నాలింపలేదు. ఇట్టిదుష్కార్యముఁ గావించుచున్న భీముని వారింపనందుకై యుధిష్ఠిరుని గృష్ణుఁడు తిరస్కరించెను. ఇటుఁ బాండవపక్షవీరులు దుర్యోధనుని వధించినందుకై భీము ననేకవిధములఁ బ్రశంసించుచు దుర్యోధనుని గటుభాషణంబులచే నిందింపఁ దొడంగిరి. కృష్ణుఁడు వారిం గాంచి విరక్తుఁడై—

"మృతకల్పుఁడగు శత్రునింగూర్చి కటువాక్యప్రయోగంబు గావించుట న్యాయము కాదు." అనియెను.

కృష్ణునియీవాక్యములన్నియు నాదర్శపురుషోచితములై యుండెను. కాని తరువాత నీగ్రంథమునం గానవచ్చుచున్న విషయము పరమాశ్చర్యకరముగా నున్నది.

ఇందుఁ బ్రథమాశ్చర్యవ్యాపారమేమనిః—"మృతకల్పుఁడగు శత్రునిం గూర్చి కటువాక్యప్రయోగముం గావించుట న్యాయము కాదు" అని యితరులకు బోధించిన కృష్ణుఁ డప్పుడు తానే దుర్యోధను నాక్షేపించినట్లున్నది.

దుర్యోధనుని యుత్తరము ద్వితీయాశ్చర్యవ్యాపారము. దుర్యోధనుఁడు భగ్నోరుఁడయ్యును నప్పటికిని మరణింపక పడియుండెను. అతఁడిప్పుడు కృష్ణునికటూక్తుల నాలించి యిట్లు ప్రత్యుత్తరము చెప్పం దొడంగెను.

"ఓకంసదాసతనయా! ధనంజయుఁడు నీయుపదేశానుసారముగా నాయూరుభగ్నముం గావించుటకు భీమునికి సంజ్ఞచేయుటవలన భీముఁ డధర్మయుద్ధమున నన్ను నిపాతితుసం గావించి యున్నాఁడు. ఇది నీకు లజ్జాకరముగ లేదా? నీయన్యాయోపాయములమూలమున నే ధర్మయుద్ధప్రవృత్తు లగు వేలకొలఁది క్షత్రియవీరులు ప్రతిదినమును నిహతులై పోయిరి. (ఇట్టిసందర్భము మహాభారతమునం దెచ్చటను లేదు. ఏతరగతికవికల్పనయందును లేదు) నీవే శిఖండిని ముందుగ నిలిపి పితామహుని నిహతునిం గావించితివి. (కృష్ణునికి దీనితో నెట్టిసంబంధమును లేదు. మహాభారతమునఁగూడ నెచ్చటను నీమాట లేదు) అశ్వత్థామయనుగజంబు మరణించుటయు నీవాకతంత్రమును బన్ని ద్రోణాచార్యునిచే నస్త్రసన్యాసముం జేయించితివి. ఆసమయమునదురాత్ముఁ డగుధృష్టద్యుమ్నుఁడు నీయెదుటనే యాచార్యుని నిహతునిం గావించుచుండఁగా నీ వెంతమాత్రము నిషేధింపవైతివి. శత్రువును వధించుచుండఁగా నేల నిషేధింపవలయును ?) అర్జునుని వధింపవలయునని చాలదినములనుండి యతిప్రయత్నముతోఁ గర్ణుఁడు దాచుకొనియున్న

యస్త్రమును నీవతినిపుణముగ ఘటోత్కచునిపైఁ బ్రయోగింపఁ జేయించి వ్యర్థము చేయించితివి. (కృష్ణుఁ డీవిషయమున నెట్టికౌశలమును గావింపలేదు. కౌరవవీరులబలవంతముచేతనే కర్ణుఁడా యస్త్రమును ఘటోత్కచునిపైఁ బ్రయోగించినట్లు మహాభారతమునందున్నది.) సాత్యకి నీప్రవర్తనమునే యాదర్శముగఁ జేసికొని ఛిన్నహస్తుఁడును బ్రాయోపవిష్టుండును నగుభూరిశ్రవుని నిహతునిం గావించెను. (ఈమాట కేవలమసత్యము. ఇట్లు మహాభారతమునఁ జెప్పియుండలేదు. సాత్యకి భూరిశ్రవునిజంపినమాట నిజమే. మీఁదు మిక్కిలి ఛిన్నబాహుఁ డగు భూరిశ్రవుని వధించుట న్యాయముకాదని శ్రీకృష్ణుఁడు నిషేధించి యుండెను.) మహావీరుఁడగు కర్ణుఁడర్జునుని వధింప నుద్యుక్తుం డగుచుండఁగా నీవతికౌశలంబున నాతని సర్పముఖాస్త్రమును నిరర్థకముగఁ జేయించితివి (ఆకౌశలమునిజపదబలంబున రథచక్రములను భూమిలోనికిఁ గ్రుంగించుటయే. ఆయుపాయము న్యాయమైనదియే. రథికుని రక్షించుటయే సారథికి ధర్మము) తుట్టతుదను గర్ణునిరథము భూమిలోనికిఁ గ్రుంగినప్పు డాతఁడు దానినుద్ధరించుకొనుచుండఁగా నీవతికౌశలంబున నర్జునునిచే నాతనివినాశసాధనముం గావించి కృతార్థుండవైతివి. (ఇది కుతంత్రమా? మహాభారతమునం దీపట్టునఁ గృష్ణునికౌశలముం గూర్చి యెట్టిమాటయును లేదు. యుద్ధమునం దర్జునుఁడు కర్ణుని వధించినట్లే యున్నది) కావుననీకంటెపాపాత్ముఁడునునిర్దయుఁడునునిర్లజ్జుఁడును మఱియెవ్వఁడున్నాఁడు? భీష్మునితోఁగాని, ద్రోణునితోఁగాని, కర్ణునితోఁగాని, నాతోఁగాని న్యాయయుద్ధమునే గావించినచో మీకెన్నటికైన జయము లభించునా? మీయనార్యోపాయంబులమూలముననే స్వధర్మానుగతులగుపార్థివగణంబులతోఁ గూడ మేమందఱమును నిహతులమైపోయితిమి"

ఈవాక్యముల కన్నిటికిని బ్రత్యుత్తరములను జూపి మేమిందే కుండలీకరణముంగావించి యుంచితిమి. పాఠకులు వానిని గ్రహింతు రుగాక! ఈమాటలన్నియు నసత్యములే. ఇట్టిసంపూర్ణమిథ్యాతిరస్కారము భారతమునందు మఱియెచ్చటను లేదు. అందుచేతనే దుర్యోధనుని ప్రత్యుత్తర మాశ్చర్యముగా నున్నదని చెప్పి యుంటిమి

తృతీయాశ్చర్యమేమనిన—వీనికిఁ గృష్ణుఁడిచ్చిన ప్రత్యుత్తరము. కృష్ణుఁడు గంభీరస్వభావుఁడును, క్షమాశీలుఁడును, నెవ్వరితిరస్కారమునకును బదులుచెప్పనివాఁడు ని మేమిదివఱకే చూపియున్నాము. సభామధ్యమున శిశుపాలుఁడు గావించిన యసహ్యానిందావాదమును మాఱుమాటాడకుండ నాతఁడు సహించియుండెను. విశేషించి దుర్యోధనుఁ డిప్పుడు మరణోన్ముఖుఁడై యున్నాఁడు. ఆతనిమాటలకు మాఱు చెప్పుటవలన నెట్టి ప్రయోజనమును లేదు. ఆతని నెంతమాత్రము నిందించినను దనకే యగౌరవమని కృష్ణుఁడు భావింపవలసియుండెను. అయినను గృష్ణుఁడు దుర్యోధనుని తిరస్కారమునకుఁ బ్రత్యుత్తర మిచ్చుటయే కాక కటూక్తినిగూడఁ బ్రయోగించెను; అప్పుడు దుర్యోధనుని పాపకృత్యములనన్నిటినుగ్గడించుచుఁ గట్టకడపట "నీవెన్నియో పాపములను గావించితివి. ఇప్పుడిఁక వానిఫలంబు ననుభవింపుము" అని తూలనాడెను.

అప్పుడు దుర్యోధనుఁడు గభీరస్వరముతో "నేనధ్యయనంబు చేసి విధిపూర్వకస్నానాదినియమంబులం గావించుచు సపాగరంబగు నీభూమండలమునంతను శాసించి విపక్షగణంబులమస్తకోపరిస్థలంబున నవస్థితుండనై యత్యుత్కృష్టంబగు నైశ్వర్యలాభంబు గాంచి తుట్టతుదకు ధర్మపరాయణు లగు క్షత్రియవీరులకుఁ బ్రార్థనీయంబగు సమరమరణంబును గాంచి యుంటిని. కావున మత్సమానుం డగు సౌ

భాగ్యశాలి మఱి యెవ్వఁడున్నాఁడు ; నేనిప్పుడు భ్రాతృవర్గంబుతోడ ను, బంధుగణంబులతోడను, స్వర్గమునకుఁ బోయెదను. మీరందఱు ను శోకాకులితహృదయులగుచు మృతప్రాయులై భూమియందుందుర డు!" అనియెను.

ఈయుత్తరమునం దాశ్చర్యము లేదు. పరులసర్వస్వమును బా పద్యూతమునందపహరించిన దుర్యోధనునివంటి దాంభికుఁడు తన్నుజ యించినశత్రువిం గాంచి నేనే జయించితిని ; నీవోడితివని ధిక్కరించు టలో నాశ్చర్య మేమున్నది ? దుర్యోధనుఁడు హ్రదమునను నుండియే యిట్టిమాట లనియుండెను. యుద్ధమున మరణించినచో స్వర్గలాభంబు గలుగు నని క్షత్రియు లందఱును జెప్పుదురు. ఈయుత్తర మాశ్చర్య ము కాదు. కాని యీయుత్తరమునకుఁ గలిగినఫలమునుమాత్ర మప్పటి కంటె నాశ్చర్యకరమైనది. ఈమాట చెప్పినంతమాత్రముననే యాకా శమునుండి సుగంధకుసుమవృష్టిగురియందొడంగెను; గంధర్వులు మ ధురవాద్యములను మ్రోగింపఁదొడంగిరి. అప్సరలు రాజదుర్యోధ నుని యశోగీతములను గానముచేయఁదొడంగిరి. సిద్ధు లాతనింగూర్చి సాధువాదములం గావించిరి. సుగంధసంపన్నంబును, సుఖస్పర్శంబు న గుసమీరణంబు మందమందముగ వీతెంచుచుండెను. దిఙ్మండలంబును నభోమండలముచుగూడ సునిర్మలంబు లయ్యెను. అప్పుడు వాసుదేవ ప్రముఖు లగుపాండవులు దుర్యోధనునిసన్మానసూచకం బగు నీయ ద్భుతవ్యాపారముంగాంచుచు నతితరలజ్జావనతవదనులై పోయిరి. మఱి యును వారు భీష్మద్రోణకర్ణభూరిశ్రవుల నన్యాయముగ వధించినందు లకై యీసందర్భములను స్మరించుకొనుచు నతిశోకాకులితహృదయుల గుచుండిరి.

మహాభారతంబునఁ బాపాత్ములలో నెల్ల నధమాధముండని వ ర్ణింపఁబడినదుర్యోధనున కిట్టియద్భుతసన్మానసాధువాదంబులును, స

దు ధర్మాత్ములలోనెల్ల శ్రేష్ఠులనివర్ణింపఁబడిన మహాత్ముల కిట్టియధర్మాచరణముాలకంబగు లజ్జయును సంభవించుట యాశ్చర్యము కాదా ? సిద్ధగణము, అప్సరోగణము, దేవగణమునుగూడ దురాత్ముఁడగుదుర్యోధనుఁడు ధర్మాత్ముఁడనియుఁ గృష్ణపాండవులు మహాపాపాత్ములనియుఁ బ్రకటించిరి. ఇదియే మహాభారతమునందెల్ల నాశ్చర్యవిషయము. ఇదిమహాభారతమున కంతకును విరుద్ధముగానున్నది. సిద్ధాదులమాట యటుంచి యేమానవుఁడైనను నిట్టిసాధువాదము మహాభారతమునం దాశ్చర్యవిషయమని చెప్పకమానఁడు. ఏమనిన—దుర్యోధనుని యధర్మమునుగూర్చియుఁ గృష్ణపాండవుల ధర్మముంగూర్చియుఁ బ్రశంసించుటయే భారతోద్దేశము భీష్మద్రోణకర్ణభూరిశ్రవులను దామధర్మయుద్ధమున సంహరించినట్లు దుర్యోధనునివలన గ్రహించి కృష్ణపాండవులు శోకాకులితస్వాంతులైరని చెప్పుట మఱియు నద్భుతరసవంతముగా నున్నది. ఇంతకాలమునఱకును వారించుకంతయు నెఱుంగనివారై యుండియిప్పుడు పరమశత్రుముఖంబున దమయపరాధముం దెలిసికొని పెద్దమనుష్యులవలె విచారమును బ్రదర్శింపఁజేయఁదొడంగిరి. భీష్మునిగాని, కర్ణునిగాని వధించుపట్టునఁ దామెట్టియధర్మమును గావింపలేదని వారెఱుంగుదురు. ఇప్పుడు పరమశత్రువగుదుర్యోధనుఁడు చెప్పినంతమాత్రమునఁ దామధర్మముం గావించినట్లే విశ్వసించి శోకప్రకటనముం గావించిరి. భూరిశ్రవుని వారిలో నెవ్వరును వధించియుండలేదు. ఆతనిని సాత్యకి వధించెను. అప్పుడు కృష్ణార్జునులును, భీముఁడునుగూడ సాత్యకిని నిషేధించియుండిరి. అయినను బరమశత్రుఁడగుదుర్యోధనుం డాతనిని మీరే చంపితిరనియు, మీరేయధర్మముం గావించితి రనియు నిందించినంతనే మూఢులగుపాండవు లామాటల సత్యము విశ్వసించి తామేచంపితి మనియుఁ దామే యధర్మముం గావించితి మనియు నంగీకరించుటకు బాధ్యులై పెద్దమనుష్యులవలె నేడు

పనారంభించిరి. ఇఁక నీవిషయముంగూర్చి విమర్శించుట నిష్ప్రయోజనము కాదా ? అయినను నీనిర్భాగ్యదేశమునందలి ప్రజలనమ్మకమేమనిన—గ్రంథమధ్యమున లిఖింపఁబడినవిషయము లన్నియు ఋషివాక్యములే యనియు, నభ్రాంతము లనియు, శిరోధార్యములనియు వారియుద్దేశము. అందుచే బలవంతముగా నిట్టివిషయములను మనముగూడ నంగీకరింపవలసివచ్చుచున్నది.

ఆశ్చర్యకరవృత్తాంతము లింకను ముగియలేదు ! కృష్ణుఁ డప్పుడు తనయధర్మాచరణముంగూర్చి సిగ్గుపడియెనుగదా ! మరల నప్పుడే యాతఁ డత్యంతమును నిర్లజ్జాభావముతో నీవిధముగాఁ దనపాపాచరణముంగూర్చి యాత్మశ్లాఘనముం గావించుకొనియెను.

" భీష్మప్రముఖమహారథగణంబులును, రాజగుదుర్యోధనుఁడును గూడ నసాధారణసమరకళావిశారదులు; మీరెన్నటికిని వారిని ధర్మయుద్ధమున జయించుటకు సమర్థులు కాఁజాలరు. నేను కేవలమును మీహితానుష్ఠానపరతంత్రుఁడనై యనేకోపాయముల నాలోచించి మాయాబలప్రదర్శనపూర్వకముగ వారిని సంహరింపఁ జేయించితిని. నేనిట్టి కుటిలవ్యవహారముం గావింపకున్నచో మీకిట్టిజయలాభంబును, రాజ్యలాభంబును, నర్థలాభంబును నెన్నటికిని గలుగఁబోదు. భీష్మప్రముఖులగు నానలువురు మహాత్ములును భూమండలమున నతిరథులని ప్రఖ్యాతి గాంచినవారు. లోకపాలకులందఱు నేకమై వచ్చినను వారినిధర్మయుద్ధమునం దోడించుటకు సమర్థులు కాఁజాలరు. మఱియును సమరాంగణమున నపరిశ్రాంతుండును గదాధారియునగు నీదుర్యోధనుని గదాపాణి యగుకృతాంతుఁడైనను ధర్మయుద్ధమున వధింపఁజాలఁడు. కావున నే భీముఁడాతని నధర్మోపాయమున వధింపవలసివచ్చెను. దీనికొఱకు విచారింపవలసినపనిలేదు. ఇది సర్వసామాన్యకృత్యమే—శత్రుబలము

వృద్ధియైనప్పుడు కూటయుద్ధమునఁ బరవినాశనమ్ముం గావింపవలయును. మహాత్ములగు దేవతలు కూటయుద్ధమునే యవలంబించి యసురనాశనమును జేసి యున్నారు. వారి ననుకరించుట యెల్లరకును గర్తవ్యము" అనియెను. ఇంతకంటెసిగ్గుమాలిన యధర్మము మఱి యెచ్చటనైన నున్నదా ?

దుర్యోధనకృతం బగునీతిరస్కారవృత్తాంత మంతయు నస్వభావముగ నున్నదని వేఱుగఁ జెప్పనక్కఱలేదు. ద్రోణవధాదిస్థానముల యందలి యసామాలికభాగములను మేమిదివఱకే సప్రమాణముగ నిరూపించియున్నాము. అసామాలికవిషయముంగూర్చి ప్రసంగ మెక్కడవచ్చినను నదికూడ నసామాలికమే యగుచున్నది. ఇంకొకసంగతి చెప్పవలసియున్నది. ఈభాగమున రెండవతరగతికవిలేఖినీచిహ్నముకూడ నగపడుటలేదు. రెండవతరగతికవి కృష్ణభక్తుఁడు. ఈవ్రాఁత కృష్ణద్వేషివ్రాఁతవలె నున్నది. శైవాదులును, నవైష్ణవులును, వైష్ణవద్వేషులును గూడి యప్పుడప్పుడు భారతకళేబరము నచ్చటచ్చటనుబ్బించి యున్నారను సంగతి యిదివఱకే చెప్పి యుంటిమి. అట్టివా రెవ్వరో యీవృత్తాంతమును గల్పించి యుండవచ్చును. ఇది కృష్ణభక్తుఁడు గావించినకల్పనమని యును జెప్పినఁ జెప్పవచ్చును. భారతవర్షీయులగుకవిశేఖరులకు నిందాస్తుతి గావించుట యొకవిధమగు ప్రౌఢత్వము. ఈరచన యట్టిదియేమైయుండును.

అదియేమైనఁ గానిండు—దీనితరువాతనే దుర్యోధనుఁ డశ్వత్థామతో "అమితతేజోమయుం డగువాసుదేవుని మాహాత్మ్యవిశేషమును నేనవగతంబు చేసికొంటిని. ఆతఁడు నన్ను క్షాత్రధర్మమునుండి పరిభ్రష్టునిం గావింపలేఁడు. కావున నాకొఱకు విచారింపంబనిలేదు" అని పిచ్చెనట్లగపడుచున్నది.

ఇట్టి పూర్వాపరవిరుద్ధవిషయములను విమర్శింపఁబూనుట య నావశ్యకము ?

నవమపరిచ్ఛేదము.

యుద్ధశేషము.

దుర్యోధనుఁ డన్యాయయుద్ధమున హతుఁ డయ్యె నని యుధిష్ఠిరునకుఁ జాలభయము కలిగెను. తపఃప్రభావశాలిని యగుగాంధారి యీమాట విని పాండవులను భస్మము చేయునేమో యని తల్లడిల్లుచు నాతఁడు హస్తినానగరమునకుఁ బోయి గాంధారీధృతరాష్ట్రులను శాంతింపఁ జేసివచ్చుటకు శ్రీకృష్ణునియంగీకారమును బ్రార్థించెను.

ఈవ్రాఁత ప్రథమతరగతికవిరచనము కాదు. ఏమనిన—ఇప్పట్టున యుధిష్ఠిరుఁడు కృష్ణునిం గాంచి " నీవవ్యయుఁడవు; లోకమునకు సృష్టిసంహారకర్తవు "అని కీర్తించి యుండెను. ఇంత కించుక ముందుగనే కృష్ణుఁ డర్జునునిరథమునుండి దిగినప్పు డారథము మండిపోయెను. అర్జునుం డాయద్భుతసంఘటనముం గాంచి యిది యేమని యడుగుటయుఁ గృష్ణుఁ డాతనితో " బ్రహ్మాస్త్రప్రభావముచే నీరథమిదివఱకే యగ్నిసంలగ్నమై యున్నది. నేను దీని నధిష్ఠించియుండుట కారణంబుగా నిది యింతపర్యంతమును దగ్ధంబు గాకయుండెను. (అనఁగా నేనువిష్ణువునని చెప్పుట) " అని చెప్పి యుండెను. ఇది ద్వితీయకవిరచనమో, తృతీయకవిరచనమో యైయుండును.

కృష్ణుఁడు హస్తినాపురంబునకుఁ బోయి గాంధారీధృతరాష్ట్రు

లకించుక బోధించెను. ఆమాటల నిచ్చట నుదాహరించుటకుఁగాని, విమర్శించుటకుఁగాని యావశ్యకము లేదు.

తరువాత దుర్యోధనుఁ డశ్వత్థామను సేనానాయకునిం గావించెను. కాని, యప్పుడు సేనామధ్యమున నశ్వత్థామయుఁ గృపాచార్యుఁడును, గృతవర్మయుమాత్రమే యుండిరి. దీనితో శల్యపర్వము పరిసమాప్తం బయ్యెను.

తరువాత సౌప్తికపర్వము. సౌప్తికపర్వ మతిభీషణవ్యాపారపరిపూర్ణమైనది. అందు మొదటిభాగమున నశ్వత్థామ చోరునివలె నిశీథకాలంబునఁ బాండవశిబిరంబునఁ బ్రవేశించి నిద్రాభిభూతులగు ధృష్టద్యుమ్నుని, శిఖండిని, ఉపపాండవులను, సమస్తపాంచాలగణంబులను సేనను, సేనాపతిగణంబులనుగూడ వధించెను. పంచపాండవులును, గృష్ణుండునుదక్కఁ బాండవపక్షమున మఱియెవ్వరును జీవించియుండ లేదు.

వాస్తవముగా నీకురుక్షేత్రయుద్ధము కురుపాంచాలయుద్ధమే. పాంచాలవంశమంతరించుటతోడనే యుద్ధము పరిసమాప్త మయ్యెను.

తరువాత సౌప్తిక పర్వమునం దొకయైషీకపర్వాధ్యాయ మున్నది. అశ్వత్థామచోరోచితం బగునిట్టిదుష్కృత్యముం గావించి పాండవభయంబున వనంబునకుఁ బోయి దాఁగియుండెను. మఱునాఁడు పాండవులాతని వెదకి పట్టుకొనిరి. అశ్వత్థామ యట్లు పట్టువడి యాత్మరక్షణంబుకొఱకతిభయంకరంబగు బ్రహ్మశిరోనామకాస్త్రమును బ్రయోగించెను. దానిని నివారించుటకై యర్జునుండును బ్రహ్మశిరోనామకాస్త్రమును బ్రయోగించెను. ఈయస్త్రద్వయ తేజమువలనను బ్రహ్మాండము విధ్వస్తంబగునేమో యని తోఁచుటయు మహర్షులందఱును వచ్చి యాయిరువురినడుమను శాంతిస్థాపనంబు గావించిరి. అప్పుడశ్వ

త్థామ తనయుత్తమాంగమున సహజముగానున్న మణిని దీసి ద్రౌపది కుపహారముం గావించెను. ఇంతలో బ్రహ్మశిరోనామకాస్త్రము పాండవవధువగునుత్తరగర్భమునందలియర్భకుని విగతాసునిం గావించెను.

అనైసర్గికంబు లగునిట్టిసప్తవృత్తాంతములను మేము వదలివై చెదము. ఈసౌప్తికపర్వమునఁ గృష్ణచరిత్రముతో సంబంధించిన వివర్ణనీయంబగునొక్కవృత్తాంతమును లేదు.

దీనివెనుక స్త్రీపర్వము. స్త్రీపర్వముమిగులను భీషణమైనది. మరణించిన వీరగణంబులవీరపత్నులయార్తనాదములే యిందున్నవి. ఇంతటిభయంకరార్తనాదము లిదివఱ కెన్నఁడు నెచ్చటను వినఁబడియుండలేదు. కాని యిందుఁ గృష్ణచరిత్రకు సంబంధించిన రెండువిషయములుమాత్రమున్నవి—

(1) ధృతరాష్ట్రుఁడు భీము నాలింగనము చేసికొని చూర్ణము గావించె ననియొకకల్పన చేయఁబడి యుండెను. కాని కృష్ణుఁ డందుకొఱ కొకలోహమయభీమవిగ్రహమును జేయించి యుంచెను. అంధుఁడగుధృతరాష్ట్రుఁడు దానినే చూర్ణముగాఁ జేసివైచెను. అస్వాభావంబగు నీవృత్తాంతము మనము పరిత్యజింపఁదగినదే. కావున నీవిషయమున నిఁకఁ జెప్పవలసిన దేదియును లేదు.

(2) గాంధారి కృష్ణునియొద్ద ననేకవిధముల విలపించి కట్టకడపటఁ గ్రోధముతోఁ గృష్ణుని శపించుచు—

"ఓజనార్దనా! కురుపాండవులు పరస్పరక్రోధానలమున దగ్ధులై పోవుచుండఁగా నీవూరకచూచుచు నుపేక్షించి యుండుటకుఁ గారణమేమి? నీకసంఖ్యంబగుభృత్యవర్గంబును, సైన్యంబునుగూడ నున్నది. నీవు శాస్త్రజ్ఞానసంపన్నుఁడవు, వాక్యవిశారదుండవు నై యుండియు నసాధారణవినాశనము నుపేక్షించి యుంటివి. కావున నవశ్యముగ నీపాప

మునకుఁ దగినశాస్తి కావలయును. నేను పతిశుశ్రూషామూలంబున నించుకతపస్సంచయంబు గూర్చుకొని యుంటిని. అత్యంతదుర్లభంబగునట్టితపఃప్రభావము చే నేనిప్పుడు నిన్ను శపించుచున్నదానను. జ్ఞాతులగుకురుపాండవుల వినాశనమును నీవూరక యుపేక్షించి చూచుచుంటివి కావున నీజ్ఞాతివర్గముకూడ నీమూలముననే వినాశముం గాంచునుగాక! ఇఁక నలువదియాఱేండ్లకుఁదరువాత నీవుపుత్రమిత్రామాత్యవిహీనుండవై వనమధ్యంబున నతినీచోపాయమూలంబున నిహతుండవు కాఁగలవు. (అలువదియాఱేండ్లనుటయే లెక్క-యో) నీకులవధూమణులు, భరతవంశమహిళామణులవలెనే పతిపుత్రహీనలై విలాపపరితాపంబు లనుభవించెదరుగాక!" అనియెను.

అప్పుడు కృష్ణుఁడు నవ్వుచు "దేవీ! యదువంశధ్వంసముం గావించుటకు నాకంటె సమర్థుఁడగువాఁ డెవ్వఁడును లేఁడు. ఆపనిచేయవలయు నని నేనిదివఱకే నిశ్చయించుకొంటిని. నాకేది యవశ్యకర్తవ్యమో దానినే నీవిప్పుడు చెప్పితివి. యాదవులు మానవులకుఁగాని దానవులకుఁగాని, దేవతలకుఁగాని వధ్యులు కారు. కేవలము వారికి వారే వినాశనముం గల్పించుకొనవలసియుండెను" అనియెను.

ఈవిధముగా రెండవతరగతికవి మౌసలపర్వరచనమునకుఁ బూర్వసూచనముం గావించి యుంచెను. మౌసలికపర్వము రెండవతరగతికవికల్పితమని మేముకూడఁ బూర్వసూచనముం గావించి యుంటిమిగదా!

దశమపరిచ్ఛేదము.

విధిసంస్థాపనము.

మేమిప్పటి కతిదుస్తరంబగు కురుక్షేత్రయుద్ధవిచారమునుండి యుత్తీర్ణులమైతిమి. కృష్ణచరిత్రము మరల వినిర్మలప్రభాభాసిత మగుచు

న్నది. కాని శాంత్యనుశాసనపర్వములు శ్రీకృష్ణుఁడీశ్వరుఁడని సంపూర్ణముగఁ బ్రకటించుచున్నవి.

యుద్ధావశేషమున నగాధబుద్ధి యగుయుధిష్ఠిరుఁడు మరల నెకయగాధబుద్ధిఖేలనమును గావించెను. ఆతఁ డప్పు డర్జుననిం గాంచి "ఇంతమందిజ్ఞాతులను వధించుట కారణంబుగా నాహృదయంబున కెట్టి సుఖంబును లేకుండఁ బోయినది. నేనిఁక వనంబునకుఁ బోయి భిక్షాన్నమును భుజించుచుఁ గాలక్షేపము చేసెదను." అని చెప్పెను. అర్జునుఁడు చాలఁగోపించి యుధిష్ఠిరున కనేకవిధంబుల బోధించెను. పిమ్మట భీమనకులసహదేవులును, ద్రౌపదియును స్వయముగాఁ గృష్ణుండును గూడ బోధించిరి. కాని దుర్బలహృదయుఁ డగుయుధిష్ఠిరుఁడు తేరుకొనఁజాలక పోయెను. వ్యాసనారదాదులుకూడ నాతనికి బోధించిరి. ఏమియు లాభము లేకపోయెను. తుదకుఁ గృష్ణునియుపదేశమువలన యుధిష్ఠిరుఁడు మహాసమారోహముతో హస్తినాపురమునఁ బ్రవేశించెను.

తరువాతఁ గృష్ణుఁ డాతనికి రాజ్యాభిషేకముం జేయించెను. అప్పుడు యుధిష్ఠిరుఁడు కృష్ణుని స్తుతించెను. ఆస్తోత్రము కేవల మీశ్వరస్తోత్రమే. యుధిష్ఠిరుఁడట్లుఁ స్తుతించి కృష్ణునకు నమస్కరించెను. కృష్ణుఁ డాతనికంటెఁ జిన్నవాఁడు; యుధిష్ఠిరుఁ డాతని కిదివఱకెన్నఁడును స్తోత్రనమస్కారములను జేసి యుండలేదు.

ఇటఁ గౌరవశ్రేష్ఠుండగుభీష్ముఁడు శరశయ్యాశాయియై తీవ్రబాధననుభవించుచు నుత్తరాయణంబుకొఱకు నిరీక్షించుచుండెను. ఆతఁ డప్పుడు మహర్షిగణపరివృతుండై సర్వమయుండును సర్వాధారుండును బరమపురుషుండు నగుకృష్ణుని ధ్యానించుచుండెను. అతనిస్తుతివాక్యంబులచేఁ జంచలచిత్తుండగుకృష్ణుఁడు యుధిష్ఠిరాదులతోఁగూడ నా

తనిదర్శింపఁబోయెను. అట్లు పోవుచుండఁగా మార్గమధ్యమున యుధిష్ఠి రుఁడు కృష్ణునివలనఁ బరశురామోపాఖ్యానమును వినియెను.

భీష్మునియొద్ద జ్ఞానలాభంబు గాంచుమని కృష్ణుఁడు యుధిష్ఠిరున కనుమతి నొసంగెను. ఏమనిన— భీష్ముఁడు సకలధర్మవేత్త; ఆతనిజ్ఞాన మాతనితో నంతరించి పోవలసి యుండెను! ఆతఁడట్లు మరణింపకుండఁగనే యాతనిజ్ఞానము జగంబున వ్యాపింపవలయునని కృష్ణునియుద్దేశము. అందుచేతనే కృష్ణుఁడు భీష్మునియొద్ద జ్ఞానోపదేశముం గాంచవలయునని యుధిష్ఠిరునకు బోధించెను. మఱియుధిష్ఠిరునకు జ్ఞానబోధ చేయునట్లు కృష్ణుఁడు భీష్మునకుఁగూడ ననుమతి నొసంగెను.

భీష్ముఁ డట్లు చేయుట కంగీకరింపక "ధర్మాధర్మములు నీవలననే యగుచున్నవి. నీవే సర్వజ్ఞుఁడవు. కావున నీవె యుధిష్ఠిరునకుపదేశింపవలయును నేనిప్పుడు శరచ్ఛిన్నశరీరుండనై మరణావస్థయం దతిక్లేశము ననుభవించుచుంటిని. బుద్ధిభ్రష్టుండ నగుటావలన నిక్కార్యంబు గా నేరదు "అని చెప్పెను. అప్పుడు కృష్ణుఁడు" నీకుశరాఘాతంబువలన వేదన లేకుండునట్టివరంబును బ్రసాదించితిని. నీయంతఃకరణము జ్ఞానతేజంబుచేఁ బ్రకాశమానంబు గాఁగలదు. నీబుద్ధి నిశ్చలమై యుండఁగలదు. నీమనంబు కేవలమును సత్యగుణాశ్రయం బగుచు. దివ్యదృష్టిప్రభావముచే నీకు భవిష్యదర్థంబు లన్నియు దేటపడుంగాక!" అని వరప్రదానముం గావించెను.

కృష్ణునికృపాతిరేకంబున నట్లేయయ్యెను. కాని యప్పుడుగూడ భీష్ముఁడు తనయసమ్మతిం దెలియఁజేయుచు "జనార్దనా! స్వయముగా యుధిష్ఠిరునకు నీవేలయుపదేశంబు సేయఁగూడదు?" అని ప్రశ్నించెను.

కృష్ణుఁడు దానికిఁ బ్రత్యుత్తరముగా "హితాహితకర్మంబులు స ర్వంబును నావలననే సంభూతంబు లగుచున్నవి. చంద్రునకు శీతాంశుఖ్యాతివలెనే నాకును యశోలాభంబయ్యెనని యెఱుంగుము. నిన్ను నిప్పుడు సమధికయశస్సాంద్రునింగా నొనింపవలయు ననియే నాయుద్దేశము అందుచేతనే నాసర్వశక్తులును నీకుఁ బ్రసాదించి యుంటిని" అని చెప్పెను.

అప్పుడు భీష్ముఁడు ప్రఫుల్లహృదయుఁడై యుధిష్ఠిరునకు ధర్మ తత్త్వమును బ్రబోధించుటకుఁ బ్రవృత్తుం డయ్యెను. అతఁడీవిధముగా రాజధర్మమును, ఆపద్ధర్మమును, మోక్షధర్మమును సవిస్తరముగా ధర్మజునకు కెఱింగించెను. మోక్షధర్మోపదేశముతో శాంతిపర్వము ము గిసెను.

ఈశాంతిపర్వమునందు ముఖ్యతరగతులకవుల చేతులునుగాడం బడుచున్నవి. ఈశాంతిపర్వకళేబరముమాత్రము మొదటితరగతికవిది తరువాత నెవ్వరి కేధర్మము తెలిసెనో వారాధర్మమున కీశాంతిపర్వ మున వ్రాసియుంచుచు వచ్చిరి. ఈపర్వమునందు మనము బాగు గవిమర్శింపఁదగిన యొక గొప్పవిషయము మున్నది. కేవలమును ధార్మికు ని రాజుగాఁ జేసినంతమాత్రమున ధర్మరాజ్యసంస్థాపనముం గావించిన ట్లు కానేరదు. రేపాతనియుత్తరాధికారి యగువాఁడు పాపాత్ముఁడు కా వచ్చును. కావున ధర్మరాజ్యస్థాపనంబు చేసి దానిని రక్షించుటకై ధ ర్మవ్యవస్థను గావించుట యావశ్యకమైయుండెను. రణవిజయము మనునది రాజ్యస్థాపనమునకుఁ బ్రథమ కార్యమాత్రమే-దానిని శాసించుటకు (Legislation) విధివ్యవస్థ యవశ్యమై యుండెను. కృష్ణుఁ డాకార్య ముఁదీర్చుటకు భీష్ముని నియోగించెను. అట్లు భీష్ముని నియోగించుటకు విశేషకారణమున్నది. ఆకారణము నాదర్శనీతిజ్ఞుఁడొకఁడు మాత్ర

మేగ్రహింపఁగలఁడు. ఆకారణముంగూర్చి సవిస్తరముగఁ గృష్ణుఁడే స్వయముగ భీష్మునకెఱింగించెను:—

"నీవు వయోవృద్ధుండవును, శాస్త్రవిదుండవును, శుద్ధాచారసంపన్నుఁడవు నై యుంటివి. నీకవిదితంబు లగురాజధర్మంబులును నితరధర్మంబులును లేవు. జన్మావధి నీజీవితమునం దెట్టిదోషంబునుగానవచ్చుట లేదు. నరపతు లందఱును నిన్ను సర్వధర్మవేత్తగాఁ గీర్తించి యున్నారు. కావునఁ దండ్రివలె నీవే యీభూపాలగణంబునకు నీతినుపదేశింపుము. నీవు నిరంతరమును మహర్షిగణంబును దేవగణంబును నుపాసించువాఁడవు. ఇప్పుడీభూపాలురు నీవలన ధర్మవృత్తాంతమును దెలిసికొనవలయు నని కుతూహలపడుచున్నారు. కావున నీవవశ్యముగ సకలధర్మతత్త్వములను సవిస్తరముగఁ దెలుపవలయును. విద్వాంసుఁడగువాఁడే ధర్మోపదేశకుఁడు కావలయునని పండితులు చెప్పుదురు"

తరువాత ననుశాసనపర్వము-ఇందుఁగూడ హితోపదేశమే యున్నది. యుధిష్ఠిరుఁడుశ్రోత; భీష్ముఁడు వక్త; కొన్నివ్యర్థవిషయములతో నీయనుశాసనపర్వము కూర్పఁబడినది, చాలవఱకిది మూఁడవతరగతికవికల్పితమని తోఁచుచున్నది. అందుమనకుఁ బ్రయోజనీయంబగువిషయ మేదియును లేదు.

అనంతరము భీష్ముఁడు స్వర్గారోహణముం గావించెను. ఇదిమాత్రమే మొదటితరగతికవికృతమని చెప్పవచ్చును.

ఏకాదశపరిచ్ఛేదము.

కామగీత

భీష్మస్వర్గారోహణానంతరమున యుధిష్ఠిరుఁడు మరల దుఃఖముతో మునిఁగిపోయెను; మరలవనమునకుఁబోయెద నని పట్టుపట్టెను; అనే

ములనేకవిధములఁ బోధించిరి. కాని, కృష్ణుఁడీసారిమాత్ర మీరోగమునకు దగినయౌషధమును బ్రయోగించెను. అట్టిరోగమును నిర్ణయించుట మఱియెవ్వరికిని సాధ్యముకాదు. యుధిష్ఠిరున కిప్పుడు కలిగినరోగ మహంకారము. ఇంగ్లీషువిద్యాశాలయందు మనము నేర్చిన(pride) "ప్రైడ్" అనుశబ్దము సరిగా దీనికిఁ బ్రతిశబ్దము. కాని వాస్తవముగామాత్ర మది కాదు. అహంకారమును మాత్సర్యమును వేఱువేఱుభావములు. "ఇదియంతయు నేనే చేయుచున్నాను." "ఇది నాదుఃఖము", "ఇది నాది" అనుభావమే యహంకారము ఇదియే యుధిష్ఠిరుని దుఃఖమునకుఁ గారణము. "నేనిపాపమునుగావించితిని; అందుచేత నే నాకీదుఃఖముకలిగినది; నామూలముననే యిదియంతయును తటస్థించినది; కావున నేను వనంబునకుఁ బోయెదను" అనునీయాత్మాభిమానమే యుధిష్ఠిరుని దుఃఖమునకు మూలమై యున్నది ఆమూలమునఁ గుఠారాఘాతముం గావించి యుధిష్ఠిరు నుద్ధరించుటయే యీశ్రేష్ఠధర్మవేదియుద్దేశము. అందుచేతనే కృష్ణుఁడప్పుడు యుధిష్ఠిరునిం గాంచి పౌరుషవాక్యములతో "ఇంకను నీకొకశత్రువు మిగిలియున్నాఁడు. నీశరీరాభ్యంతరమున నహంకారరూపం బగుదుర్జయశత్రువున్నట్లు నీవు గ్రహించితివా?" అని చెప్పి శ్రీకృష్ణుఁడు తత్త్వజ్ఞానమూలంబున నయ్యహంకారమును దూరీకరించుటకై యొకరూపకమును యుధిష్ఠిరునకు వినుపించెను. తరువాత నాతఁడుత్కృష్టోపదేశంబున యుధిష్ఠిరునిం దేర్చెను. దానిని సవిస్తరముగ నిక్రింద నుదాహరించుచున్నాము. గీతలయందు మనము పఠించిన నిష్కామధర్మ మిందుఁగూడ నున్నది. ఇట్టి యతిమహత్తరంబగుధర్మోపదేశముచేఁ గృష్ణచరిత్రమునకు విశేషస్ఫూర్తి యగుచున్నది:—

"ఓధర్మరాజా! వ్యాధి రెండువిధంబులైనది. శారీరిక మనియు మానసికమనియును. ఈద్వివిధవ్యాధులును బరస్పరకారణంబున ను

త్పన్నంబు లగుచుండును. శరీరమునందలి వ్యాధి శారీరకంబనియు మనోమధ్యంబునఁ బీడించువ్యాధి మానసికవ్యాధి యనియుఁ జెప్పఁబడుచున్నది. కఫవాతపిత్తంబులు శరీరగుణంబులు. అవిమూఁడును సమభాగమునం దున్నప్పుడు శరీరము స్వస్థముగానుండును; అవి విషమంబులైనప్పుడే దేహమున రోగముదయించును. పైత్యముద్రేకించినప్పుడు కఫము తగ్గును; కఫ మతిశయించినప్పుడు పైత్యము తగ్గియుండును. శరీరమునకుంబోలి యాత్మకును మూఁడుగుణంబు లున్నవి. రజస్సు, సత్త్వము, తమము నని వానినామములు. ఈగుణత్రయమును సమభావమునం దున్నచో నాత్మ స్వస్థమై యుండును. ఈగుణత్రయమునం దేదేనతిశయించినచో మఱియొకటి లోపించుచుండును. హర్షము కలిగినచో శోకమును, శోకము కలిగినచో హర్షమును దిరోహితమగుచుండును. దుఃఖసమయంబున సుఖంబును, సుఖసమయంబున దుఃఖమును నెవ్వఁ డనుభవించును? ఏమనిన నేమి? ఇప్పుడు సుఖదుఃఖములను రెంటిని స్మరించుట నీకుఁగర్తవ్యము గాదు. సుఖదుఃఖాతీతం బగుపరబ్రహ్మమును స్మరించుటయే నీకు విధేయమై యున్నది. నీకిదివఱకు భీష్మద్రోణాదులతో నెట్టి మహారణము సంప్రాప్తించినదో, యట్లే యిప్పుడొక్క యహంకారముతో నంతకంటెను నతిభీకరం బగుసంగ్రామము తటస్థించినది. ఈయుద్ధమునం దాభిముఖ్యంబు గాంచుటయే నీకిప్పు డవశ్యకర్తవ్యము. యోగంబును, దదుపయుక్తం బగుకార్యకలాపమును నవలంబించినచో నీయుద్ధంబున జయలాభంబు నందఁగలవు. ఈయుద్ధమున బాణములు, సైనికులు, భృత్యులు, బంధువులు మొదలగుసహాయులతో నంతమాత్రమును సంబంధము లేదు. ఏకమాత్రమనస్సహాయముచేతనే యుద్ధరంగమునఁ బ్రవేశింపవచ్చును. ఈరణంబున విజయంబుఁ బడయుచున్నచో దుఃఖమునకుఁ బారమే లేక యుండును. కా

ప్రన నీవు నాయీయుపదేశమును గ్రహించి యచిరకాలంబుననే య హంకారమును జయించి శోకపరిత్యాగంబు సేసి స్వస్థచిత్తుండవై పై తృకరాజ్యపరిపాలనంబు గావింపుము.

ఓయుధిష్ఠిరా! కేవలరాజ్యాదిపరిత్యాగమూలంబున సిద్ధిలాభం బు వడయుట యెన్నటికిని సాధ్యంబు కానేరదు. ఇంద్రియసముదాయ మును జయింపఁగలిగినచో సిద్ధిలాభంబు కలుగుట కెట్టిసందేహమును లేదు. ఎవ్వారు రాజ్యాదివిషయసముదయంబును బరిత్యజించియు మనం బున విషయభోగాభిలాషులై యుందురో వారికిఁ గలుగుసుఖమువంటి సుఖము నిశత్రువులకు లభింపనిమ్ము. మమత సంసారప్రాప్తికిని, నిర్మ మత బ్రహ్మపదప్రాప్తికిని గారణంబు లని నిర్దేశింపఁబడియెను. ఇట్టివి రుద్ధధర్మములుగలమమత్వమును, నిర్మమత్వమునుగూడ మానవహృ దయంబుల నలక్షితముగఁ బ్రవేశించియుండి యొకదాని నొకటిపరాక్ర మించి పరస్పరవిజయంబునకుఁ బ్రియత్నించుచుండును. ఎవ్వఁడీశ్వరు నింబోలి జగంబునకును, నస్తిత్వమును, నవినశ్వరత్వమును గలవని వి శ్వసించునో యాతఁడు ప్రాణివినాశంబు గావించియు హింసాపాపనిర్లి ప్తుండు గానేరఁడు. ఎవ్వఁడీస్థావరజంగమాత్మకంబగు జగంబునకంతకు నాధిపత్యంబు గాంచియు, మమకారమును బరిత్యజించియుండునో, యాతఁడెన్నఁడు నీసంసారపాశంబులచే బద్ధుండు గాఁబోఁడు, మఱియు నెవ్వఁ డరణ్యవాసంబు చేయుచు, ఫలమూలాదులవలన జీవికానిర్వ హణంబు గావించుచుండియును, విషయవాసనాపరిత్యక్తుండు గాఁజా లఁడో యాతఁడు నిశ్చయముగా నీసంసారజాలంబునఁ బడిపోవును. కా వున నింద్రియంబులును, విషయసముదయంబునుగూడ మాయామయం బు లని యెఱుంగుట నీకకర్తవ్యము. వీనిపై మమత లేకుండువాఁ డే నిశ్చయముగా సంసారమునుండి ముక్తిలాభంబుఁ గాంచుటకు సమర్థు

డగును. కామపరతంత్రులగు మూఢవ్యక్తు లెన్నటికిని బ్రశంసాస్పదు లు కాఁజాలరు. కామమనునది మనసునుండియే సముత్పన్నం బగును. అదియే సకల ప్రవృత్తులకును మూలకారణ మైనది. బహుజన్మాభ్యా సవశంబునఁ గామము స్వధర్మముగా గ్రహించి దానము, వేదాధ్యయ నము, తపము, వ్రతము, యజ్ఞము, నియమము, ధ్యానము యోగ ము మొదలగువానిని ఫలాపేక్ష లేకుండ నాశ్రయించువాఁ డొక్కఁ డే యెప్పటి కైనఁ గామమును జయించుటకు సమర్థుఁడగుచున్నాఁడు. కామనిగ్రహమే యథార్థధర్మము—అదియే మోక్షమునకు బీజస్వ రూపమనుటకు సందేహము లేదు.

పూర్వకాలమున విజ్ఞానమయు లగుపండితులచేఁ గీర్తింపఁబడి న కామగీతను నీకిప్పు డుపదేశించెదను వినుము. కామము స్వయము గా నిట్లు చెప్పెను. నిర్మమత్వమును యోగాభ్యాసమును లేకుండ నెవ్వ రైన నను జయించుటకు సమర్థులు కాఁజాలరు. జపాదికార్యంబులచే నెవ్వ రైన నన్నుఁ జయించుటకుఁ బ్రయత్నించినచో నేనభిమానరూపం బున వారిహృదయంబుల బ్రవేశించి వారిప్రయత్నమును విఫలంబుగఁ జేసివైచెదను. వివిధంబు లగుయజ్ఞానుష్ఠానాదులచే నెవ్వ రైన నన్ను ని గ్రింప నెంచినచో నేనువారిహృదయమధ్యమున జంగమమధ్యగతం బ గుజీవాత్మంబోలి వ్యక్తరూపంబున నుదయింతును. వేదవేదాంతాలో చనరూపంబున నెవ్వ రైన నన్ను శాసింపఁ బ్రయత్నించినచో నేను వా రిహృదయంబున స్థావరాంతర్గతంబగు జీవాత్మంబోలి నిలిచియుందును. ధైర్యమూలంబున నెవ్వ రైన నన్ను జయింపఁబ్రయత్నించినచో వారి హృదయమును నేనెన్నఁడును విడువనే విడువను. తపోమూలంబున నె వ్వ రైన నన్ను జయింపనెంచినచో నేను వారి తపోమధ్యమునుండియే ప్రాదుర్భావంబు నందెదను. మోక్షార్థులై యెవ్వఁ రైన నన్ను జయింపఁ

దలఁచినచో నేనాతనింగాంచి నవ్వి నాట్యము చేయుచుందును. సర్వభూతంబులనుగూడ నన్ను జయింపఁజాల వనియును నాస్థితి సనాతనం బనియును బండితులు నిర్దేశించి యున్నారు

ఓయుధిష్ఠిరా! నేనిప్పుడు నీయెదుటఁ గామగీతను గీర్తించి యున్నాను. కావునఁ గామమును జయించుట దుస్సాధ్య మని యెఱుంగుము. నీవు విధిపూర్వకంబుగ నశ్వమేధంబును నితరయజ్ఞానుష్ఠానంబును గావించుచుఁ గామంబును ధర్మవిషయంబున నుపయోగింపుము. మాటిమాటికిని బంధువియోగక్లేశాభిభూతుండ వగుచుండుట నీవంటివానికిఁ గేవలమనుచితము. నీవెంతవిలపించినను వారి నెన్నటికిఁ మరల దర్శించుటకు సమర్థుండవు కాఁజాలవు. కావున నీవిప్పుడు మహాసమారోహముతో సుసమృద్ధంబు లగుయజ్ఞాదికార్యంబుల ననుష్ఠించుటకుఁ బ్రయత్నింపుము. అట్లయినచో నిహలోకంబున నతులకీర్తియును బరలోకంబున నుత్కృష్టగతిలాభంబును గాంచుటకు సమర్థుండ వయ్యెదవు.

ద్వాదశపరిచ్ఛేదము.

కృష్ణప్రయాణము.

ధర్మరాజ్యము సంస్థాపిత మయ్యెను. ధర్మము ప్రచారిత మయ్యెను. ఈశ్రేయస్సుం గల పాండవులతోడి కృష్ణసంబంధ [illegible] కొఱకే. మహాభారతమున శ్రీకృష్ణుఁ డెంతకాలము ప్రధానపాత్ర [illegible] యెనో యాతని పూర్తియైనది. ఇఁకఁ గృష్ణుఁడు మహాభాగవతమునుండి యంతర్హితుం డగుటయే యుచితము. కాని, రచనాకండూతిపీడితు లంత సులభముగాఁ గృష్ణుని విడిచిపెట్టఁ గలరా? తరువాత నార్జునుఁడు

ఖమునుండి యొకయప్రాసంగికవిషయమును వెలువరించిరి. అదియేమను
సిన—అర్జునుఁడు కృష్ణుం గాంచి "నీవు నాకు యుద్ధసమయమునం గా
వించినధర్మోపదేశమంతయును నేను మఱచిపోయితిని. కావున మఱొ
యొకసారి బోధింపవలయును" అని ప్రార్థించెను. అప్పుడు కృష్ణుఁడు
కేవలము సాధారణునింబోలి "నాకావిషయ మంతయు నిప్పుడుమఱ
ల స్మృతికి రానేరదు. నేనప్పుడు యోగసహితుండనై సమస్తము నుప
దేశించితిని. నీవు మూఢుఁడవు; శ్రద్ధాశూన్యుఁడవు. కావున నీకిఁక నేమి
యును జెప్పఁదలఁచుకొనలేదు. అయినను నీకొకపురాతనేతిహాసమును
వినిపించెదను వినుము.

కృష్ణుఁ డుప్పు డయ్యితిహాసవ్యక్తి నవలంబనము చేసికొని యర్
జునునకు మరలఁ దత్త్వజ్ఞానము నుపదేశించెను. అతఁడు మొదట బోధిం
చినవిషయము గీతారూపమునఁ బ్రసిద్ధమైయుండెను. ఇప్పు డుపదేశిం
చినవిషయమునకు గ్రంథకారుఁడు "అనుగీత"యను నామకరణముం గా
వించెను. ఇందలియొకభాగమునకు బ్రాహ్మణగీత యని పేరున్నది.

భగవద్గీత, ప్రజాగరము, సనత్సుజాతీయము, మార్కండేయ
సమస్య, అనుగీత మొదలగు ననేకధర్మవిషయములు మహాభారత
మధ్యమునఁ బ్రవేశించి యింతవఱకు నవి మహాభారతభాగములుగ నే
పరిగణింపఁబడుచున్నవి. ఈయన్నిటియందును శ్రేష్ఠమైనది గీతయే
గాని తక్కినవానియందుఁగూడ సారగర్భితంబులగు వచనము లగపడు
చున్నవి. అనుగీతయు నుత్తమగ్రంథమే. "మోక్షమూలరు" దీనిని దన
"Sacred of the East" అనుగ్రంథమునందుఁ బ్రశంసించియున్నాఁడు.
బొంబాయిహైకోర్టుజడ్జి యగు శ్రీయుత కాశీనాథత్రియంబక తెలంగు
గారు దీని నింగ్లీషునం దనువాదముగావించియున్నారు. కాని యీగ్రం
థ మెట్టిదైనను మనకు దీనితో నెంతమాత్రమును బ్రయోజనము లే

ను. అదియెంతయుత్తమమైనదైననుగృష్ణోక్తముమాత్రము కాదు. గ్రంథకారులో, యితరులో దానిని ట్లవతరింపఁజేసి కృష్ణోక్తముగాఁ జేసియున్నారు. కాని యిందు భిన్నహస్తచిహ్నములు స్పష్టముగా నగపడుచున్నవి. ఈయనుగీతోక్తధర్మమునకును, గీతోక్తధర్మమునకును నెట్టిసాదృశ్యమును లేదు. ఈసంగతి గీతావేత్తలే విమర్శింపవలయును. శ్రీ కాశీనాథత్ర్యంబకుఁడు తనయనువాదగ్రంథమున దీర్ఘానుక్రమణికను వ్రాసియున్నాఁడు. అందలిసందేహజనకంబు లగుప్రమాణప్రయోగములమూలముననే యనుగీత గీతకువెనుక ననేకశతాబ్దులకు రచింపఁబడినట్లు తేటపడుచున్నది. ఆప్రమాణములను విస్తరించి విమర్శించుటవలన నెట్టిప్రయోజనమును లేదు. కృష్ణచరిత్రమునందలి యేభాగమునుగూడ ననుగీతపై నాధారపడి యుండలేదు. అయినను ననుగీతయు, బ్రాహ్మణగీతయుఁ బ్రక్షిప్తములని నిరూపించుట కీసంగతిమాత్రము తెలుపుట చాలును. ధర్మసంగ్రహాధ్యాయమున వీనిప్రసంగ మేమియును లేదు.

అర్జునున కిట్లుపదేశించినతరువాతఁ గృష్ణుఁడు పాండవులను వీడ్కొని ద్వారకానగరమునకు వెడలిపోయెను. ఈవీడ్కోలు మానవప్రకృతిసులభమై స్నేహపరిపూర్ణమై యుండెను. కృష్ణుని మానవత్వముంగూర్చి మేమిదివఱకే యనేకప్రమాణములను జూపియున్నాము. కావున నిఁక విస్తరించి వర్ణింపవలసిన యావశ్యకము లేదు

కృష్ణుఁడు మార్గమధ్యమున నుతంకుని దర్శించినట్లు వర్ణింపఁబడినది. మహారణమును నివారింపనందుకై యప్పుడుతంకుఁడు కృష్ణుని శపించుటకు సంసిద్ధుఁ డయ్యెను. అప్పుడు కృష్ణుఁడు "మహాత్మా ! నన్ను శపింపవలదు. శపించినచో నీతపస్సంక్షయంబు గాఁగలదు. నేను సంధిస్థాపనంబు గావించుటకై ప్రయత్నించితిని. మఱియు నేను జగ

దీశ్వరుఁడను" అని చెప్పెను. అప్పు డుతంకుఁడు కృష్ణునకుఁ బ్రణామం
బు సేసి స్తోత్రంబు గావించి శ్రీకృష్ణునివిశ్వరూపమును జూపింపవల
యునని ప్రార్థించెను; కృష్ణుండును దనవిశ్వరూపమును జూపించెను !
మఱియునుతంకునకు బలవంతముగ వరప్రదానముం గావించెను. తరు
వాత నొకచండాలుండును శునకంబును వచ్చినట్లును, చండాలుఁడు శు
నకమాంసమును భుజింపవలయు నని యుతంకుని బలవంతపెట్టినట్లును
నిట్టివే యెన్నియో బీభత్సవ్యాపారము లందు వర్ణింపఁబడియెను. ఈ
యుతంకసమాగమవృత్తాంతము మహాభారతసంగ్రహాధ్యాయమున లే
దు. కేవల మిది మహాభారతభాగము కాదు. అందుచే నీవిషయమున
నాలోచించుట మన కావశ్యకము కాదు. ఇందు మూఁడవతరగతికవిహ
స్తము స్పష్టముగా నగపడుచున్నది

ద్వారకకుఁ బోయి కృష్ణుఁడు తన బాంధవులనందఱను గలిసికొ
నియెను. అప్పుడు వసుదేవుఁడు కృష్ణునివలన యుద్ధవృత్తాంతమును విన
వలయు ననికుతూహలపడియెను. కృష్ణుఁ డప్పుడు సంక్షిప్తంబుగను, న
త్యుక్తిశూన్యంబుగను, ననైసర్గికదోషవిరహితంబుగను యుద్ధచరిత్ర
మును దండ్రికి వినుపించెను. ఆతఁడు కేవలము నప్పు డభిమన్యువధవృ
త్తాంతమును మాత్రము గూఢముగా నుంచెను. తక్కిన విషయముల
నన్నిటిని స్పష్టముగా నెఱింగించెను. కాని సుభద్ర కృష్ణునితోఁ గూడ
ద్వారకకుఁ బోయి యుండెను. కావున నామెయే స్వయముగ నభిమ
న్యువధంగూర్చిన ప్రస్తావము నెత్తెను. అప్పుడు కృష్ణుఁ డాసంగతినిగూ
డ సవిస్తరముగఁ దెలియఁజేసెను.

ప్రయాణసమయమున యుధిష్ఠిరుఁడు తనయశ్వమేధయాగ కా
లమునకు మరల రావలయు నని శ్రీకృష్ణుని బ్రార్థించి యుండెను. ఇ
ప్పు డట్టిసమయము తటస్థించెను. కావున శ్రీకృష్ణుఁడు యాదవగణప
రివృతుఁడై మరలహస్తినాపురమునకు బయలుదేఱి పోయెను.

కృష్ణుఁ డచ్చటికిఁ బోయినతరువాత నభిమన్యుపత్ని యగునుత్తర యొకమృతశిశువును బ్రసవించెను. కృష్ణుఁడామృతపుత్త్రుని బునర్జీవితుని గావించెను. కాని కృష్ణుఁ డీశ్వరశక్తిమూలముననే యీకార్యమును నిర్వహించెనని సిద్ధాంతము చేయఁగూడదు. ఇప్పటిడాక్టరులలోఁ జాలమంది మృతప్రాయులై జనించినబిడ్డలను బునర్జీవితులం గావింపఁగలుగుచున్నారు. వారెట్లు చేయఁగలుగుచున్నారో చేయుచుండిరో మనము బాగుగ నెఱుంగుదుము. ఇట్లు చేయుట యాకాలపువా రెవ్వరు నెఱుంగ రనియు, నప్పుడు శ్రీకృష్ణునకొక్కనికే యీపద్ధతి తెలిసియుండెననియు దీనినిబట్టి మనము నిర్దేశింపవచ్చును. ఆతఁడాదర్శపురుషుఁడు గావున సమస్తవిద్యలు నాతనికిఁ గరతలామలకములైయుండెను.

తరువాత యజ్ఞము నిర్విఘ్నముగా సంపన్నం బయ్యెను. కృష్ణుండును మరల ద్వారకానగరంబునకుఁ బోయెను. తరువాత నాతఁ డెన్నఁడును మరలఁ బాండవులకు సాక్షాత్కరింపలేదు.



శ్రీకృష్ణచరిత్రము

సప్తమఖండము.

ప్రభాసము.

యోఽసౌ యుగసహస్రాంతే ప్రదీప్తార్చి ర్విభావసుః
సంభక్షయతి భూతాని తస్మై ఘోరాత్మనే నమః.

శాంతిపర్వము ౪౭అధ్యాయము.

ప్రథమపరిచ్ఛేదము.

యదువంశధ్వంసము.

తరువాత నాశ్రమవాసపర్వము. దానితోఁ గృష్ణచరిత్రమున కెట్టిసంబంధమును లేదు. దానితరువాత నీతిభాషావహంబగు మౌసల పర్వము. ఇందు సమస్త యదువంశధ్వంసమును బలరామకృష్ణుల దేహత్యాగమును వర్ణింపఁబడియెను. యదువంశీయు లందఱు నొండొరులను వధించుకొనిరి; ఈభయానకవ్యాపారమును నివారించుటకుఁ గృష్ణుఁడు స్వయముగా నెట్టిప్రయత్నమును గావించి యుండలేదు. ఇంతేకా

క యనేకయాదవవీరు లాతని చేతనే నిహతులైనట్లుగూడ వర్ణితమై యుండెను.

ఆవృత్తాంత మంతయు నిట్లున్నది— గాంధారిచేఁ జెప్పఁబడిన యిరువదిమూఁడవయేఁ డతీతం బయ్యెను. ఒకనాఁడు లోకప్రసిద్ధు లగువిశ్వామిత్రుఁడు, కణ్వుఁడు, నారదుఁడు ననుమువ్వురు ఋషులును ద్వారకకు వచ్చిరి. అప్పటికి యాదవు లందఱును దుర్నీతిపరాయణులై యుండిరి. అప్పుడు దుర్వినీతులగుయాదవులు కృష్ణపుత్రుఁడగుసాంబుని కాఁడువేషము వైచి యాఋషులయొద్దకుఁ దీసికొనిపోయి "ఈమె గర్భవతియై యున్నది. ఈమెకుఁ బుత్రసంతానము కలుగునా?" అని ప్రశ్నించిరి. పురాణేతిహాసములయందు మహర్షులందఱును భయంకరక్రోధస్వరూపులుగా వర్ణింపఁబడి యుండిరి. మాటిమాటికిని వారిచ్చుశాపములనుబట్టి చూడఁగా వారీశ్వరపరాయణులగుజితేంద్రియులు గారనియు, నతినృశంసు లగునరపిశాచస్వరూపులనియు బోధపడక మానదు. ఇక్కాలమునఁ బెద్దమనుష్యులెవ్వరైన నిట్టిపరిహాసవ్యాపారముం గాంచినచో నొక్కించుక మందహాసముం గావించి విడిచిపెట్టుదురు. కాకున్నచో నొక్కతిరస్కారవచనమును బ్రయోగించి యూరకుందురు కాని యీజితేంద్రియు లగుమహర్షులు మాత్ర మొక్కసారిగా సమస్త యదువంశధ్వంస మగునట్లతిక్రూరముగ శాపప్రదానముం గావించుచు "ఈగర్భమున లోహమయం బగుముసలము ప్రసవించును. దాని మూలమునఁ గృష్ణబలరాములు కాక తక్కినయదువంశమంతయును విధ్వస్తమై పోవును." అని ధిక్కరించి పలికిరి. అంతేకాని యాశాపనివారణమున కెట్టియుపాయమును గావింపలేదు.

సాంబుఁడు పురుషుఁడైననేమి, మఱియెవ్వరైననేమి—ఆతనిగర్భమునుండి యథావిధిగ నొకముసలము ప్రసవించెను. అప్పుడు యా

దవేశ్వరుఁడగు నుగ్రసేనుఁడు (కృష్ణుఁడు యాదవేశ్వరుఁడు గాఁడు) భయపడి యామునలమును జూర్ణముగఁ జేయవలయు నని యాజ్ఞాపించెను. మునలము చూర్ణమైనది—చూర్ణమంతయును సముద్రమున నిక్షిప్తం బయ్యెను. ఇట యాదవు లందఱును ధర్మబాహ్యులై పోయిరి. అప్పుడు కృష్ణుఁడు వారలవినాశనంబును గోరి ప్రభాసతీర్థమునకుఁ బోవలయునని సమస్తయాదవులకు నాజ్ఞాపించెను.

యాదవులందఱును, బ్రభాసతీర్థమునకుఁ బోయి యట సురాపానపరవశులై యనేకోత్సవంబులఁ గావింపఁదొడంగిరి. తుదకు వారి వారికిఁ గలహము లారంభ మయ్యెను కురుక్షేత్రయుద్ధమున మహారథుం డగుసాత్యకియె మొట్టమొదట వివాదమున కారంభించెను. అతఁడు కృతవర్మతోఁ గలహము పెట్టుకొనుటయుఁ బ్రద్యుమ్నుఁ డాతనిపక్షము నవలంబించెను సాత్యకి యప్పుడు కృతవర్మశిరఃఖండనంబు గావించెను. అనంతరము కృతవర్మజ్ఞాతులు (యాదవులు యదువృష్టిభోజాంధకాదిభిన్న భిన్నవంశీయులైయుండిరి) వచ్చి సాత్యకిప్రద్యుమ్నులను జంపివైచిరి. అప్పుడు కృష్ణుఁడు క్రోధముతో నొకగుప్పెఁడుతెల్లుగడ్డిని గ్రహించి దానిమూలమున ననేకయాదవులను నిహతులం గావించెను. ఈతెల్లుగడ్డియే మునలచూర్ణంబనియును, రాజాజ్ఞచే సముద్రనిక్షిప్తం బగునాచూర్ణమునుండియే యిది యుత్పన్నం బయ్యెననియు గ్రంథాంతరమునఁ జెప్పఁబడి యుండెను. మహాభారతమునందీ వృత్తాంతమగపడుట లేదు. కాని కృష్ణుఁడు గ్రహించినతెల్లుగడ్డి మునలరూపమునఁ బరిణమించె ననియు, బ్రాహ్మణశాపముచే నచ్చటితెల్లంతయు ముసలీభూతమై యుండె ననియు, యాదవులందఱును దానిమూలమున నే యొండొరులఁ బ్రహరించుకొనుచు నశించిపోయిరనియు భారతమునం దున్నది. అప్పుడు దారుకుఁడును, బభ్రుం డను నొక యాదవు

డును గృష్ణునిం గాంచి "ఓజనార్దనా! నీవిప్పు డసంఖ్యప్రాణిసంహారంబు గావించి వెడలిపొమ్ము! మేము మహాత్ముం డగుబలభద్రుని యొద్దకుం బోయెదము" అని చెప్పిరి.

కృష్ణుండు దారుకుని హస్తినాపురమున కర్జునునియొద్దకుం బంపించెను. అర్జునుండు వచ్చి యాదవకులకామినులను హస్తినాపురమునకుం గొనిపోవలయు నని యాజ్ఞాపించెను. కృష్ణుడు యోగాసనాసీనుండగు బలరాముని దర్శించెను. అప్పుడాతనిముఖమునుండి సహస్రఫణా విరాజితంబగు నొకసర్పము వెలువడి సాగరవరుణనదీవాసుకి ప్రభృతులచే నభినుతింపంబడి సముద్రమధ్యంబునం బ్రవేశించెను. బలరాముని దేహము జీవశూన్యం బయ్యెను. అప్పుడు కృష్ణుండు స్వయముగా మర్త్యలోకత్యాగంబుం గావింపందలంచి మహాయోగావలంబనపూర్వకంబుగ భూతలశాయి యయ్యెను. ఆసమయమున జరానాముండగు నొకవ్యాధుండు మృగభ్రాంతిచే గృష్ణపాదపద్మమును శరవిద్ధంబు గావించెను తోడనే యాతండు తనవిభ్రాంతి నెఱింగి శంకితహృదయముతో వచ్చి కృష్ణచరణనిపతితుండయ్యెను. కృష్ణుం డాతని నాశ్వాసించి యాకాశమండలమును బ్రభాసితముగం జేయుచు స్వర్గారోహణంబు గావించెను.

ఇట నర్జునుండు ద్వారకకు వచ్చి రామకృష్ణుల కౌర్ధ్వదైహిక కృత్యంబులు నిర్వర్తించి యాదవకులకామినులను వెంటం బెట్టుకొని హస్తినాపురంబునకుం బ్రయాణ మయ్యెను. మార్గమధ్యమున దండహస్తులగుదస్యు లాతని నాక్రమించిరి. భీష్మకర్ణులను మహారణంబున నిర్జించినట్టియు, నీపృథ్వీమండలమునంతను జయించినట్టియు నర్జునుం డప్పుడు దండధారులగు దస్యులచేం బరాజితుండై పోయెను. ఆతండు గాండీవమునే యెత్తంజాలకపోయెను. రుక్మిణి, సత్యభామ, హైమవతి,

జాంబవతి మొదలుగాఁగల కృష్ణమహిషీగణంబునుదక్కఁ దక్కినకాంతల నందఱను దస్యులపహరించుకొని పోయిరి.

ఈవృత్తాంత మంతయును మాలిక మేనా? ముసలవ్యాపారము కేవలమనైసర్గికముగా నున్నది. కావున మేము దీనిని బూర్వసియమానుసారంబుగఁ బరిత్యజించుటకు బాధ్యుల మైతిమి. దానిని త్యజించినను స్వభావానుగతంబుగ నిలిచియున్న స్వల్పవృత్తాంతమునుమాత్రి మంత శీఘ్రముగాఁ ద్రోసివైవఁ జాలకుంటిమి. యాదవులు పానాసక్తులనియు, దుర్నీతిపరాయణులనియు నిదివఱకే చెప్పంబడియుండెను. వారందఱు నేకవంశీయులు గారు, భిన్నభిన్న వంశీయులును, ననేక సమయములయందుఁ బరస్పర విరుద్ధాచారులు నై యుండిరి. కురుక్షేత్రియుద్ధంబున వార్ష్ణేయులును, సాత్యకియుఁ, గృష్ణుఁడును మాత్రము పాండవపక్షమునం దుండిరి. కాని యంధ కుకురు భోజవంశీయులును, గృతవర్మయు దుర్యోధనునిపక్షము నవలంబించిరి. మఱియు యాదవులకు రాజనువాఁ డెవ్వఁడును లేఁడు. ఉగ్రసేనుని రాజని చెప్పవలసి యుండెను. కాని యాదవులకు రాజ్యాధికారము లేదనుప్రవాద మొకటి యున్నది. కృష్ణుఁడు తనగుణాధిక్యము కారణంబుగా యాదవులకందఱకును నేతయైయుండెను. కాని కృష్ణునకు బలరామునితో మతభేద మున్నట్లు శాంతిపర్వమునఁగానంబడుచున్నది. భీష్ముఁడు కృష్ణనారదసంవాదముం గూర్చి చెప్పుచు శ్రీకృష్ణుఁడు జ్ఞాతిరంజనమునకై తానెంతప్రయత్నించినను విఫలమనోరథుండనైతినని విచారించుచు నారదునితోఁ జెప్పినట్లు వర్ణించి యుండెను. ఈసకలవృత్తాంతమును బూర్వమే చెప్పియుంటిమి. కావున యాదవులు పరస్పరవిద్వేషవిశిష్టులును, స్వస్వప్రధానులును, నత్యంతబలగర్వితులును, దుర్నీతిపరాయణులును, నేపలసురాపాన నిరతులునై యుండిరని చెప్పుట కెంతమాత్రమును

సందేహము లేదు. * అట్టివారు పరస్పరకలహంబు గావించుకొని సకలయాదుకులక్షయంబు గావించిరనియు, స్వేచ్ఛాధీనముగనో, యస్వేచ్ఛాధీనముగనో రామకృష్ణులుకూడ నామూలముగ నే దేహత్యాగంబు గావించిరనియు జెప్పుట యసంభవముగాని యస్వభావముగాని కానేరదు. ఇట్టిపరివాదము లోకమున వ్యాపించియుండె ననియు, నందుపై గ్రంథకారులీయదువంశధ్వంసవృత్తాంతము నీవిధముగా గ్రంథస్థము గావించి యుందురనియుఁ దోఁచుచున్నది. అందుచే నీవృత్తాంత మెంతవఱకు మౌలికమని విమర్శించుటవలన నుపయోగము లేదు. కాని యొకటిరెండుమాటలు చెప్పవలసియున్నది. యదువంశధ్వంసమును నివారించుటకై కృష్ణుఁడెట్టిప్రయత్నమును జేయకుండుటయే కాక దానికిఁ బ్రోత్సాహముఁగూడఁ జేసినట్లు చెప్పఁబడియుండెను. ఇదియొకవేళ సత్యమే యైనను దీనివలనఁ గృష్ణచరిత్రమున కసంగతిగాని, యగౌరవముగాని యెంతమాత్రమును లేదు. ఆదర్శపురుషుఁ డాదర్శపురుషునకుఁ దగినకార్యమునే గావించి యుండెను. ఆదర్శపురుషున కాత్మీయులు ననాత్మీయులు ననువా రెవ్వరును లేరు. ఆతనికి ధర్మమే యాత్మీయమైనది. యదువంశీయులందఱు నధార్మికులైపోవుచుండుటచే వారిని దండించుటయును నావశ్యకసమయమున వారివినాశసాధనముం గావించుటయును గృష్ణునకుఁ గర్తవ్యములై యుండెను. అధర్మాత్ములను కారణంబున జరాసంధాదులను సంహరించినవాఁడు దుర్వినీతులగు యాదవులకు వినాశనంబు గల్పింపకయే యున్నచో నిఁక ధర్మబంధుఁ డెట్లగు

* యాదవుల మద్యపానాసక్తి యెంతవఱకు విజృంభించెననఁగా — దానినడంచుటకై బలరామకృష్ణులు ద్వారకానగరమున సురను సిద్ధముచేయు వారికి శూలారోపణశిక్షయగునని చాటింపు చేయింపవలసివచ్చినది. మేమిప్పుడు పాశ్చాత్యరాజపురుషులం గూర్చి యిట్టియుత్తమనీతి నాదరింప ననువయు నని ప్రార్థించుచున్నాము. వాం

ను ? ఆత్మీయులకు బంధుఁడును, తనకు బంధుఁడు నగువాఁడెన్నటికిని ధర్మపక్షపాతి కాఁజాలఁడు. ఆతఁడు స్వపక్షపాతియే యగును. అట్టివాఁడాదర్శధర్మాత్ముఁడు కాఁడు. కావుననే కృష్ణుఁడట్టివాఁడు కాలేఁడు.

కృష్ణుని దేహత్యాగమునకుఁ గారణములు కొన్ని యనిశ్చితములైయుండెను. దానికి నాలుగు కారణములను నిర్దేశింపవచ్చును.

మొదటిది టాల్ వయస్ హుంగులు సాంప్రదాయమువారు కృష్ణుఁడు జూలియస్ కైజరువలె ద్వేషవిశిష్టులగు బంధులచే నిహతుండయ్యెనని చెప్పుదురు. ఇట్లేగ్రంథమునందును జెప్పఁబడి యుండలేదు.

రెండవది—ఆతఁడు యోగావలంబనముం గావించి దేహత్యాగంబు గావించెనని—పాశ్చాత్య వైజ్ఞానికులకు శిష్యులగువారు యోగావలంబనముచే దేహత్యాగంబు చేసెననుమాటను విశ్వసింపరు. ఆయవిశ్వాసమునకుఁ గారణమేమో నాకుఁ బోధపడలేదు. యోగాభ్యాసకాలంబున నిశ్వాసమును నిరోధించునలవాటుగలవారు శ్వాసనిరోధంబు చేసి ప్రాణత్యాగంబు చేసికొనఁజాలరని మేము సాహసించి చెప్పఁజాలము. ఇట్టిసంఘటనము విశ్వస్తసూత్రంబున వినవచ్చుచునేయుండెను. ఇది యాత్మహత్య యగుటచేఁ గేవలమును బాపకృత్యమనియు, నాదర్శపురుషున కనాచరణీయ మనియుఁ గొందఱు చెప్పుదురు. కాని మేమట్లు చెప్పఁజాలము. ప్రాచీనవయస్సున జీవితకార్యముల నన్నిటిని సంపన్నంబు గావించుకొని యనంతర మీశ్వరునియందు విలీనుండగుటకై మనోమధ్యంబునఁ దన్మయుండై శ్వాసనిరోధించుట యాత్మహత్యయనవలయునా? ఈశ్వరప్రాప్తి యనవలయునా ? అదియే విమర్శింపఁదగినవిషయము. ఆత్మహత్య మహాపాపమనియే యంగీకరింతము. కాని జీవితవిశేషమున యోగావలంబనపూర్వకముగాఁ బ్రాణత్యాగంబు చేయుట కూడ నట్టిదియేనా ?

మూడవది—ముసలితనమున శరాఘాతమగుట.

నాలుగవది—అప్పటికిఁ గృష్ణునకు నూతేండ్లవయసు దాఁటిపో యినది. విష్ణుపురాణమునం దీసంగతి చెప్పఁబడినది. ఇదిజరావ్యాధి యేనా ?

కృష్ణునిమనుష్యత్వమును మాత్రమేయంగీకరించి యాతని యీశ్వరత్వముంగూర్చి యంగీకరింపనివా రీనాలుగుకారణములలో నేదేని కదాని నంగీకరింతురు. కాని మేము కృష్ణుని సీశ్వరావతారమని విశ్వసించుచున్నాము. అందుచే మేము కృష్ణునియిచ్ఛయే యాతని దేహత్యాగమునకుఁ గారణమని చెప్పుదుము. జగత్తునందు మానవత్వమున కాదర్శమును బ్రచారము గావించుటయే యాతని యిచ్ఛ. ఆయిచ్ఛా పూరణార్థమే యాతఁడు సకలకార్యములను మానవశక్తిమూలముననే నిర్వహించెను. అయినను నాతఁడీశ్వరావతారుఁడగుటచే జననమరణము లాతనియిచ్ఛాధీనములై యుండెను. ఇదియే మామతము. కావునఁ గృష్ణునియిచ్ఛయే యాతనిదేహత్యాగమున కేకమాత్రకారణమని మేము చెప్పుచున్నాము.

మాసలపర్వము మహాభారతప్రథమశ్రేణికవితాంతర్గతమా నా కాదాయనుసంగతిని మేము పరిశీలింపలేదు. విశేషప్రయోజనము లేకుండుటచే విడిచివైచితిమి. అందుఁ గొన్నిస్థూలసంఘటనములు సత్యము లనియే బోధ యగుచున్నది. అయినను నివి మహాభారతప్రథమకవితాంతర్గతములు కావనితోఁచుచున్నది. పురాణములయందును హరివంశమునందును గలకృష్ణజీవితసంఘటనములు చాలవఱకు మహాభారతమున లేవు. ఈవృత్తాంతముమాత్రము పురాణములయందును, హరివంశమునందును మహాభారతమునందునుగూడ నున్నది. మహాభారతమునఁ గృష్ణచరిత్రము పాండవులతో సంబంధించినంతవఱకు మాత్రమేయున్నది. అంతకంటె నతిశయముగా నుండుట కవకాశము లేదు.

ఈ విషయము మాత్రి మానియమమునకు బహిర్భూతమై యున్నది. ఇచ్చటఁ గృష్ణుఁడీశ్వరావతారుఁడుగాఁ జెప్పఁబడియెను. ఇందు రెండుమూఁడుతరగతులకవి తలచిహ్నములగపడుచున్నవని యిదివఱకే చెప్పియుంటిమి ఇట్లు నిశ్చయించుటకు మఱికొన్ని యితర కారణములను జూపవచ్చునుగాని ప్రయోజనమంతగా నగపడుటలేదు. అయినను ననుక్రమణికాధ్యాయమున మౌసలపర్వప్రస్తావ మేమియును లేదనుసంగతిమాత్రము చెప్పవలసియున్నది. పరీక్షిత్తుజనించినతరువాత మఱియేవృత్తాంతము గూడ ననుక్రమణికాధ్యాయమున లేదు. పరీక్షిత్తుజననవృత్తాంతముతోడనే యాదిమహాభారతము ముగిసియుండు నని మాయభిప్రాయము. ఆతరువాతివృత్తాంతములన్నియు రెండుమూఁడుతరగతుల కవులకల్పనలై యుండును.

ద్వితీయపరిచ్ఛేదము.

ఉపసంహారము.

ప్రయోజనము ననుసరించి విమర్శించుపద్ధతి యిరుతెఱంగులై యుండును. ప్రాచీనకుసంస్కారములను నిరసించుట మొదటివిధము. సత్యమును దెలిసి గ్రహించుట రెండవవిధము. ఈకృష్ణచరిత్రమున మొదటిపద్ధతియే ప్రధానమై యుండెను. అందుచే మా సమయమును, బ్రయాసమునుగూడ దానికొఱకే విశేషముగ వినియోగపడియెను. కృష్ణచరిత్రమునందు సత్యమును నూతనముగ గ్రహించుట దుస్సాధ్యవ్యాపారము. ఏమనిన — మిథ్యాస్వభావోపన్యాసము లనుభస్మమధ్యమున మఱుగుపడియున్న సత్యవృత్తాంతములనునగ్నికణంబులను

వెదకి కనుఁగొనుట చాలకష్టము. ఏయుపాదానమూలమున శ్రీకృష్ణచరిత్రమును బునస్థాపితముగఁ జేయవలసియుండెనో, యాయుపాదానముకూడ మిథ్యాసాగరమధ్యమున మునిఁగి యుండెను. అయినను మాకు సాధ్యమైనంతవఱకు మేము దీనిరూపము నేర్పఱచితిమి.

పురాణేతిహాసములయం దెంతవఱకు సత్యమును గ్రహించితిమో దానినంతను గృష్ణచరిత్రమునం దెట్లుపయోగించితిమో నేమిా యుపసంహారమునఁ జూపవలసియున్నది.

బాల్యకాలంబునఁ గృష్ణుఁడు శరీరబలంబున శౌదర్యబలవంతుఁడని చూచియున్నాము. అశిక్షితం బగునాతనిబలప్రభావముచే బృందావనమునందలి క్రూరజంతువు లన్నియును నశించెను. ఆతని యనభ్యస్తబలవిశేషంబుననే కంసునిమల్లురు నిహతులైపోయిరి. గోపాలనకాలంబునను, గోపాలగణంబులతోడి విలాసక్రీడాసమయంబునను గావించు వ్యాయామాదులచేఁ గృష్ణునకు శారీరకబలస్ఫూర్తి ద్విగుణమైనట్లుగ పడుచున్నది. దుర్గమునంబునఁ గాలయవనుఁడుగూడ నాతనికిఁ జాలలేకపోయెను. కురుక్షేత్రయుద్ధమునం దాతనిరథసంచాలనవిద్య విశేషముగఁ బ్రశంసింపఁబడియెను.

ఈబలము క్రమముగా సక్రమశిక్షితమగుటచేఁ గృష్ణుఁ డాసమయమున క్షత్రియసమాజమునందెల్లఁ బ్రధానాస్త్రవిదుఁడని ప్రసిద్ధిం గాంచెను. ఆకాలమునం దాతని నెవ్వరును బరాభూతునిం గావింపఁజాలకుండిరి. ఆతఁడప్పుడు కంసజరాసంధశిశుపాలాది సర్వప్రధానయోధులతోడను, గాశీకళింగపౌండ్రక గాంధారాదిదేశాధిపతులతోడను యుద్ధముం గావించి యుండెను. అందెవ్వరు నెన్నఁడు నాతని బరాభూతునిం జేయఁజాలకపోయిరి. యుద్ధవిద్యయం దాతనిశిష్యులగు సాత్యకియు, నభిమన్యుండునుగూడ రణరంగమునం దెప్పుడు నజేయులై

యుండిరి. ఒకానొకసమయమునం దర్జునుఁడుగూడ యుద్ధసంబంధమునం దాతనిశిష్యత్వము నంగీకరించి యుండెను. రణపాటవము కేవల శరీరబలమునందును, నభ్యాసమునందును నాధారపడి యుండు నని పురాణేతిహాసములవలనఁ దెలియవచ్చుచున్నది. కాని యట్టిరణపాటవము కేవల మొకసైనికునకుఁగూడఁ గలిగి యుండవచ్చును. సేనాపతిత్వమే యోధుని శ్రేష్ఠత్వమునకుఁ బ్రధానగుణము. ఆకాలమున యోధు లెవ్వరును సేనాపతిత్వమునందు సమర్థులై యుండలేదు. పురాణములయందుఁగాని, మహాభారతమునందుఁగాని యెవ్వరికినట్టిగుణపాటవమున్నట్లగపడదు. భీష్మునకును, నర్జునునకును గూడ నట్టిసామర్థ్యము లేదు. జరాసంధయుద్ధమున శ్రీకృష్ణునిసేనానాయకత్వసామర్థ్యము విశేషముగఁ గానవచ్చుచున్నది. ఆతనిసేనానాయకత్వమువలనఁ గొలఁదిపాటియాదవసైన్యముచే జరాసంధునియసంఖ్యసైన్యము మధురాపురమునుండి విముఖమైపోయెను. అగణనీయం బగుజరాసంధసైన్యమును నిర్జించుట యాదవసైన్యమునకు దుస్సాధ్యంబని యెంచి మధురను బరిత్యజించి సాగరద్వీపమున ద్వారక యనునూతననగరనిర్మాణంబుగావించుటయు, దానికిసమీపమునందలి రైవతకగిరిపంక్తియందు దుర్భేద్యదుర్గములను నిర్మించుటయును శ్రీకృష్ణుని యసాధారణరాజనీతిజ్ఞతను వెల్లడించుచున్నవి. అట్టిసామర్థ్యము పురాణేతిహాసములయందలి యేక్షత్రియులయందును గానవచ్చుట లేదు. పురాణకారులగుమహర్షులకుఁగూడ నిది యవబోధగమ్యంబైనది. కావుననే కృష్ణేతిహాసము కల్పనామాత్రము కాదనియు, సత్యమే యనియుఁ దెలుపుటకిదియు నొకనిదర్శనమై యున్నది.

శ్రీకృష్ణుని జ్ఞానోపార్జితంబులగుసమస్తవృత్తులును జరమస్ఫూర్తింగాంచినట్లు మనకుఁ గావలసినన్నినిదర్శనము లగపడుచున్నవి. ఆతఁ డద్వితీయవేదజ్ఞుఁడని యర్ఘ్యప్రదానసమయంబున భీష్ముఁడు ప్ర

శంసించియున్నాఁడు. అట్లు పూజించుటకగు నొక కారణముఁగూడ నాతఁడు తెలిపి యున్నాఁడు. శిశుపాలుఁడుగూడ నామాటకు మాఱుపలుకలేదు. వేదవ్యాసుఁడుండఁగా నీతనినే పూజించుట యేలకని మాత్రమే యాతఁడాక్షేపించి యుండెను.

శ్రీకృష్ణుని జ్ఞానవృత్తు లన్నియును సంపూర్ణవికాసమును గాంచి యున్నట్లాతనిచేఁ బ్రచారితంబగుధర్మోపదేశమే విస్పష్టప్రమాణమై యున్నది. ఈధర్మము కేవలమును గీతయందే కాక మహాభారతమునం దనేకస్థలములయందుఁగూడఁ గానంబడుచున్నది. కృష్ణునిచేఁ జెప్పఁబడినధర్మముకంటె నున్నతంబును, సకలలోకహితకరంబును, సర్వజనాచరణీయంబును నగుధర్మ మేకాలమునందును జగత్ప్రచారితమైయుండలేదు. ఈసంగతి సవిమర్శముగ మేము గ్రంథాంతరమున సిద్ధాంతీకరించి యున్నాము. ఈధర్మము మనుష్యాతీతంబగుజ్ఞానమును బ్రసాదించుచున్నది. కృష్ణుఁడు మానవశక్తులమునననే సకలకార్యములను సాధించెనని మేము మాటిమాటికిం జెప్పుటయే కాక ప్రమాణములనుగూడఁ జూపియున్నాము. కేవల మీగీతోపదేశమునందు మాత్రము శ్రీకృష్ణుఁడు విశేషించి యనంతజ్ఞానమునే యాశ్రయించి యుండెను.

సార్వజనీనధర్మమునుండి శ్రీకృష్ణుఁ డవతరింపఁ జేసిన రాజధర్మమునుబట్టియు, రాజనీతినిబట్టియు నాలోచించిచూడఁగా నాతనిజ్ఞానప్రవృత్తులు చరమస్ఫూర్తిం గాంచినవని స్పష్టముగాఁ బోధపడుచుండును. సర్వశ్రేష్ఠంబును, సంభ్రాంతంబును నగు రాజసూయ మొనరించినవాఁ డాతఁ డొక్కఁడే యగుటచేతనే యుధిష్ఠిరుఁడు వ్యాసభగవానునిచే నుపదేశింపఁబడియును శ్రీకృష్ణుని యాలోచన లేకయే రాజసూయయజ్ఞముం గావించుటకుఁ జేయిసేసికొనలేదు. అ[illegible]

దవులును, బాధ్యులగుపాండవులునుగూడ నాతనితో నాలోచింపకుండ నేకార్యమును జేయుట లేదు. జరాసంధుని నిహతునింగావించి రాజమండలమును గారాగారమునుండి యుద్ధరించుట శ్రీకృష్ణునియుత్కృష్ట రాజనీతికి స్పష్టోదాహరణ మైయున్నది. ధర్మరాజ్యస్థాపనంబు న కతిసులభంబును, బరమధర్మంబు నగునుపాయమదియే — ధర్మరాజ్యస్థాపనానంతరమున ధర్మరాజ్యశాసనంబుగావింప నెంచి భీష్ముని రాజధర్మోపదేశంబునకు నియోగించి రాజవ్యవస్థను సంస్థాపించుట శ్రీకృష్ణుని రాజనీతిజ్ఞత కతిప్రశంసనీయం బగుద్వితీయోదాహరణముగా నున్నది. ఇంకను నిట్టివెన్నియో యుదాహరణములను బాఠకులు చూచి యున్నారు.

శ్రీకృష్ణునిబుద్ధి సర్వవ్యాపినియు, సర్వదర్శినియు, సకలోపాయోద్భాసినియునై సర్వోత్కృష్టస్థానమును గాంచి యున్నట్లు మనమెన్నియోసారులు పరికించి యున్నాము. మానవశరీరధారు లెంతవఱకు సర్వజ్ఞు లగుట కవకాశమున్నదో శ్రీకృష్ణుం డంతవఱకును సర్వజ్ఞుడై యుండెను. ఎవ్వనిబుద్ధి నిరంతరము నధ్యాత్మతత్త్వాలోచనమును, ధర్మతత్త్వాలోచనమును విడువక వానినే యాశ్రయించి యుండెనో యిట్టి శ్రీకృష్ణునకు వైద్యవిద్య, సంగీతవిద్య, అశ్వవిద్య మొదలగునితరవిద్యలుకూడ నాయత్తము లై యుండెను. ఉత్తరాగర్భజనితుండగుమృతపుత్రుని బునర్జీవితునిం గావించుట మొదటివిద్యకును, జగద్విఖ్యాతంబగు మురళీమోహనగానము రెండవవిద్యకును, జయద్రథునవధదినంబున నశ్వశల్యోద్ధారంబు గావించుట తృతీయవిద్యకును నుదాహరణములు.

సర్వోపయుక్తంబు లగుశ్రీకృష్ణునిసమస్తప్రవృత్తులును బరమస్ఫూర్తిగాంచినవి. ఆతనిసాహసమును, ఉపకారిత్వమును సకలక

ర్మతత్త్వరత్వమును మనకనేకసమయములయందుఁ గానంబడుచున్నవి. ఆతనిధర్మస్వభావము, సత్యమును నిశ్చలంబులైనవని సూచించునిదర్శనములచే నీగ్రంథమంతయును నిండి యున్నది. ఆతనిసర్వభూతదయాగుణంబును, నిర్మలప్రేమయు నీయితిహాసమునందు స్పష్టముగా నగపడుచున్నది. ఆతఁడు బలగర్వితులగువీరులకంటె నధికబలవంతుం డయ్యును, లోకహితార్థంబుగ శాంతిని స్థాపించుటకు దృఢప్రయత్నుండును, దృఢప్రతిజ్ఞుండు నై యుండెను. శ్రీకృష్ణుఁడు సర్వలోకహితైషియై యుండెను. మానవులయందే కాక గోవత్సాదితిర్యగ్జంతువులయందుఁగూడ నాతఁడు దయామయుఁడై యుండెను. ఈసంగతి గిరియజ్ఞమున స్పష్టముగా నగపడుచున్నది. ఆతఁడు బాల్యకాలమున వానరములకుఁ బెట్టుటకై నవనీతమును దొంగిలించుట, ఫలవిక్రేత్రికథ మొదలగువృత్తాంతములన్నియును గింవదంతులనియే త్రోసివేయఁగూడదు. గోవత్సముల కుత్తమభోజనముం గల్పించుటకై యింద్రయాగమునుగూడమాన్పించినయాతని కట్టిగుణముండుననుట యాశ్చర్యము కాదు. ఆతఁ డాత్మీయులు, బంధువులు జ్ఞాతులు మొదలగువారికందఱకు నెంతటిహితుఁడై యున్నట్లగపడుచుండెనో, పాపాత్ములైనచో నాత్మీయులకైనను నంతటియహితుఁడై యున్నట్లు కానవచ్చుచున్నది. ఆతఁడపరిమితక్షమాగుణసంపన్నుఁడుగా నగపడుచుండును. కాని సమయము వచ్చినచో లోహమయహృదయముతో నకుంఠితుఁడై దండవిధానముం గావించుచుండును. ఆతఁడు స్వజనప్రియుఁడు; అయినను లోకహితార్థమై యాత్మీయులనైన వధించుటకు సంశయింపఁడు, కంసుఁ డాతనిమేనమామ; ఆతనికిఁ బాండవు లెట్టిబంధులో శిశుపాలుఁడుఁగూడ నట్టిబంధుఁడే—మేనత్తకొడుకు! శ్రీకృష్ణుఁ డట్టికంసశిశుపాలురను వధించుటకుఁ గుంఠితుఁడు కాలేదు. తుట్టతుదను దుర్నీతి ప

రాయణులును, సురాపానవివశులు నగుటచే యాదవు లాత్మీయులైన ను వారిరక్షణవిధానమును గావింపక యూరకుండెను.

ఇట్టి శ్రీకృష్ణవృత్తు లన్నియును సర్వోత్కృష్టస్థానము నాక్రమించినంతమాత్రమున నాతఁడు చిత్తరంజనీవృత్తి ననుశీలనముం గావించువిషయమునఁగూడఁ బరాఙ్ముఖుఁడు కాలేదు. బృందావనమునందలి వ్రజలీలయుఁ బరిణతవయస్సున సముద్రవిహారము, యమునావిహారము, రైవతకవిహారము మొదలగునవి దానికుదాహరణంబులై యున్నవి. వానినిగూర్చి సవిస్తరముగ నిట వర్ణించు టంతయావశ్యకముగా నగపడలేదు.

కేవల మిఁక నొకమాటనే చెప్పవలసి యున్నది. భక్తియే మానవునకుఁ బ్రధానవృత్తి యని ధర్మతత్త్వమునఁ జెప్పఁబడి యుండెను. కృష్ణుఁ డాదర్శపురుషుఁడు—మానవత్వమున కాదర్శమును బ్రచారము సేయుటకే యాతఁ డవతరించి యుండెను. ఆతనిభక్తిస్ఫూర్తి మన కెచ్చట నగపడినది? కాని యాతఁడే యీశ్వరావతారమైనప్పు డిఁక నాతనిభక్తి కాశ్రయులు మఱియెవ్వరున్నారు? స్వయముగ నాతఁడే * తాను బ్రహ్మపదార్థముకంటె భిన్నుఁడనుగానను జ్ఞాన మెప్పుడనుభవమునకు వచ్చునో యప్పుడే తనయందు భక్తి కలుగుచున్నది. ఇదియే జ్ఞానమార్గమునకుఁ బరమస్థానము. దీనినే యాత్మరతి యందురు. ఛాందోగ్యోపనిషత్తునందు దీనినిగూర్చి "ఏష ఏవం పశ్యన్నేవం, మన్వాన ఏవం విజ్ఞానన్నాత్మరతి రాత్మక్రీడాఆత్మమిథున ఆత్మానందః స స్వరాడ్భవతీతి" అని వర్ణింపఁబడియెను.

ఎవ్వఁడు దీనిని జూచి భావించి, దీనిని దెలిసికొని యాత్మరతుండును, నాత్మక్రీడాశాలియు నగునో, ఎవ్వని కాత్మయే మిథునంబును, నాత్మయే యానందంబు నగునో యాతఁడే స్వరాట్టగుచున్నాఁడు.

* మహాభారతమునం దన్నిభాగములయందును శ్రీకృష్ణుఁడు శివోపాసకుఁడుగా వర్ణింపఁబడియుండెను. అవి యన్నియును బ్రక్షిప్తలక్షణవిశిష్టములై యున్నవి.

ఇదియే గీతయందును జెప్పంబడియెను. కృష్ణుఁ డాత్మారాముఁడు; ఆత్మజగన్మయుమైనది. ఆతఁడే జగంబునఁ బ్రతివిశిష్టుఁడు. పరమాత్మయం దాత్మరతి మఱి యేవిధముచేతను దెలియఁజాలము. అందుచే మేము తెలిసికొనఁజాలమని చెప్పుచున్నాము—

శ్రీకృష్ణుఁడు సర్వస్థలములయందును, సర్వసమయములందును సర్వగుణాభివ్యక్తిచే సముజ్జ్వలుండని యుపసంహారమునఁ జెప్పవలసి యున్నది. ఆతఁ డజేయుఁడు; అపరాజితుఁడు; విశుద్ధుఁడు; పుణ్యమయుఁడు; ప్రేమమయుఁడు; దయామయుఁడు; అనుష్ఠేయ కార్యములయం దపరాఙ్ముఖుఁడు—ధర్మాత్ముఁడు; వేదజ్ఞుఁడు నీతిజ్ఞుఁడు; ధర్మజ్ఞుఁడు; లోకహితైషి; న్యాయనిష్ఠుఁడు; క్షమాశీలుఁడు నిరపేక్షుఁడు శాస్త; నిర్మముఁడు; నిరహంకారుఁడు; యోగయుక్తుఁడు; మఱియుఁ దపస్వియై యుండెను. ఆతఁడు మానవశక్తిచేతనే సకలకార్యనిర్వహణముం గావించెను. కాని యాతనిచరిత్ర మమానుషమైనది. ఈవిధముగా మానవశక్తిచే నతిమానుషచరిత్రము వికాసముం గాంచుటవలన నాతని మానవత్వముగాని, యీశ్వరత్వముగాని యనుమోదితమగునా కాదా యనువిషయమును బాఠకులే తమబుద్ధివివేచనానుసారముగా స్థిరపఱుచుకొనవలయును. కృష్ణుఁడు మనుష్యమాత్రుఁడే యని మీమాంసచేయువాఁడు రేస్ డేవిడ్సు "Rhys Davidis" శాక్యసింహునింగూర్చి "the wisest and gratest of the Hindus" జ్ఞానియనియు, హిందువులలో నుత్తమోత్తముఁడనియుఁ జెప్పిన శ్రీకృష్ణునింగూర్చియును బ్రశంసింపఁగలఁడు. మఱియు నీకృష్ణచరిత్రమునం దీశ్వరప్రభావమును గాంచఁగలిగినవాఁడుమాత్రము చేతులు జోడించుకొని యీగ్రంథసమాపనకాలమున నాతోఁగూడఁ గంఠమునుగలిపి యీక్రిందివిధముగా గానము చేయును—

నాకారణాత్ కారణాద్వా కారణాకారణాన్నచ।
శరీరగ్రహణంవాపి ధర్మత్రాణాయ తేపరమ్.

సమాప్తము.



ఆంధ్రప్రచారిణీ గ్రంథనిలయము.

కాకినాడ.

[1911 వ సంవత్సరములో స్థాపింపఁబడినది.]

ఇంతవరకుఁ బ్రకటింపఁబడి సిద్ధముగనున్న గ్రంథములు.

సం		చందాదారులకు			ఇతరులకు		
1	దుర్గేశనందిని	1	0	0	1	5	0
2	వసుమతీవసంతము	1	0	0	1	8	0
5	సీతారాము	1	0	0	1	8	0
6	సూర్యహాసు	1	0	0	1	8	0
10	మనోరమ (క్యాలికో)	1	0	0	1	8	0
12	విషవృక్షము	1	0	0	1	8	0
13	బృందావనము	1	0	0	1	8	0
24	మాతృమందిరము	1	0	0	1	8	0
25	నీలాంబరి	1	0	0	1	8	0
26	వీరపూజ (క్యాలికో)	1	0	0	1	8	0
27	అదరాజీవ	1	0	0	1	8	0
28	మాయావి	1	0	0	1	8	0
29	పూర్ణానందము	1	0	0	1	8	0
30	శివపురాణము సం ౧	1	0	0	1	8	0
31	శివపురాణము సం ౨	1	0	0	1	8	0
32	జీవన్మృతరహస్యము	1	0	0	1	8	0
33	రహస్యవిప్లవము	1	0	0	1	8	0
34	గోరా (సం ౧)	1	0	0	1	8	0
35	గోరా (సం ౨)	1	0	0	1	8	0
36	జయాపజయములు	1	0	0	1	8	0
21	శ్రీకృష్ణచరిత్ర ౧ సం॥	1	0	0	1	8	0
37	శ్రీకృష్ణచరిత్ర ౨ సం॥	1	0	0	1	8	0

అనుబంధగ్రంథములు.

1 రాధారాణి	0	4	0	0	6	0
5 సాధన	0	10	0	0	12	0
10 పరిమళ	0	12	0	1	0	0
12 నీరద	0	8	0	0	12	0
13 రజని	0	12	0	1	0	0
19 అరణ్యక	0	10	0	0	12	0
32 సమస్య	0	2	0	0	3	0
33 అనాథప్రేతము	0	1	0	0	1	0
34 బ్యారిష్టరు	0	1	0	0	1	0
35 సన్యాసిని	0	2	0	0	3	0
36 కాకము	0	1	0	0	1	0
37 ఇదియొకచిత్రము	0	1	0	0	1	0
38 ప్రేమాంజలి	0	1	0	0	1	0
39 బాలునివీరత్వము	0	1	0	0	1	0
40 జాతీయగీతము	0	1	0	0	1	0
41 మాయావిని	0	8	0	0	12	0
42 భారతవీరుఁడు (అర్జునుఁడు)	0	12	0	1	0	0
43 నీతిముక్తావళి	0	4	0	0	6	0
44 నీతికథాముక్తావళి	0	6	0	0	8	0
49 తులసీమాహాత్మ్యము (పద్యకావ్యము)	0	4	0	0	6	0
50 ప్రణయప్రతిమ	0	10	0	0	12	0
51 లక్షరూపాయిలు	0	10	0	0	12	0
52 శకుంతల	0	10	0	0	12	0
53 అశోకుఁడు	0	12	0	1	0	0
54 వీరమహిమ	0	8	0	0	10	0
55 ఏకాంతసేవ	0	6	0	0	8	0
56 శ్రీరామరాజనీతి	0	3	0	0	4	0
57 సంజీవనము	0	2	0	0	2	6
58 రాజకళింగగంగు (నాటకము)	0	8	0	0	10	0

ఆంధ్రప్రచారిణీగ్రంథనిలయము.
కాకినాడ, గోదావరిజిల్లా. } వేంకటపార్వతీశ్వరకవులు.